# హనుమద్విజయం

(సుందర కాండ)



2

మాస్టర్ పార్వతీకుమార్



# హనుమద్విజయం

(సుందర కాండ)

2

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

**హనుమద్విజయం** (సుందరకాండ-2)

ప్రథమ ముద్రణ : 22-07-2022 ప్రతులు : 1,000

**(మాతృశ్రీ కంభంపాటి కృష్ణకుమారిగారి 72వ జయింతి)**

© ధనిష్ఠ ఫౌండేషన్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

వెల : రూ॥ **130-00**

*ప్రాప్తిస్థానము :*

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**
15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2701531, 2509154.
Website : www.dhanistha.org.
info@dhanistha.org.
ISBN : 978-81-957285-3-4

*ముద్రణ :*

**ఓం నమశ్శివాయ జెరాక్స్**
మహారాణిపేట, విశాఖపట్నం.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్య వాయువు. ధన మనగ దివ్య సంపద. అది కేవలము డబ్బు కాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబం ధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధన మనిరి. ఆర్షవిజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు 'ధనిష్ఠ' 1992లో జనించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థ కర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును, సద్గోష్ఠికై వలసిన ప్రశాంత వాతావరణమును– "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

మాతృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించుచున్న సత్సాధనా సంపత్తి గల నవయుగ యోగ మార్గదర్శి మాస్టర్ పార్వతీకుమార్‌గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్య జీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో "డాక్టర్ ఆఫ్ లెటర్స్" పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారి నప్పుడే దానికి సాఫల్యత, సార్థకత ఉండునని, "మానవ సేవయే మాధవ

సేవ" అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింప జేయు వైద్యులు, శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించు చున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించు చున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

# ప్రస్తావన

శ్రీమద్రామాయణము ప్రపంచ వాఙ్మయము నందు శిరోధార్యమైన మహాకావ్యము. శ్రీమద్రామాయణము వివరించుట, ప్రవచించుట గురు సంప్రదాయములో నిరంతరము జరుగు కార్యక్రమము.

శ్రీమద్రామాయణమునకు మూలపురుషుడు శ్రీ రామచంద్ర మూర్తి. అత్యంత కీలకమైన మూర్తి శ్రీ ఆంజనేయుడు. సృష్టి నిర్వహణములో విష్ణుతత్త్వమునకు శివతత్త్వము, శివతత్త్వమునకు విష్ణుతత్త్వము పరస్పరాధారముగా నుండుట విశేషము.

శ్రీమద్రామాయణమునందు శివ తేజముగా అవతరించిన హనుమంతుడు ధర్మాచరణములో శ్రీరామునికి సంపూర్ణ సహకార మును భక్తి శ్రద్ధలతో భృత్యురూపమున నెరపుట అత్యంత విశేషము.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి జీవతత్త్వములో శ్రీరామతత్త్వ మున్నది. శ్రీరామునివలె మౌనముగా మహత్కార్యములను కర్తవ్యముగా మాత్రమే నిర్వహించిన మౌనమూర్తి.

మాస్టరుగారు 'శ్రీమద్రామాయణ ప్రవచనములు' సంపూర్ణ ముగా అందించిన వారు. ఈ ప్రవచనములు గ్రంథ రూపమున 'నావాణి' మాసపత్రికలో ధారావాహికముగా ప్రచురణ జరుగు చున్నది.

మాస్టరుగారి ప్రవచనములు ప్రచురణ కావలెనని ఇతోధికముగా శ్రోతలు కోరుచున్నప్పటికి మాస్టరుగారు మౌనము వహించిరి.

'సుందరకాండ' ప్రవచనములో హనుమంతుని గురు తత్త్వమును, శ్రీరాముని దైవ తత్త్వమును, సీతాదేవి జీవ తత్త్వమును అతి విశిష్టముగా తెలిపినారు. నిత్యాచరణలో జీవులు తత్త్వ సమన్వయమును పొంది, సులభముగా జీవించి, దైవత్వమును చేరు సాధనాపరమైన సోపానములు సరళముగా, సంగ్రహముగా అందించిన విధానము పఠించుటయే కాని వివరింపలేము.

శ్రీ రామాయణ ప్రచురణమునకు చిరకాలము నుండి భక్తితో కోరి వేచియున్న **శ్రీ కర్రి జీవరత్నం దంపతి** నిమిత్తకారకులు.

ఈ ప్రచురణలో సుందరకాండ ప్రారంభము నుండి హనుమంతులవారు లంకాపట్టణము చేరి, సీతమ్మ వారిని దర్శించు వరకు మొదటి భాగముగా వెలువడినది. తదుపరి ఈ భాగముతో సుందరకాండ పరిపూర్తి అయినది. గ్రంథ విస్తారము వలన ఈ విధముగా ప్రచురించుట జరిగినది. ఈ మహాయజ్ఞము నందు పాల్గొనిన వారందరికీ మాస్టరుగారి ఆశీస్సులు, శ్రీ రామ చంద్రుని అనుగ్రహము ప్రసరించవలెనని ప్రార్థన.

**- ధనిష్ఠ**

# హనుమద్విజయం

(సుందర కాండ-2)

## 6

తెల్లవారటానికి అప్పుడు కొంచెము పొద్దే వుంది. వేద వేదాంగవిదులు, మహాక్రతు యాజకులైన బ్రహ్మరాక్షసులు చేస్తున్న వేదాధ్యయన ధ్వనులు హనుమంతుడికి వినిపిస్తున్నాయి.

(బ్రహ్మరాక్షసులు కూడా బ్రహ్మమును నమ్మినవారే. వాళ్ళు కూడా వేదాధ్యయనం చేస్తారు. కానీ వారిలో అహంకారం వుంటుంది. భారతీయ ధర్మంలో ప్రచారం లేదు. వేదం చదివేవాళ్ళు, గీత చదివేవాళ్ళు, రామాయణం చదివేవాళ్ళందరూ మంచివాళ్ళు కాదు. వాళ్ళది రాజస పూజ. అది ప్రచారంగా, పటాటోపంగా వుంటుంది. అలాంటి పూజలో అహంకారం ఎక్కువగా వుంటుంది. తమోగుణ పూజలో అశ్రద్ధ ఎక్కువగా వుంటుంది. అవి వికటిస్తాయి. రజోగుణపూజలు నీలో శక్తిని పెంచుతాయి కానీ ఆ శక్తి సద్వినియోగం కాదు. దానంలో తమోగుణాన్ని, రజోగుణాన్ని, సత్వగుణాన్ని చూపించ వచ్చు. అలాగే పూజలూ, తపస్సులు కూడా. లంకలోకూడా వేదాలు చదివేవాళ్ళు. ఆ రాక్షసులకు పట్టుదల ఎక్కువ.)

"శృత మనోహరమైన మంగళవాద్య ధ్వనులు రాజ భవనములో చెలరేగినాయి. ఆ మహా బాహువు, ఆ మహా

బలవంతుడు రావణాసురుడు చెదరిపోయిన పూలదండలతోనూ, తారుమారైన కట్టుబట్టలతోనూ నిద్ర మేల్కొన్నాడు. నిద్రలేస్తూనే సీతాదేవిని గురించి తలచుకున్నాడు. (రాత్రి ఏ భావంతో నిద్రపోతే ఉదయాన్నే అదే గుర్తుకొస్తుంది. అందుకే రాత్రి పడుకోబోయే ముందు సద్భావం, సద్గ్రంథ పఠనం చెయ్యాలి. Start the day in an auspicious manner, conclude the day with auspicious things. అని చెబుతారు. రాత్రి పడుకోబోయే ముందు చివరిపని దైవ ప్రార్థన, మళ్లీ లేవగానే దైవప్రార్థన చెయ్యాలి.)

రావణుడు మంచి మదంతో వున్నాడు. వాడికి మదనతాపం ఎక్కువైంది. కామోద్రేకాన్ని అణచుకో లేకున్నాడు. వెంటనే సమస్త ఆభరణాలను అలంకరించుకొని లోకోత్తరమైన శోభతో రాజ భవనం నుండి బయలుదేరినాడు. సమస్త పుష్ప ఫలభరితములైన వృక్షాలతోనూ, కోనేళ్ళతోనూ, శోభాయమానమైన పుష్పలతల తోనూ, పూలూ పళ్ళూ తిని కలకలమని ధ్వనులు చేసే మత్తెక్కిన రంగురంగుల పిట్టలతోనూ, పరమాద్భుతంగానూ, నేత్రపర్వము గానూ కనిపించే తోడేళ్ళు మొదలైన బొమ్మలతోనూ, నానావిధ మృగ సమూహాలతోనూ, నేల అంతటా రాలిన పళ్ళతోనూ, రంగు రంగుల పూలతోనూ, మణికాంచన ద్వారాలతో వున్న అశోక వనంలోకి ప్రవేశించాడు.

దేవేంద్రుని దేవకన్యలు, గంధర్వాంగనలు వెంబడించేటట్లు ఆ పౌలస్త్యుని అప్పుడు ఒక నూరుమంది స్త్రీలు వెంబడించారు. వారిలో కొందరు బంగారు కాగడాలు పట్టుకున్నారు. కొందరు చామరాలు, కొందరు తాటి విసనకర్రలు తీసుకున్నారు. బంగారు,

వెండి పాత్రల నిండా నీళ్ళు తీసుకొని ముందు నడిచారు. (అలా పూర్ణకుంభాల వెనుక నడిస్తే అశుభాలు వుండవని చెబుతారు. అందుకే 'పూర్ణకుంభ స్వాగతం' అన్న సంప్రదాయం వచ్చింది.)

కత్తులు తీసుకొని కొందరు స్త్రీలు, ఆసనాలు తీసుకొని కొందరు స్త్రీలు వెంబడించారు. బరాబరిగా మద్యం వున్న మణిమయ పాత్రను కుడిచేత్తో పట్టుకొని చుక్కవంటి స్త్రీ నడిచింది. తెల్లని కాంతితోను, బంగారు దండెము ధగధగలతోనూ రాజహంసవలె, పూర్ణచంద్రుడివలె తేజరిల్లుతున్న ఛత్రము పట్టుకుని ఒకతె నడిచింది. ఆ వరాంగనలందరూ నిద్రవల్లను, తాగిన కైపువల్లను, కనులు తిరుగుతున్నందువల్ల, కన్నులు మూస్తూనూ కన్నులు తెరుస్తూనూ నీలమేఘం వెంటపోయే మెఱపు తీగలవలె తళుక్కు మంటూ రావణాసురుని వెంట నడిచినారు. ఆ రావణాసురుడి ప్రియ భార్యలందరూ అంతవరకూ సొమ్మసిల్లి నిద్రపోయినారు. అందువల్ల వారి కంఠహారాలు, బాహుమూపురులు చెదరి పోయినవి. మైపూతలు మాసిపోయినవి. కొప్పులు వీడిపోయినవి. కొనలు జారిపోయినవి. ముఖాలు అంతటా చెమటలు పోసి వున్నాయి. ఆ చెమటలకు వారు పెట్టుకున్న పూలదండలు తడిసి వాడి పోయినాయి. వారు తలలో పెట్టుకున్న పూలదండలు చెదరి పోయినాయి. భర్తృ గౌరవం వల్లను, మరులవల్లను తూలిపోతూ అదే ఒక సొగసుగా కనిపిస్తూ ఆ రాక్షసాధిపతి వెంట నడిచినారు. ఆ మహా బలవంతుడి మనసంతా సీతాదేవి మీదనే వుంది. అందువల్ల అతడు మందమందంగా నడిచినాడు. ఆ వరాంగనల మొలనూళ్ళ గలగల ధ్వనులు, వారి కాళ్ళ అందెల గలగల ధ్వనులు

హనుమంతునికి వినిపించినవి. అంత, ఇంత అని ఎన్ననలవికాని ఆ బల పరాక్రమవంతుడు, ఏ ఇతరులూ చేయలేని పనులు చేసే ఆ రావణాసురుడు అశోకవన ద్వారము దగ్గరకు రావడము హనుమంతుడు చూచినాడు.

సువాసనగల నూనెలలో తడిపినందువల్ల సుగంధము గుబాళిస్తూ వెలుగుతున్న ఎన్నో కాగడాలు అతనిముందు సుంద రాంగులు పట్టుకొని నడుస్తూ వున్నారు. మదము వల్లను, మద్యము కైపువల్లను, మదనతాపము వల్లను ఎర్రబడిపోయిన విశాల నేత్రా లతో చెరకువిల్లు వదలిపెట్టి వచ్చిన ప్రత్యక్ష మన్మథుడిలా రావణాసురుడు అశోకవనం లోకి వచ్చినాడు. చిలికిన అమృత నురుగువలె మిసమిస లాడుతూ బాహుపురులు తగులుకొని జారి పోతున్న ఉత్తరీయాన్ని సవిలాసంగా సవరించుకుంటూ అతడు దగ్గరకు రావటం హనుమంతుడు చూచినాడు. ఆకులు దట్టంగా వున్న కొమ్మమీద ఎవరికీ కనబడకుండా వుండేటట్లు ఆకులూ, పూలూ కప్పుకుని చూడసాగినాడు.

ఆ రావణాసురుడి వరాంగనలందరూ రూప యౌవన సంపన్నులు. ఆ సురూపులందరినీ హనుమంతుడు చూచినాడు. ఆ మత్తుడు, విశ్రవసుడి పుత్రుడు, రాక్షసాధిపతి నానావిధ ఆభరణాల తోనూ, నిక్కబొడుచుకున్న చెవులతోనూ, అంతమంది సురాంగన లతో నక్షత్రాల మధ్య చంద్రునిలా ఆ అశోకవనంలోకి వచ్చినాడు. ఆ మహా తేజోవంతుని హనుమంతుడు చూచి, రాజభవనంలో నిద్రపోతున్న మహాబాహువు రావణాసురుడు వీడేననుకుంటూ అతని చేష్టలు కనిపెట్టడానికి క్రింది కొమ్మ మీదికి దిగినాడు. తాను

ఉగ్ర పరాక్రమవంతు డైనప్పటికినీ ఆ రావణాసురుడి తేజానికి తాను వచ్చాను అని ఏమాత్రం కనబడకుండా వుండటానికి ఆకు లలో దాక్కున్నాడు. కొనలతో కూడా నల్లగా వున్న తల వెంట్రుకల తోనూ, సుందరమయిన పిరుదులతోనూ, నడుమ సందు లేకుండా ఒకదానితో ఒకటి ఒరుసుకుపోతున్న స్తనాలతోనూ, నల్లని కన్నుల తోనూ కూర్చునివున్న సీతాదేవి దగ్గరకు రావణాసురుడు పోయినాడు.

(సీతాదేవిని జీవాత్మ స్వరూపంగా భావన చేస్తే, ఆమె మనసు దైవముపై లగ్నమై వున్నది. అహంకార స్వరూపుడైన రావణుడు సీతను తనదానిగా చేసుకోవాలనే ప్రయత్నంలో అశోక వనానికి వచ్చినట్లుగా మనం గమనించవచ్చు. జీవుడికి, అహం కారానికి మధ్య జరిగే భాషణము గమనించినట్లు సద్గురువుగా హనుమంతుడు రావణాసురుడు, సీతాదేవి యొక్క భాషణమును గమనిస్తాడు. అహంకార స్వరూపుడైన రావణుడు రకరకాల ప్రలోభాలకు సీత వశమవుతుందేమో నని ప్రయత్నం చేస్తాడు. అది హనుమంతుడు గమనిస్తాడు. సత్సాధకులు కూడా ఈ ప్రపంచంలో రకరకములైన విషయాలకు ప్రలోభము చెందు తున్నారా? లేదా? అన్నదాన్ని సద్గురువు గమనిస్తూ వుంటాడు. వారు అలా లొంగితే దైవారాధనము, దైవదర్శనము, ఆత్మానుభూతి, దైవ సాన్నిధ్యము అనే విషయములు ముఖ్యమైనవి కానట్లయితే, వారిని సత్సాధకులుగా సద్గురువు పరిగణించలేడు. అటువంటి ప్రలోభాలకి లొంగినటువంటి జీవాత్మను సద్గురువు అనుగ్రహించ లేడు. అది మనం రామాయణంలో గమనించాలి. ఒకవేళ ఎట్టి

పరిస్థితులలోనైనా ఇక్కడుండేటటువంటి ఈ భోగభాగ్యాలకి, ఐశ్వర్యానికి, సంపదలకి, సౌకర్యాలకు సీతాదేవి గనుక ప్రలోభపడి లొంగినట్లైతే, తనకు ఇక అక్కడ పనిలేదనుకుంటాడు హనుమంతుడు. కానీ ఆమె అలా ప్రపంచపు ఆకర్షణలకి లోనుకాకుండా వున్నట్లుగా గుర్తిస్తాడు. ఇపుడు రావణుని భాషణము, దానికి సీతయొక్క సమాధాన భాషణము ఈ రెండింటినీ గమనించిన హనుమంతుడు మరీ పొంగిపోతాడు. అంటే ఒక సద్గురువు యొక్క అంతరంగము నందు ఒక శిష్యునికి స్థానం దొరకటం అంటే అది ఏ విధంగా వుంటుంది అనేది రామాయణం చక్కగా నిర్వచించింది.

కేవలం భౌతికంగా సద్గురువు యొక్క దర్శన, స్పర్శన, సంభాషణాది అవకాశములు దొరికినా, అతని అంతరంగమందు చోటు దొరకటం దుర్లభమైన విషయం. సత్యధర్మాలను అనుసరిస్తూ, ఇతర ప్రలోభాలకు ఆకర్షింపబడక జీవించే సాధకులను సద్గురువు అంగీకరించ గలడు. లేకపోతే శిష్యుడు, తాను ఆ గురువు యొక్క శిష్యుడు అనుకోవటమే తప్ప, సద్గురువు మనస్సులో వారెవరూ శిష్యులుగా పరిగణించరు.

ఒక్కసారి ఒక సద్గురువు ఒక సత్సాధకుడిని తన అంతరంగము నందు అంగీకరించినట్లైతే, అతడి ఆత్మదర్శనం జరిగేదాకా సద్గురువుదే బాధ్యత. వారి సమస్త భారములను తానే వహిస్తాడు. బాధ్యతాయుతమైన జీవుల యందు మాత్రమే అటువంటి బాధ్యత వహిస్తాడు. గురు, శిష్య సంబంధము, అహంకారము ఈ మూడింటిని మనం అమ్మవారిని జీవాత్మగా (దైవాన్ని ఆరాధించే సత్సాధకుడిగా), రావణుడు త్రిగుణములకు

లోబడిన అహంకార పురుషుడిగా, తదతీతమైన గురుతత్త్వంగా హనుమంతుడు దేవదూతగా అక్కడికి వచ్చినట్లుగా భావించి సుందరకాండ పారాయణ చేసుకోవాలి.

(సుందరకాండ చదివితే కష్టాలు పోతాయంటారు. ఎందు కంటే సుందరమైన జీవితంలోకి 'నేను' ప్రవేశిస్తే, నీకు కష్ట నష్టము లను ఓర్చుకునే శక్తి, సన్నివేశములందు కాక దైవము నందు ఇమిడి వుండగల పరిస్థితి ఏర్పడి, జీవితం సుందరంగా వుంటుంది. అందుకే భక్తుల జీవితాలనిండా తీరని, భయంకరమైన, లోతైన సమస్య లుంటాయి. అయినప్పటికీ వారు జీవితాన్ని సుందరంగా నడుపుకుంటారు. మామూలు సామాన్యమైనటువంటి మనుష్యులకు భరింపలేని సమస్యలుంటూ వుంటాయి. కానీ సత్సాధకులు ధర్మమును, సత్యమును ఆశ్రయించడం చేత వారి జీవితము సుందరము.

అమ్మవారు సత్త్వము లేక దైవమును ఆశ్రయించిందా, ధర్మమును అనుసరిస్తోందా అనేటువంటి విషయం మీద మన కిపుడు ఒక చక్కని ఆవిష్కరణ కనిపిస్తుంది. అందుచేత ఆ విధమైన అవగాహనకోసం మనం రామాయణం చదువుకోవాలి. ఎందుకంటే మన గురించి మనకి చాలా ఎక్కువ అంచనా లుంటాయి. మనం చాలా భక్తులమని, మహా భక్తులమని, కారణ జన్మలమని, సద్గురువుకి చాలా చేరువగా వున్నవాళ్ళమని, ఆయన అంత రంగంలో వుండే వాళ్ళమని- ఇట్లా ఎవరికి వారుగా అనుకుంటూ వుంటాం. ఈ అనుకోవటంలో సత్యం ఎంత వున్నదో మన ధర్మానుష్ఠానాన్ని బట్టి, మనకి బయట లోకంలో వుండే

ప్రలోభములను బట్టి, మనకు సత్యము నందున్న ఆసక్తిని బట్టి బేరీజు వేయబడుతుంటుంది. అందుచేత ఇక్కడ చాలా సుందర ముగా గురు – శిష్య సంబంధము, జీవాత్మ – పరమాత్మ సంబంధము ఆవిష్కరింపబడి యున్నది. అమ్మవారు సత్య ధర్మాలను ఆశ్రయించిన జీవితము గురించి తెలుస్తుంది.)

శ్రేష్ఠమైన ఆభరణాలతో అలంకరించుకొని శోభాయ మానంగా వస్తున్న ఆ రూప యౌవన సంపన్నుని, రాక్షసాధిపతి రావణాసురుని ఆ వరారోహ, ఆ జనకరాజ పుత్రి, సీతాదేవి చూచి పెద్దగాలికి ఊగిన అరటిచెట్టు వలె వణకిపోయింది. ఆ విశాలాక్షి, ఆ వరవర్ణిని తన తొడలతో కడుపును, బాహువులతో స్తనాలను కనబడకుండా కప్పివేసుకొని ఏడుస్తూ వుంది. అట్లా రాక్షసాంగనల కాపలాలో వుంటూ, దుఃఖముతో తపించిపోతూ సముద్రంలో మునిగిపోయిన నావ మాదిరిగా నున్న ఆ వైదేహిని దశగ్రీవుడు చూసినాడు.

ఆమె ఆస్తరణములేమీ లేని కటికనేలపై కూర్చుని వున్నది. తీక్షణ వ్రతదీక్షలో వున్నట్లుగా కనిపించింది. నరికితే నేలకూలిన చెట్టుకొమ్మ మాదిరిగా తోచింది. దుమ్ము, ధూళి అలుముకొన్న ఆమె దేహము చిత్ర విచిత్ర వర్ణాలతో కనిపించింది. అలంకరించు కోనందువల్ల బురద కొట్టుకొన్న తామర తూడువలె ప్రకాశిస్తూనూ, ప్రకాశించకుండాను వుంది. విజితాత్ముడు, రాజసింహుడు అయిన రాముని దగ్గరకు ఆమె సంకల్పము అనే గుఱ్ఱాన్ని కట్టిన మనసు అనే రథం ఎక్కిపోతున్నట్లుగా వున్నది. ఆమె ధ్యాన శోక పరాయణగా వుంది. ఆమె దుఃఖానికి అంతము అగుపడలేదు. రాముని

అనుసరించి వుండటమే ఆమె వ్రతము. మణిమంత్రాలకు కట్టుబడి పోయి, చుట్ట చుట్టుకున్న పాము మాదిరిగా వున్నది. సదాచారము, సత్స్వభావము, ధర్మప్రధానము అయిన వంశములో పుట్టినది.

అయితే ఆమె ఆ అశోకవన పరిసరాలకు తగినట్లుగా లేదు. ఆవిడ విఘ్నమైపోయిన ధనలాభము వలె, తిరస్కరించిన ఆజ్ఞ వలె, ఉత్పాతములను జ్వలించే దిక్కువలె, పాడైపోయిన పూజవలె, శూరులు చచ్చిపోయిన సేన వలె, నీళ్ళెండిపోయిన నది వలె, తాకరాని వాళ్ళు తాకిన వేదివలె, చీకట్లు కమ్ముకున్నందు వలన తొలగిపోయిన వెలుతురు వలె, చల్లారిపోయిన అగ్నిశిఖవలె, చంద్రమండలము రాహుగ్రస్త మైనందువలన కాంతులు మాసి పోయిన పున్నమిరాత్రి వలె, ఏనుగులు తొండాలతో కెలికి, పెరికి వేసిన తామరాకులతోను, తామర పూలతోను, భయపడి పోయిన పక్షులతోను పాడుబడ్డ తామరకొలను వలె వున్నది.

ఆమె మనస్సు రామునికి వశమైనది. ఆమె రాముని యొక్క వియోగము చేత దుఃఖపడుతూ, ఏడుస్తూ వున్నది. రామునికి దూరమవటంచేత ఇతరములైన విషయముల యందు శ్రద్ధలేక క్రుంగిపోతూ ధ్యానము శోకపరాయణంగా నడుస్తూ వున్నది. ఆమె దుఃఖానికి అంతం అగుపడటం లేదు. ఆమె రామభక్తికి ఇది తార్కాణం. రాముణ్ణి అనుసరించుకొని వుండటమే ఆమె వ్రతము. జీవాత్మ పరమాత్మని అనుసరించి వుండటమే. దైవాన్ని అనుసరించి వుండటమే. "అనన్యాశ్చింతయంతోమాం" అని శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా సమస్త వాఙ్మయము, భారతీయ వాఙ్మయము చెప్పినట్లుగా దైవ పరంగా జీవించటం అనేటువంటిది జీవుని యొక్క ముఖ్యమైన

కర్తవ్యము. అలా వున్నటువంటి ఆమె అశోకవన పరిసరాలకు తగినట్లుగా లేదు. అశోకవనం చాలా సుందరంగా వుంది. ఆమేమో చాలా కళతప్పి వుంది. ఎందుకంటే ఆ వనం ఆమెకు ఏమాత్రమూ ఆనందం కలిగించటం లేదు.

మన సమస్యలన్నీ పరిష్కరింపబడి, మనకన్నీ బాగుంటే మనకు చుట్టూవుండే విషయాలే చాలా ఆనందం కలిగిస్తూ వుంటాయి. ఇల్లు, వాకిలి, కుటుంబము, బంధుజనులు, మిత్రులు, సంఘము అందరూ మనల్ని ఆదరిస్తున్నారనుకోండి, అన్ని రకాలుగా బాగున్నాయనుకోండి, అక్కడే వుంటాం మనం. మరి దైవం ఎందుకు? సమస్య కలిగినపుడు దైవం, కదా! ఇక్కడ అంతా బాగుంది. దైవం లేదు కాబట్టి ఆమె ఆనందంగా లేదు. అంతా బాగుంటే దైవం అక్కర్లేదు మామూలు మనుష్యులకి. దైవం మనకుండే కోరికలకి ఒక ఉపాయంగా ఆస్తికజనులు భావిస్తూ వుంటారు. సీతాదేవి జీవాత్మగా, 'అనన్యాశ్చింతయంతోమాం' అన్నట్లుగా రాముని (పరమాత్మను) ధ్యానిస్తూ వుంది. లంకలో అన్నీ వున్నా దైవం లేదు. ఆ వనం ఆమెకు ఏ మాత్రమూ ఆనందం కలిగించలేదు.

మామూలు మనుషులకు దైవం, వారి కోరికలకు ఒక ఉపాయము. వారికి దైవం, వారి కోరికలకు తగినట్లుగా వారి వారి పనులను బట్టి ఫలితాలను ఇస్తూ వుంటారు. ఇందులో సద్గురు ప్రమేయం వుండదు. ఇక్కడ ఈమె దృఢవ్రతయై, పతివ్రతయై అంటే, పతి అంటే జగత్పతి అయినటువంటి ఒకే ఒక దైవం ఆరాధనము మాత్రమే తన ముఖ్య గమ్యంగా, ఆశయంగా

పెట్టుకొని వుండటం చేత ఆమె ఆవిధంగా గోచరించింది. ఇక్కడ రకరకాలుగా ఆమెని వర్ణిస్తారు. విఘ్నమైపోయిన ధనలాభం వలెను, ఏమిటి ధనలాభం? ఆమె ఆయనతో కూడి వుండుట, అది విఘ్నమైపోయింది. కారణం తాను రజోగుణానికి లోబడటం చేత. ఈ రోజున మానవ జాతిలో ప్రత్యేకించి, విపరీతమైన రజోగుణం ప్రబలివున్నది. ఎపుడూ ఏదో ఒక కోరిక చేత ప్రతి మనిషి పీడింపబడి వున్నాడు. ఏదో ఒక కోరిక. ఆ కోరికయే ఉదయం నిద్ర లేపుతుంది. ఆ కోరికయే ఉదయం నుంచి సాయంత్రం వరకు మనని అలసట ఎరక్కుండా త్రిప్పుతుంది. ఆ కోరికయే సాయంత్రానికి నెరవేరక నిద్రపోవటం అవుతుంది. మళ్ళీ లేవటం కూడా ఆ కోరికతోనే లేవటంగా వుంటుంది.

ఇపుడు రావణుడి స్థితి కూడా అదే. లేవటం తోటే హుటా హుటిన సీతాదేవి దగ్గరకి రావటానికి కారణం కోరికయే. కాబట్టి ఒక కోరిక కోరటంచేత ధనం కలిగివున్న ఆమె, ఆ లాభమునకు విఘ్నం ఏర్పడేటట్లుగా తయారైంది. అంటే ఒకే ఒక్కసారి పొర పాటు చేయటం వలన ఇంత జరిగిందే! మనం ఎన్ని పొరపాట్లు చేస్తుంటాం? తమోగుణం, రజోగుణం ఇష్టం వచ్చినట్లు ఆడిస్తుంటే, ఆడుతున్నటువంటి జీవులు. సత్త్వగుణం అనేటువంటిది మర్చి పోయి నటువంటివారు. కోరికలే వేదికగా జీవితాలు నడుస్తున్నటు వంటి వారము. మనకు ఈ విధంగా పోల్చి చూసుకుంటే కొంత మనని మనం ఏవన్నా, 'ఆత్మానాత్మానాం' అన్నాడు భగవంతుడు భగవద్గీతలో. "నిన్ను నువ్వే ఉద్ధరించుకోవాలయ్యా! ఎవరూ ఉద్ధరించరు" అని చెపుతాడు శ్రీకృష్ణుడు గీతలో. ఉద్ధారణ

కార్యక్రమం ఎవరో చేసిపెడతా రనుకోకుండా నీకుగా నీవు చేసుకుంటూ వుండటమే.

హనుమంతుడు వస్తాడని చేస్తోందా సీతాదేవి ఇదంతా? తన తపన తను చెందుతూ వుంటే, అనూహ్యామైనటువంటి ఒక సహాయ సహకారం అందింది. మిగతావన్నీ బాగుంటే దేవుడు, బాగుండకపోతే దేవుడు మనకేం చేశాడు? ఇటువంటి భావనలతో మనం వుంటాం. ఈ గురువు మనకేం చేశాడు? ఇక్కడికొస్తే అన్నీ కష్టాలే. ఇటువంటి భావనలున్న వాళ్ళం. దేహాత్మ భావన చాలా ఎక్కువగా వుండి ఓ సద్గురువు ఆశ్రయంలో వాటినన్నింటినీ సాధించుకుందాం అనేటువంటి ఒక దురవగాహన కలిగినటువంటి వాళ్ళం ఈ రోజున గురు ఆశ్రమాల్లో చేరి, వారి ఆశ్రమాలన్నీ కూడా నింపి వుంచుతున్నాం. అందుచేత ఇక్కడ రామాయణం ఒకసారి అసలు విషయాన్ని చక్కగా ఆవిష్కరిస్తుంది. అది మనం చక్కగా అవగాహన చేసుకోవాలి. మనం నిజంగా దైవాన్ని కోరుతున్నామా? లేక మన కోరికలు నిర్వర్తించుకోవటం కోసం దైవాన్ని ఆశ్రయించి వున్నామా? తప్పులేదు. రెండోది వుంటే నీవు కోరిన కోరిక ప్రకారం దానికి సంబంధించినటువంటి ప్రయత్నం చేసుకోవాలి. దానికి కూడా దైవం యొక్క అనుగ్రహం వుంటుంది. గుర్తు పెట్టుకోండి.

ఎందుకంటే సీతాదేవి రాముణ్ణి ఆ బంగారు జింకని కోరింది. కోరితే దానికోసం దైవం సహాయంకి వెళ్ళలేదా? అందుచేత కోరికలు కోరకూడదా, కోరవచ్చా? అంటే కోరవచ్చు. కానీ ఆ కోరికల యొక్క ఫలితములు నీకు సంబంధించినవి. అందుచేత

ఒక మెట్టు ఇంకొంచెం ఎక్కటానికి ప్రయత్నం చేసేవారికి ఇహ కోరక అని చెపుతారు. ఇహ కోరక అని చెప్పేటువంటివారు వుంటారు. ఎందుకంటే కోరిన కొద్దీ వాటి యొక్క ఫలితములు అనుభవిస్తూ వుండాలి. కోరికలు ఫలితాలు తెస్తూంటాయి. ఫలితాల నుంచి మళ్ళీ కోరికలు పుడుతుంటాయి. సన్నివేశములు కలుగుతుంటాయి. Every desire has its consequences. మనకి కోరికలైతే వుంటాయి కానీ వాటి consequences face చేసేటువంటి సంసిద్ధత వుండదు. దొంగతనం చేయకూడదు అన్నారు. ఎందుకు చేయకూడదు? చేయచ్చు. ఎప్పుడు చేయవచ్చు అంటే దాన్నుండి వచ్చే ఫలితాలు నీవు పొందటానికి సిద్ధంగా వుంటే చేసుకోవచ్చు.

రావణునికి బలీయంగా కోరిక వున్నది. ధర్మాన్ని వ్యతిరేకించి పని చేస్తున్నాడు. దైవం వున్నాడు కదా అని అనుకుంటాడు చిట్ట చివరి వరకు. చివరికి తెలుస్తుంది. దైవం తనప్రక్క లేదని. ఇంతకాలం వున్న దైవం ఇపుడు లేదు. అందుకని ఎపుడైతే అధర్మాచరణ వచ్చిందో, కోరిక ధర్మపరంగా లేనపుడు అతడు బలహీను డౌతాడు, ఎంత దైవ భక్తుడైనా సరే. ధర్మపరంగా వున్నపుడు అతడు బలవంతుడై వుంటాడు. అందుచేత ఆమె ఈ విధంగా వున్నది. కారణ మేమిటంటే ఇపుడివన్నీ ఆ విఘ్నమై పోయిన ధనలాభం వలె, తిరస్కరించిన ఆజ్ఞవలె, పాడైపోయిన పూజవలె, శూరుడు చచ్చిపోయిన సేనవలె, తాకరానివాడు తాకిన వేదికవలె చాలా పవిత్రమైన వస్తువు ఆ విధంగా అయిపోయింది. అంటే మనకి ఒక విధంగా అహల్య ఏవిధంగా గౌతముని

ఆశ్రమంలో శిథిలమైనటువంటి చైతన్యంతో వుందో, రాయి అయిపోయిందంటే అర్థం ఏమిటంటే చేతనలు అన్నీ ఉడిగిపోయి కేవలము దైవం అనుగ్రహం కోసం వేచియుండటం చేత ఆమె రాయి అయిపోయింది. రాయి అంటే చుట్టు ప్రక్కల ప్రపంచానికి ఆమె రాయి. అంతేగానీ రాతిని కాలితో తాకితే ఆ రాయేదో ఇది అయిపోయింది- ఇవన్నీ ఏదో మనకి తమాషాగా రాస్తారు. రామాయణంలో అట్లా లేదు. ఆమెను రాముడు స్పృశించటం చేత ఆమెలో చేతన పెరిగి, ఆ స్పర్శచేత ఆమె అనుభవించిన కర్మ పూర్తవటం చేత రెండూ కలిసివచ్చి ఆమె మళ్ళీ పతివ్రతగా పరిగణింపబడుతుంది.

రాముడి స్పర్శ ఎపుడూ వున్నది సీతకు. ఎందుకంటే ఆమె ఒక కోరిక కోరింది. అది చాలా ఆకర్షణీయమైన సందర్భంలో కోరిన కోరిక. అంటే ఇక్కడ ఎంత నిశితమైనటువంటి దీక్ష ధర్మవ్రతులకు అందించారో మనం గమనించాలి. ఇక్కడ మనం చదువుకుంటే ఏమవుతుందంటే కొంచెం మనలో ఒక వీసమెత్తు ధర్మాచరణకు మనస్సు ఉరుకుతుంది. అంతేకానీ సీతాదేవిలా మనం ఆరాధన చేసేస్తాం అనికాదు. ఓహో ఇదీ అసలు అవగాహన అనేటువంటిది మనకొక టేర్పడితే, ముందుకెప్పటికో పని చేస్తుందన్నమాట! ఆవిధంగా మొదట ఆ నియమం, ఆమె లోపల వున్నటువంటి పరిస్థితులు తెలిపారు. తర్వాతేమో ఆమె బయట వున్నటువంటి పరిస్థితులు చెప్పారు.

హనుమంతుని దర్శనం కూడా మొదట ఆమె లోపల ఎలా వున్నదో చూశాడు. ఆమె అగ్ని శిఖవలె పవిత్రంగా తేజరిల్లుతూ

కాంతులు కలిగివున్నది. అంతరంగం అంతా పవిత్రమే. బహిరంగం అంతా కూడా శిథిలమై వున్నది. ఇక్కడ కూడా రావణుడు వచ్చి చూచినపుడు ఆమె అటు మళ్ళి వుండటంచేత మనస్సు ఇతన్ని చూడంగానే కొంత విముఖత, భయం వల్ల మళ్ళీ ఏం జరుగుతుందోనన్న బాధ వున్నదన్నమాట. సీత తను రజో గుణానికి లోబడటం చేత దైవానికి దూరం అవుతుంది. మనం సత్త్వగుణం మర్చిపోయి, రజస్తమో గుణాల చేతిలో ఆడుతున్న వాళ్ళము.

"ఆమె సుకుమారి, సుందరాంగి. ఆమె మణిమయమైన గర్భగృహంలో వుండవలసింది. అటువంటి ఆమె పీకివేస్తే అప్పుడే ఎండిపోయిన తామరతూడులా వుంది. మణిమయమైన గర్భ గృహంలో వుండటం అంటే కాంతివంతమైన శరీరంలో వుండ వలసినది జీవాత్మ. అది నశించటానికి కారణం, ఒక విధంగా పీకివేసినట్లుగా అవటానికి కారణం ఏమిటంటే రజోగుణం. ఆ రజోగుణం చేత ఎండకు వాడిపోయిన తామరతూడు లాగ, పీకి వేయబడి నటువంటి లతగా గోచరించింది. వేటగాళ్ళు పట్టుకొని స్తంభానికి కట్టివేస్తే, పోతుటేనుగును ఎడబాసి నిట్టూర్పులు విడుస్తూవున్న పెంటి ఏనుగులా వుంది. ఉపవాసాలు చేసి పెనిమిటి ధ్యానంతో, భయంతో ఆమె క్షీణించి పోయింది. దీనురాలై పోయింది. దుఃఖంతో బాధపడుతూ, రావణాసురుని రాముడు పరాభవము చేయవలెనని చేతులు జోడించి, మనసుతో దేవతలను ప్రార్థిస్తున్నట్లు కూర్చున్నది". తను దైవాన్ని నమ్ము కుంది. ఈ కష్టానికి దైవమే సహాయం చేయాలనే టటువంటి

భావనతో, రాముడు పరాభవము చేసి రావణుణ్ణి హతమారిస్తే బాగుంటుందని దేవతలని ప్రార్థించింది. ఆమె తన కష్టానికి దైవమే సహాయం చెయ్యాలని దేవతల నందరినీ ప్రార్థించింది.

చక్కని కనురెప్పలతో, ఎర్రటి కనుకొలకులతో, తెల్లటి కన్నులతో అన్ని వైపులా చూస్తూ ఏడుస్తున్న ఆ అనిందితను, రాముడిని అనుసరించుటే వ్రతంగా పెట్టుకున్న ఆ మైథిలిని, ఆ సీతాదేవిని, రావణాసురుడు తన చావుకోసం ఆశ పెట్టబోయాడు. జీవాత్మ పరమాత్మ వైపుకు మొగ్గిందంటే అహంకారానికి చావే. అహంకారం నశించడమంటే, త్రిగుణాత్మకమైన లింగశరీరం నశించడమే.

త్రిగుణాత్మక మైనటువంటి శరీరం ధరించినటువంటి ప్రతి జీవుడూ కూడా తన నిజ స్వరూపాన్ని మరచి, తనకి ప్రపంచంలో వున్నటువంటి ఒక చిరునామా వుంటుంది. ఒక పేరు, ఒక తిథి, ఒక గతి, కొంత కీర్తి, కొంత ప్రతిష్ఠ, కొంత స్థితిగతులు ఇవన్నీ వుంటాయి. వాటిని బట్టే మనుష్యులు, మనుష్యులతో ప్రవర్తిస్తూ వుంటారు. అంతకు మించినటువంటి సత్యం అందరూ ఆత్మ స్వరూపులే నన్న భావం తత్త్వ మెరిగిన వారికి మాత్రమే ఎప్పటి కప్పుడు దర్శన మిస్తూ, ప్రాపంచిక మైనటువంటి కొలతలు లేక జీవిస్తూ వుంటారు. ప్రాపంచికమైన కొలతలకు ఆవలవుండే వాళ్ళంతా లింగశరీరాన్ని దగ్ధం చేసుకొన్నవారే. అలాకాని వాళ్ళు ఎంత తెలిసిన వాళ్ళైనా అహంకారానికి లోబడినటువంటి వాళ్ళే.

అందుకే భాగవతంలో చెప్పబడిన భక్తులంతా ఆ లింగ శరీరం దగ్ధమైపోయి, అహంకారం లేక దైవమే తానుగా ఈ

సమస్తమందునూ దైవాన్ని భావన చేస్తూ, తమను అవమానించినా ఒక్క మాట కూడా ఎదురు చెప్పకుండా భరిస్తూ దైవారాధన చేసుకుంటూ వుంటారు. వారే అంబరీషుడు, ప్రహ్లాదుడు, నారదుడు, శుకుడు, వ్యాసుడు. వీరందరి గురించి భాగవతంలో ఎందుకు చెప్పారంటే, వారంతా తమ అహంకార శరీరాన్ని త్యజించినటువంటి వారు. దైవమే తాముగా వున్నటువంటివారు. సరాసరి వారి రూపంలో 'నేనే' వున్నాను అని శ్రీకృష్ణుడు చెపుతాడు.

అహంకారంతో వున్నవాళ్ళు తమ ప్రాపంచిక చిరునామాతో జీవిస్తూ వుంటారు. వాళ్ళకు ఎవరి సహాయమైనా కావలిస్తే ఎదుటివాళ్ళు గుర్తుకు వస్తారు. ధర్మరాజుకి లింగశరీరం లేదు. భీమార్జునులకు, ద్రౌపదికి లింగశరీరం చాలా ఎక్కువగా వున్నది. అందుకని ధర్మరాజుకి మానావమానములు గానీ, అపనిందలు గానీ, ధనం రావటంగానీ, పోవటంగానీ, రాజ్యం రావటం గానీ, పోవటం గానీ ఏవీకూడా అతన్ని బాధపెట్టనటువంటి ఒక ఉత్తమ మైన స్థితిలో వుంటాడు. అతను నిరహంకారి గనుక అతనికి కోపమే రాదు. ఎంత కష్టం పెట్టినా వీళ్ళందరూ నాశనమైపోవాలని లోపల ఎన్నడూ అనుకోడు. అర్జునుడు, ద్రౌపది, భీముడు వీళ్ళందరూ ఎప్పటికప్పుడు శాపనార్థాలు పెడుతూనే వుంటారు. అది లోకసహజం. వాళ్ళూ ధర్మాత్ములే. అయినప్పటికీ కూడా వారు ఇతరుల గురించి వారు చేసిన అపచారములకు, అవమానములకు కొంత వెష్ట పడుతుంటారు, అదికూడా దాటిన వాడు ధర్మరాజు. సరే అధర్మాన్ని ఆశ్రయించినవారు కౌరవులు.

వారికన్నా వీరు మెరుగు. వీరికన్నా ధర్మరాజు మెరుగు. అందుకని ధర్మరాజు అందరికన్నా ఇష్టుడు దైవమునకు, ధర్మమునకు.

కాబట్టి ఆ విధంగా లింగశరీరం ధరించినటువంటి వారికి తన చిరునామా తనకి గుర్తుంటుంది. తన చిరునామా తనకి గుర్తుండక పోవటమే దైవానుగ్రహం. అంటే తను ఇది అని ఎవరన్నా చెపితే గుర్తురావాలి తప్ప, తనకుగా తాను గుర్తుండ కూడదు. హనుమంతుడికి అందరూ చెపుతారు నువ్వు ఇంతటి వాడివి, అంతటివాడివి, నీకు గుర్తులేదా చిన్నపుడు నువ్వు వెళ్ళి సూర్యుణ్ణి పండనుకొని మింగబోయావు. అంత దూరం ఎగిరావు. ఇంద్రుడు వజ్రాయుధం వేస్తే కూడా నీకేం కాలేదు. ఇటువంటి వన్నీ గుర్తు చేయాలి. ఎందుకంటే ఆయనకి గుర్తుండవు.

మనం చేసేవి చాలా చిన్న పనులు. ఆవగింజంత పనులు. ప్రపంచం మర్చిపోతుందేమో నని అందరికీ చెప్పుకోవటం కోసం మనమే ప్రయత్నం చేస్తూంటాం. ప్రపంచం ఎలాగూ మర్చి పోతుంది. ఎందుకంటే వాళ్ళకి వాళ్ళ పనులు వేరేవుంటాయి. మనల్ని గుర్తు పెట్టుకోవటం వాళ్ళపని కాదుకదా! వాళ్ళకి వాళ్ళని గురించి ప్రపంచం గుర్తు పెట్టుకోవాలని ఎవరికి వారు తపన చెందుతున్నటువంటి సమాజంలో ఇంకొకడిని గుర్తుపెట్టుకొనే దేముందండీ? కేవలం అవసరం వుంటే గుర్తుకు వస్తారు. అవసరం లేకపోతే ఎవరూ గుర్తుకు రారు.

రావణాసురుడు ఈ సీతాదేవిని ముట్టుకోవటం అంటే నెమ్మదిగా వాడు చావటమే. ఎందుకంటే ఈమె మనస్సు అటు

వెళ్ళిపోయింది. మనస్సు దేనియందైతే లగ్నమై కరుగుతుందో దాని యందు సీత మనస్సు లగ్నమై వున్నది. దానియందు లగ్నమైన మనస్సుకి అంతా ఊర్ధ్వమైనటువంటి ప్రజ్ఞ వున్నది. తనదైన మనస్సు కూడా వున్నది. ఊర్ధ్వమైన ప్రజ్ఞ వుండటమే కుండలినీ శక్తి ఊర్ధ్వగతి చెందటం అంటారు. అలాంటివారు చక్రములలో కూడా బంధింపబడరు. మనసును దాటి జీవాత్మ, పరమాత్మ, దివ్య లోకములు వీటియందే మనసు నిలిపిన వారికి చక్రములు కమలములుగా విచ్చుకుంటాయని చెబుతారు.

మనసున్న వాడికి మొత్తం సృష్టంతా గోళంగా కనిపిస్తుంది. మనసు దాటినవాడికి ఇది గోళంగా కాక విచ్చుకున్న పుష్పంలా కనిపిస్తుంది. అందుకే సృష్టి గోళమని, పద్మకోశమని అంటారు. తెలిసిన వారికి ఇది పద్మకోశం. పద్మకోశం అంటే పద్మం వలె విచ్చుకొని రేకులు రేకులుగా ఇవన్నీ వున్నట్లు కన్పిస్తాయి. మనం చక్రాల్లో గిరగిరా తిరుగుతుంటాం. ఎందుకంటే మనస్సులో తిరిగేటువంటి వాడు చక్రాల్లో తిరుగుతుంటాడు. చేసినపనే చేసుకుంటూ, అవెట్లాగూ ఎప్పటికీ అవవు. అవే చేసుకుంటూ వుంటాం. అక్కడే క్రింద మీదా పడుతుంటాం. రకరకాలుగా బాధలు పడుతూ వుంటాం. ఇక్కడ ఈ మనస్సు ట్రాన్స్‌ఫర్ అయిపోయింది ఇంకోచోటుకి.

ఆమె మనస్సు చక్కగా ఈ వాక్యంలో మనం అనుసంధానం చేసుకోవలసి వుంటుంది. విజితాత్ముడు, రాజసింహుడు అయిన రాముడి దగ్గరకు ఆమె సంకల్పం అనే గుఱ్ఱాన్ని కట్టిన మనస్సు అనే రథం ఎక్కిపోతున్నట్లుగా వుంది.

ఇటుప్రక్క జరిగేవి మనని ప్రభావితం చేయకుండా, ఆ ఇవన్నీ అట్లాగే వుంటాయిలే! మనం మాత్రం దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మరువకూడదు. అంటే మన గమ్యం. ఇదేముంది? ఇట్లా చాలాసార్లు అయినాయి. ఎన్నోసార్లు ఎంతోమంది వచ్చారు. ఎంతమందిని పెళ్ళి చేసుకున్నాం? ఒక జన్మలోనే కాదు. ఒక్కొక్క జన్మలో ఒక్కొక్కరు. ఎంతోమంది పుట్టారు. ఎంతోమంది ఎన్నో రకాలుగా మనల్ని పీడించారు. ఎంతోమందిని మనం పీడించాము. ఏం సందేహం లేదు. మనం పీడించక మనల్ని పీడించేవాళ్ళు వుండరు. ఎవరన్నా మనల్ని పీడిస్తున్నారనుకోండి ఏడవవద్దు. ఎందుకంటే ఇదివరకు ఎవర్నో పీడించావు. మనల్ని పీడిస్తున్నారు. ఎవరో మోసం చేశారనుకోండి. ఇదివరకు ఎవర్నో మోసం చేశావు. అందుకని ఇపుడు చేస్తున్నారు. ఇది తెలిసినవాళ్ళ పద్ధతి. అట్లా వుండేవాళ్ళకి ఏమవుతుందంటే ఈ చక్రాలన్నీ పద్మాలు అవుతాయి.

రాముని గూర్చిన సంకల్పం అనేటువంటి గుఱ్ఱం తన మనస్సనే రథానికి కట్టివేసింది. ఆ గుఱ్ఱం రాముని దగ్గరకే వెళు తుంది. ఇంకెటూ వెళ్ళదు. మన సంకల్పం గుఱ్ఱం కాదు గాడిద. అదేం చేస్తుందంటే ఏడుస్తూ అపుడపుడూ దైవం దగ్గరకు వెళు తుంది. ఏం జరుగుతున్నాయిలే మనకేం జరుగట్లేదు. అటు దారేం తెలియట్లేదు. ఇటు ఈ పనులు జరగట్లేదు అని ఏడుస్తూ వుండేటువంటి ఒక గాడిద లాంటిదాన్ని మనం మన మనస్సనే రథానికి కట్టాం. అందుకనే దైవ సంకల్పం ఎప్పుడూ మన మనస్సు యందుంటే, అదే గమ్యంగా పెట్టుకుంటే అపుడు మనస్సనేటు

వంటి రథం అటు ప్రయాణం చెయ్యాలి. కొంతమందికి కాలము కేవలం గుండ్రంగా రాట్నం త్రిప్పినట్లుగా త్రిప్పేస్తుంది. చక్రంలాగ తిరగటం అంటే ఆ చక్రంలో తీగవలె అల్లుకుంటూ, అదీ గుండ్రం గానే తిరుగుతూ ఉంటుంది కానీ ఒక్కొక్క రౌండుకి ఒక్కొక్క మెట్టు ఎక్కేస్తూ వుంటుంది. అది కుండలిని.

ఎవరికైతే కాలము unwinding energy గా కుండలినిగా మారుతుందో, వారికి చక్రాలు ఉండవు. పద్మాలుంటాయిట వికసించి. మనస్సు ఉండదట. మొత్తం అంతాకూడా విచ్చుకొని, లేనటువంటి స్థితి. లేనివాళ్ళకి మనస్సు వుంటుంది. మనస్సులో అంతా మొత్తం ఈ గిరగిరా తిప్పేటువంటి కాలం వుంటుంది. ఆ తిప్పినటువంటి కాలంలో వీరు తిరిగి తిరిగి కళ్ళు తిరిగి పడిపోతూంటారు. మళ్ళీ లేపుతారు. మళ్ళీ అట్లాగే తిరుగుతారు. ఇట్లా గిరగిరా గుండ్రంగా తిరిగేవాళ్ళంతా కూడా వాసుకి చేతిలో వున్నటువంటివారు. ఇట్లా గిరగిరా తిరుగుతున్నా, పైకి వెళ్ళి పోతున్నవారు అనంతుని చేతిలో వున్నటువంటివారు. అదీ పామే ఇదీ పామే. అనంతుడు అనంతమైన భగవతత్త్వంలోకి చేరుస్తాడు. వాసుకి అక్కడే గుండ్రం గుండ్రంగా తిప్పుతుంటాడు రంగుల రాట్నం లాగ. ఎంతసేపు తిరుగుతుంటావు? ఇక చాలు అనం. అలసిపోతుంటాం. కానీ అక్కడే తిరుగుతుంటాం.

అందుకని ఏంచేయాలంటే ఈ మొత్తంలోంచి బయటపడా లంటే, సంసార చక్రం రకరకాల చక్రాల్లోంచి బయటపడాలంటే దైవసంకల్పం అనేటువంటిది దృఢం చేసుకోవాలి. దైవమును గూర్చిన సంకల్పం దృఢం అవాలి. అదే భాగవతంలో చెపుతాడు

లేచిన దగ్గర్నుంచి “అన్నింటియందు నన్ను చూడు” అని. అది లేకుండా తిరిగితే గాలికి తిరిగినట్లే. ఉసూరుమంటూ వుంటుంది ప్రాణం. లేచిన దగ్గర్నుంచి అదే పళ్ళు తోముకోవటం, స్నానం, బ్రేక్‌ఫాస్ట్, ఉద్యోగం, వాళ్ళే మనుష్యులు, అవే మాటలు, మళ్ళీ సాయంత్రం ఉసూరుమంటూ వుంటుంది. అంతేగానీ ఓ రామాయణం గానీ, ఒక భగవద్గీత గానీ, ఒక భాగవతం గానీ చదువుదాం అని ఉండదు. ఎందుకు వుండదంటే, మన సంకల్పం అనేటువంటిది అసలు గట్టిమే కాదు. ముందు అది గట్టిం కావాలి. ఆ తర్వాత దైవత్వాన్ని చేరేటువంటి మార్గం దానికి గనుక ఆ సంకల్పానికి వుంటే, అపుడు ఈ మనస్సనే రథానికి దాన్ని కట్టేస్తే, అందుకనే శ్రీకృష్ణుడు చెపుతాడు. "spiritual attainment cannot be gained unless your practice can become whole time" అన్నాడు. part time practice వుంటే spirituality లోకి రాలేవురా. కుక్కతోకను బద్దకి కట్టేసి వదిలేస్తే, మళ్ళీ వంకరగానే వస్తుంది. అట్లా ఒక 12 ఏళ్ళు కట్టేస్తే బద్దకేసి కుక్కకి, ఆ తోకకి వుండేటటువంటి ఎముక అట్లా నిట్టనిలువుగా వచ్చేస్తుంది. ఇంక ఆ తర్వాత వంచమన్నా వంచలేదు. ఎందుకని? అహర్నిశలూ అలా కట్టి వుంచటం చేత. అలాగే మన మనస్సనే కుక్కతోకకు, ఆ విధమైన సంకల్పమనే బద్దకి కట్టివేయాలి.

ఎప్పుడూ దైవసంకల్పంలో వుండిపోయి నటువంటి మనస్సైతే నీది, అపుడు నీవు సీతాదేవివే. ఈ రామాయణం పురాణ కాలక్షేపం కాదు. నిజంగా సాధన చేసి యోగంలో నడుద్దామనుకునేటువంటి వాళ్ళకి. సి.వి.వి. గారు చెప్పారు ఈ

యోగసాధన ఒకటి, రెండు రోజులు చేసి నిరుత్సాహపడకు, కొలంబస్ ఎన్నాళ్ళకు అమెరికా కనుక్కున్నాడు? అలాగే శాస్త్రజ్ఞులు క్రొత్త విషయాలు తెలుసుకోవడానికి ఎంత పరిశోధన చేసి, జన్మంతా దానికే సమర్పణ చేశారు? అట్లాగే నీవుకూడా దృఢ సంకల్పంతో కష్టనష్టాలు ఓర్చుకొని సాధన చెయ్యాలి తప్ప, ప్రతి చిన్న కష్టానికీ ముందు సాధన మానేస్తానని అనేవాడివల్ల ఏమీకాదు అన్నారు. అందుకని ఆ విధంగా చేసుకో సాధన అన్నారు.

ఇపుడు రాముని గురించి సీత యొక్క సాధన అంటే 30 సార్లు చెపుతున్నానని, ముందుకెళ్ళడేం అనిపించవచ్చు. అంటే విషయం దాటేసి ఊరికే కథ చెప్పుకోవటంగా 30 సార్లు చెప్పుకోవచ్చు రామాయణం. అసలు విషయాలు ఎప్పుడూ ఎక్కవు కదా! అటువంటిచోట మనం ఏం చేయాలంటే బాగా తవ్వుకోవాలి లోపలకి. తవ్వుకొని మన పరిస్థితి ఏమిటి? మనం ఎక్కడున్నాం? ఏవో చిన్న చిన్న ఆకర్షణలు వచ్చేస్తే, ముందు చేసే కార్యక్రమాలు మానేస్తాం కదా! ప్రేయర్ చేయాలి ఎట్లా? అదా ఇదా? ఇట్లా అవే మనల్ని తినేస్తున్నపుడు దీని గురించి మనం ఆలోచన చేస్తే, కనీసం స్మరణ చేసుకుంటే కొంచెం స్ఫూర్తి వస్తుందని, ఇంతసేపు మనం దీనిగురించి చెప్పుకుంటున్నాం. కాబట్టి అటువంటివాళ్ళ విషయంలో అహంకారానికి తావులేదు.

రావణాసురుడు ఆ మైథిలిని సీతాదేవిని తన చావుకోసం ఆశ పెట్టబోయాడు. ఓసారి ఆశ పెట్టాడు. అది మాయ అని తెలిసింది. ఆ పరమ పతివ్రత దీనురాలై పోయింది. ఏ విధమైన

సంతోషమూ లేకుండా తపస్విని మాదిరిగా కూర్చొని వున్నది. అటువంటి సీతాదేవికి రావణాసురుడు తన అభిప్రాయము చెప్పవలెననే మధురమైన మాటలతో, “ఓ సీతా! నీవు నన్ను చూచి భయపడుతున్నావు. అందువల్లనే ఏనుగు తొండాల వంటి నీ తొడలతో నీ కడుపు కనబడకుండాను, నీ స్తనాలు కనబడ కుండాను కప్పుకొని కూర్చున్నావు. నీ దేహము నాకు అగుపడ కూడదని అనుకుంటున్నావు. ఓ విశాలాక్షీ! నిన్ను నేను కామించాను. శుభ లక్షణాలతో వున్న నీ సర్వాంగాలు నన్ను ఆకర్షించాయి. నీవు సర్వలోక మనోహరవు. నన్ను గౌరవించు. ఇక్కడ మనుషులు కానీ, కామరూపులైన రాక్షసులు కానీ లేరు. నీకెందుకు భయం? నేను నిన్ను కామించినవాడిని. ఓ సీతా! నీవు నన్ను చూచి భయపడవద్దు. ఓ భీరూ! పరస్త్రీలతో పోవడం కానీ, పరస్త్రీలను ఎత్తుకు పోవడం కానీ రాక్షసులకు సర్వవిధాల స్వధర్మము”.

వారి పనే అది. వారికి వారు చేసింది ధర్మమే. అహంకారం జీవులను అట్లా ఎత్తుకుపోకపోతే ఈ ప్రపంచం అంతా ఎవరు పట్టించుకుంటారు? ఎవరూ పట్టించుకోరు కదా! రక్షితులవల్ల ఈ పంచభూతాత్మకమైన సృష్టిని రక్షించి అందులో జీవులను త్రొక్కి పెట్టటం వాళ్ళ పని. అది కూడా మనం అర్థం చేసుకోవాలి. అందులో వుందామనుకున్న వాళ్ళు అందులో వుండవచ్చు. దేవుడేం కాదనడు. అందులోంచి బయటకు వద్దామనుకునే వాళ్ళని అందులోకి తొక్కకురా అని చెపుతాడు. మనకుండే రహస్యం ఏమిటంటే ఈ పాంచభౌతిక సృష్టిలో అన్నీ అనుభవిస్తూ

వుండేవాళ్ళు దైవం గురించి భావన చేయట్లేదు అని ఎవరూ వెష్టపడనక్కర్లేదు. భగవంతుడు జీవులు ఆనందంగా వుండటం కోసమే ఈ విధంగా ఏర్పాటుచేసి ధర్మాన్ని ఇచ్చాడు.

ధర్మాన్ని అనుసరిస్తూ, భోగభాగ్యాలు అనుభవిస్తే అదేమీ తప్పుకాదు. నీ ధర్మాన్ని నీవు పాలిస్తూ, ఇక్కడుండేవి అన్నీ అనుభవిస్తున్నా వనుకో, తప్పేమీ లేదు. కొంతమందికి యిహ ఇది చాలు అనిపిస్తుంది. ఇది చాలు అన్పించిన వాడిని వీళ్ళు వదిలేయాలి.

పరస్త్రీలతో పోవటంగాని, పరస్త్రీలను ఎత్తుకు పోవడంగాని రాక్షసులకు సర్వవిధాలా స్వధర్మం. గుర్తుపెట్టుకోండి, రావణుని గురించి అంతకు ముందు చెప్పినపుడు ఎప్పుడూకూడా ఎవరినీ బలవంతంచేసి రావణుడు చెరచలేదు. ఆయన్ని కోరినటువంటి వారే ఆ స్త్రీ లందరూ! అంటే ఈ ప్రపంచంలో ఈ త్రిగుణాత్మకమైన సృష్టిలో దీన్నంతా అనుభూతి చెందాలని అనుకున్నవారి నెవరినీ అహంకార పురుషుడు ముట్టుకోడు. ముట్టుకోడు అంటే వాళ్ళందరూ ఈయన చుట్టూ తిరుగుతుంటారు. రావణుని చుట్టూ ఎంతమంది తిరుగుతున్నారో ఆయన ప్రొద్దున్నే లేచివస్తే వెనకాల ఎంతమందో చూశాం. అందుచేత ఈ లోకంలో వీటన్నిటినీ అనుభూతి చెందుదా మనుకునే వాళ్ళందరికీ రావణుడే రాజు. అహంకారమే రాజు. వారందరినీ ఆయన పరిపాలించుకుంటూ వుంటాడు. అంతేగానీ అటు దైవం గురించి చింతన చేస్తూ ఇది అక్కర లేదు అనుకున్న వాళ్ళను ఇంతవరకూ ముట్టుకోలేదు.

ఎందుకంటే రావణుడు కొన్ని అధర్మమైన పనులు చేశాడు. ప్రతివాళ్ళనీ వాళ్ళ ఉద్యోగాలు తీసేసి అన్ని ఉద్యోగాలు నావే అన్నాడు. అష్ట దిక్పాలకులకు, నవగ్రహాలకు పనులు లేవు. ఈయన ఏం చెబితే అది చేయాలి. ఇట్లా ఎక్కువ అహంకరించాడు. అందుకే అధర్మ ప్రవర్తన అయ్యింది. పరస్త్రీలతో సంబంధం పెట్టుకోవటం. పరస్త్రీలంటే జీవులందరూ కూడా అహంకారుడికి పరస్త్రీలే. జీవులందరూ దైవానికి చెందినవారు. వారికి వారుగా వచ్చి లోబడిపోతే అనుభవిస్తున్నాడు. అలా కానివారిని అనుభ వించటానికి ప్రయత్నం చేస్తే దెబ్బతింటాడు. ఇదొక ధర్మం మనకి ఇందులో కనిపిస్తుంది.

మనం ఇంకొకరిని ఆస్తికులుగా తయారుచేసే 'సోరా' వుంటుందే అది కూడా అజ్ఞానమే. కృష్ణుడొక్కడే ఆ మాట చెబుతాడు. “Don't disturb the simple minds” అన్నాడు గీత 3వ అధ్యాయంలో. వాడి దారిలో వాడు బ్రతుకుతున్నాడు కదా! ఇతర మతాల్లో రజోగుణదోషం చాలా ఎక్కువ. మన మతంలో లేదు. ఇపుడిపుడే రజోగుణం అనేది మనుషుల్లో బాగా పెరుగుతోంది. కాబట్టి వీళ్ళూ అవే పనులు చేస్తున్నారు. నీకు నచ్చింది నీవు చేసుకుంటున్నావు. వాడికి నచ్చింది వాడిని చేయనీ.

మహర్షులు ఏం చెబుతారంటే “I rule myself, let us others rule themselves.” అన్నారు. నన్ను నేను పరిపాలించు కుంటాను. ఇతరులను వారిని వారుగా పరిపాలించుకో నిస్తాను. అంతేకాని నా సిద్ధాంతాలు, నా నమ్మకాలు, నా సంప్రదాయాలు, నా అలవాట్లు వారిమీద రుద్ది, వారలాగే వుండాలని వారిని హింస

పెట్టను. అందుకని ఎవరు ఏమిటి అనేది ఈ స్వతంత్రత పరమగురువుల బోధల్లో చాలా ఎక్కువ వుంటుంది. ఎందుకంటే నీతోపాటు పుట్టినవారికి నీలాంటి సంస్కారమే వుండాలని ఎక్కడా లేదు.

హిరణ్యకశిపునికి ప్రహ్లాదుడు పుట్టలేదూ? కృష్ణునికి సాంబుడు, గదుడు పుట్టటం ఏమిటి? ఊహించలేం కదా! రావణాసురుడు పడుకుంటే, ఆడవాళ్ళంతా ఎట్లా పడుకున్నారో హనుమంతుడు ప్రతి వ్యక్తిని పరిశీలనగా చూడటంచేత ఎట్లా పడుకున్నారో అన్నీ చాలా వివరంగా ఇచ్చేశాడు వాల్మీకి. తు.చ. తప్పకుండా సత్యం వున్నదున్నట్లు రాశాడు. అలా రాసినపుడు వాళ్ళందరూ ఆయనతో అట్లా కోరి వున్నారు తప్ప, ఏ ఒక్కరినీ బలాత్కారం చేసి, బలవంతం చేసి రావణుడు తాకలేదు అని వ్రాశాడు. అందుకని అహంకారంలో ఇమిడి వున్నటువంటి వాళ్ళందరూ కూడా రావణుని మోహించిన వాళ్ళే. సర్వ విధాలా ఇది మా స్వధర్మం అని రావణుడు చెప్పాడు. మమ్మల్ని అనుసరించే వాళ్ళని మేమే పాలిస్తాం. అనుసరించని వాళ్ళని కూడా పాలిద్దామని కొంచెం ప్రయత్నం చేశాడు.

“ఓ మైథిలీ! ఇదిట్లా వున్నప్పటికీ నేను నిన్ను ముట్టుకోను.” అది చూడండి. కామించడం కోసం సామ దాన భేద దండోపాయాలు చూపించాడు తప్ప, కామించకుండా ముట్టుకునే బుద్ధి కాదు రావణుడిది. అహంకారం కూడా అంతే. నువ్వు నీయందు నీలోపల కడుపునిండా పెట్టుకుంటావు కోరిక. అవన్నీ అహంకారానికి సంబంధించినవి. త్రిగుణములతో మనిషి వున్నప్పుడు వానికి

తట్టెడు కోరిక లుంటాయి. అవి పెట్టుకుని ఏవో హోమాలని, పూజలని, లేకపోతే క్లాసులని వీటన్నిటికీ వస్తుంటారు జీవులు.

సుందరకాండలో ఏది సుందరం? మన కోరికలు తీరటం సుందరం కాదు. సద్గురువు సుందరం. సత్సాధకుడు సుందరం. అహంకార పురుషుడి ధర్మముల వివరణ సుందరం. లంకానగరం సుందరం. సీతాదేవి భక్తి సుందరం. భక్తుని యందు రాముని ఆకాంక్ష సుందరం. హనుమంతుడి శక్తి సామర్థ్యాలు, చర్యలు, నిరహంకారము సుందరం.

రావణాసురుడైనా మనం మెచ్చుకోవాలి. రాముడే మెచ్చుకున్నాడు. ఇంకొకడి మెప్పుకోసం రావణుడు జీవించడు. అహంకార పురుషుడు రావణుడు. "నువ్వు నన్ను కామించనిదే నిన్ను ముట్టుకోను." మనం ఎన్నింటినో కామిస్తాం. కామిస్తాం కాబట్టి రావణుడు మనకు రాజు అయిపోతాడు. లంకలో బంధిస్తాడు. కామించని వాడిని ఏమీ చెయ్యడు. బంగారు జింకను కామించావు, అందుకని వచ్చేశావు. ట్రాన్స్‌ఫర్ చేసేశారు నిన్ను అక్కడనించి. నీకు అదే లేకపోతే రాముడితోనే వుండేదానివి కదా! రాముడి రక్షణలో వుంటే నేనేమీ చేయగలిగి వుండేవాడిని కాదు. నువ్వు నీకై కోరుకుని ఓ దాంట్లో పడ్డావు.

"నువ్వు నన్ను యథేచ్ఛగా కామించవలెను" అంటున్నాడు next. ఇవి మంచి వాక్యాలండీ. నువ్వు నన్ను కామించనిదే నిన్ను నేను ముట్టుకోను. ఒక నియమం అది అహంకార పురుషుడికి. నువ్వు కోరుకోకపోతే నిన్ను బంధించేదేమీ లేదు. నువ్వు

కోరుకోవటం వలన, నీ కోరిక వలన నువ్వు బంధింపబడు తుంటావు. ఎందుకంటే అది అవదు. దానికోసం అట్లా చొంగలు కార్చుకుంటూ తిరగటం. కదా! నీవు భయపడ నక్కర్లేదు. నీవు నన్ను యథేచ్ఛగా కామించవచ్చు. నీకు ఇష్టమైతే కామించు అంటున్నాడు. కామిస్తే మరి మిగతా అంతా నేను చూసుకుంటాను అంటాడు.

"ఓ ప్రియురాలా! నీవు ఇక భయపడ నక్కర లేదు. నన్ను నమ్ము. యథార్థముగా నన్ను ప్రేమించు. నీవిట్లా శోకలాలసవు కావద్దు. నువ్వు దువ్వుకోకుండా నీ తలవెంట్రుకలు ఒకే జడగా మెలి పెట్టుకోవటము, నువ్వు కటిక నేలమీద పడుకోవటము, ఎపుడూ ఏదో ధ్యానము చేస్తూ వుండటము, మాసిపోయిన చీర వదలకుండా కట్టుకొని వుండటము, సమయా సమయాలు గమనించకుండా ఉపవాసాలు చేయటము ఏమీ బాగోలేదు." సమయా సమయాలు లేకుండా ఉపవాసాలు అంటే తిండి మానేయటం అని కాదు. అంటే అదొక అర్థం. ఆవిడ దేవుడికోసం తినటం మానేసింది. చస్తే చస్తాం. కనపడితే వాడు కనపడాలి. ఎన్నాళ్ళని తింటాం, ఈ పచ్చళ్ళు, కూరలు అన్పించి వదిలేసింది. సమయా సమయాలు లేకుండా ఉపవాసం అంటే ఎపుడు వీలుంటే అపుడు దైవంతో కూర్చోవటం ఉపవాసమే. దైవానికి దగ్గరగా కూర్చోవటం ఉపవాసం. దైవానికి దగ్గరగా కూర్చోటానికి పనికి వస్తుందని బాగా పొట్టనిండా తినకుండా వుండటానికి ఉపవాసం పెట్టుకున్నారు. అంతేగానీ ఉపవాసం వుంటే దేవుడికి ఆనందం కాదు. మనం అంతా ఆకలితో వుంటే ఆయనకేంటి ఆనందం?

ఒకడు ఏడుస్తూంటే ఆనందించేవాడు దేవుడైతే, ఆ దేవుడు మనకి అక్కర్లేదు. పెద్ద వాళ్ళందరూ కూడా దైవము యందు వాళ్ళకున్న అనురక్తివల్ల తినటం మర్చిపోయే వారు. మనకంత పరిస్థితి ఏం వుంది? తినటమే కాదు, చాలా ముఖ్యమైన విషయాలు కూడా మర్చిపోయే వారు దైవంతో వుండటంచేత. వదిలేసుకుంటే ఆయన దగ్గరవుతాడు అనుకోకూడదు. దగ్గరవటం వలన వారికవి గుర్తులేవు. అలా తీసుకోవాలి. 40 రోజులు ఏసుక్రీస్తు దైవ సాన్నిధ్యంలో వుండటం వల్ల తినలేదు, త్రాగలేదు. ఇవాల్టికీ చేస్తూంటారు ఎపుడవుతుందా 40 రోజులు అని లెక్కపెట్టు కుంటూ. ఉపవాసం అంటే దైవముతో చేరియుండుట. మనస్సును దైవంతో చేర్చియుంచుట. అందుకని మితంగా తీసుకోవటం, నిర్జల ఉపవాసం వుంటుంది. ఊరికే అది శరీరాన్ని దుఃఖ పెట్టేటట్లుగా చేయకూడదు.

"మైథిలీ! నీవు నన్ను కూడు. నానావిధాల పూలదండలు వేసుకో. నీ దేహానికి చందనాగరు గంధం పూసుకో. దివ్యాభరణాలు పెట్టుకో. మంచి చీరలు కట్టుకో. మంచి మద్యము త్రాగుతూ, ఉత్తమ శయ్యాసనాల మీద పడుకొంటూ, కూర్చుంటూ, విహరిస్తూ, నృత్య గీత వాయిద్యాలతో ప్రొద్దుపుచ్చుతూ హాయిగా వుండు. నీవు సిగలో రత్నము వంటి దానవు. నీవిట్లా వుండ కూడదు. నీ దేహాన్ని చక్కగా అలంకరించుకో. ఓ రూపసీ! నా నివాసము చేరిన నీవు అలంకారాలు, ఆభరణాలు లేకుండా వుండటం ఏమిటి?" శరీరంలో వున్నావు కదా! అది కదా లంక.

శరీరంలో వున్నదానివి శరీరాన్ని చక్కగా ఏర్పాటు చేసుకొని అనుభూతి చెందక ఎందుకిట్లా వున్నావు?

"నీవు నన్ను యథేచ్ఛగా కామించవలెను. నీకిష్టమైతే కామించు. ఓ ప్రియురాలా! నీవు అలంకరణాలు, ఆభరణాలు లేనిదానివిగా వుండటమేమిటి? మనోహరమైన నీ యౌవనమంతా గడిచిపోతూ వుంది. ప్రవాహంలో కొట్టుకుపోయిన నీళ్ళు తిరిగి రావు. అట్లాగే గడిచిపోయిన యౌవనమూ తిరిగిరాదు. ఓ వైదేహీ! ఈ ప్రపంచంలో రూపాలన్నీ చేసే బ్రహ్మదేవుడికి నిన్ను చేసిన తరువాత, నీ రూపము వలె మరొకటి చేయడం చేతకాలేదని అనుకుంటున్నాను" అన్నాడు.

శరీరంలో వున్నాం కాబట్టి దానికి అలంకారాలు కావాలి. లంక అంటే శరీరమే కదా! శరీరానికి యౌవనం దాటిపోతే మళ్ళీ తిరిగి రాదు. ఇలా ఆడవాళ్ళతో మాట్లాడటం కూడా ఒక కళే. ఆడవాళ్ళను ఎప్పటికీ గెలవలేము కానీ అప్పుడప్పుడు పొగడాలి, గెలవాలి. పురుషుని పొగిడితే అతడు కూడా స్పందిస్తాడు కానీ స్త్రీ తొందరగా స్పందిస్తుంది. అందుకే జూలియస్ సీజర్ "ఈ మొత్తం సృష్టిలో పొగిడితే పడనివాడు ఎవడూ వుండడు" అన్నాడు.

ధర్మరాజే పొగిడితే పడిపోయాడు. అందుకని రాజసూయం వరకూ వచ్చింది. బ్రహ్మాండంగా విశ్వామిత్రుడు పొగిడితే హరిశ్చంద్రుడు నీకేం కావాలో అది ఇస్తాను అంటాడు. అయి పోయింది. నేను పైకి బిళ్ళ ఎగరేస్తాను. అంత ధనం ఇచ్చేయ్ అంటాడు. ఆ బిళ్ళ ఎగరేస్తే అది ఎక్కడికో పోయింది. ఏడు

లోకాలు దాటింది. ఎంత ఇచ్చినా చాలలేదు. మరి ఇచ్చేసేయ్ అని పెళ్ళాం దగ్గర్నించి పట్టుకెళ్ళి పోయాడు. దశరథుడిని పొగిడాడు విశ్వామిత్రుడు. ఇంత రాజర్షి పొంగిపోయాడు. తెలివైనవాడు పొగిడి, వాడి పనులు చేయించుకుంటాడు. బుద్ధిహీనుడు వాడి పొగడ్తకు లోబడి శక్తికి మించిన పనులు ఒప్పుకొని కష్టపడతాడు.

రావణుడు సీతను చాలా పొగిడాడు. కానీ ఆమె పడిపో లేదు. సత్యమే అయినప్పటికీ ఆవిడ పడదు. మనస్సు అటెటో పోయింది. పిచ్చోళ్ళతో మాట్లాడితే ఎట్లా వుంటుంది? వాడు పాపం పిచ్చివాడని మనం అనుకుంటాం కానీ వాడు అనుకోడు. వాడు అదృష్టవంతుడు. వాడికీ లోకమే వుండదు. వాడికిష్టమైతే తింటాడు. లేకపోతే అదీలేదు. తినాలని కూడా తెలియదు. ఈ మనస్సులో జీవించేటటువంటి వాళ్ళు, ఆ మనస్సులో జీవించ నటువంటి వాళ్ళని ఏదో పాపం కాపాడుకోవాలని వీడి కర్మ ప్రకారం వాడికి చేయటమే. వాడు వీడిని చేయమని కూడా అడగడు. ఎందుకని? వాడికి మనస్సే లేదు. చచ్చిపోతున్నానని కూడా వాడికి తెలియదు. పాపం వాడికి మనస్సే లేదని మనం అనుకోవటం తప్పు, పాపం వీళ్ళకి మనస్సుందని వాడు అది కూడా అనుకోడు. అట్లా ఈవిడ మనస్సు ఎక్కడికో వెళ్ళిపోయింది. ఈయన శరీరం గురించి చెపుతున్నాడు.

రావణుడు సీతతో ఇంకా మాట్లాడుతూ, "ఓ శుభదర్శినీ! నీ రూపాన్ని పోలినది మరొకటె ఈ జగత్తులో లేదు. సీతా! నీ రూపాన్ని, నీ యౌవనాన్ని చూస్తే సాక్షాత్తూ బ్రహ్మదేవుడైనా నిన్ను మోహిస్తాడు. ఇక ఏ మగవాడు నిన్ను మోహించకుండా

వుండగలడు? ఓ మైథిలీ! నీవు నా భార్యవుకా! అజ్ఞానము వదిలి పెట్టు. నీకు మంచి అవుతుంది. నేను నానా ప్రదేశాల నుండీ ఎంతోమంది వరాంగనలను ఎత్తుకొని వచ్చినాను. వారందరూ నాకు భార్యలైనారు. వారందరిలోనూ నీవు నాకు అగ్రమహిషివిగా వుండు. నేను ఈ లోకములో బలవంతంగా ఎత్తుకొని వచ్చిన రత్నాలన్నీ నీకు ఇస్తాను. నా రాజ్యము నీకు ఇస్తాను. నేను నీవాడిగా వుంటాను".

(అహంకారానికి లోబడ్డ జీవుడు తలక్రిందులుగా మల మూత్రాల దగ్గర పడివుంటాడు. అహంకారాన్ని దాటిన జీవుడు తేజస్సుతో ఆజ్ఞలో వుండి తనదైన జీవితాన్ని పరిపాలిస్తూ వుంటాడు.)

"ఓ విలాసినీ! నీకోసం నానావిధ నగరాలతో వున్న ఈ పృథ్వినంతా జయించి, నీ తండ్రి జనక మహారాజుకు ఇస్తాను. నన్నెదిరించిన వాడెవడూ ఇంతవరకూ నాకు ఈ లోకంలో అగుపడలేదు. యుద్ధంలో నన్నెదుర్కొనువాడు ఈ జగత్తులో ఎవడూ లేడు. నా మహత్తర పరాక్రమాన్ని గురించి అలోచించు. సురాసురులు నాతో అనేకమార్లు యుద్ధం చేసి ఓడిపోయారు. నేను వారి టెక్కాలను విరగగొట్టాను. వారెవరూ నా ఎదుట నిలువలేక పోయారు. ఓ సీతా! నీవు నన్ను వరించు. చక్కగా అలంకరించుకో. నీ కాంతివంతమైన ఆభరణాలన్నీ పెట్టుకో. చక్కగా అలంకారము చేసుకున్న నీ రూపం చూస్తాను. ఓ సుందరాననా! నీవు నామీద దయయుంచి అలంకరించుకో. యథేష్టముగా అన్ని భోగాలూ అనుభవించు. తాగు, క్రీడించు. నీ

వాళ్ళకు నీ చిత్తము వచ్చినట్లుగా ధనాన్ని, భూమిని ఇచ్చుకో. నన్ను నమ్ము. నాతో రమించు. నీకు కావలసిన పనులన్నీ ధైర్యంగా ఆజ్ఞాపించి చేయించుకో. నీవు నా అనుగ్రహంతో సంతోషాలన్నీ అనుభవిస్తూ వుంటే, చూచి నీ బంధువులందరూ ఆనందిస్తారు".

"ఓ మంగళ స్వరూపిణీ! నీవు నా వస్తు సమృద్ధిని, నా ఐశ్వర్యాన్ని, నా యశస్సును చూడు. ఓ సుందరీ! వల్కలాలు కట్టుకొన్న రాముడితో ఏమి అనుభవిస్తావు? వాడికి జయము లేదు. సంపద పోయింది. మహారణ్యాలలో తిరుగుతున్నాడు. వానప్రస్థ వ్రతం అవలంబించి నేలమీద పడుకొంటూ వున్నాడు. ఇప్పుడు బ్రతికివున్నాడో లేదో సందేహమే. కొక్కెర నీలిమేఘాల్లా కమ్ముకుంటే, వెన్నెల అగుపించదు. అట్లాగే నా దగ్గరవున్న నీవు రాముడికి అగుపడవు. వాడు వచ్చి నిన్ను చూడలేడు. హిరణ్య కశిపుడంతటి వాడు తన భార్యను దేవేంద్రుడు ఎత్తుకు పోతే, పరాక్రమంతో తిరిగి తెచ్చుకోలేక పోయాడు. నారదుడి కాళ్ళు పట్టుకొని భార్యను తెచ్చుకున్నాడు. కానీ నేను ఎత్తుకువచ్చిన నిన్ను మాత్రము రాముడు ఏ విధం గానూ తీసుకుపోలేడు.

ఓ విలాసినీ! నీవు భీరువువు. నీ సహజమైన చిరునవ్వు, అందమైన పలువరుస, మనోహరమైన నేత్రాలు, నీ అంగ సౌందర్యము నా మనసును హరించి వేస్తున్నాయి. అహంకారునికి ఎంతసేపూ దేహాన్ని సంరక్షించుకోవటమే. దేహ సౌందర్యమే, రూప సౌందర్యమే. ఈ ప్రకృతిలో కనిపించే వాటియందే వాటికి మక్కువ ఎక్కువ. అవన్నీ ఏరుకు తెచ్చుకుంటూ వుంటాడు.

ఓ జానకీ! అంతఃపురాంగన లందరూ సమస్త శుభలక్షణ సంపన్నులు. వారందరికీ నీవు అధికారిణిగా వుండు. వారందరూ ముల్లోకాలలోనూ ఉత్తమమైన స్త్రీలు. లక్ష్మీదేవికి అప్సరసల వలె నీకు వారందరూ సేవలు చేస్తూ వుంటారు. ఓ శుశ్రోణీ! కుబేరుడి దగ్గర వున్న ధనాన్ని, రత్నాలను తీసుకొనివచ్చి నీకు ఇస్తాను. వాటినే కాదు, నేను జయించిన లోకాల నన్నిటినీ నీవు హాయిగా అనుభవించు. ఓ సీతా! తపస్సులో రాముడు నాతో సరిసమాన మైనవాడు కాదు. బలంలో కానీ, పరాక్రమంలో కానీ, ధనంలో కానీ, తేజస్సులో కానీ నాకు తుల్యుడు కాదు. ఓ లలనా! నీవు త్రాగు. సుఖంగా తిరుగు. క్రీడించు. అన్ని భోగాలూ అనుభవించు. నీకు నేను ధనమును, ఈ భూమిని ఇస్తాను. నాతో హాయిగా రమించు. నీ బంధువు లందరూ నీ దగ్గరకు చేరి సంతోష పడతారు.

ఓ భీరూ! నీవు బంగారపు హారాలతో అలంకరించుకో. సముద్రతీరాన పూలుపూసిన వృక్ష సమూహాలతోను, తుమ్మెదల ఝుంకారములతోను కూడిన మనోహరమైన ఉద్యానవనాలలో నాతో విహరించు" అని రావణుడు చెప్పాడు.

రావణాసురుడు ఆ విధంగా కామోద్రేకముతో సీతను సమీపించి ప్రసంగించగా, దానికి అమ్మవారు ఈ విధంగా ప్రతిస్పందించింది.

ఆ భయంకర రాక్షసుడు రావణాసురుడు చెప్పిన మాటలు సీతాదేవి విన్నది. ఆ శుచిస్మిత, ఆ వరారోహ, ఆ పతివ్రత తన

పెనిమిటి గురించి ఆలోచిస్తూ, వణకిపోతూ, ఏడుస్తూ, రావణాసురుడితో ప్రత్యక్షంగా కాకుండా ఓ గడ్డిపోచను అడ్డుపెట్టుకొని దీనస్వరంతో ఈ విధంగా పలికింది.

“ఓ రాక్షసుడా! నామీద నుంచి నీ మనసు మళ్ళించుకో. నీ మనసు నీ స్వంత భార్యల మీద ఉంచు. పాపిష్ఠివాడు స్వర్గాన్ని కోరినట్లు నీవు నన్ను ప్రార్థించి ప్రయోజనం లేదు. నేను పరిశుద్ధమైన వంశములో పుట్టినాను. మహాపూజ్యమైన వంశములో పుట్టినవాడు నన్ను పెళ్ళాడినాడు. నాకు ఒక్కడే పెనిమిటి. నేను పతివ్రతను. లోకము నిందించే అకార్యము నేను చేయను” అంటూ తన ముఖము ఆ రావణాసురునికి కనబడ కుండా వెనుకకు తిరిగి, “ఓ రాక్షసుడా! నేను ఇతరుడి భార్యను. పతివ్రతను. నీకు తగిన భార్యను కాను. నీవు సత్పురుషుల ధర్మం ఆలోచించు. సత్పురుషులు పాటించే ఆచారాన్ని పాటించు.”

“ఓ నిశాచరుడా! నీ భార్యల వంటి వారే ఇతరుల భార్యలు కూడాను. నీవు నీ భార్యలను ఎంత కట్టుదిట్టంగా కాపాడుకుంటూ వుంటావో, ప్రతి మగవాడు వాడి భార్యను అదేవిధంగా కాపాడు కుంటూ వుంటాడు. అందరూ నీవంటి వారే. నీవు నీ భార్యలతో సంతుష్టిపడు. అలా సంతుష్టి చెందని చపలుని, చలిత ఇంద్రియుని పరదారలు పరాభవిస్తారు. వాడి ఐశ్వర్యాన్ని నాశనం చేసి వేస్తారు.”

అందుచేత ఎపుడూ కూడా ఇతర స్త్రీలను ఆశించటం అనేది ఒక మనిషి తన యొక్క సమస్త ఐశ్వర్యమును, కీర్తిని, ప్రతిష్ఠను సమస్తమును కోల్పోవటం అనే ఒక సన్నివేశము అతని

జీవితంలో గనక తారసిల్లినట్లైతే ఈ విధమైనటువంటి భావాలు వస్తాయి. ఇతరుల ధనం అపహరించడం ఒక ఎత్తు. ఇతరుల భార్యను అపహరించటం ఒక ఎత్తు. రావణుడు ఇంత కాలం ఇతరుల ధనాన్ని బాగా తన పరాక్రమం చేత జయించుకున్నాడు.

"ఓ రావణాసురుడా! ఈ లంకా పట్టణంలో నీకు చెప్ప గలిగిన పెద్దలెవరూ లేరా? లేక ఆ పెద్దలు చెప్పిన మాటలు నీ బుద్ధి కెక్కవా? అంతే అయివుంటుంది. సత్పురుషులు నీకు మేలు చేసే మాటలే చెప్పివుంటారు. నీ బుద్ధి విపరీతమై పోయింది. అందువల్ల నీవు వారి మాటలు పాటించి వుండవు. నీవు రాక్షసు లందరితోను పైకి స్నేహంతో వుంటూ లోపల వారి నాశనము తలపెట్టినావు. సత్పురుషుల సదుపదేశము వినకుండా రాజు అన్యాయానికి ఒడిగట్టితే సర్వసంపదలు, రాష్ట్రాలు, నగరాలు నాశనమై పోతాయి. నానావిధ రత్న ధాతువులతోను, సమస్త సంపదలతోను తులతూగుతూ వున్న ఈ లంకారాజ్యం నీ ఒక్కడి అపరాధం వల్ల అచిరకాలంలోనే నాశనమై పోతుంది. దూరదృష్టి లేని పాపకర్ముడు చేసిన పాపిష్ఠి పనికి నాశనమైపోతూ వుంటే సర్వప్రాణికోటి సంతోషిస్తుంది. ఇదివరకు నీవు ఎవరిని వంచన చేశావో వారందరూ, నీవు దైవవశం వల్ల నాశనమైపోతూ వుంటే చూసి సంతోషిస్తారు. భయంకరుడవైన నీకు కష్టాలు వస్తే అందరూ అది తమ భాగ్యమని చెప్పుకుంటారు.

ఓ రాక్షసుడా! నీ ఐశ్వర్యంతో కానీ, నీ అంతఃపుర ప్రభుత్వ అధికారంతో కానీ, నీ ధనంతో కానీ నీవు నన్ను ఆశ పెట్టలేవు. నేను అట్లా ఆశపడేదానను కూడా కాదు. సూర్యుని వెంట

వెలుతురువలె నేను ఆ రామప్రభువు వెంట ఎప్పుడూ వుండే దానను. నేను ఆయనను వదిలిపెట్టను. ఆ లోకనాథుని ఉత్తమ భుజాన్ని తలగడగా చేసుకున్న నేను మరొక భుజాన్ని ఎట్లా తలగడగా చేసుకుంటాను? రసస్నాతుడు, విజితాత్ముడు, బుద్ధి మంతుడు అయిన బ్రాహ్మణుని ఆశ్రయించుకొని వుండే వేద విద్యవలె ఆ మహానుభావుని నేను ఆశ్రయించుకొని వుంటాను. నేను ఆ రామప్రభువుకు తప్ప మరెవరికీ తగిన భార్యను కాను. ఓ రాక్షసుడా! అడవిలో పోతుటేనుగును ఎడబాసి నలుగుతున్న పెంటి ఏనుగును మళ్ళీ పోతుటేనుగుతో చేర్చినట్లుగా ఇట్లా దుఃఖ పడుతున్న నన్ను, నీవు ఆ రామ ప్రభువుతో చేర్చు.

ఓ రావణాసురుడా! నీవు హాయిగా వుండవలె ననుకొంటే, ఘోరవధ వద్దనుకొంటే నీవు ఆ పురుషోత్తమునితో స్నేహము చేసుకో. ఆ మహానుభావుడు స్నేహానికి తగినవాడని, ధర్మజ్ఞుడని, శరణాగత వత్సలుడని ప్రసిద్ధికెక్కినాడు. నీవు జీవించదలచుకుంటే, ఆయనతో చెలిమి చేసుకోవలెను. నీవు ఆ శరణాగత వత్సలుని సంతోషపెట్టవలెను. నీవు పరిశుద్ధుడవై నన్ను ఆయనకు సమర్పించవలెను. ఇట్లా నన్ను ఆయనకు సమర్పించేట్లయితే నీకు మేలవుతుంది.”

(మొట్టమొదటగా అమ్మవారు పరపురుషుని చూడటం ఇష్టంలేక ఒక గడ్డిపోచను అడ్డంగా పెట్టుకొని మాట్లాడుతుంది. అందులోని ఒక భావం ఏమిటంటే నీవు నాకు ఒక గడ్డిపోచతో సమానమని. మరొకటి అతని ప్రవర్తనము. తన ప్రవర్తన వల్ల అతడెంతో తేలికయ్యాడని తెలుస్తుంది. గడ్డిపోచ అన్నిటికన్నా

తేలిక. ఎప్పుడైతే పురుషుడు పరస్త్రీని మోహించి, కామించి, అనుభవించాలని అనుకుంటాడో అప్పుడతని గుణాలన్నీ అతని నుండి అదృశ్యమైపోయి, ధర్మమంతా నాశనమైపోయి అతడు గడ్డి పోచతో సమానమైన వ్యక్తి అవుతాడు. ఇది మనకు పెద్దలిచ్చిన ధర్మం. ఎన్నడూ ఇతరుల భార్యలను ఆశింపకూడదు. ఈశా వాసోపనిషత్తు కూడా ఆ విషయమే చెబుతుంది. అందుచేత ఎప్పుడూ ఇతర స్త్రీలను ఆశిస్తే ఇలా అవుతాడు.

రావణుడు స్త్రీలను తన పరాక్రమంతో జయించినవాడు. ఆ స్త్రీలందరూ అతనిని వరించి చేరినవారే. ఇప్పుడు మొట్టమొదటి సారిగా రావణుడు వివాహమైన స్త్రీని అక్రమంగా ఎత్తుకొచ్చాడు. వీర్యశుల్క కూడా కాదు. వీర్యశుల్క అయినప్పటికీ కూడా రామునితో యుద్ధంలో గెలిచినప్పటికీ కూడా వివాహిత అయిన స్త్రీని వివాహం ఆడటానికి ధర్మం ఒప్పుకోదు. ప్రత్యేకించి ఆ స్త్రీ అంగీకరించకపోతే సర్వనాశనం అయిపోతాడు. సీతకు తామిద్దరూ ఉత్తమ వంశములలో పుట్టామన్న ఆత్మవిశ్వాసం వుంది. ఉత్తమ వంశంలో పుట్టినవారికి యిలాంటి ఆలోచనలు రావు. రావణుడు సప్తర్షులలో ఒకడైన పులస్త్యుని మనుమడు. అయినప్పటికీ ఇలాంటి బుద్ధి పుట్టడం వల్ల వంశానికి కీడు కలుగుతుంది.

ఒక వ్యక్తి తను చేసినటువంటి పని ఫలితంగా ముందు మూడు తరములు, తర్వాత మూడు తరములు తరించటం గానీ, నశించటం గానీ వుంటుంది. అందుకని అది ఒక ధర్మం. మనకి బాలకాండ, అయోధ్యకాండలలో బాగా వివరించి ఇస్తారు. రాముడు నిజానికి తండ్రి ఆజ్ఞ మేరకు వనవాసం చేస్తాడు. అది తండ్రికి

ఉత్తమ లోకాలు కలగాలని, తండ్రి తండ్రికి కలగాలని, ముత్తాతకి కలగాలని. స్వచ్ఛందంగా భరతుడు, కైకేయితో సహా తల్లులు వచ్చి, రాజ్యానికి మళ్ళీ వచ్చి నీవే పరిపాలించుకో. ఏదో ఒక దురదృష్టమైన ఘటన జరిగింది అని చెప్పినప్పటికీ, రాముడికి పరిపాలించటానికి కావలసిన అవకాశం ఏర్పడినపుడు కూడా దశరథుడు, అతనికన్నా ముందు పరిపాలించిన రాజులు, తన వంశంలో పూర్వులు అందరూ కూడా ఉత్తమలోకంలో వుండా లంటే అతడు దశరథుడి యొక్క మాటని సత్యం చేయాలి. అందుచేత తనతో సమానమైన భరతుడు రాజ్యాన్ని పరిపా లిస్తున్నాడు కాబట్టి, రాజ్యానికి ఏ విధమైన ఆపద లేదు. తనవంతు కర్తవ్యంగా పితృఋణం తీర్చుకునే పద్ధతిలో రాముడు అరణ్య వాసం చేసి, దశరథుడికి ఉత్తమ లోకాలు కల్పిస్తాడు. అటువంటి ఉత్తమోత్తమమైన కుటుంబంలో పుట్టినవాడు రాముడు.

అలాగే రావణుడు కూడా సప్తర్షుల వంశంలో పుట్టినవాడు, శివభక్తుడు. వేదవిద్య యందు పరిపూర్ణమైన అవగాహన కలిగిన వాడు. సహజముగా ధర్మాత్ముడు. పరాక్రమం చేత సమస్తమును గెలుచుకున్నాడు. ఆ గెలుచుకోవటంలో ఇబ్బంది కలిగింది. నీకన్నా బలహీనుడైన రాజుని జయించి అతన్ని వశం చేసుకోవటం అనేది రాజస ధర్మంలో వుంది. ఆ విధంగా నువ్వు నిర్వర్తిస్తే నిర్వర్తించావు. ఇతరుల స్త్రీలను నువ్వు కామించి, వారు కూడా నిన్ను కామిస్తే నీవు పొందవచ్చు. వివాహితులు కానివారినే రావణాసురుడు తెచ్చుకున్నాడు. వారందరూ తనని మోహిస్తేనే తన భార్యలుగా ఏర్పరచుకొని జీవిస్తూ వచ్చాడు. ఇపుడు ఇతను చేసే పని ఒక

ఉత్తమ కులంలో ఉండేవాడు చేసే పని కాదు అనే విషయాన్ని ఆమె అతనికి గుర్తు చేస్తోంది.

అందుచేత నేను, రాముడు పరిశుద్ధ వంశంలో పుట్టాము. అది కారణం చేత సత్పురుషులు చేసే ఆచారాన్నే మేం పాటిస్తున్నాం. ఒక్కసారి ఆలోచిస్తే నువ్వు కూడా ఆ విధంగానే పాటించవలసి వుంటుంది సుమా! అని చెప్పింది. రెండవది ఇంకొక ధర్మం చెప్పింది. ఒకటి ప్రతివ్యక్తి తను చేసే పనులవలన తన పూర్వీకులకి కూడా ఏమన్నా దెబ్బ తగులుతున్నదా అని చూసుకోవాలి. ఎందుకంటే ఒక ఉత్తమమైన వంశంలో పుట్టి దురభ్యాసాలకిలోనై, తాను రకరకముల పాపములు నిర్వర్తించినట్లైతే అది కారణంగా తన తండ్రి, తాత, ముత్తాతలకి దానియొక్క ప్రభావం వారిమీద వుంటుంది. మనం శ్రాద్ధములు పెట్టేటపుడు కూడా ఈ ముగ్గురికీ పెడుతూవుంటాం. అందుకని వారి ముగ్గురికీ నీ ప్రవర్తనయే ఉత్తమ లోకాలు కలిగించటం గానీ, ఉన్న లోకాల నుంచి క్రిందకి లాగటం కానీ వుంటుంది. నీవు ఒక్కడివే కాదు. నీముందు ముగ్గురు, నీ తర్వాత ముగ్గురితో నీకు సంబంధం వున్నది. ఏడు తరముల సంబంధం ప్రతి వ్యక్తికీ వుంటుంది. అంతేకాదు తన మూడు జన్మల ముందువి, తన మూడు జన్మల తరవాతవి కూడా తను చేసే కార్యక్రమములు తనని పీడిస్తూంటాయి. అది కారణంగా అంటే Lateral గాను, Lineal గాను వుంటాం. అంటే నీ తండ్రి, తాతలు, నీ తనయుడు, మనుమలు అదొక వర్గం అయితే, నీ ముందు జన్మలు, నీ తరువాత జన్మలు. ఇలా మనకి రెండు రకాలుగా ఈ బాధ అనుభవించవలసి వస్తుంది. సత్కార్యములు

నిర్వర్తిస్తే  రెండు రకములుగా సుఖ పెట్టినట్లు అవుతుంది. అందుచేత సీతాదేవి "నీవొక్కడివీ ఈ విధంగా ప్రవర్తించటం వలన అంతకుముందు ధర్మంతో ప్రవర్తించిన నీ తండ్రి, తాతలకు కూడా నీవు ఇబ్బంది కలిగిస్తున్నావు సుమా!" అనే ధర్మాన్ని చెప్పింది. ఆపైన ఏం చెప్పిందంటే....

నీ భార్యల విషయంలో నువ్వేం కోరుకుంటావో, ఇతరులు కూడా వారి భార్యల విషయంలో అదే కోరుకుంటారు కదా! నీ భార్యల్ని నీవు కట్టుదిట్టం చేసుకున్నావు. నీ భార్యల్ని ఇంకొకరు ఎత్తుకుపోకుండా చూసుకుంటావు. అలా వెళ్ళిపోతే నీవు చాలా దుఃఖ పడతావు. నీకు బాధ కలుగుతుంది. వారిమీద యుద్ధానికి వెళతావు. వాళ్ళని సంహరించేంత వరకు నీవూరుకోవు. అదే పద్ధతిలో మిగతావాళ్లు కూడా వుంటారు కదా! అందువలన నీ భార్యకు కలిగే దుఃఖం ఇతరులకు కూడా నీవు చేసిన పనుల వలన కలుగుతుంది కదా! కాబట్టి నీవు ఈ విధంగా ఆచరించటానికి పూనుకో కూడదు అనే ధర్మాన్ని సీతాదేవి తన భాషణంలో ఆవిష్కరిస్తుంది.

నీ గురించి చాలామంది నీవు నాశనం అయితే బాగుండు నని భావిస్తున్నారు. నీవల్ల పరాభవం పొందిన వారందరూ కూడా నీవు నశిస్తే బాగుండునని చూస్తున్నారు. నీవు నశిస్తే అయ్యో పాపం అని ఎవరూ అనుకోరు. అందరూ హమ్మయ్య ఈ దరిద్రుడు విరగడయ్యాడు అని సంతోషిస్తారు. వాళ్ళు ఆ విధంగా సంతోషి స్తుంటే నీవు చూచి నిలబడగలవా అంది.

అందుచేత రాబోయే పరాభవాన్ని కూడా మనసులో పెట్టుకొని, ఎంతోమంది నీ పతనానికి ఎదురు చూస్తున్నారని ఒక్కసారి గుర్తుతెచ్చుకొని నీవు చేసే పనిని గూర్చి ఆలోచించమని చెప్పింది. అటుపైన ఇంకొక ధర్మం చెప్పింది. నీకు బుద్ధి కూడ లోపించినటువంటి పరిస్థితి ఏర్పడింది. అందుకని పెద్దల వాక్యం వినే పరిస్థితిలో లేవని అనిపిస్తోంది. లంకలో పెద్దలు లేరా? లేక వారు చెప్పినా నీవు వినటం లేదా? అహంకారం బాగా పెచ్చు పెరిగిపోతే పెద్దవాళ్ళ మాట వినబుద్ధి కాదు. ఎప్పుడైతే పెద్దల మాట పెడచెవిన పెట్టే మదము లోపల చేరుతుందో, అపుడు నాశనానికి కావలసినదంతా తాను ఏర్పాటు చేసుకున్నట్లుగా వుంటుంది. అలాగనక నీవు పెద్దలమాట కూడా వినకుండా పూర్ణమైన అహంకారంతో ప్రవర్తించినట్లైతే, నీవు ఇక రాజుగా ఉండతగవు అంది.

రాజు అంటే తనని ఆశ్రయించిన వారియొక్క సంక్షేమాన్ని కోరేవాడు. వారి సంక్షేమాన్ని కోరుతున్నట్లుగా నీవు పైకి కన్పిస్తు న్నప్పటికీ వారి సర్వనాశనానికి నీవు కారకుడ వవుతున్నావు. ఎందు కంటే నీ కారణంగా రాక్షసవంశం అంతా కూడ దెబ్బ తింటుంది. ఈ విషయములో మనకి మంచి ఉదాహరణ లున్నాయి.

తక్షకుడు ఎప్పుడైతే అతిక్రమించి పరీక్షిత్తుని విషయంలో ప్రవర్తిస్తాడో, మొత్తం సర్పజాతికే ఆపద కొనితెచ్చుకుంటాడు. జనమేజయుడు సర్పయాగం చేసి అన్ని పాములు చచ్చేవరకు యాగం చేయండని ఆజ్ఞాపిస్తాడు. ఎందుకలా చేశాడు? ఒక

సత్పురుషుడు, రాజర్షి, సరాసరి కృష్ణుని యొక్క ప్రతీకగా జీవిస్తూ 300 సంవత్సరముల పాటు కలియుగంలో ధర్మాన్ని నాలుగు పాదాలుగా నిర్వర్తింప చేసిన ఒక ఉత్తమోత్తమ జీవునికి ఏదో కారణం వల్ల శాపం కలిగితే, ఆ శాపం నిర్వర్తించవలసిన బాధ్యత తక్షకునికి ఏర్పడితే కొంత అందులో ఎక్కువ ప్రవర్తిస్తాడు తక్షకుడు. తక్షకుడు కాటువేస్తే పరీక్షిత్తు మరణించాలని శాపం. మరణించిన తర్వాత పరీక్షిత్తుని ఎవరన్నా బ్రతికించుకుంటే అతడికేమీ అభ్యంతరం వుండకూడదు. కాటు వేయటం వరకే అతని పని. మరణిస్తాడు. తన కర్తవ్యం తనకి పూర్తయింది. తక్షకుడు అలా కాకుండా ఏం చేస్తాడంటే, మరల పరీక్షిత్తుని బ్రతికించుకునే ఒక బ్రాహ్మణుని గమనించి అతనికి ధనమిచ్చి వెనక్కి పంపించేస్తాడు. అది కారణంగా తక్షకుడు అతిక్రమించి ప్రవర్తించి నట్లవుతుంది. అది తెలిసిన పరీక్షిత్తు తనయుడు జనమేజయుడు సర్పయాగం తలపెట్టి కోట్లాది సర్పాలను ఆహుతి చేసేస్తాడు. దానికి కారణం తక్షకుడు నిర్వర్తించిన రజోగుణ ప్రేరితమైన క్రియ.

అలాగే రావణుడు ఇపుడు చేసిన పనివల్ల ఏ సంబంధం లేదనటానికి వీల్లేదు కదా! ఆయన రక్షణలో వుండే వాళ్ళందరికీ దెబ్బ తగులుతుంది. ఆయనకే కాదు, ఆయన చేసిన పనికి రాక్షసు లందరూ నాశనమైపోతారు.

దుర్యోధనుడు చేసిన పనికి ఎంతమంది నాశనమైపోయారు. ధృతరాష్ట్రుడికి అదే చెపుతాడు కృష్ణుడు. “చాలామందికి ప్రాణ నష్టం అయిపోతుంది. కాబట్టి ఆలోచించి చెప్పు మామా!” అంటాడు. ఏమీ ఆలోచించేది లేదాయనకి. ఎందుకంటే ఒక రకమైన

అజ్ఞానాంధకారంలో పడి, ఆశ బాగా పెంచేసుకొని, కామానికి లోబడి నటువంటి సందర్భంలో తనయొక్క దాయాదులతో సహా వంశం, సమస్త ఐశ్వర్యాలు నాశన మవుతున్నా ఏమీ అనిపించదు.

ఒక వివాహిత స్త్రీని బలాత్కారం చేసి అనుభవిస్తే, వున్న ఐశ్వర్యం అంతా పోతుంది ఒకటి. రెండవది నీ వంశమంతా నాశనమవుతుంది. మూడవది నిన్నాశ్రయించిన వారంతా నాశనమై పోతారు. ఆ విధంగా ఆమె ఒక్కొక్క విషయం చెపుతున్నది.

నీవు రాక్షసులందరితోనూ పైకి స్నేహంగా వుంటున్నావు. లోపల వారి నాశనం తలపెట్టావు. ఒక చెడు పనిచేస్తే అదేదో మనవరకు సరిపోతుంది అనుకోవటానికి వీల్లేదు. మనకి ఒక బాధ్యత వుంది. మన తల్లితండ్రులు, తాతలు వారికి సంబంధించిన బాధ్యత వుంది. కలుగబోయే సంతానం విషయంలో బాధ్యత వుంది. మన వంశంలో పుట్టిన వారియందు బాధ్యత వున్నది. ఆశ్రయించిన వారియందు బాధ్యత వున్నది. అందుకని చాలా పెద్ద బాధ్యత నిర్వర్తించేటువంటి వాడు చేసిన పొరపాటు వల్ల ఇంతమంది దెబ్బతింటారు. ఆ విధంగా నీ ఒక్కడి పొరపాటు వల్ల ఈ లంకారాజ్యం అచిరకాలంలోనే నాశనమైపోతుంది. దూర దృష్టి లేని పాపకర్ముడు చేసిన పాపిష్ఠి పనికి నాశనమై పోతుంటే సర్వప్రాణికోటి సంతోషిస్తుందిట. అది కూడా ఆవిడ చెపుతోంది. ఎందుకంటే వీడికి అభిమానం ఎక్కువ. అభిమానవంతుడికి ఏదన్నా కొంత తేడా జరిగితే సంతోషించేవాళ్ళు చాలామంది వుంటారు. కాబట్టి జాగ్రత్తగా వుండు అని చెపుతోంది.

ఒక కుటుంబంలో గానీ, ఒక వంశంలో గానీ ఒకడు విపరీతంగా పెరిగిపోతే చుట్టూ వుండే వాళ్ళు హర్షించలేరు. అదొక బాధ ఉన్నది. ఏసుక్రీస్తు విషయంలో అలాగే జరిగితే, ఏ దేశంలో ఏ సత్పురుషుని తనవారైన వారు గౌరవించారు గనక? అంటాడు. గౌరవించలేరు. ఎందుకంటే అసూయ అడ్డువస్తుంది. ఆ అసూయ కారణంగా వారితో సరిగా వుండలేరు. కృష్ణుని విషయంలో కూడా యాదవులు అట్లాగే వున్నారు.

ఇపుడు నువ్వున్నావు చూశావా! మొత్తం 14 లోకాల్లో నీ పేరు బాగా మారుమ్రోగుతోంది. నువ్వు పడిపోతే బాగుండుననే వారు వున్నారు. వాళ్ళందరూ కూడా నిన్ను బాగా శాపనార్థాలు పెట్టి వుంచారు. వీడుపోతే బాగుండును, ఆనందాన్ని పంచు కుందాం అనే పద్ధతిలో వున్నారు అని మరొక్కసారి వాని అభిమానం మీద దెబ్బకొట్టింది. అలాగే నన్ను నీవు ఏ రకంగానూ ఆశ పెట్టలేవు అని చెప్పింది. నా గురించి నీవేర్పరచుకున్న భావన వలన నీకు అటువంటి నాశనం ఒకటి రాసిపెట్టినట్లుగా అన్పిస్తోంది. ఇహపోతే నేనంటావా దేనికీ లొంగను. ధర్మానికి తప్ప. నీకు ఐశ్వర్యం వుందని నేను నీకు ఆకర్షితురాలి నవుతానని అనుకుంటే అది కలలో మాట అని చెప్పింది. నీకు అందం వుందని, శక్తి వుందని ఆకర్షింపబడను. ఇన్ని లోకాలు జయించిన పరాక్రమ వంతుడవని ఆకర్షింపబడను. కారణ మేమిటంటే నా ఆకర్షణ ఇప్పటికే నా దైవంతో, నా పతితో పరిపూర్ణంగా నిండి యున్నది.

ఎందుకంటే దైవమును రుచి చూచిన జీవుడు, అహంకారం ఎన్ని రకాల ఆకర్షణలు చూపించినా లొంగడు. ఈ దైవమును

రుచి చూసినటువంటి సాధకుడు మాత్రం రకరకాల ప్రభావాలకి లోనవుతూ వుంటాడు. సాధనాపరంగా చూసుకుంటే సత్సాధకుడికి రకరకాల ఆకర్షణ లుంటాయి. ఈ ఆకర్షణలన్నీ కూడా మూడు రకాలుగా సత్పురుషుల జీవితంలో గోచరిస్తాయి. మొదటి ఆకర్షణ ధర్మం, 2.కీర్తి, 3.స్త్రీ. ఈ మూడు ఆకర్షణలు ఎవరైతే జయించ గలుగుతారో అంటే యివి మామూలుగా చిల్లరగా వుండవు. చాలా పెద్దవిగా వస్తూంటాయి. ఓ 10 కోట్లు వస్తుందట. 15 కోట్లు వస్తుందట. ఈ చిన్నపని చేస్తే అంటే మనకి పెద్ద పెద్ద ఆశ్రమాలు కట్టుకొని ఇహ మనం అందర్నీ ఆశీర్వదిస్తూ, మంచి కార్యాలు చేస్తూ వుండచ్చు కదా అనిపిస్తుంది. ఆ 10 కోట్లు మన కెందుకు అనిపించదు. 10 కోట్లు ముఖ్యమా? మనం నిర్వహించే కార్యక్రమం ముఖ్యమా?

ధనం వల్ల సత్కార్యాలు నిర్వర్తింపబడతాయి అనేది అంత సత్యమైన విషయం కాదు. సత్కార్యాలు నిర్వర్తింపబడుతూ వుంటే, ధనం చేరితే అది పవిత్రమైన ధనంగా చేరుతూ వుంటుంది. అందుకే మామూలుగా ధన లేమి చేత మనిషి- మనకి ధనం వుంటే సత్కార్యాలు బాగా చేయవచ్చునుకుంటాడు. అట్లాగే కొంత మంది రాజాశ్రయము, ప్రభుత్వాశ్రయము, రాజకీయనేతల ఆశ్రయము- ఇటువంటివి దొరికితే మనం అనుకొనే దివ్యప్రణాళిక బ్రహ్మాండంగా నిర్వర్తించవచ్చు అనుకొంటారు. అలాగే రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల చుట్టూ చేరి వారి పనులు వీరు చేసిపెడుతూ, వారికి ఊడిగం చేస్తూ వారి చేతులలో వీరు బానిసలై పోయిన సత్పురుషు లుంటారు.

అక్రూరుడు వ్యాసుని విషయంలో అలాగే అనుకుంటాడు. వ్యాసుడు కౌరవ సామ్రాజ్యాధినేత ప్రాపకం చేత పెద్దవాడు అయినాడని ఒక భావన. దురదృష్టం. ఎందుకంటే ఇద్దరూ ఒకచోటే ఒక గురువు దగ్గరే చదువుకున్నారు. వాళ్ళలో ఒకడేమో పెద్దవాడైపోయినాడు. ఒకడేమో అసూయ చేత, అహంకారం చేత అలాగే వుండిపోయినాడు. ఎందుకంటే మంచి చిహ్నాలతో పుట్టాడు అక్రూరుడు. కాబట్టి మనం గొప్పవాళ్ళం అనుకున్నాడు. గొప్ప వాళ్ళనుకో కూడదు. అది బాధ్యత అనుకోవాలి. అలా అనుకోలేదు అక్రూరుడు. మనం పాదం ఎక్కడ పెడితే అక్కడ వర్షం పడు తుంది. ఇటువంటి భావనలన్నీ కలిగి పుట్టుక చేతనే మహానుభావు డిని అనుకొంటూ వుంటాడు.

వ్యాసుడి పుట్టుక, అక్రూరుడి పుట్టుక లౌకికంగా చూసుకుంటే అక్రూరుడి పుట్టుకే ఉత్తమంగా అన్పిస్తుంది. అక్రూరుడు ఎక్కడ పాదం పెడితే అక్కడ వర్షాలు పడతాయి. ఇటువంటివేవో ఆయనకున్నాయి. వ్యాసుడికీ వున్నాయి. కానీ ఆయన బయటకి చెప్పుకోడు. రెండవది ఆయన పరిపూర్ణంగా దైవమునకు సమర్పణ చెంది తన కార్యం తాను నిర్వర్తించేవాడు. పదిమందీ ఏమను కుంటారో అనే భయం లేకుండా నిర్భీతిగా ధర్మాన్ని నిర్వర్తించేవాడు. అలాంటివాడు కౌరవ సామ్రాజ్యానికి ఆపద కలిగినపుడల్లా వచ్చి వారికి సాయం చేశాడు. వంశం, వంశాంకురం లేకుండా నశించి పోతుందంటే సాయం చేశాడు. అలాగే ఆపత్కాలంలో వచ్చి చక్కని సలహా లిచ్చాడు. అంతేతప్ప వారిమీద ఆయన ఆధార పడలేదు. ఆయనమీద వారు అప్పుడప్పుడు ఆధారపడ్డ సన్నివేశా

లున్నాయి. అదేకాకుండా వ్యాసుడు మధ్య మధ్యలో వచ్చి ధృతరాష్ట్రుడికి హెచ్చరికలు చేస్తూ వుంటాడు. నువ్వు చేసేది తప్పు సుమా! ఇలా చేస్తే వంశం నిలవదు. నీ నూరుగురు కొడుకులూ నీ కళ్ళముందే నాశనం అయిపోతారు అని. ఆ విధంగా వ్యాసుడు తనదైన జీవితం తను జీవిస్తూ రాజులు కోరితే ప్రతిస్పందిస్తూ వుంటాడు.

అక్రూరుడు రాజాశ్రయం కోరి ఆ కారణంగా కంసుడి దగ్గర చేరాడు. ఒకరి దగ్గర ఆశ్రయించి నీవు చేరితే, వారు నీమాట వింటారా? నీవు వారి మాట వినవలసి వస్తుందా? కంసుడి దగ్గర చేరి కంసుణ్ణి మారుద్దా మనుకొంటాడు అక్రూరుడు. కంసుణ్ణి మనమేం మార్చగలం? ఎవరూ మార్చలేరు. అసలు ఇంకొకరు ఏమన్నా మారదాం అనుకుంటే నీవు మార్చవచ్చు తప్ప, నువ్వు మారుద్దాం అనుకుంటే ఎవరూ మారరు. మారకపోగా వారు చెప్పింది నీవు చేయవలసి వస్తుంది. ఎందుకంటే వాడి కొలువులో నీవున్నావు కదా! వాడి లాంఛనాలు, వాడిచ్చిన ఐశ్వర్యాలు, వాడిచ్చిన సౌకర్యాలు నీవు అనుభవిస్తూ వుంటావు కదా! కంసుడికి నువ్వు రాజగురువు అవటంచేత నీకు రథం వుంటుంది. ప్రజలలో పలుకుబడి వుంటుంది. అవన్నీ అలావుండగా, నువ్వేం చేస్తున్నావు? అధర్మానికి కొమ్ము కాస్తున్నావు. ఇలా చేసి ఎప్పటికపుడు తనలో ఘర్షణ పడుతూ, అటుపైన కంసుడు నశిస్తే రాజాశ్రయం కూడా లేక అలా వుంటూ వుంటాడు. అన్నీ తెలిసినవాడు అహంకరించి వుంటాడు. అహంకారం చేత వ్యాసుణ్ణి కూడా ఆ విధంగా చూస్తాడు.

ఎందుకంటే తన సహాధ్యాయి, ఇంతలోనే ఎంతవాడై పోయాడు? మా పరాశర నందనుడు అంటూ వుంటాడు. ఎంత వాడైపోవటం ఏమిటి? వాడెంతో చేశాడు. నువ్వేం చేయకుండా అట్లా వుండిపోయావు. అందుకని వాడు అంతటివాడై పోయాడు. అంతటివాడు అవటమే కాదు, వేదవ్యాసుడి శిష్యులతో కూడా అక్రూరుడు ఎంతో చెప్పించుకోవలసి వస్తుంది. ఎంత దుస్థితి? సహాధ్యాయి శిష్యుల చేత చెప్పించుకొనే పరిస్థితికి వచ్చావంటే. నీ పరిస్థితేంటి? ఎందుకిలా జరిగింది అంటే కేవలము అసూయ. తన వారిలో ఒకడైనటువంటివాడు అంతవాడై పోయాడు. వాడు అంతటివాడు కాదని ఋజువు చేయాలని అక్రూరుడు తపన చెందుతాడు. వ్యాసుడు మహాత్ముడు కాదని, కృష్ణుడు భగవంతుడు కాదని నిరూపించాలని ప్రయత్నం చేసి విఫలుడై, అటుపైన కృష్ణుడి అనుగ్రహం పొంది కృష్ణభక్తుల లిస్టులో చేరిపోతాడు. ఈ అక్రూరుని కథ మాస్టర్ ఇ.కె.గారు చక్కగా ధర్మ మార్గంలో వుంటూ, అధర్మమునకు ఆకర్షింపబడటం అనేది ఎలా వుంటుందో చెపుతారు. సత్పురుషు లనుకునేవారు కూడా ఈ కీర్తి, ప్రతిష్ఠ, పదవి, హోదా వీటికోసం ఆకర్షింపబడతారు. అలా ఆకర్షింపబడితే ఏమవు తుందంటే వారు, వీరిచుట్టూ తిరుగుతుంటారు. వారి పనులు వీరు చేసిపెడుతూ వుండాలి.

పదవి వున్నవాళ్ళ ప్రాపకం కోసం సత్పురుషులు ప్రాకులాడి దెబ్బతిన్న కథలు చాలా వున్నాయి. ద్రోణుడట్లా దెబ్బతిన్నాడు. అతడు బ్రాహ్మణ వంశంలో పుట్టాడు. ప్రతీకారం, పగ బ్రాహ్మణు లకి లేవు. తనలో రజస్సుండటం చేత ద్రుపదుడి మీద ప్రతీకారం

అనేది లోపల ప్రజ్వరిల్లుతుంది. ఆ ద్రుపదుడి మీద ప్రతీకారం అనే భావన లేక, ద్రుపదుడు రజోగుణ ప్రభావానికి లోనై వున్నాడు, అందుకని అలాగే ప్రవర్తిస్తాడు అని వచ్చేస్తే సరిపోయేది ద్రోణుడు. ద్రోణుడు శివుణ్ణి ఆరాధన చేస్తే శివుడలా ప్రసన్న మయ్యేటువంటి స్థితి ద్రోణుడిది. సరాసరి ఒక చిరంజీవినే తన పుత్రుడిగా పొంది నటువంటి స్థితి. తనకు పుట్టినటువంటి పుత్రుడు జన్మతః చిరంజీవి. తనకి తెలియని విద్యలేదు. తను గురువుగా అందరికీ విద్య నేర్పితే సరిపోతుంది. ఆ ద్రుపదుడి మీద కక్ష పెట్టుకొని, వీరి ఆశ్రయంలో చేరటం వలన, వారి యొక్క కూడు తినటం చేత వారికి పనిచేసి పెట్టవలసిన దుస్థితి ఏర్పడింది.

సంఘంలో పెద్దలు సత్పురుషులను వశం చేసుకొని తమ చుట్టూ తిప్పుకుంటారు కదా! వారికి చిన్న ఆపద వచ్చినా, వారింట్లో ఏ కార్యం జరిగినా వీరు వెళుతుండాలి. ఎందుకంటే నీ ఆశీర్వచనం వారికి కావాలి. వారి ప్రాపకం నీకు కావాలి. యిలా ఎంత సమయం వృథా అయిపోతుంది? అందుకని ధనము, సంఘంలో ఉన్నత పదవిలో ఉండేవారి ఆశ్రయము– ఈ రెండూ చాలా ఆకర్షిస్తాయి మనుష్యులను. ఈ రెండూ ఆకర్షణలకు గురైనవారు వారుగా చేయవలసిన పనులు చేయలేరు. ఏసుక్రీస్తు రాజాశ్రయం కోరలేదు. సత్పురుషులు, పరమ గురువులు ఎవరూ కోరరు. పరమగురువుల మార్గంలో నడిచే శిష్యులు కూడ ఆ మోహంలో పడరు.

ధన వ్యామోహం, కీర్తి వ్యామోహం– ఈ రెండూ దాటినా ఇంకోటుంటుంది. అది దాటడం చాలా కష్టం. ఈ రెండూ అయిన

తర్వాత అసలు ప్రకృతే పరీక్ష పెడుతుంది అటువంటి సాధకుడికి. చాలా అందము, ఆకర్షణ కలిగినటువంటి స్త్రీని నువ్వు వరించటం కాదు. నువ్వు ఆమెవెంట పడటం కాదు. ఆమె నిన్ను వరిస్తుంది. నీ వెంట పడుతుంది. నీలో వుండేటువంటి దైవీ ఆకర్షణకులోనై, నువ్వు నన్ను అంగీకరించవా అంటుంది. అపుడేం చేస్తావు? ఇది దాటటం మరీ కష్టం. ఎందుకంటే 'వనిత తనంతట తానే వచ్చిన' అనే సామెత కూడా వుంది కదా! వనితగానీ, ధనం గానీ, ఒక పుష్పం గానీ దానంతటది దగ్గరకి వస్తే నిరాకరించకూడదు అని. నిరాకరిస్తే వాళ్ళు శాపం పెడతారుట. అర్జునునికి ఒకావిడ శాపం పెట్టేసింది అలా. త్రిలోకాల్లో అందమైన దాన్ని కోరితే, నువ్వు నన్ను కాదంటావా, పేడివై పొమ్మంటుంది. ఇదెక్కడి గోల అనుకుంటే అది కూడా ఆయనకి వరమైంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్మాన్ని దాటనటువంటి వారికి శాపాలు కూడా వరాలైపోతాయి. అది కూడా అజ్ఞాత వాసంలో పనిచేసింది. ఆ విధంగా మనకిక్కడ ఈమె చెపుతోంది. నేను దేనికీ లొంగనురా అంటుంది.

రాముని సాన్నిధ్యాన్ని అనుభవించినటువంటి సీతాదేవి రావణుణ్ణి కోరదు. మంచి రుచికరమైన, పరిశుద్ధమైన భోజనం చేసేవాడు అడ్డమైన గడ్డి తినడు. అదేగా ప్రహ్లాదుడు "*మందార మకరంద మాధుర్యమునదేలు మధుపంబు వోవునే మదనములకు, నిర్మల మందాకినీవీచికల దూగురాయంచ చనునె తరంగిణులకు.*" అట్లా చాలా చెపుతాడు పద్యాలు.

అందుచేత పంది అయితే మురికిగుంట కోరుకుంటుంది. ఓ జాతికుక్క కోరుకుంటుందా? జాతికుక్కకి, ఊరకుక్కకి తేడా

లేదూ? ఊరకుక్క రోడ్డుమీద వదిలేస్తే ఏదిపడితే అది తింటుంది. జాతికుక్క వాసన చూసి వదిలేస్తుంది. ముట్టుకోదు. శుద్ధమేదో, అశుద్ధమేదో తెలుసు. అట్లాగే జీవిలో కూడా పరిశుద్ధత పెరిగిన కొలదీ ఏది మనది, ఏది మనది కాదు? ఏది ముట్టుకోవాలి. ఏది ముట్టుకోకూడదు? అసలు దేన్నీ ముట్టుకోకు, మరి దేన్ని ముట్టు కోవటం? మన దగ్గరకి వచ్చిందనుకో జీవుడు కావచ్చు, సన్నివేశం కావచ్చు. ఆ వచ్చే సన్నివేశంలో నీ కర్తవ్యం మాత్రమే చూచి, మిగతా వాటికి పోకుండా చూడటం అనేటువంటిది తుమ్మెద తెలివి అంటారు.

తుమ్మెద తెలివేంటంటే ఆ పువ్వు చాలా బాగుండి, పెద్ద పువ్వు అయివుండచ్చు. ఇపుడే విచ్చి వుండచ్చు. ఎన్ని వున్నప్పటికీ కూడా తేనెటీగ పని ఒక్కటే. ఆ పువ్వులోని తేనె తోటే దాని సంబంధం. అలాగే సత్పురుషుడికి కర్తవ్యంతోనే ఏ విషయంతోనైన సంబంధం. ఇహ మిగతా సంబంధాలేమీ లేవు.

అందుకని ఈమె ఇక్కడ చాలా చక్కగా ఒక సత్సాధకురాలు పలికే మాటలు పలుకుతోంది. నీ సంగతి వదిలేయ్, నీవెట్లాగూ నాశనం అయిపోవటానికి సిద్ధంగా కన్పిస్తున్నావు. నా సంగ తంటావా నీ ఐశ్వర్యంతోగానీ, నీ అంతఃపుర ప్రభుత్వ అధికారంతో గానీ, నీ ధనంతోగానీ నీవు నన్ను ఆశ పెట్టలేవు.

(తుకారాం మీద అన్ని రకాల ప్రలోభాలని ప్రయోగించి, చిట్ట చివరికి ఒక అందమైన స్త్రీని ప్రయోగిస్తాడు. ఆయన ఆమె ఏ ఉద్దేశ్యంతో వచ్చిందో గమనించి అటుపైన ఆమెతో ఎందుకిలా

మిడిసిపడుతున్నావు? ఈ అందం తాత్కాలికం కదా! అంతః సౌందర్యం శాశ్వతం, బాహ్య సౌందర్యం తాత్కాలికం. నువ్వెట్లా వుంటావో ముందు నీకు తెలుసా? అని అడిగి ఒక బొమ్మవేసి చూపిస్తాడు. ఆ బొమ్మ చూడగానే ఆమెకీ వైరాగ్యం వచ్చేస్తుంది. ఇది తాత్కాలికం. ఈ సౌందర్యంతో ఒక సత్పురుషుణ్ణి వశం చేసుకుందాం అనుకోవటం పొరపాటనుకొని శిష్యురాలవుతుంది. అలా సత్పురుషుల కథలు చాలా గోచరిస్తాయి.)

నేనట్లా ఆశపడే దానిని కాదు. సూర్యుడి వెంట వెలుతురు వలె ఆ రామప్రభువుతోనే నేనెపుడూ వుండవలెను. నేనాయనను వదిలిపెట్టను. ఆ లోకనాథుడి ఉత్తమ భుజాన్ని తలగడగా చేసుకున్న నేను మరొకరి భుజాన్ని ఎట్లా తలగడగా చేసుకుంటాను? (అంటే ఎక్కడైతే తాను విశ్రమించటానికి నిర్ణయం చేసుకుందో అక్కడ తప్ప, ఎక్కడా విశ్రమించదు. ఇంకెక్కడా ఆధారపడదు. అదొక్కటే ఆధారం. మిగతా ఆధారాలు ఆధారాలు కాదు.)

అందుచేత నీ అంతఃపురం వుందని అంతఃపురంలో వుంటానా? (అంతఃపురం బైట వుంది ఆవిడ. అశోకవనంలో కూడా పెద్ద విశ్రాంతి గృహం వుంది. ఆ గృహం బైట చెట్టుక్రింద వుంది ఆవిడ. ఎందుకలా వుంటారు అంటే కొన్ని చోట్లకు అస్సలు వెళ్ళనేకూడదు. వెళ్ళటం వలన అది పూసుకున్నట్లవుతుంది. మళ్ళీ అది కడుక్కుంటూ వుండాలి. కొన్ని చోట్లకి కోరి వెళ్ళాలి. ఎక్కడ అధర్మం బాగా పరిపాలిస్తూ వుందో అక్కడికి వెళ్ళరు. వాడికి బాగా డబ్బుందని గానీ, వాడికి బాగా అధికారం వుందనిగానీ వెళ్ళరు. సత్పురుషులైతే వాడికి ఏం వుంది, ఏం లేదు

అని చూసుకోకుండా వెళతారు. రాముడు శబరి ఇంటికి వెళ్ళాడు కదా! అలా తార్కాణాలు ఇటువంటి వాక్యాల్లోంచి మనం తెలుసుకో వలసి వస్తుంది.

కాబట్టి వ్రతస్నాతుడు, విజితాత్ముడు, బుద్ధిమంతుడు అయిన బ్రాహ్మణుణ్ణి ఆశ్రయించుకున్న వేదవిద్యవలె. గుర్తుపెట్టుకోండి ఇది ఒకటి చాలా ముఖ్యం. వ్రతస్నాతుడు నిత్యం ఏదో ఒక వ్రతదీక్షలో వుంటాడు. విజితాత్ముడు ఆత్మను ఎరిగి వుంటాడు. బుద్ధిమంతు డైన వానినే వేదవిద్య ఆశ్రయించి వుంటుంది. వేదవిద్య మనల్ని ఆశ్రయించి వుండవలెనంటే ఒక దీక్ష తర్వాత ఒక దీక్ష తర్వాత ఒక దీక్ష. దీక్షలో వుండటం అంటే గతి తప్పిపోకుండా పూర్తిగా మన యందు ధర్మం స్థాపింపబడి, మనం పండేంతవరకు కూడా మనం ఇతరములు చేరకుండా అట్లా ఏర్పరచి వుంచాలి. పూర్తయిన తర్వాత బయటకి వస్తే బాగుంటుంది. పూర్తి కాకుండా బైటకి వచ్చేస్తే ఫట్. పండు పండకుండా కోసేశామనుకోండి. దాని రుచి పండిన పండులాగ వుండదు కదా! అలాగే ప్రతి విషయంలో కూడా ఈ ధర్మాన్ని ఆచరించేవాళ్ళు ఎప్పటికప్పుడు దీక్షలు పెట్టు కుంటూ వుంటారు. ఇపుడు దీక్షలంటే మడి, తడి కాదు.

40 రోజులపాటు విష్ణు సహస్రనామం చదువుకుందాం. అయిపోతుంది. 40 అవగానే ఇహ విచ్చలవిడిగా పోవటం కాదు. ఇంకో 40 రోజులు రుద్రనమకం పారాయణం, ఇంకో 40 రోజులు తైత్తిరీయం పారాయణం, ఇంకో 40 రోజులు లలితా సహస్రం పారాయణం. ఇట్లా ప్రతి 40 రోజులు. పైగా అయిపోయిందని

ఇహ ఆ రోజు వచ్చేసి, వికటాట్టహాసం చేసుకోవటం కాదు. ఈ దీక్ష ఎంతవరకూ సాగాలంటే నువ్వు పండేంతవరకు సాగాలి. నీలో ధర్మమైనటువంటి తలపు తప్ప, మరొక తలపు రానట్లుగా. అట్లా దీక్షగా వుంటేనే మార్పు వస్తుంది. దీక్ష ఎటువంటిది? పాలల్లో తోడువంటిది. పాలు తోడుకోకుండానే నువ్వు ఆ తోడు తీసేస్తే ఇహ తోడుకోదు. తోడుకున్న తర్వాత తీసివేయటమే కాదు దాన్ని ఇంకోదానికి తోడుగా కూడా వేయవచ్చు. అదీ దీక్ష అంటే. దీక్షకి, పాలు పెరుగవటానికి వేసిన తోడుకి చక్కని ఊహండి. మధ్యలో మానేయకూడదు. ఏదో ఒక దైవమును గూర్చి దీక్ష. ఈ దీక్ష మానసికమైనది. ఇదివరకు కాలంలో దేశకాల పరిస్థితులను బట్టి మనకన్నీ వీలుపడేవి భౌతికంగా కూడా. ఇపుడు మానసికమే.

రోజూ విష్ణు సహస్రనామం సంవత్సరం చదువుకుంటా అంటే ఎవడు కాదన్నాడు నిన్ను? చదువుకుంటానన్నాను కాబట్టి ఎట్లాగో అట్లా పూర్తిచేద్దాం అని కాకుండా దానికి ఓ సమయం పెట్టుకొని, ఆ సమయాన్ని మనం అనుసరించి విష్ణు సహస్ర నామాన్ని శ్రద్ధగా చదివితే నీలో ఎన్ని మార్పులు వస్తాయో. వారాని కొకసారి చదువుతున్నాం కదా! ఇంకా మమ్మల్ని సాధిస్తారేంటండి అనుకోవచ్చు. 10 రోజులు ఒక రకంగా వుండి, ఒక రోజు ఒక రకంగా వుంటే ఏంటి ఉపయోగం? పోనీ రోజూ కృష్ణాష్టోతరం గానీ, నారాయణ కవచం గానీ, పురుషసూక్తం గానీ, శ్రీ సూక్తం గానీ చదువుకోండి. ఎప్పటివరకు? పండేంతవరకు. బోరుగా వుంటుందేమో ఎపుడూ రోజూ ఒకటే చదువుకుంటుంటే. మనస్సుకి వైవిధ్యం కావాలి. అందుకని రకరకాల స్తోత్రాలు పెద్దలు వ్రాసి

ఇచ్చారు. 40రోజులు ఇది. 40 రోజులు అది అట్లా పెట్టుకోండి. ఏదో ఒకటి, అందులో కొనసాగుతూంటే తప్పు నిలబడదు.

ఏదో పౌర్ణమి ముందు, అమావాస్య ముందు, ఏకాదశి ముందు, గురుపూజల ముందు, పండగ ముందు ఇలా కుదరదు. నువ్వు రేపు ఆగష్టు 11 మాస్టరుగారి పుట్టినరోజని ఉత్సాహం కొద్దీ ఫెళ ఫెళా చేస్తావు. మర్నాడే ఆ ఫెళ ఫెళలో కొంత కంటిన్యూ చేయి, మాస్టరుగారి పుట్టిన రోజు కదా ఒక నిర్ణయం చేసుకో. ఏదో ఒక దీక్షబూని నిర్ణయం చేసుకో. నువ్వు బాగుపడటానికే. ఎవరి కోసమూ కాదు. నేను ఇవాల్టి నుంచి ఇలా చేస్తున్నానని ఎవరికీ చెప్పక్కర్లేదు. ఇన్నాళ్ళనుంచి ఇలా చేశానని చెప్పక్కర్లేదు. ఓ సంవత్సరం హోమం చేయి దమ్ముంటే. లోపల మంటపెట్టి మొత్తమంతా మారుస్తారు. మనకు ఇవ్వబడినవన్నీ కూడా తప్పక మన స్వభావంలో మార్పు తెచ్చే స్తోత్రములే ఇచ్చారు. ఆత్మదర్శనం చేసినటువంటి వాళ్ళు ఇచ్చిన స్తోత్రములు గానీ, ఆరాధనలు గానీ అవి తప్పక మనలో మార్పు తీసుకువస్తాయి. పాడితే అన్నమయ్య పాట పాడాలి, లేకపోతే త్యాగరాజు ఇచ్చిన కీర్తన పాడుకోవాలి.

మనం చదివే స్తోత్రాలు వేదవ్యాసుడు లేక శంకరులు వ్రాసినవి. వారందరూ కూడా ఉత్తమోత్తమమైన స్థితిని పొందిన వారు. కాబట్టి, ఆ స్తోత్రాలు మనం చదువుకున్నా అర్థం వుంటుంది. అవి మనస్సులో పెట్టుకొని సనాతనంగా వస్తున్నవి, కలకాలం నిలిచి కాలానికి లోనుకాకుండా యివాల్టివరకు వుండి, యిహ ముందుకూడ వుండే భారత, భాగవత, రామాయణ గ్రంథాలో, పురాణాలో తీసి ఏదో ఒకటి ఓ దీక్షగా సాగించండి. ముందు

అలసటగా వుండి, ఓపిక తక్కువగా వుంటే చిన్న స్తోత్రం పెట్టుకోండి. అష్టోత్తరమే పెట్టుకోండి. లేదా రోజూ నిష్ఠగా రోజుకి మూడు స్పూన్లు నీళ్ళు పోస్తాం అనుకోండి శివలింగం మీద, అది నువ్వు రోజూ చెయ్యగలిగితే అదెంత పుణ్యం.

కలియుగంలో ఏదైనా చాలా సులభంగా అట్లా చిటికెన వ్రేలుతో అధర్మంలోకి లాగేస్తుంది. కలికి మనం ఏమీ కాదు. అవగింజంత కూడా కాదు. నేను కలిని ఎదిరిస్తానంటే ఏడిశావులే అంటాడు. పెద్దవాళ్ళే పడిపోతుంటే నువ్వేంటిరా మధ్యలో అని. కలి తాకని ధర్మం ఏమిటి? నన్ను అనుసరించటం, నన్ను స్మరణ చేయటం. అందుకని ఏదో ఒకటి పట్టుకుంటే ఆ ఒక్క ధర్మం *"స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్"* కృష్ణుడు అన్నాడు. చిన్న ధర్మం ఎపుడూ నిర్వర్తిస్తూ వుంటే, రోజూ ఆపిల్ పండు కృష్ణుడి దగ్గర పెట్టి, ఊళ్లో ఎవరికో ఇచ్చేస్తామనుకోండి. కృష్ణుడికి పెట్టడం extra అక్కర్లేదు. రోజూ ఒక ఆపిల్ పండు ఒక జీవికి పెడతా మనుకోండి. పోనీ అరటిపండు పెడతావు. ఏదో ఒకటి నువ్వనుకున్నది దీక్షగా జన్మాంతరం నిర్వర్తించటం చేయ గలవా? చేస్తే నీలో ధర్మానికి చిన్న సూది మోపినంత చోటంటారు చూశారా అంత చోటు ఇచ్చినవాళ్ళం అవుతాం. అది చాలు. అదికూడా చేయకుండా మనకి ఏదో తోచినపుడు విపరీతంగా చేసేసి, మిగతా అపుడు నిద్రపోతూంటాం. అట్లా నిరంతరం కానిదేదీ మనకి అక్కర్లేదు.

*'మాత్రాబలం'*, ప్రతి అక్షరం దానికుండేటటు వంటి బలాన్ని నీవు పలక్కపోతే అది ప్రతిస్పందించదు. *'వర్ణస్వరః'* ప్రతి

అక్షరానికీ ఒక స్వరం వుంది. ఆ స్వరం చదవకపోతే అది పలకదు. 'సామ సంతానః' మధ్య మధ్యలో నట్లు వేసుకుంటూ చదవకూడదు. సంతానం అని ఎందుకన్నారో తెలుసా? ప్రతి రెండేళ్ళకో, ఏడాదిన్నరకో అట్లా గబగబా వచ్చేసేవారు పిల్లలందరూ కూడా. ముగ్గురో, నలుగురో, ఐదుగురో, తొమ్మండుగురో అప్పటికి అయిపోయేది అది. అసలు ఉపనిషత్తులు చదువుకోవటానికి 'శిక్ష' అని, అందులో మొదటే ఏం చెప్పారంటే- మాట బలంగా ఉండాలని. అక్షరం బాగా పలకాలి. అక్కడ ఒక స్వరం వుంది. ఆ స్వరమే పలకాలి. అది వింటేగాని రాదు. అది చదవగలిగిన వాడి దగ్గర కూర్చుని చదువుకుంటే, దీక్షను బట్టి అది నిన్ను అనుగ్రహిస్తే అది నీలో ప్రవేశిస్తుంది. అదీ వేదం! మాత్రకు బలం లేదు. వర్ణానికి స్వరం లేదు. సామ సంతానం లేదు. అక్కర్లేని చోట లాగుతాం. లాగాల్సిన చోట వదిలేస్తాం. అనుదాత్తం ఎవ్వరికీ పలకదు. ఎందుకంటే బొడ్డు దగ్గర నుంచి పలకటం ఎవరికీ చేతకాదు. కంఠం దగ్గరనుంచి పలుకుతారు. అక్కడనుంచి అరవ మంటే గట్టిగా అరుస్తారు తప్ప అంతకన్నా క్రిందకి వెళ్ళలేరు. ఈ క్రింద అపానవాయువు వుందే, అది మలినాన్ని బయటకి తీయాలంటే అనుదాత్తం బాగా పలికితేనే వస్తుంది. లేకపోతే రాదు. ఓం అని రావాల్సి వస్తుంది. బేస్ వాయిస్ అంటారు. బేస్ వాయిస్ నాలుగు పదాలిచ్చి, రెండు ఉదాత్తంలో పెట్టి, మళ్ళీ రెండు క్రిందకి దించి, మూడు పైకిలాగి, మూడు క్రిందకి దించి ఇట్లా చేస్తూంటుంది వేదం. ఎందుకంటే నీకు మూడు స్థితులలో శబ్దాన్ని ఆ విధంగా పలకటం చేత నీలో వుండేటువంటి పశువు

అంటే శరీరము, నీవు అంటే మానవ ప్రజ్ఞ, దైవము ఈ మూడూ కూడా చక్కగా అనుసంధానం చెందుతాయి. అందుకు వేదం.

వేదవిద్య వ్రతస్నాతుడిని, బుద్ధిమంతుడిని, విజితాత్ముడిని ఆశ్రయించి వుంటుంది. ఆ విధంగా నేను ఆ మహానుభావుణ్ణి ఆశ్రయించి వున్నాను. రాముణ్ణి వదిలేసి నిన్ను చేరతా ననుకోబోక అంటోంది. ఒక్కసారి త్రిగుణములకు అతీతమై వున్నటువంటి దైవీప్రజ్ఞని రుచి చూసినటువంటి వాడు ఇంక వీటికి లోనుకాడు. రజోగుణం చూపించేటటువంటి ఆకర్షణలకు లోనుకాడు. కావలసి నది చాలా వుంది.

నువ్వు నన్ను ఏమైనా చేసుకోగానీ, నువ్వేం చేసినా నిన్ను వదలను అని పాడుతుంది మీరాబాయి. నాకున్నవన్నీ ఊడగొడు తున్నావని కనపడుతోంది. ఏం ఫర్వాలేదు. నువ్వు ఎన్ని ఊడ గొట్టినా నేను నిన్ను మాత్రం వదల నంటుంది. నువ్వు నాకున్నవన్నీ వదిలిస్తున్నావు. కనపడుతూనే వుంది. 'మై నా ఛోడూ' అంటుంది. నా కదేగా కావాలి అంటాడు కృష్ణుడు. తనను మాత్రమే పట్టుకున్నదని తెలియాలంటే మిగతావన్నీ ఊడగొట్టేస్తాడు.)

నేను ఆ మహానుభావుణ్ణి ఆశ్రయించుకొని వున్నాను. ఆ రామప్రభువుకి తప్ప మరెవరికీ తగిన భార్యని కాదు అని చెప్పింది. ఓ రాక్షసుడా! అడవిలో పోతుటేనుగును ఎడబాసిన పెంటి ఏనుగును మళ్ళీ పోతుటేనుగుతో చేర్చేట్లు, దుఃఖపడుతున్న నన్ను నీవు రామప్రభువుతో చేర్చు అన్నది.

ఓ రావణాసురుడా! నన్ను కోరుకుంటే నీకు హాయిగా

వుండదు. మొత్తం అంతా నాశనం అయిపోతావు. నువ్వు హాయిగా వుండాలని నేను కూడా కోరుకుంటున్నాను. కాబట్టి నన్ను రాముడికి అప్పచెప్పేసెయ్. చాలా హాయిగా వుండవచ్చు అని చెపుతోంది.

నీవు ఆ పురుషోత్తముడితో స్నేహం చేసుకో. రాముడు తక్కువవాడు కాదు. గుర్తుపెట్టుకో. (రాముడి గురించి బాగా చెపుతుంది తర్వాత సీతాదేవి. ఏదో అనుకుంటున్నావేమో కనబడేంత తేలికైనవాడు కాదు రాముడు. లోతైనవాడు. నీది బైట ప్రకటన. ఆయనదంతా గోప్యం. రాముడు బైటకేం కన్పించడు కదా! సమయం వస్తే కన్పిస్తాడు. వీడెంతసేపూ బైటే కన్పిస్తుంటాడు. అందుచేత ప్రకటించేవాడికి లోపల బలం వుండదు. లోపలదే బలము, బైట బలం బలం కాదు. Forget and forgive అంటే ఒక పెద్దాయన, సత్పురుషుడు అన్నారు forget వుండదు, forgive వాడి సంస్కారాన్ని బట్టి వుంటుంది. మర్చిపోరు ఎవరూ ఏదీనూ, కాకపోతే క్షమించ గలిగే సంస్కారం వుంటే వుంటుంది. లేకపోతే మళ్ళీ అవకాశం కోసం వెయిట్ చేస్తూ వుంటారు.)

అందుచేత నీవు రాముడితో స్నేహం చేసుకో. రాముడు నీవనుకున్నంత భీరువు కాదు. బలహీనుడు కాదు. కందమూలాదులు తింటున్నాడు కదా కండబలం లేదు అని అనుకోకు. (కండబలం గొప్ప బలమా? ఏనుగుకి చాలా బలం. దానిమీద కూర్చున్నవాడు ఎలా వుంటాడు? మావటివాడు అంకుశం పెట్టి పొడిస్తే ఎటు కావాలంటే అటు వెళుతుంది. దణ్ణం పెట్టమంటే పెడుతుంది. అంత ఏనుగు లొంగిపోయింది. ఏమిటి బలం? బలం లోపల వున్నది. భౌతికబలం కన్నా మానసికబలం గొప్పది. భౌతికం

కన్నా కామం. కామం నడిపిస్తుంది భౌతికాన్ని. కామంకన్నా మానసికం, మానసికం కన్నా బుద్ధి, బుద్ధి కన్నా విజ్ఞానం, విజ్ఞానం కన్నా ఆత్మబలం గొప్పది. మరి ఆత్మబలం వున్నవాడి ముందు నువ్వెంత అని అంటుంది.

ఆత్మబలం కామబలం కన్నా ఆరురెట్లు గొప్పది. కామి రెండవ లోకంలో వుంటే ఆత్మ తెలిసినవాడు ఏడవ లోకంలో వుంటాడు. వాడి ముందు వీడు ఎందుకూ కాడు. అందుకని బలం లోపల ఎంతుందో చూసుకుంటే మంచిది. లోపల చాలా కుళ్ళుందంటే వాడితో చేరతావా నీవు? బైట చాలా వుండి లోపలంతా లేదనుకోండి, మనకి సంబంధం లేదు. బయట ఏమీ లేదు. లోపల చాలా వుంది. వాడితో కోరి మనం సహవాసం చేయాలి. మిత్రత్వం ఏర్పరచుకోవాలి. గరుత్మంతుడితో మొదట పోట్లాడిన ఇంద్రుడు గరుత్మంతుడి బలం తెలిసిన తర్వాత అమృత భాండం తీసుకొని తిరిగివస్తుంటే నువ్వు నాతో స్నేహం చేస్తావా? నేను నీతో స్నేహం చేద్దాం అనుకుంటున్నాను అని అంటాడు. అది తెలివి. వాడిని ఓడించినవాడు ఎవడన్నా వున్నాడనుకోండి. వాడు బలవంతుడైతే వాడితో మనం వైరం పెట్టుకోవటం కన్నా, మిత్రత్వం పెంచుకుంటే వాడి బలం మన బలమేగా! మనకు ఆపద వచ్చినపుడు వాడు కాపాడుతాడు కదా! అందుచేత గరుత్మంతుడి బలం ఏమిటి? స్పందనాత్మక చైతన్యం. ఇంద్రుడి బలం మనస్సు. మనస్సు కన్నా గొప్పది అది.

అందుచేత ఏది బలమో అది రాముడి దగ్గర వుంది. ఏది బలం అని నువ్వనుకుంటున్నావో ఆ బలం నీ దగ్గర వుంది.

ధర్మందే బలం. లో బలమే బలం. లో బలం వున్న రాముడితో పై బలం వున్న నువ్వు పెట్టుకుంటే, నువ్వు చాలా దారుణంగా దెబ్బతింటావు. అందుకని రాముడితో నీకు స్నేహం వుందనుకో ఇంకా బాగుంటుంది. స్నేహం చేసుకో అని చెపుతోంది.) ఆ మహానుభావుడు స్నేహానికి తగినవాడు. ధర్మజ్ఞుడని, శరణాగత వత్సలుడని ప్రసిద్ధి కెక్కినాడు. (ధర్మజ్ఞుడు. ధర్మంతో సంబంధం లేకుండ శరణడిగితే ఇచ్చేస్తాడు. అది రాముడి గొప్పతనం. అదెక్కడా లేదు. ఇంకెవరూ అట్లా చేయరు. గుర్తుపెట్టుకోండి 'రామా' అన్న శబ్దం అంతకు ముందు నీవు వెధవ పనులు చేశావా అని అడగదు. నీకు రక్షగా వుంటుంది. నిన్ను బాగు చేసుకుంటాడు.

అందుకనే విభీషణ శరణాగతిలో రక రకాలుగా చెపుతారు. మంచివాడు కాబట్టి ఆశ్రయం ఇమ్మని కొంతమంది అన్నారు. కాదు కాబట్టి ఇవ్వద్దని కొంతమంది అన్నారు. హనుమంతుడు అతని లోపలి గుణాలు చూసి ఇమ్మంటాడు. రాముడంటాడు, ఇవన్నీ లెక్క కాదు నాకు. నన్ను శరణంటే ఇవ్వటమే. ఇంకోటి లేదు అంటాడు. *'శ్రీరామరక్ష! సర్వజగద్రక్ష!'*. నన్ను శరణంటే ఇచ్చేశాను. వాడిని ఈ మూడు లోకాల్లో ఎవరూ ముట్టుకోవటానికి వీల్లేదు. అందుకని విభీషణుడు తనవారిని కాదని ఇక్కడికి వస్తే నేను శరణు ఇవ్వటానికి మీనమేషాలు లెక్కపెట్టను అని చెప్పి ఒక కథ చెపుతాడు. మనబోటి వాళ్ళం కొన్ని వందల జన్మలు గడిచినా ఆ అవగాహనకి వస్తామా అనేది ఎపుడూ ప్రశ్నార్థకమే.

ఒక పులి ఒక మనిషిని తరుముకుంటూ వస్తోంది. మనిషి

పరిగెత్తి అలసట చెంది, పులి బారిన పడతానని చెట్టు ఎక్కాడుట. చెట్టుకొమ్మ మీద ఎలుగుబంటి పడుకొని వుంది. పులి చెట్టెక్కలేదు. అందువల్ల ఎలుగుబంటిని చూసి వాడిని నువ్వు తినేసెయ్ అంది. నేను తినను వాడిని, నా ఆశ్రయంలో వున్నాడంటుంది. చెట్టు నా ఇల్లు, నా ఇంట్లోకి రక్షణకోసం వచ్చినవాడిని నేను తిననంటుంది. పోనీ క్రిందకి తోసెయ్ తినేస్తానంటుంది. వాడు క్రిందకి వస్తే నీవు తినెయ్. అది నీ ధర్మం. ఆకలేస్తే నీవు తినవచ్చు. కానీ నేను తోసేసి నీకు అప్పచెప్ప నంటుంది. మరి ఎలా అంటే అలా వుండు అంటుంది. క్రింద పులి, పైన ఎలుగుబంటి వుంటాయి. ఎలుగు బంటి మాటలకి సంతోషించి మనిషి విశ్రాంతి తీసుకుంటుంటాడు. అలసిపోవటం వల్ల నిద్రపోతూంటే పులి ఇపుడు తోసెయ్ వాడిని అంటుంది. తప్పు అట్లా తోయకూడదు అంటుంది. ఇలా మాట్లాడు కుంటుంటే వాడికి మెలకువ వచ్చి అనుమానం వచ్చింది. అవి రెండూ జంతువులు. అవి ఒకటే. మనం వేరు కదా! ఏమో తోసేస్తే? అనుకొని మేలుకొని వుంటాడు. ఈ లోపల ఎలుగుబంటికి నిద్ర వస్తుంది. నిద్రపోతుంటే పులి మనిషితో దాన్ని తోసెయ్. తిని ఆకలి తీరిపోతే నేను వెళ్ళిపోతా నంటుంది. వీడు తోసేస్తాడు. అదీ మనిషి! తోస్తే ఢామ్మని క్రిందపడుతుంది. పడేసరికి దీనికి మెలకువ వచ్చి ఎదురుగుండా చూస్తే పులి వుంటుంది. నిన్ను తోసేయమని అడిగితే వాడు తోసేశాడు. వాడు మనిషి. నిన్ను తోయమంటే నువ్వు తోసేయలేదు. వాడు నిన్ను వెంటనే తోసేశాడు. ఇపుడు నిన్ను తినేయచ్చు కదా! మరి నేనట్లా తినను. పై కెక్కి వాడిని తోసెయ్ అంటుంది. అంటే అలాగే అని పైకెక్కి, నేను తోయ

నంటుంది. పులికి ఆశ్చర్యం వేస్తుంది. మనిషికి సిగ్గు వేస్తుంది. ఛీ నేను మనిషినా, జంతువునా? అది దేవుడు, నేను దరిద్రుడిని అని, ఈ కథ చెపుతాడు రాముడు.

అందుకని నాకు రేపు విభీషణుడు అపకారం చేసినా నాకేం సంబంధం లేదు. నా ఆత్మబలం చేత నేను సమస్యను ఎదుర్కొంటాను. వాడు అపకారం తలపెట్టినా కానీ, వాడు నన్ను శరణు వేడినపుడు ఇవన్నీ నేను మాట్లాడను. తప్పకుండా శరణు ఇస్తానన్నాడు.)

ఓ రావణా! నన్ను దొంగతనంగా ఎత్తుకు వచ్చావు, ఇన్నాళ్ళు అట్టిపెట్టుకున్నావు- ఇవన్నీ రాముడు మనస్సులో పెట్టుకోడు. శరణాగత వత్సలుడని ప్రసిద్ధికెక్కాడు ఆయన. అందుకని నీకు భయం లేదు. (బింకానికి రావణుడలా అన్నాడు గానీ రాముణ్ణి ఎందుకు ఎదుర్కోలేదు? రాముణ్ణి ఎదుర్కొంటే గెలవలేనని వాడికి తెలుసు. ఎందుకంటే అంతకుముందు రాముడు 14 వేలమందిని 6 నిముషాలలో కొట్టేశాడు. మరి వాడిముందు నిలబడలేమని భయం. మారీచుడు కూడా వాడిని కొట్టలేవు కష్టం అని చెప్తాడు. అందుకని రాముడి బలం తగ్గాలని ఈవిడని ఎత్తుకొనివస్తాడు. ఒకవేళ అపుడు వచ్చినా కూడా కొట్టటం సులభం కాని వీలు పడదట్లా. 14 ఏళ్ళు అరణ్యంలో బ్రతికినవాడు ఎట్లా వుంటాడు. ఆయన లోపల బలం కాబట్టి అట్లాగే వున్నాడు. శరీరబలం తగ్గినా లోపల బలం తగ్గలేదు. అందుచేత నీవు వస్తే నీకు తప్పకుండా శరణు ఇస్తాడు. నీవు జీవించ దలచుకున్నట్లైతే ఆయనతో చెలిమి చేసుకోవలెను. నీవు బ్రతికుండాలంటే అదొక్కటే మార్గం. నీవు రామునితో స్నేహం చేసుకోక పోయినట్లైతే బ్రతకవు. నీవు ఆ

శరణాగత వత్సలుడిని సంతోషపెట్టవలెను. నీవు పరిశుద్ధుడవై నన్ను ఆయనకి అప్పగించవలెను. నన్ను ఆయనకి సమర్పించినట్లైతే నీకు మేలవుతుంది అని చెప్పింది. ఆపదలో వుంటే ఇన్ని మాటలు మాట్లాడగలమండీ? ఆవిడ లోపల స్థిరమైన చిత్తంతో, స్థితప్రజ్ఞత్వంతో ఒక తల్లి, కొడుక్కి చెప్పినట్లు ఆయనకి ఎన్నో రకాలుగా చెపుతోంది.)

ఓ రావణుడా! నేను చెప్పినట్లుగా కాక మరొక విధంగా ప్రవర్తించేటట్లైతే, నీకు చావు తప్పదు. దేవేంద్రుడు వదలిన వజ్రాయుధం నిన్ను వదిలిపెడితే వదిలిపెట్టవచ్చును. బహుకాలం యమధర్మరాజు నీ జోలికి రాకుండా వుండవచ్చును. ఆ లోకనాథుడు రాముడికి కోపం వస్తే నిన్ను ఎంతమాత్రమూ వదిలిపెట్టడు. దేవేంద్రుడు వదిలే వజ్రాయుధం ధ్వని వంటి రామశరాసన ధ్వనిని నీవు త్వరలోనే వింటావు. చక్కని కణుపు లతో, మంటలు మండే ముఖాలతో, రామ లక్ష్మణుల గుర్తులతో, మహా విషసర్పాల వంటి బాణాలు త్వరలోనే ఈ లంకాపట్టణం మీద పడతాయి. కంకిపక్షుల రెక్కల వంటి బాణాలు ఈ పట్టణమంతా దట్టంగా పడి రాక్షసులందరినీ రూపుమాపుతాయి. గరుత్మంతుడు అమిత వేగంతో సర్పాలను చిమ్మివేసినట్లుగా రామ ప్రభువు తన బాణాలతో సర్పాలవంటి రాక్షసు లందరినీ అమిత వేగంతో చిమ్మివేస్తాడు. విష్ణుమూర్తి మూడడుగులు వేసి అసురుని వద్దనుంచి రాజ్యలక్ష్మిని స్వాధీనం చేసుకున్నట్లుగా అచిరకాలంలోనే ఆ అరిందముడు, నా భర్త రామప్రభువు నిన్ను నాశనం చేసి, నన్ను తీసుకొనివెడతాడు.

ఓ రావణాసురుడా! రాక్షస సేనలన్నింటినీ నాశనం చేస్తూ, నా పెనిమిటి జనస్థానాన్ని హతస్థానం చేసివేసేటప్పుడు నీవు అశక్తుడివిగా కూర్చుని వున్నావు. ఆ తరువాత నన్ను దొంగిలించుకొని వచ్చావు. ఓ రాక్షసుడా! నీవు నీచుడవు. ఆ పురుష సింహులు అన్నదమ్ములు రామలక్ష్మణు లిద్దరూ బయటకు పోయినప్పుడు నీవు వారి ఆశ్రమానికి పోయావు. వారి వాసనైనా నీకు తగిలివున్నట్లైతే, పెద్దపులి వాసన తగిలిన కుక్కవలె నీవు పారిపోయి వుండేవాడివి. నీకు, ఆ రామలక్ష్మణులకు యుద్ధమే జరిగి వున్నట్లైతే, నీవు ఎన్నడో చచ్చిపోయి వుండేవాడవు. ఏక బాహువైన వృత్రాసురుని, దేవేంద్రుడు రెండు బాహువులు వుండటం చేత చంపివేసినాడు. నీవు ఒక్కడవు. వాళ్ళు అన్నదమ్ములిద్దరు. వారు నిన్ను చంపివేసేవారు. నా నాథుడు, ఆ రామ ప్రభువు త్వరలోనే లక్ష్మణుడితో కూడా ఇక్కడికి వస్తాడు. ఆదిత్యుడు తన అనంత కిరణాలతో అల్పజలాలను హరించినట్లు, నా ప్రభువు తన బాణాలతో నీ ప్రాణాలను పీల్చివేస్తాడు.

ఓ రావణుడా! నీకు చేటుకాలం వచ్చింది. నీవు కైలాసగిరికి పోయినా, వర్ణపురపు సభా భవనానికి పోయినా, పిడుగుపాటు తప్పించుకోలేని మహావృక్షమువలె నీవు ఆ దాశరథి బాణాలను తప్పించుకోలేవు అని సీతాదేవి చెప్పింది.

(అమ్మవారు మత్తులో వున్న రావణుడికి చెప్పేసరికి మత్తు అంతా దిగుతుంది. చెప్పినవన్నీ సత్యాలు. ఎంతో ధైర్యంతో, ధీరతతో, సంసిద్ధతతో సీతాదేవి అంత భయంకరమైన రాక్షసుడికి సమాధానం చెప్పింది.

దైవస్వరూపము ముందు అహంకార స్వరూపము చాలా తుచ్ఛమైనటువంటిది అనే భావన వ్యక్తపరచి, 14 లోకాలు జయించినప్పటికీ కూడ అతడు ఒక గడ్డిపోచకన్నా విలువైనవాడు కాదనే విషయాన్ని ఆమె అతనికి గుర్తుచేస్తుంది. దైవము ముందు అహంకారం పరిస్థితి అది. అందుచేత అహంకారము చూపించేటు వంటి ప్రలోభాలకు లోనుకాకుండా ధర్మమును, దైవమును నమ్మటం అంటే ఏమిటి అనేది మనకి సీతాదేవి భాషణము నందు చక్కగా గోచరిస్తుంది. అందుచేత ఈ కాండము నందు అహంకారంపై జీవుని యొక్క విజయమును తెలియపరిచే కాండము కాబట్టి ఇది సుందరకాండము. ఎట్టి పరిస్థితుల్లో కూడా ఆమెను ప్రలోభ పెట్టటానికి అవకాశం లేనటువంటి ఒక స్థితియందు ఆమె వున్నట్లుగా ఈ కాండము నందు గోచరిస్తుంది.

ఒక సత్సాధకునికి ఎంత క్లిష్టమైన పరిస్థితులు ఏర్పడి నప్పటికీ కూడా ప్రలోభము చెందక, ధర్మమును తప్పక జీవించి యుండటం అనేది ఒక ఉత్తమమైన సాధన. ఒక జీవి ఏ విధంగా నిర్వర్తిస్తుందనేది తెలియపరచేటువంటి ప్రవర్తన మనకి సీతాదేవి యొక్క ప్రవర్తన ద్వారా ఆవిష్కరింపబడుతూ వుంటుంది. ఇంతకన్నా మించిన దైవభక్తి కనిపించదు. అలాగే రావణుని మించిన అహంకారము కనిపించదు. ఎందుకంటే మనకి పురాణాలలో హిరణ్యకశిపుడి తర్వాత రావణు డంతటి వాడు. అతని అహం కారము, అందము, పరాక్రమము, ఐశ్వర్యం, అధికారం సరిపోల్చి చూడటానికి మరెవరూ గోచరించ లేనటువంటి పరిస్థితిలో వున్న వాడికి కూడా, దైవము నందు ఆకర్షితులై వుండటం చేత వాటిని

విసర్జించటం అనేది ఒక భక్తుడు ఏ విధంగా నిర్వర్తిస్తాడు అనేటు వంటి ఘట్టం మనకిక్కడ గోచరిస్తుంది.)

సీతాదేవి అన్న పరుష వాక్యాలకు ఆ రాక్షసాధిపతి రావణాసురుడు ఆమెకు దుఃఖము వచ్చేటట్లుగా “ఓ సీతా! మగవాడు ఆడుదానిని ఎంతెంతగా బ్రతిమలాడుకుంటాడో, అంతంతగా ఆ ఆడుదానికి లోకువై పోతుంటాడు. సంతోషం కలుగజేసే మాటలు ఎంతెంతగా చెబుతాడో, అంతంతగా అవమాన పడిపోతాడు. నేను నిన్ను కామించినాను. కామము మహాచెడ్డది. ఆ కామము ఎవరిమీద ఎక్కువైతే వారిమీద జాలి, స్నేహము ఎక్కువవుతాయి. ఉరకలు వేస్తూ ముందుకు పరుగులెత్తే గుఱ్ఱాలను సారథివలె నా కోపాన్ని మన్మథుడిప్పుడు వెనక్కు లాగుతున్నాడు. ఈ కారణము వలన, ఓ సుందరాననా! నేను నిన్నిప్పుడు ఏమీ చేయకుండా ఊరుకుంటున్నాను. నీ కపట వైరాగ్యానికి నిన్ను పరాభవింప వలెను లేదా చంపివేయవలెను. ఓ మైథిలీ! నీవు అన్న ప్రతి పరుష వాక్యానికి నిన్ను చిత్రవధ చేయవలెను.”

(మామూలుగా రావణుడు ఇంతవరకూ ఎవరి చేతా కూడా ఇంత భయంకరంగా మాటలు అనిపించుకోలేదు. మామూలుగా ఎవరన్నా ఎదురుమాట చెపితేనే తలకాయ లేచిపోతుంది. అటువంటి భయంకరమైన అహంకార పురుషుడు ఆమె మీద తనకు కలిగిన కామం చేత ఇవన్నీ భరిస్తున్నాడు. నీమీద వుండే కామం చేత నాలో వున్న అభిమానాన్ని కూడా చంపుకొని ఈ విధంగా వున్నాను. లేకపోతే ఈ పాటికి నిన్నెపుడో సంహరించ వలసింది అని చెపుతున్నాడు.)

"ఓ సీతా! నేను నీకు రెండు మాసాల గడువు పెట్టినాను. ఆ గడువుకాలం అయిపోగానే నీవు వచ్చి నా శయ్యమీద నాతో కూడా పడుకోవలెను. అట్లా నీవు నన్ను భర్తగా వరించక పోయినట్టైతే గడువు అయిన మరుసటినాడు నా ప్రాతఃకాల భోజనం కోసం నిన్ను నా వంట ఇంట్లో చీల్చివేస్తాను" అని బెదిరించినాడు.

రావణుడు సీతాదేవిని బెదిరిస్తూవుంటే, అప్పుడక్కడ అతని వెంటనున్న దేవకన్యలు, గంధర్వకన్యలు సీతాదేవిని విస్మితంగా చూచి దుఃఖపడిపోయినారు. చక్కని స్త్రీలు పెదవులతోను, ముఖాల తోను, కన్నులతోను సంజ్ఞలు చేస్తూ సీతాదేవిని ఊరడించినారు. ఆ స్త్రీ లందరూ తననట్లా ఊరడిస్తూ వుంటే, సీతాదేవి పాతివ్రత్య బలంతోను, గర్వముతోను రావణుని చూచి, "ఓ రాక్షసుడా! నీ మేలుకోరే వాడెవడూ ఈ పట్టణంలో లేడు. అది నిజము. నీవిట్లా తప్పుపని చేస్తూవుంటే, నిన్ను ఒక్కడూ అడ్డగించడం లేదు. దేవేంద్రుని భార్య అయిన శచీదేవి వంటి నన్ను, నీవు తప్ప ముల్లోకాలలో ఎవరూ కామించరు. అమిత తేజోవంతుడైన రామప్రభువు భార్యతో నీవు కాబట్టి ఈ పాపిష్ఠి మాటలన్నావు. ఇక నీవెక్కడికి పోయినా నీకు మోక్షము లేదు. నిన్ను ఆ రామప్రభువు శిక్షించకుండా వుండడు.

ఓ రావణాసురుడా! అడవిలో గర్వముతో తిరిగే మదపు టేనుగుతో కుందేలు పోరాడితే ఏమవుతుందో ఆ తేజోవంతుడు రాముడితో నీవు పోరాడితే అదే అవుతుంది. రాముడిని దూరంగా పంపించి నీవు నన్ను దొంగిలించుకొని వచ్చావు. నీకు సిగ్గు

వేయడం లేదా? నీవింతవరకూ ఆ రామప్రభువు కంటపడలేదు. ఓ రాక్షసుడా! నల్లగాను, తేనెరంగులో నున్న నీ క్రూరనేత్రాలు రాలి క్రింద పడిపోవలెను. నేను ఆ ధర్మాత్ముడి భార్యను. దశరథ మహారాజు కోడలిని. నీవు నన్ను అన్న మాటలకు నీ నాలుకలు చీలికలై పోవలెను. ఓ రాక్షసుడా! నీవు భస్మమై పోవలెను. కానీ నేనిప్పుడు పాతివ్రత్య ధర్మము నుంచి నీవు భస్మమై పోవలెనని శాపం పెట్టకుండా వున్నాను."

(సమస్తమూ పతియే అని భావించే స్త్రీయే పతివ్రత. దైవమైనా పతియే. అదొక వ్రతం. అలాగే గురువ్రతులు కూడా వుంటారు. వాళ్ళకు అంతా గురువే. అందుకే 'గురుచరిత్ర' చదువుతూంటారు ఏవో కష్టాలని. అందులో మొట్ట మొదట వచ్చే కథే అది. దీపకుడనే శిష్యుడు విష్ణువు వచ్చినా, శివుడు వచ్చినా గురువు ముందు లెక్కలేదు. గురువే నాకంతానూ. నా గురువేం చేస్తే అదే నాకు ఆశీర్వచనము. నువ్వు నాకేం చెయ్యక్కర్లేదని చెపుతాడు. మనం నమ్ముకున్న గురువు కన్నా, ఇంకో గురువు కొంచెం బాగా చేసిపెడుతున్నారట అంటే అక్కడికి పరిగెడతాము కదా! ఇక్కడ గురువు కాదు సరాసరి విష్ణువే వచ్చేశాడు. శివుడే వచ్చేశాడు. వచ్చేసి ఏం పడతావులే వాడితో కష్టాలు, పోనీ వాడి కష్టాలు తగ్గించమంటావా? వాడి కుష్టురోగం తగ్గించమంటావా? అని రకరకాలుగా అడుగుతారు. ఏమి అడిగినా నా గురువుని అడిగి చెపుతానంటాడు. అది ఒక సద్గురువు నందు శిష్యునికి గల పాతివ్రత్య ధర్మం. ఒకళ్ళని నమ్ముకున్నావు. మంచి, చెడు ఇక అంతే. ఇంకోటి లేదు. అన్నీ వాడే. ముంచినా వాడే. తేల్చినా వాడే.

అలాగే పాతివ్రత్య ధర్మం ఒకటుంది. ప్రతివ్రత తనను తాను కాపాడుకోదు. తనని కాపాడవలసిన అవసరం తన పతిదే. తన ధర్మంచేత ఆమె చాలా శక్తివంతమైనది. ఆమెకున్న శక్తిచేత రావణాసురుణ్ణి అప్పటికప్పుడు దగ్ధం చేయగలదు. కానీ తాను ఆ విధంగా చేస్తే రాముడికి అవమానం. ఎందుకంటే తాను రాముడి యొక్క సొత్తు అయినపుడు రాముడే తనను వచ్చి రక్షించుకోవాలి. తనకుగ తాను రక్షణ చేసుకొనేటువంటి స్థితి భక్తికి సంబంధించి చాలా పెద్ద విషయం అది. ఉత్తమోత్తమ స్థితిలో ఎక్కడో ఒకటి అరా భక్తులు అలా వుంటారు. వాళ్ళది వాళ్ళు కాపాడుకోరు. నన్ను కాపాడాల్సింది వాడు. వాడిని తలుచుకోవటమే నావంతు. అంతే తప్ప నన్ను నేను కాపాడుకుందాం, అన్నీ ఆయన చేసిపెడతాడు, ఇట్లా వుండదు. అదే శ్రీకృష్ణుడు చెప్పిన "సర్వధర్మాన్ పరిత్యజ్య". సులభమైన విషయం కాదు. ఎందుకంటే మనం ఏ ఎండకి ఆ గొడుగు పట్టటం అనే పద్ధతి బాగా నేర్చి వున్నటువంటి వాళ్ళం.

అందుకని ఇక్కడ రాముడి కన్నా విష్ణుమూర్తి బెటరేమో అనిపించవచ్చు కదా సీతాదేవికి. ఇవన్నీ ఎందుకు? మా నాన్న జనకమహారాజు వున్నాడు. బాగా యోగసిద్ధి కలిగినటువంటివాడు, యోగి. ఆయనకి కబురుపెడితే బాగుంటుందేమో. అంతకు ముందు అగస్త్య మహర్షి వాళ్ళని కలిశాం. అగస్త్యుడు కన్నా మించినవాళ్ళు ఎవరూలేరు కదా! వారందరి ముందు కనపడడు రాముడు. ఇపుడు ఎంతమంది మహర్షులను చూస్తూ వచ్చారు? ఇంట్లో వశిష్ఠ మహర్షి, అటుపైన విశ్వామిత్రుడు, భరద్వాజుడు రకరకాల మహర్షులు, అందర్నీ మించి అగస్త్యమహర్షి. ఇంత

మందినీ చూచివచ్చింది అమ్మవారు. జీవి ఎక్కడైనా ప్రలోభపడి పోవచ్చు కదా! తనను తాను ఒకచోట సమర్పణ చేసుకున్న తర్వాత దాన్ని నీతి అంటారు. అది లేనిచోట వ్యభిచారము అంటారు. వ్యభిచారం వున్నచోట దేవుడూ వదిలేస్తాడు. ఇటు గురువూ వదిలేస్తాడు. అందుచేత ఇక్కడ ఈ వ్యభిచారం లేనటు వంటి ఒక స్థితిని సీతాదేవి నిర్వర్తించి చూపిస్తోంది.

హనుమంతుడు తనని లంకలోంచి తీసుకెళ్ళగలడు వీళ్ళందరినీ నిర్జించి అని తెలిసికూడా సీతాదేవి, నేను రాను ఆయనేవచ్చి నన్ను తీసుకువెళ్ళాలి అని చెపుతుంది. నువ్వు నన్ను రక్షించగల శక్తి కలవాడవే అయినా నేను రాను. ఆయన వచ్చి నన్ను రక్షించుకుంటే అది ఆయనకి ప్రతిభ, ప్రతిష్ఠ. ఎందుకంటే నేను ఆయన్ని శరణు పొందినటువంటి దాన్ని. అలాగే రావణుడికి చెపుతుంది. ఇపుడు నేను నిన్ను సంహరించేస్తే రాముడికి ఏమి కీర్తి? అడవుల్లో భార్యని పోగొట్టుకున్నాడు, ఆవిడని మళ్ళీ ఆవిడే రక్షించుకుని వచ్చింది. వీడేం రాముడు అంటారు కదా! అట్లా భర్తను అంటే తనుమాత్రం ఎలా బ్రతకగలదు? ఆవిడ శక్తి స్వరూపిణి. సమస్త శక్తులూ తనలో వున్నప్పటికీ కూడ తన శక్తియుక్తులు వాడకుండా గురువునో, దైవాన్నో శరణుజొచ్చుటం అనేది భక్తిలో పరాకాష్ఠ. వాళ్ళూ భక్తులంటే.

అందుకని ఆవిధమైన భక్తిలో ఏం జరుగుతుందో వాడే చూసుకుంటాడు. వాడే కాపాడుకుంటాడు. వాడిమీద మనకి డౌట్ రాకూడదు. మనకేంటంటే రావణుడు రాముడికన్నా చాలా బాగా కనిపిస్తాడు. ఏం సందేహం లేదు. ఎందుకంటే రాముడే చూసి

అబ్బో అనుకుంటాడు. అదంతా బయట పటాటం. లోపల తక్కువ. లోపల అందం ఎంతమందికి తెలుస్తుంది. లోపల అందం శాశ్వతమైనది. బయట అందం తగ్గిపోయేటువంటిది కదా! బైట కనపడే మెరుగులకే లోబడిపోతూంటారు జీవులు.

సీతాదేవికి రాముడేంటో తెలుసు. ఇక్కడ అమ్మవారు అంటే సీతాదేవి. సరాసరి విష్ణు అంశతో పుట్టినటువంటి రాముడు విష్ణువు యొక్క అవతారమే కాబట్టి ఆవిడకంత అపనమ్మకం లేకపోవచ్చు. మరీ బొత్తిగా కుష్టురోగులు, ఏమీ లేనివాళ్ళు- అటువంటి వాళ్ళని కూడ నమ్ముకుని బ్రతికిన కథలు మనకి చాలా ఉంటాయి. మహాభారతం చదువుకుంటే, అక్కడ ఆ పతి ఎంత శక్తివంతుడు అనేది కాదు కథ. వాడు ఎటువంటివాడైనా మనసా వాచా కర్మణా వాడే దైవము అని పెట్టుకుంటే, ఆ మనిషిలో పెరిగే శక్తి ప్రపంచాన్నే కదిలించేస్తుంది. మరి సూర్యుడి గమనాన్ని ఆపేసిన పతివ్రతలున్నారు. ఈ పాతివ్రత్య మహిమ అటువంటిది.

అందుకని నేను కూడా ధర్మం చేత నిన్ను సహిస్తున్నాను. లేకపోతే నాకున్న పాతివ్రత్య మహిమచేత నిన్ను నేను సులభంగా భస్మం చేయగలను అని చెపుతుంది. నీకెవరూ చెప్పేవాళ్ళు లేకపోవటం దురదృష్టం అని చెపుతుంది. నా గురించిగానీ, రాముడి గురించి గానీ చెప్పాలి. రాముడంటే రావణుడికి భయం అని ప్రపంచం అంతా తెలిసిపోయింది. ఎందుకంటే ఆయన్ని పక్కకి పంపించి దొంగతనంగా ఎత్తుకు వచ్చావు. అందుచేత నువ్వు ఏ విధంగానూ పరాక్రమ వంతుడివి కావు. రాముడు నీకన్నా పరాక్రమవంతుడు. నాముందు నీవెందుకూ పనికిరావు.

నా బలం ధర్మం యొక్క బలం. పాతివ్రత్య ధర్మం యొక్క బలం. నీవు ధర్మాన్ని ఆచరించక పోవటమే నీ బలహీనత అని చెపుతుంది.

మనకి భారతం, రామాయణాల్లో యోధులు వాళ్ళకి ధర్మహాని జరిగినచోట పోయారు తప్ప వాళ్ళకున్నటువంటి వీర్యం, శక్తి, మంత్ర తంత్ర శక్తుల వల్ల రక్షింపబడలేదు. ఏమిటి రక్షించింది అంటే ఆచరణ రక్షించింది. ఇంకేం రక్షించదు. ఆచరణ దగ్గర కృష్ణుడు మెదలాలి. కాబట్టి అదే ఆచరణ తనవాళ్ళకి అందించాడు. అందుచేత వాళ్ళు రక్షింపబడ్డారు. ఆచరణ లేక, ఆచరణలో లొసుగులుంటే ధర్మానికి హాని జరుగుతుంది. అలా ధర్మానికి హాని జరిగినపుడు నీవు బలహీనుడ వవుతావు. బలహీనుడవైన నీవు బయట ఎన్ని కవచాలు వేసుకొని వున్నా ఉపయోగం లేదు.

వాడెవడో సహజమైన కవచంతో పుట్టాడు కదా! ఒంట్లోనే వుంది కవచం. ఎవరూ చంపలేరు. అయినా పోయాడు. ఇంకో ఆయన తను చద్దామనుకుంటే తప్ప చావడు. అయినా పోయాడు. మరొకాయన విల్లు పట్టుకున్నంతసేపూ ఎవరూ ఆయన్ని గెలవ లేరు. అయినా పోయాడు. మరొకాయన చిరంజీవి. అయినా పోయాడు. అదేంటి మరి? అంటే ఏమైంది చివరికి? అది చెపుతున్నారిక్కడ. ఎక్కడికక్కడ మన గ్రంథాలలో చెప్పేది నీ ఆచరణలలో వుండే ధర్మమే నిన్ను రక్షిస్తుంది. మరొకటి నిన్ను రక్షించదు.

నీకు కష్టం వచ్చింది. వస్తుంది, ఎందుకు వస్తుందంటే ఏవో

కొన్ని ఎక్కువగా చేయటం వలన ఇపుడు కష్టాలు వస్తాయి. అవేంటో తెలుసుకొని బాగుచేసుకుంటావా? దానికి ఇంకా వంకర్లు వెతుకుతావా? మనం ఎపుడూ వంకర దారులు, సులభంగా దాటేసేవి వెతుక్కుంటూ మన లోపలకి మనం పరిశీలించి చూసుకోము. పరిశీలించుకుంటే తప్పులు తెలుస్తాయి. మనకి నీవల్ల ఈ పొరపాటు జరిగిందని ఎవరూ స్పష్టంగా చెప్పరు. నీకది చెప్పటంవల్ల నీకు తెలుస్తుందా? ఒప్పుకోకపోగా లేదు నేను ఎందుకు చేశానంటే అని చెప్పి దానికి ఒక తర్కం తీసుకు వస్తావు. అంటే నీకు నీవు సిద్ధంగా లేవు నీ తప్పు తెలుసుకోవటానికి. అందుకని నీకుగా నీవు తెలుసుకోవాలంటే నువ్వు బాగా పరిశీలనగా చూసుకోవాలి. దాన్నే ఆత్మపరిశీలనం అంటారు.

ఆత్మావలోకనం చేసుకుని, ఆత్మపరిశీలన చేసుకొని సీతా దేవి చాలా దుఃఖపడుతుంది. ఏం పనిచేశాను నేను అని. ఎపుడూ దుఃఖమే ఆవిడకి. ఆవిడ దుఃఖానికి కారణం రావణాసురుడు తనని ఎత్తుకు వచ్చేశాడని కాదు. రాముడు, లక్ష్మణుడు చెప్పింది వినలేదని. కష్టంలో పడ్డానని ఏడవట్లేదు ఆవిడ. వాళ్ళ మాట వినలేదని. రాముడు, లక్ష్మణుణ్ణి కాపలా పెట్టి వెళ్ళాడు. అంతకు ముందు లక్ష్మణుడు ఇది తప్పకుండా మాయ లేడియే సందేహం లేదన్నపుడు, సరే ఇన్ని రకాలుగా అనుకుంటున్నపుడు మన కెందుకులే అని ఊరుకుందా? కామం మహా చెడ్డది అన్నాడు వాల్మీకి.

అదే విదురుడంటాడు కామానికి నీతి, ఉచ్ఛనీచాలు లేవని. ఇది ఉచ్ఛం, నీచం అనిపించదట కామం. అందుకనే కథలో చాలా

వేదాలు నేర్చుకున్నటువంటి పండితుడు, శూద్ర స్త్రీ వెనకపడి పోయినట్లుంటాయి కదా! ఒక్కసారి కామం పుడితే ఏంటి కొలబద్ద? ఇదేంటిరా నువ్వు ఏం చూసి ప్రేమించావు? అంటే వాడికి కనిపించింది మిగతావాళ్ళ కెవరికీ కనిపించదు. అది కామం. ఊళ్ళో వాళ్ళందరికీ డోకు పుడుతూ ఉంటుంది. అజామీళుడు చూడబోతే అద్భుతంగా వుంటాడు. శూద్ర స్త్రీని చూడబోతే కళ్ళు మూసుకోవాల్సిందే. అయినప్పటికీ ఏమిటది కర్మ. మరి వాడికి అదే మహా అప్సరస. నాశనం అయిపోయేంత వరకూ కూడా. అలాగే వుంటుంది. అది కామం.

అందుకని ఇంతమంది చెప్పినా వినకుండా కామానికి మోహితయై తను ఈ కష్టాన్ని కొనితెచ్చుకున్నానన్న దుఃఖం తప్ప, రావణుడి దగ్గర వున్నాం, మన కెట్లా? అదికాదు. రాముడు తన యందు ఇంకా ప్రీతిచెంది వున్నాడా? ఒకటి. లక్ష్మణుడు తన గురించి ఏమనుకుంటాడు? రెండు. నేను ఎందుకిలా ప్రవర్తించాను? మూడు. ఎపుడూ ధర్మాత్ములకి గోల ఒకటే. మనం ఎందుకు ఈ టైమ్‌లో ఇలా ప్రవర్తించాం అనిపిస్తూంటుంది. అధర్మాత్ములకు మాత్రం అట్లా అనిపించదు. వాడు కారణం, వీడు కారణం అనిపిస్తుంది.)

(సీతాదేవికి అసలు రావణుడు సమస్య కాదు. ఆవిడ సమస్య ఒకటే. అపుడు ఆవిడ ఎందుకలా చేసింది? వీడేదో వండుకు తినేస్తాడని ఇట్లా ఆవిడ భయపడట్లేదు అసలు. ఆవిడ భయం ఏమిటంటే ఇపుడు నేను చేసినదానికి ఎంత కష్టపడు తున్నారు వాళ్ళక్కడ. స్త్రీకి లోపల వున్న స్థిమితం పురుషులకు

వుండదు. పురుషుడు పైకి గంభీరంగా వున్నా, లోపల డీలా. స్త్రీ పైకి కోమలంగా వున్నా లోపల స్థిరంగా వుంటుంది. అందుకని రాముడు తాను లేకపోవటం వలన ఎంత డీలా పడిపోయి వుంటాడో అని బాధపడుతోంది.

రావణుడి యుక్తి కూడ అదే. అందరూ అదే చెపుతారు. "వాడితో వెళ్ళి పోట్లాడి సీతాదేవిని తెచ్చేసుకుందాం అనుకోక. వాడిని బలహీన పరచాలి" అని. అడవిలో వున్నప్పటికీ రాముడు బలహీనుడు కాదు. వాడిని బలహీనుణ్ణి చేయాలంటే నువ్వు ముందు సీతాదేవిని ఎత్తుకు వచ్చేయాలి. అపుడు అతను సీతకోసం పడే ఆవేదనలో అతని బలం తగ్గుతుంది అని అందరూ సలహా చెపుతారు. అందుచేత ఆ విధంగా చేశాడు. అమ్మవారికి కూడా తెలుసు ఆయన తనవలన ఎంత దుఃఖం చెందుతున్నాడో. వాళ్ళిద్దరి దుఃఖానికి తనుకదా కారణం. అలా వుంటుంది ఆలోచన. అందుచేత ఈ రావణుడు ఏదో చేసేస్తాడన్న భావన ఆమెకి లేదు ఒకటి. కావాలంటే అతన్ని తాను సంహరించ గలదు. లేదా తనను తాను ఆహుతి చేసుకోగలదు. అందుకు తన తపశ్శక్తి చేత అగ్ని పుట్టించుకొని తానే దగ్ధం అయిపోగలదు. వాడికందేటు వంటి ప్రశ్న అక్కడ లేదు. అందుకు అన్ని రకాల ధర్మాలు వాళ్ళ మాటల్లో తొంగి చూస్తూంటాయి.)

సీతాదేవి రావణుడితో 'ఓ రాక్షసుడా! ఆ మహాత్ముడు వుండగా నన్ను నీవు ఎత్తుకొని రావటానికి వీలయ్యేదే కాదు. ఇంతకూ నీ చావుకోసం నీవు నన్ను అపహరించి తెచ్చావు. నీకెటు చూసినా చావు తప్పేట్లుగా లేదు. నీకా చెప్పేవారు లేరు. ఆయన

నీకన్నా చాలా పరాక్రమవంతుడు. నువ్వేమో నన్ను తీసుకెళ్ళి అప్ప చెప్పేటట్లుగా లేవు. ఎంతసేపూ కామంతో పీడింపబడుతున్నావు తప్ప నీకెవరూ చెప్పేవారు లేరు. భయం లేదు. (ఎపుడొస్తుందంటే చెడిపోయే కాలం, ఇంకోళ్ళు చెప్పినా వినం. మంచి చెపితే వినకపోవటం అన్నది చాలామంది చేస్తారు. కానీ కొంతమందికి భయం వుంటుంది. భయం చేత మంచిగా వుంటారు. భయం లేకపోతే అంత మంచిగా వుండరు.)

నీకు భయమూ లేదు. అది పెద్ద ఇబ్బందై పోయింది. భయం లేనివాడు ఏ పనైనా ఎట్లాగో అట్లా చేసేస్తూంటాడు. పెద్దవాళ్ళ మాట వినాలనేటువంటి బుద్ధి లేదు. ఎంతమంది చెప్పినా వాడు వినడు. వాడికా భయం లేదు. ఎట్లా తెలుస్తుంది? కాబట్టి తప్పకుండా చనిపోతావు నువ్వు. సందేహం లేదు. కుబేరుడి తమ్ముడినని, సూర్యుడినని నీవు చెప్పుకున్నావే. ఎందుకు? ఆ మహానుభావుని అక్కడి నుంచి తప్పించి నన్ను దొంగిలించుకొని వచ్చావే! అన్నది. నువ్వేదో గొప్పవాడివని చెపుతున్నావు. నువ్వు ఎట్లా అవుతావు గొప్పవాడివి? ఆయన్ని పక్కకి తప్పించి నన్నెత్తుకు వచ్చిన నువ్వేం మహాత్ముడివి? ముందు పోట్లాడి జయించుకు వస్తే వీర్యశుల్కం అవుతుంది కదా! వీర్యశుల్కం కాదిది.

(కృష్ణుడూ ఎత్తుకు వచ్చేశాడు రుక్మిణీదేవిని. అన్న సమక్షం లోనే పట్టుకు వచ్చేశాడు. ఎవరూ లేకుండా చూసి దొంగతనంగా తీసుకురాలా. అందరూ చూస్తుండగా, అందరూ ఆయుధాలు పట్టుకుని నిలబడ్డారు కృష్ణుడు వస్తాడని. తప్పకుండా వస్తాడని మాకు తెలుసని రుక్మి సంఘం అంతా ప్రణాళిక వేసుకొని

ఆయుధాలతో సహా రెడీగా వుంటారు. గుడి దగ్గరకి ఈవిడ వెళ్ళినపుడు తప్పకుండా వచ్చి పట్టుకు వెళతాడు ఈమెని అని అందరూ దారులు కాచి వుంటారు. Security arrangements అన్నీ పెట్టుకొని. వాళ్ళందరూ చూస్తూండగానే వాళ్ళ పక్క చూచి నవ్వాడు. నవ్వేసరికి వెఱ్ఱోళ్ళు అయిపోయా రందరూ. ఆ నవ్వుకి ఎవరైనా అయిపోతారు. సమ్మోహనాస్త్రం అంటారు దాన్ని. ఆ అస్త్రం వేసి వాళ్ళందరూ చూస్తూండగానే కంగారు లేకుండా ఆవిడ దగ్గరకి వెళ్ళి చేయి అందించాడు. వయ్యారంగా నడుచుకుంటూ వచ్చి రథం ఎక్కారు. కొంతదూరం వెళ్ళిన తర్వాత see you అని చేయి ఊపాడు. అపుడు వాళ్ళకి తెలివొచ్చింది. అపుడు వచ్చినా, రాకపోయినా ఒకటే. అయిపోయింది. వీర్యశుల్కలు అంటే వారి వీరత్వం చూపి ఎత్తుకురావాలి. భీష్ముడట్లా ఎత్తుకువచ్చాడు కాశీరాజు పిల్లల్ని. అందుచేత నీవు వీర్యం ప్రకటించ లేదు. ఊరికే దొంగ తనంగా ఎత్తుకువచ్చి కబుర్లు చెపుతావా అంటోంది.

నిజానికి చూడటానికట్లా వున్నాడు గానీ, సీతాదేవికి శ్మశాన మండపంవలె కనుపించినాడు లోపల నుంచి. వీడికి బైటనుంచి అన్నీ వున్నప్పటికీ కూడా లోపల ఏమిటి ఏర్పాటవుతోంది అన్నది కన్పిస్తుంది పెద్దలకి. అంటే ముందు వీడి భావి ఎట్లా వుంటుంది అని చూస్తే పరమ దరిద్రంగా అనిపిస్తుంది కొంతమందికి. కొంతమందికి చూడటానికి ఏడుస్తూ కన్పించినా భావి చాలా బాగుంటుంది. అందుకని పెద్దలకి, ధర్మం ఆచరించేవాళ్ళకి భావి బాగుంటుంది.)

రావణాసురుడు తన క్రూరనేత్రాలతో సీతాదేవి వంక

తేరిపార చూచాడు. అతడు నీలమేఘం వంటివాడు. పెద్ద పెద్ద భుజాలు, బలిసిన మెడ, సింహమంతటి బలవంతుడు. సింహం వలె నడుస్తాడు. అతడు కాంతిమంతుడు. కన్నులు, నాలుక జ్యోతులవలె వెలుగుతూ వుంటాయి. మంచి ఎత్తైనవాడు. అట్లా నడుస్తూ వుంటే, ఆ నడకకు శిరము మీద కిరీటము శోభాయ మానంగా కదులుతూ వుంటుంది. అతడు చందనచర్చ చేసుకున్న దేహము మీద రంగురంగుల పూలదండలు, కన్నులు చెదిరిపోయే ఎర్రటి పూలదండలు వేసుకున్నాడు. రక్తవస్త్రము కట్టుకున్నాడు. బంగారు బాహుపురులు ధగధగలాడుతూ వున్నవి. అమృత మథన మప్పుడు మంథర పర్వతానికి చుట్టిన వాసుకి వంటి నల్లటి మొలత్రాడుతోను, నల్లటి శిఖరాలవంటి పెద్ద పెద్ద భుజాలతోను, చెవులకు పెట్టుకున్న కుండలాలు తరుణాదిత్య కాంతులతో ధగధగ లాడుతూ వున్నందువల్ల ఎర్రటి చిగుళ్ళు, ఎర్రటిపూలు పూసిన అశోకవృక్షాలున్న పర్వతంవలె శోభించినాడు. అతడు ఒక కల్ప వృక్షం వలెను, ఆకారం ధరించిన వసంతుడివలెను అలంకరించు కున్నప్పటికీ శ్మశానపు మండపంవలె భయంకరంగా కనిపించాడు.

ఆ రావణాసురుడు కోపంతో కన్నులెర్రజేసి, వైదేహిని చూస్తూ పాము బుసలు కొట్టినట్లు నిట్టూర్పులు విడుస్తూ, ఓ సీతా! వాడు దరిద్రుడు, దుర్మార్గుడు. వాడిని, ఆ రాముని అనుసరించడ మనే వ్రతం పట్టినావు. ప్రాతఃసంధ్యను సూర్యుడివలె, నిన్నిప్పుడు నా ఓజస్సుతో నాశనం చేసివేస్తాను అని చెప్పినాడు. అంతట ఆ శత్రు రావణుడు ఏకాక్షిని, ఏకకర్ణుడు, కర్ణప్రావర్ణుడు, గోకర్ణిని, హస్తకర్ణిని, లంబకర్ణిని, అకర్ణికను, ఏనుగు పాదాల దానిని, గుఱ్ఱం

పాదాల దానిని, గోవుల పాదాల దానిని, పాదాలకు జుట్టు వున్న దానిని, పెద్దతల, మెడ వున్న దానిని, పెద్ద పెద్ద స్తనాలు, పొట్ట వున్న దానిని, పెద్ద కన్నులు, పెద్ద ముఖం వున్న దానిని, నాలుక వున్న దానిని, నాలుక లేనిదానిని, ముక్కు లేనిదానిని, సింహం ముఖం వున్న దానిని, గోముఖం వున్న దానిని, పందిముఖం దానిని– అట్లా భయంకరంగా కనిపించే రాక్షస స్త్రీల నందరినీ చూచి, ఓ రాక్షసాంగనలారా! మీరందరూ ఏకమై, ఏ పనిచేస్తే ఈ జనకరాజు కూతురు సీత నా వశమవుతుందో, ఆ పని వెంటనే చేయండి. ఈమెకు అనుకూలంగా కానీ, ప్రతికూలంగా కానీ ప్రవర్తించండి. సామ దాన భేద దండోపాయాలు ప్రయోగించండి. మొత్తానికి అది నామాట వినేటట్లు చేయండి అన్నాడు. ఈ వైదేహి నా వశమయ్యేట్లు మీరు చెయ్యవలెను. కామము, క్రోధము పెన వేసుకుపోయి, ఆ రావణాసురుడు సీతాదేవిని మాటిమాటికీ బెదరించసాగాడు.

అప్పుడు ధ్యానమాలిని అనే రాక్షసాంగన రావణాసురుని కౌగలించుకొని 'మహారాజా! నాతో క్రీడించు. ఈ సీత మానవ స్త్రీ. దేహము పాలిపోయి వుంది. ఇది ఏడుస్తూ వుంది. ఓ రాక్షసేశ్వరా! ఇట్లా ఏడ్చేదానితో ఏమి అనుభవిస్తావు? మహాప్రభూ! నీ భుజ బలంతో ఆర్జించిన దివ్యము, ఉత్తమోత్తమమైన భోగాలను అనుభవించటానికి బ్రహ్మదేవుడు ఈ సీతను సృష్టించ లేదు. నిజము. కోరిక లేని దానిని కామించే వారికి దేహతాపము తప్ప మరే సుఖమూ వుండదు. కోరుకుంటున్న దానిని కామించేవారు చెప్పనలవి కాని సంతోషాన్ని పొందుతారు' అని చెప్పింది.

ఆ మాటలకు ఆ బలవంతుడికి కోపం చల్లారి పోయింది. ఆ మేఘ సమానుడు రావణాసురుడు అప్పుడు నవ్వుతూ వెనుకకు మళ్ళినాడు. భూమి కంపించేలా అడుగులు వేస్తూ, మధ్యాహ్న సూర్యుడివలె తేజరిల్లే తన రాజభవనానికి పోయినాడు. అతడితో పాటు ఆ రాజభవనంలోకి దేవకన్యలు, గంధర్వాంగనలు, నాగ కన్యలు మొదలగు స్త్రీ లందరూ పోయినారు.

అన్ని లోకాల్లోనూ వున్న సుందరాంగన లందరూ ఇతని అందానికి, ప్రతాపానికి, ఐశ్వర్యానికి, అధికారానికి లోబడి వెంటపడి వచ్చేశారు. వాళ్ళంతా మేమంతా వున్నాం కదా నీకు. ఆ ఏడ్చేదాన్నేం బాధిస్తావులే? దానితో నువ్వు ఏం ఆనందించగలవు? మేమున్నాం కదా, పద పోదాం అంటారు.

(రావణుడి బలం ఉపాసనా బలం. రాముడిది సహజ బలం. వశిష్ఠునిది సహజమైన బలం. విశ్వామిత్రుడిది చివరిదాకా ఉపసనా బలం. ఉపాసనతో మహత్తర కార్యాలు చేసినవాళ్ళు తరువాత గాలి తీసిన బూరలా అయిపోతారు. సహజమైన బలంతో సత్కార్యాలు చేసేవాళ్ళు నిరంతరం చేస్తూ వుంటారు. జన్మ జన్మల వరకూ ఎక్కడా తరుగు లేకుండా చేస్తూ వుంటారు. హెచ్చుతగ్గు లుండవు. పెళ పెళ మని చేయటం, క్రింద పడిపోవటం వుండదు. అందుకని వుంటే సహజబలం వుండాలి. దేవతలు నీతో సహకరించాలి గానీ, దేవతలు పట్టుకు కూర్చుంటే, వాళ్ళెంత సేపూ వీడెక్కడ పొరపాటు చేస్తాడా, వీడికి ఎదురుతిరుగుదాం అన్నట్లు చూస్తారు. వాళ్ళ దగ్గర వుండే శక్తులు వారికి వ్యతిరేకంగా పని చేయటానికి ఎపుడూ సిద్ధంగా వుంటాయి. నువ్వు ధర్మాన్ని

ఆచరించనపుడు కొన్ని ఆసురీ శక్తులు అధర్మాన్ని చేయించటానికి ఎపుడూ వెంటబడి వుంటాయి. కర్ణుడి దగ్గర వున్న నాగాస్త్ర అనే శక్తి ఆయుధాన్ని అర్జునుడి మీద ప్రయోగిస్తే, కృష్ణుడు రథాన్ని కాలితో తొక్కితే, రథం కొంచెం లెవెల్ తగ్గుతుంది. వచ్చిన నాగాస్త్రం సరాసరి అర్జునుడి కిరీటాన్ని కొట్టేసి వెళ్ళిపోతుంది. అది తిరిగి వెళ్ళి కర్ణుడి భుజం మీదచేరి, "కొట్టు మళ్ళీ ఈసారి క్రిందకి తొక్కి, పైకి లాగినా కొట్టేస్తాను" అంటుంది. కర్ణుడికి ఏదో ఒక అధర్మం వున్నా, మళ్ళీ కొన్ని ధర్మాలున్నాయి. దానివలననే ఉత్తమ లోకాలకి వెళ్ళటానికి అవకాశం వస్తుంది. అట్లా "ఓసారి వాడేసిన బాణాన్ని మళ్ళీ వాడను. అయిపోయింది, నీ కర్తవ్యం నీవు నిర్వర్తించేశావు. వెళ్ళిపో" అంటాడు. అదెక్కడిది? ఖాండవ దహనం లోనిది. అర్జునుడు, కృష్ణుడు కలిసి ఖాండవ దహనం చేస్తూంటే ఒక పాముకి చాలా ఇబ్బంది వచ్చింది. దాని కుటుంబం అంతా చచ్చిపోతుంది. అది నాగదేవత. అది అర్జునుడి మీద పగపడుతుంది. పగబట్టి కర్ణుడి దగ్గరకు అర్జునుణ్ణి కొట్టవచ్చుని చేరుతుంది. నేను నాగదేవతను, నాకు అర్జునుడి మీద పగవుంది. నీ పొదిలో వుంటాను. నీ అవసరమైన వేళలో నన్ను వాడుకో అని కర్ణుడికి చెబుతుంది. అంతకుముందు కర్ణుడికి ఇంద్రుడు ఒక అస్త్రం ఇస్తాడు, శక్తి. అది పెట్టి కొట్టేస్తే అయిపోతుంది అర్జునుడిని. కానీ దానికి కృష్ణుడేం చేస్తాడంటే ఘటోత్కచుని పావుగా వాడు కుంటాడు. వాడు విజృంభించేసరికి దుర్యోధనుడు "అర్జునుణ్ణి కొట్టడం కాదు, వీడు మొత్తాన్ని తినేసేటట్టు ఉన్నాడు. నువ్వు ముందు ఘోటోత్కచుని చంపేసెయ్ ఆ అస్త్రంతో అంటే, కర్ణుడు

మనసులో చాలా దుఃఖపడి సరే ఈ విధంగా వుంది విధి అని బాణం ఘటోత్కచుడి మీద వేయటం వలన అర్జునుడు బ్రతికి పోతాడు. ఇంకో బాణం నాగాస్త్రం.

ఎందుకు ఇవన్నీ ఇలా అయిపోతాయి అంటే ధర్మం ఒకటుంది కాబట్టి. ఎంత శక్తియుక్తులున్నా ధర్మాన్ని ఏం చేయలేమండి. ఏదో అనూహ్యంగా ధర్మం కాపాడుతుంది. కాపాడబడుతున్న వాడికి కూడా తెలియదు కాపాడుతోందని. ఇదేం కాపాడుతుంది అనిపిస్తుంది. సైంధవుడి తలమీద బాణం వేసి తీసేస్తే, అర్జునుడికి వెంటనే కృష్ణుడు చెప్పాడు, ఆ తల క్రిందపడకుండా మరో బాణం వేసి ఆ తల సరాసరి వాడి నాన్న తపస్సు చేసుకుంటున్న చోట వాడి ఒళ్ళోపడేటట్లు వేయి అంటాడు. బాణం తల తీసేస్తే రెండో బాణం తల క్రిందపడకుండా తీసుకెళ్ళిపోతుంది. అట్లా చెప్పకపోతే వాడి తల క్రిందపడిన క్షణంలో వీడి తలకాయ కూడా పేలిపోయేది. అర్జునుడు తలలో పూలదండ వేసి బాంబుపెడితే ఎలా పేలు తుంది? అలా అర్జునుడి తల పేలిపోతుంది. మరెవరికీ తెలియదు.

మనకు ముందు కథలో వ్యాసుడు చెప్పడు. అపుడు చెబుతాడు కృష్ణుడు. ఇవన్నీ ఆయనకెలా తెలుసు? వీళ్ళంతా అరణ్యంలో బాధలు పడుతుంటే ఆ పన్నెండేళ్ళు ఏకాగ్రమైన దృష్టితో శివుడి గురించి తపస్సు చేశాడు. వీళ్ళు ప్రాతిపదికగా ధర్మానికి, అధర్మానికి భౌగోళికంగా యుద్ధం జరగబోతోంది. ఈ యుద్ధంలో ధర్మానికి జయం కలగాలి. అందుకే తాను దిగివచ్చాడు కాబట్టి అందులో తన పాత్ర తాను సమర్థవంతంగా నిర్వర్తించాలి. అందుచేత అన్ని కీలకాలు తాను తెలుసుకుంటాడు తపస్సుద్వారా. అందుకని

కృష్ణుడు హరిహరాంశగా అక్కడ ప్రవర్తిస్తాడు. అందుచేత సమస్తము తెలిసి ఆ విధంగా నిర్వర్తింపచేశాడు. మరి అటువంటి వాడిని కోరుకునే విషయంలో కూడ అర్జునుడు అంతంత మాత్రమే. తనే తనను ఆ విధంగా కోరుకునేట్లుగా ఆయన ప్రయత్నం చేస్తాడు.

ధర్మాచరణ చేసేవాళ్ళ కోసం దైవం కూడ ఆ విధంగా తాపత్రయ పడతాడు. యిన్ని రకాలుగా ధర్మం కాపాడుతుంది. కాబట్టి వీళ్ళు ఎన్ని రకాలుగా చేసినా ధర్మం మీద నమ్మకం కలగడమే జీవుడికి అదృష్టం. దానివలన అపజయం వచ్చినా ఫరవాలేదు. ధర్మంలో ఉండటం వలన రక్షింపబడతాము. ఎవరెవరి ధర్మం ఎలా వుందో తెలియాలంటే రామాయణం చదువుకోవాలి.

రావణుడు చాలామందితో వచ్చాడు కదా! వాళ్ళందరూ విన్నారు. నీకెందుకీ గోల, పద పోదాం, మేము వున్నాం కదా! రా అన్నారు. వెళ్ళిపోయాడు.)

# 7

ఆ వికృతాంగనలు, ఆ పరుష స్వభావులు, రాక్షసాంగనలు సీతాదేవి చుట్టూచేరి, సీతా! రావణాసురుడి అంతఃపురము సర్వభూత మనోహరం. ఎటువంటి జీవుడికైనా పుట్టిన ప్రతిసారీ మనస్సు హరింప చేయగలిగినటువంటి అందమైన భవనం. నీవెపుడూ చూసుండవు. రావణుడు త్రైలోక్య ఐశ్వర్యాన్ని అనుభవిస్తున్నాడు. రాక్షస ప్రభువుని భర్తగా అంగీకరించి నీ ఇష్టం వచ్చినట్లు హాయిగా క్రీడించు. ఓ మంగళ స్వరూపిణీ! నీవు అనుజుతవు. అయితే మానవాంగన అయిపోయినావు. అందువలననే రాజ్యభ్రష్టుడు అయి, ఏ కోరిక తీర్చుకోలేని ఆ దీనుడిని, ఆ మానవుడినే కావాలనుకుంటున్నావు. అక్కడి శయ్యలు ఎంతో గొప్పగా వుంటాయి. నీవు అక్కడ వుండవలెనని ఎందుకనుకోవడం లేదు? అని చెప్పినారు.

సీతాదేవి వారి మాటలు విన్నది. తామర కన్నుల వంటి ఆమె కన్నులు నిండుకున్నవి. ఆ రాక్షసాంగన లందరినీ చూస్తూ, "మీరు లోకము ద్వేషించే మాటలు చెప్పారు. మీరు చెప్పింది పాపమని మీ మనసులో తోచడం లేదా? మానవాంగన రాక్షసుడికి భార్యగా వుండజాలదు. మీరందరూ నన్ను వదిలివేయండి. మీ

మాటలు నేను వినను. భీరుడు, రాజ్యహీనుడు కావచ్చును. ఎలాంటివాడైనా రామప్రభువే నా పెనిమిటి. అతడే నాకు అధ్యక్షుడు. సువర్చల ఎప్పుడూ సూర్యుని అనుసరించుకొని వుంటుంది. అట్లాగే అనురాగంతో నేను కూడ నా పెనిమిటిని అనుసరించుకొని వుంటాను. ఆ మహాభాగ శచీదేవి దేవేంద్రుని, అరుంధతీదేవి వశిష్ఠుని అనుసరించుకొని వుంటున్నారు. వారేకాదు రోహిణీదేవి చంద్రుని, లోపాముద్రాదేవి అగస్త్యుని, సుకన్యాదేవి చ్యవనుని, సావిత్రీదేవి సత్యవంతుని, శ్రీమతీదేవి కపిలుని, మదయంతీదేవి సౌదాసుని, కేశినీదేవి సగరుని, భీమరాజ పుత్రి దమయంతీదేవి నైషధుని అనుసరించి సమస్త భోగభాగ్యాలను అనుభవించారు. అదే విధంగా ఇక్ష్వాకు వంశ శ్రేష్ఠుడైన రామ ప్రభువును, నా భర్తను నేను అనుసరించి వుంటాను” అన్నది.

ఈ మాటలకు రాక్షసాంగనలు కోపంతో రెచ్చిపోయినారు. వాళ్ళందరూ రావణాసురుడి చెప్పుచేతలలో వున్నవారు. అందువల్ల వాళ్ళు సీతాదేవిని బెదిరించడం మొదలు పెట్టినారు. అక్కడ ఆ శింశుపా వృక్షముపై దాగివున్న హనుమంతుడు ఆ రాక్షసాంగనల బెదిరింపులన్నీ విన్నాడు. వారందర్నీ చూడసాగినాడు. భయంతో వణకిపోతున్న సీతాదేవి చుట్టూ రాక్షస స్త్రీలందరూ మూగినారు. వదులుగా వేలాడుతున్న తమతమ పెదవులను నాలుకతో నాక్కుంటూ, పరమక్రుద్ధులై చటుక్కున గొడ్డళ్ళను చేతితో పట్టుకొని ఈ సీత రావణాసురుడికి భార్యగా వుండతగనిది అంటూ భయంకర రాక్షసాంగనలు ఆ సుందరాంగన సీతాదేవిని బెదిరించినారు.

ఓ మైథిలీ! నీ మేలుకోరి చెబుతున్నాము. మా మాట వినుము. మేము చెప్పినట్లు చేయుము. నీవు రాముని వదిలిపెట్టి రావణాసురుని ఆశ్రయించు. అగ్నిహోత్రుడికి స్వాహాదేవివలె, దేవేంద్రుడికి శచీదేవివలె నీవు రావణాసురుడికి దేవిగా వుండు. ఆ దీనుడు రాముడు గతాయువు. వాడితో నీకేమి పని? ఓ సీతా! నీవు మేము చెప్పినట్లు చేయకపోతే, ఇప్పుడే మేమందరం నిన్ను భక్షిస్తాము అన్నారు. ఈ కాలానికి తగినట్లు నీ మేలుకోరి చెపుతున్నాము.

(ఈ కాలానికి తగ్గట్లు మనముండాలి తప్ప, ధర్మాన్ని బట్టి వుంటే అవదు అని వుంటుంది గదా! మనసు రకరకాలుగా సర్ది చెప్పేస్తుంది. ఇదివరకు ఇట్లా వుండేవాళ్ళం, ఇపుడు ఇట్లా వుండలేం కదా అంటుంది. కొన్ని విషయాల్లో సత్యం. దేశాన్ని, కాలాన్ని దాటి కొన్ని ధర్మా లుంటాయి. అవి శాశ్వత ధర్మాలు. అవి ఎపుడూ పాటించవలసినవి.)

అందుచేత ఈ కాలానికి తగ్గట్లుగా వుండు. నీవు మా మాటలు వినకుండా వున్నావు. సముద్రాన్ని దాటి ఇక్కడికెవరూ రాలేరు. అటువంటిచోటుకి రావణాసురుడు నిన్నెత్తుకు వచ్చినాడు. అందరం భయపడి రావణాసురుడి రాజ్యంలో వున్నాము. అతడు నిన్ను మా దగ్గర దాచిపెట్టినాడు. నీవిక్కడ సురక్షితంగా వున్నావు. సాక్షాత్తూ దేవేంద్రుడు వచ్చినా, నిన్నిక్కడ నుంచి తీసుకుపోలేడు. ఓ మైథిలీ! నీకు మంచి చెపుతున్నాము. మా మాటలు విను. ఎందుకు కన్నీళ్ళు పెడతావు? ప్రయోజనం లేని దుఃఖం వదిలిపెట్టి రావణాసురుడితో స్నేహంచేసి సంతోషం అనుభవించు. ఇష్టం వచ్చినట్టు రాక్షసరాజుతో క్రీడించు. ఓ భీరూ! స్త్రీలకు యౌవనం

అనిత్యం. నీకు ఈ సంగతి తెలిసినదే. యౌవనం పోయే లోపలే నీవు సుఖం అనుభవించాలి. ఓ సుందరీ! 7 వేలమంది స్త్రీలు నీ చెప్పుచేతల్లో వుంటారు.

(ఓ స్త్రీకి మిగతా స్త్రీలు చెప్పుచేతల్లో వుంటే చాలా ఆనందంగా వుంటుంది. వాళ్ళకదో complex వుంది. తనకన్నా అధికారం చలాయించేవాళ్లు ఇంకొకరుండటానికి వీల్లేదు. ప్రతివాళ్ళకీ వాళ్ళకో ఏరియా వుంటుంది. Operation area. దాంట్లో ఇద్దరుంటే కష్టం. కొట్టుకుంటారు. మగవాళ్ళైనా అంతే. అందుకనే సుమతీ శతకంలో ఓ రాజు, ఒక గురువు వుంటే ఆ ఊరు సుఖ పడుతుంది అన్నారు. ఒక ఊరిలో ఇద్దరు గురువులుంటే ఊళ్లో వాళ్ళు చచ్చారే. వీడొకటి చెపితే, వాడొకటి చెపుతాడు. ఒకరు చెప్పింది ఇంకొకరు చెప్పకపోవటమే కదా స్పెషాలిటీ. ఒకరు శివ మంత్రం ఇస్తే, ఇంకొకరు రామమంత్రం ఇస్తారు. రామమంత్రం చేసి పెట్టింది శివమంత్రం చేసిపెట్టదా? శివమంత్రం చేసింది రామమంత్రం చేయలేదా? రెండూ ఒకటే అయినప్పటికీ ఆ రామ మంత్రం తీసి శివమంత్రం ఇచ్చేదాకా ఈయనకి తోచదు. శివ మంత్రం తీసి రామమంత్రం ఇచ్చేదాకా ఆయనకు తోచదు. మధ్యలో చచ్చిపోతూంటారు. వీళ్ళకేం పాతివ్రత్యమా, పాడా? ఇక్కడికి అక్కడికీ తిరుగుతూంటారు. ఆ ప్రభువు వచ్చి వాడి శాసనాలు, ఈ ప్రభువు వచ్చి వీడి శాసనాలు ఇస్తే ఏ శాసనాలు అమలుపరచు కోవాలి? అందుకని ఒక ఊరికి క్షేమం ఏమిటయ్యా అంటే ఒక పాలకుడు, ఒక గురువు. అది క్షేమం. ఊరి వాళ్ళకి అదృష్టం బాగుంటే అట్లా వుంటారట. లేకపోతే బహుళత్వం అవుతుంది.

అలాగే స్త్రీలు కానీ, పురుషులు కానీ కలిసి పరిపాలించటం వుండదు. ఒకరి మాట ఒకరు వింటే పాలన నడుస్తుంది. ఎవరి మాట ఎవరు వినాలి అని ప్రశ్న కదా! ఒక స్త్రీ, పదిమంది పురుషులను కూర్చోపెట్టి సేవ చేస్తుందట గానీ, ఒక స్త్రీకి చేయదట. ఎందుకో మండిపోతుందట. సామెత వుంది. స్త్రీకి స్త్రీయే శత్రువు. ఎవరు ఇదంతా చేసింది? శూర్పణఖ.

రావణాసురుడు హాయిగా వున్నాడు. వాడి దారిన వాడు చెండేసుకుంటున్నాడు. వాడిని తీసుకువచ్చి దీంట్లో పెట్టి వాడి నాశనానికి పునాదిరాయి వేసిందెవరు? శూర్పణఖ. ఎందుకు? చుప్పనాతితనం. చుప్పనాతితనం దేనికి? అంత అందమైనవాడు దానికెందుకు  నాకుండాలి గానీ అని. మన అందంతో మనకి సంబంధం లేదు. మనం ఎంత అందమైనవాళ్ళం అని అక్కర్లేదు. అంత అందమైనవాడు దానికా? ఇదీ తన బాధ. దానికుండ కూడదు వాడు. తన కెలాగూ లేడు. తనని కాదన్నాడు. దాన్ని కూడ కాదంటే మనకి బాగుంటుందని దానికి పుట్టింది. అంత పని చేసింది కదా! అదేదో అయిపోయిందేమో లేకపోతే వచ్చిన పని అయ్యేది కాదు.

అలాగే నీకు 7 వేలమంది స్త్రీలు నీ చెప్పుచేతల్లో  వుంటారు అంటే  అదింకా  చాలా విశేషమైన వింత. ఎంతసేపూ మానవుడికి ఒకటే బాధ. వాడు చెప్పిన మాట వినాలి. ఆడది అయితే ఆడ వాళ్ళ మీద supreme అయి వుండాలి. I am the supreme. అట్లాగే మగవాడికి తన రాజ్యానికి తనే ప్రభువుగా వుండాలి.

మనుష్యులు నిర్లిప్తంగా వాళ్ళ ధర్మాన్ని వాళ్ళు నిర్వర్తించే టటువంటి వాళ్ళుంటారు. వాళ్ళ ప్రవర్తన చేతే మారాలి ఎవరైనా. ఎవరు మారతారంటే ఇది మంచి అని తెలిసి మారదాం అనుకున్న వాళ్ళే. మారని వాళ్ళని ఎవరూ ఏం చేయలేరు. ఎవరినీ మార్చేయా లనే కండూతి కూడా లేదు. ప్రపంచంలో అందరినీ మంచిగా మార్చేయాలి. అందరికీ దేవుని భక్తి వుండాలి. అందరూ రామాయణమే చదవాలి. ఇట్లా వుండదు.

7 వేలమంది స్త్రీలు నీ చెప్పుచేతల్లో వుంటారంటే అంత కంటే ఏం కావాలి? మగకైనా, ఆడకైనా అది చాలా పెద్ద స్టేటస్. చెప్పుచేతల్లో అంటే నీ చెప్పులు కూడా చేతుల్లో పెట్టి మోయటం అని చెపుతారు. అందుకని నీకు సేవ చేస్తారు. అతను రాక్షసులకు ప్రభువు. అతన్ని భర్తగా వరించు అని చెపుతారు.)

చండోదరి అనే ఒక రాక్షసాంగన కోపంతో చెలరేగి, శూలం త్రిప్పుతూ రాక్షసాంగనలారా! ఈ హరిణలోలాక్షిని, భయంతో కనులు కదిలిపోతున్న ఈ సీతను రావణాసురుడు ఎత్తుకు వచ్చినవుడే నేను చూచినాను. దీని ప్లీహానికి, గుండెకాయకు ఆధారంగా వుండే తామరమొగ్గ వంటి మాంసఖండాన్ని, దీని పేగులను, మెదడుని ఇపుడే తినివేయవలెను. (అది అప్పట్నుంచి పెట్టుకుంది మైండ్‌లో. రావణుణ్ణి ఒప్పుకుంటే సీతాదేవిని వాళ్ళు తినలేరు. ఒప్పుకోనంటోంది కాబట్టి ఇవన్నీ శుభ్రంగా తినేద్దాం. ఎప్పట్నించో తిందాం అను కుంటున్నాను దీన్ని అంటోంది.)

అంతట ప్రగస అనే రాక్షసి సీత క్రూరురాలు, దీని గొంతు

పిసికేద్దాం. ఎందుకు ఆలస్యం? ఇది చచ్చిపోయిన తర్వాత రాజుతో ఆ మానవాంగన చచ్చిపోయిందని చెపుదాం. అపుడు రాజు మనలని తినేయమంటాడు. సందేహం లేదు అని చెప్పింది.

అజాముఖి అనే రాక్షసాంగన మీరందరూ సీతను కోసివేసి సరిసమానంగా ముక్కలు చేయండి. మనం అందరం పంచుకుని తిందాం. నాకు పోట్లాడటం ఇష్టం లేదు. మంచి మంచి పానీయాలు, లేహ్యాలు తీసుకురండి. శూర్పణఖ అనే రాక్షసి అజాముఖి చెప్పిందే తనకు నచ్చిందని అంది.

క్రూరాత్ములైన ఆ రాక్షసాంగనలు అంత పరుషంగాను, అంత దారుణంగాను అన్ని మాటలు అంటూ వుంటే, ఆ జనకాత్మజ సీతాదేవి ఏడ్చింది. భయంతో కన్నీరు కారుస్తూ గద్గద కంఠముతో 'ఓ రాక్షసాంగనలారా! మానవాంగన రాక్షసుడికి భార్య కాజాలదు. మీ మాటలు నేను వినను. మీరందరూ కోరు కుంటున్నట్లు నన్ను చంపి వేయండి. భక్షించి వేయండి' అని సీతాదేవి చెప్పింది.

దుఃఖముతో బాధపడుతూ ఆమెకు మనస్వాస్థ్యము తప్పి పోయింది. మందలో నుండి తప్పిపోయి మహారణ్యములో తోడేళ్ళ పాలైన లేడివలె ఆమె తన దేహాన్ని ముడుచుకొని వణకటం మొదలు పెట్టింది. హనుమంతుడు దాక్కొని కూర్చున్న ఇరుగుడు చెట్టు సమీపంలో పూలు పూసిన పెద్ద అశోకవృక్షము దగ్గరకు పోయి, దాని కొమ్మను పట్టుకొని నిల్చొని, సీతాదేవి తన పెనిమిటిని గురించి ఆలోచించ సాగింది. కన్నుల వెంట కారుతున్న కన్నీళ్ళతో

తన హీన స్తనాలను తడిపివేస్తూ, రాముని గురించి ధ్యానిస్తూ అంతులేకుండా దుఃఖపడింది. ఆ రాక్షస స్త్రీలకు భయపడి వివర్ణమై, గజగజ వణకుతూ వుంటే, ఆమె పెద్ద పొడవాటి జడ పాకుతున్న పాము వలె కనిపించింది.

ఆమె నిట్టూర్పులు విడుస్తూ, కన్నీరు కారుస్తూ ఓ రామా! ఓ లక్ష్మణా! అయ్యో! కౌసల్యా! సుమిత్రా! అని అరుస్తూ, ఏడుస్తూ 'ఈ లోకంలో స్త్రీలు కానీ, పురుషులు కానీ కాలము రానిదే చనిపోరు' అని తెలిసినవారు చెప్పే లోకోక్తి యథార్థము. నన్ను ఈ క్రూర రాక్షసాంగనలు ఇట్లా కష్టపెడుతున్నారు. రాముని ఎడబాసి ఒక ముహూర్తమైనా జీవించలేని నేను దుఃఖంతో ఇంకా జీవించి యున్నాను. నేను స్వల్ప పుణ్యమే చేసివుంటాను. బరువు ఎక్కువై సముద్ర మధ్యంలో గాలి ఒరవడికి మునిగిపోతున్న నావ వలె నేను ఈ రాక్షసస్త్రీల మధ్య అనాథనై నాశనమై పోతున్నాను. ఈ రాక్షసాంగనల అధీనమై పోయినాను. నా పెనిమిటిని ఎడబాసి నందువల్ల నీళ్ళ ఒరిపిడికి ఏటిగట్టు వలే నేను నానాటికీ క్షీణించి పోతున్నాను. ఆ పద్మపత్రాయతాక్షుని, ఆ సింహ విక్రాంతగామిని, ఆ ప్రియవాదిని, ఆ కృతజ్ఞుడిని, నా నాథుని, రామప్రభువును పుణ్యాత్ములు చూడగలుగుతారు. తీక్షణమైన విషము త్రాగినవారు జీవించడం దుర్లభం. అదేవిధంగా ఆ విజితాత్ముడు రామ ప్రభువు లేకుండా నేను బ్రతికియుండటం ఉత్తది. నేను ఇదివరకు జన్మాంతరంలో ఎటువంటి పాపం చేశానో? ఇప్పుడు ఇటువంటి ఘోరము, దారుణమైన దుఃఖము అనుభవిస్తున్నాను. ఈ మహా దుఃఖముతో జీవించి యుండటం కన్నా చచ్చిపోవటం మంచిదని అనిపిస్తూ

వుంది. ఇటువంటి రాక్షసస్త్రీలు నన్ను కావలి కాస్తూ వున్నారు. నేను ఇక ఆ రామ ప్రభువును చేరడం ఉత్తది. నా చిత్తము వచ్చినట్లు జీవించడానికి కాని, చనిపోవడానికి కానీ అలవి కాకుండా వున్నది. ఛీ ఛీ ఈ పరాధీనత అంటూ ఏడవసాగింది.

ఆ జనకాత్మజ, ఆ బాల సీతాదేవి తల వంచుకొని, ముఖ మంతా కన్నీళ్ళతో తడిసిపోయి ఏడుస్తూ పిచ్చెత్తిన దానివలె, మద్యము త్రాగి మైమరచిపోయిన దానివలె, అలసట పోవడానికి నేలమీద పొర్లాడుతున్న ఆడగుఱ్ఱపు పిల్లవలె నేలమీద పొర్లాడుతూ అయ్యో! నా ప్రభువు ఏమరుపాటు వలన రాలేదు. నేను దుఃఖముతో అరుస్తూ వుంటే, ఈ కామరూపుడు బలవంతంగా ఎత్తుకొని వచ్చాడు. నేనిప్పుడు ఈ రాక్షసాంగనల వశమై పోయాను. వీళ్ళ దారుణమైన బెదిరింపులు భరించలేకుండా వున్నాను. ఆయనను గురించి ఆలోచిస్తూ ఈ మహాదుఃఖం అనుభవించలేను. ఆ మహారథుని, నా నాథుని వదిలిపెట్టి ఈ రాక్షసాంగనల మధ్య నేను జీవించి వుండటం దేనికి? నాకు ధన మెందుకు? ఆభరణా లెందుకు? ఇంత దుఃఖము వచ్చినా నా గుండె బ్రద్దలైపోకుండా వుంది. నా గుండె రాయి అయివుంటుంది. అంతే! ఇది శిథిలమై పోదు. చావదు. నా నాథుడు లేకుండా నేను ఒక్క ముహూర్తమైనా బ్రతికి వుండకూడదు. అటువంటిది నా ప్రాణాలు కాపాడు కుంటున్నాను. పాపపు బ్రతుకు బ్రతుకుతున్నాను. నేను దుష్టురా లను. పతివ్రతను కాను. ఛీ ఛీ. నాలుగు సముద్రాలు ఎల్లలుగా వున్న ఈ భూమికి ఆ మహాత్ముడు ప్రభువు. ప్రియం వదుడు. ఆ నా ప్రియుడు లేకుండా నేను జీవించి వుండటం ఎందుకు?

దుఃఖపడటం ఎందుకు? దేనిమీదనైనా నాకు ఆసక్తి ఎందుకు? అని అనుకొన్నది.

ఎదుటనున్న రాక్షసాంగనలను చూచి, "ఓ రాక్షసాంగనలారా! నేను నా దేహాన్ని వదలి పెడుతున్నాను. మీరు నా దేహాన్ని భక్షిస్తే భక్షించి వేయండి. పెనిమిటిని ఎడబాసిన దుఃఖాన్ని నేను అట్టే కాలము ఓర్చుకోలేను. నేను ఆ దుష్టుని, నిశాచరరాజు రావణా సురుని నా ఎడమకాలితోనైనా తాకను. ఇక వాడిని కామించట మేమిటి? వాడి పాపిష్ఠి స్వభావముతో నన్ను వాడు ప్రార్థించాడు. నేను వాడిని తిరస్కరించాను. అది వాడికి తెలియదు. వాడు, వాడి కులము నాశనమై పోతుందన్న సంగతి వాడికి తెలియడం లేదు. ఓ రాక్షసాంగనలారా! మీరు నన్ను నరికి వేయండి. ముక్కలు ముక్కలు చేసి, మండే మంటలలో కాల్చి వేయండి. నేను రావణుని అపేక్షించను. మీరెంతసేపు అరచినా ప్రయోజనము లేదు. ఆ రామప్రభువు సమస్త సద్గుణ వంతుడని ప్రసిద్ధి కెక్కినాడు. ప్రాజ్ఞుడు, కృతజ్ఞుడు, దయామయుడు, సదాచార సంపన్నుడు నా దౌర్భాగ్యం వల్ల నన్ను దయతలచకుండా వున్నాడని అనుకుంటున్నాను.

ఆ మహా పరాక్రమవంతుడు జనస్థానంలో ఒక్కగా నొక్కడు పధ్నాలుగు వేలమంది రాక్షసులను సంహారం చేసినాడు. ఆ రామ ప్రభువు నన్నెందుకు రక్షించడు? ఈ రావణాసురుడు నన్ను నిరోధిస్తున్నాడు. వీడు నా భర్త ఎదుట అల్పవీర్యుడు. నా భర్త సర్వసమర్థుడు. పోరాటంలో వీడిని సంహారం చేసివేస్తాడు. దండ కారణ్యంలో నా నాథుడు విరాధుడంతటి వాడిని వధించి వేసినాడు. ఆ మహానుభావుడు నన్నెందుకు రక్షించడు? ఈ లంకాపట్టణం

సముద్రం నడుమ నున్నది. ఇక్కడికి రావటం అలవి కాదని అనుకుంటున్నారేమో! ఆ రామ ప్రభువు బాణాలకు ఏదీ అడ్డం కాదు. ఆ పరాక్రమవంతుడు రామప్రభువు తన ప్రియ భార్యను రావణాసురుడు ఎత్తుకొనిపోతే, ఎందుకు ఆమెను రక్షించకుండా వున్నాడు? కారణమేమై వుంటుంది? ఇక్కడున్నట్లు ఆయన ఎరుగ డేమో? లక్ష్మణుడు కూడా ఊహించలేదేమో? ఎరిగి యున్నట్లయితే ఈ రావణాసురుని నిందించకుండాను, చంపి వేయకుండాను ఊరికే వుండడు. నన్ను రావణాసురుడు ఎత్తుకొని పోయినాడని ఆ రామప్రభువుతో చెప్పటానికి గద్దలరాజు ఆ జటాయువు అయినా లేడు. పోరాటంలో రావణాసురుడు ఆ జటాయువును, ముసలివాడిని చంపివేసినాడు. జటాయువు అంతటి ముసలివాడై నప్పటికీ రావణాసురుడితో నిలబడి ఘోరంగా పోరాడినాడు. అతను మహా దొడ్డవాడు.

నేనిక్కడ వున్నట్లు ఆ రామప్రభువుకు తెలిసినట్లైతే, కృద్ధుడై పోయి ఈ లోకంలో ఒక్క రాక్షసుడినైనా బ్రతకనిచ్చేవాడు కాదు. ఈ లంకాపట్టణాన్ని ఊదివేసేవాడు. మహోదధిని ఎండగొట్టేవాడు. రావణాసురుని నామరూపాలు లేకుండా చేసేవాడు. మొగుళ్ళు పోయిన రాక్షసాంగనలు ఇంటింటా యిప్పుడు నావలె ఏడుస్తూ వుండేవారు. రామలక్ష్మణులు లంకాపట్టణమంతా వెదకి రాక్షసు లందరినీ నాశనం చేసి వుండేవారు. ఆ అన్నదమ్ముల కంటబడ్డ శత్రువు ఒక్క ముహూర్తం సేపైనా బ్రతకటం అరుదు. త్వరలోనే ఈ లంకాపట్టణ వీధులు చితుల పొగలతోను, గద్దలతోను స్మశానం వలె అయిపోతుంది. అచిరకాలంలోనే నా మనోరథం ఈడేరు

తుంది. సర్వరాక్షసులు నాశనమైపోతారు. మీ దుర్మార్గ ప్రవర్తనమే తెలియజేస్తోంది. అంతే కాదు ఇప్పుడిక్కడ అనేక అశుభ నిమిత్తాలు కనబడుతున్నవి. తొందరలోనే ఈ లంకాపట్టణం సర్వనాశనం అయిపోతుంది. నీచుడు, పాపాత్ముడు అయిన రావణాసురుడు చచ్చిపోగానే ఇంతవరకు ఎదరించ నలవిగాని ఈ లంకాపట్టణం పెనిమిటి పోయిన ఆడుదాని మాదిరిగా అయిపోతుంది. రాజు చచ్చి, రాక్షసులందరూ నాశనమైపోయిన తరువాత ముండమోపు లయ్యే రాక్షసాంగనలతో పాటు ఈ లంకాపట్టణం కూడా ముండ మోస్తుంది. ఏ మంగళ సౌష్టవమూ వుండదు. అచిరకాలంలోనే ఇక్కడ ఇంటింటా రాక్షసాంగనలు దుఃఖార్తులైపోతారు. వాళ్ళ రోదన ధ్వనులు మిన్నంటుతాయి.

ఈ రావణాసురుడు నన్ను దొంగిలించుకొని వచ్చి ఈ లంకాపట్టణంలో వుంచినాడని నా నాథుడికి, ఆ రక్తాంతలోచను డికి, రామప్రభువుకు తెలిసిన ఉత్తరక్షణాన ఈ లంకాపట్టణము రామ బాణాలతో దగ్ధమైపోతుంది. చీకట్లు కమ్ముకుంటాయి. మేటి రాక్షసు లందరూ సంహారమైపోతారు. పట్టణప్రభలు మాసి పోతాయి. ఆ క్రూరుడు, ఆ నీచుడు రావణాసురుడు నాకు పెట్టిన గడువుకాలం అయిపో వచ్చింది. ఈ రాక్షసులు ఎటువంటి పాపకార్యానికైనా ఒడిగట్టుతారు. ఇది ధర్మము, ఇది అధర్మమని కానీ, ఇది కార్యము, ఇది అకార్యమని కానీ వీరికి విచక్షణాజ్ఞానము లేదు. ఇప్పుడు మహోత్పాతము సంభవిస్తుంది. ఈ రాక్షసులు మాంసాశనులు. రావణాసురుడు తన ప్రాతఃకాల భోజనానికి నన్ను తప్పకుండా చంపివేస్తాడు. ఆ నా ప్రభువును, ఆ

ప్రియదర్శనుని ఎడబాసిన నేను ఇట్లా దుఃఖపడటం తప్ప ఏమి చేయగలను? నా పెనిమిటిని వదలి నేను ఇట్లా వుండడం కన్నా, ఇక్కడెవడైనా విషము ఇచ్చేవాడు వుంటే, అది త్రాగి చచ్చిపోతే, వెంటనే యమధర్మరాజు దర్శనమన్నా అవుతుంది.

ఆ లక్ష్మణుడికి కానీ, నా నాథునికి కానీ నేను బ్రతికి యున్నట్లు తెలిసియుండదు. నేను బ్రతికి యున్నానని తెలిసినట్లైతే, నాకోసం ఆ అన్నదమ్ములు ఈ భూమినంతా గాలించి వెదికేవారు. అట్లా చేయలేదు కనుక, నేను జీవించియున్న సంగతి వారికి తెలియదు. ఆ పరాక్రమశాలి రామప్రభువు నేను లేనన్న దుఃఖముతో ఈ భూమిమీద తన దేహము వదలిపెట్టి, దేవలోకము పోయి వుంటాడు. ఆ రాజీవలోచనుని, నా నాథుని రామ ప్రభువును చూచే గంధర్వులు, దేవతలు, సిద్ధులు, పరమ ఋషులు ధన్యులు. అట్లా అయివుండక పోయినట్లైతే ఆ ధర్మకాముడికి, ఆ ధీమంతుడికి, ఆ రాజర్షికి, పరమాత్మ స్వరూపుడైన రాముడికి భార్యనైన నాతో ఏ ప్రయోజనమూ లేదేమో? ఇంతకూ ఎదుట కనబడేవారి మీదనే స్నేహం వుంటుంది. కంటికి కనబడని వారిమీద స్నేహం వుండదు. కృతఘ్నులు మాత్రమే పూర్వ స్నేహాన్ని విస్మరిస్తారు. రామప్రభువు అటువంటివాడు కాడు. స్నేహాన్ని మరచిపోడు. అయితే నేను ఆడుదానిని. రామప్రభువును ఎడబాసి అలసి పోతున్నాను. ఏమైనా పాపాలు చేసినానేమో! లేక నా దౌర్భాగ్యమేమో! ఆ మహాత్ముని, ఆ దోష రహితుని, ఆ శూరుని, ఆ శత్రు సంహారకుని, రామ ప్రభువును వదలి జీవించియుండటం కన్నా, చచ్చిపోవడం మేలు.

ఒకవేళ ఆ పురుషోత్తములు, ఆ అన్నదమ్ములు రామ లక్ష్మణులు కందమూలాలు తింటూ, శస్త్రాస్త్ర సన్యాసము చేసి మహారణ్యాలలో తిరుగుతున్నారేమో? అట్లా కాకపోతే దురాత్ముడు రావణాసురుడు కపటోపాయంతో ఆ అన్నదమ్ములను చంపివేసినాడేమో? కాలమిట్లా గడచిపోతున్నది. ఎన్నివిధాలుగా ఆలోచించినా చచ్చిపోవడమే మంచిదని అనిపిస్తున్నది. అయితే ఇంత దుఃఖంతో బాధపడుతూ, ఇంత దురవస్థలో వున్న నాకు చావు రాకుండా వున్నది. మహాత్ములు, మహాభాగులు, పాపరహితులు, జితేంద్రియులు అయిన మహామునులకు ఇది ప్రియము, ఇది అప్రియము అనే భేదం వుండదు. వారికి సుఖ దుఃఖాలు సరిసమానము. దేహాభిమానము వలన ప్రియాప్రియాలు, సుఖదుఃఖాలు కలుగుతున్నవి. అందువల్ల దేహాభిమానం వదలిన మహా మునులు ధన్యులు. వారే మహాత్ములు. వారికి నమస్కారము చేస్తున్నాను. నేను ఆ ప్రియార్హుని, ఆ విజితాత్ముని ఎడబాసి రావణాసురుని చేతికి చిక్కాను. ఇక నేను బ్రతకను. నా ప్రాణం వదలుతాను" అని సీతాదేవి చెప్పింది.

సీతాదేవి చెప్పిన మాటలకు ఆ భయంకర రాక్షసాంగనలకు ఒళ్ళెరుగని కోపం వచ్చింది. వారిలో కొంతమంది ఆ మహాబలవంతుడు రావణాసురుడికి ఈ విషయం విన్నవించటానికి అక్కడి నుంచి వెళ్ళిపోయారు. ఆ ఘోరదర్శనులలో కొంతమంది సీతాదేవి దగ్గరకు చేరి అదివరకటి మాదిరిగా మళ్ళీ అతి పౌరుషంగా 'ఓ దుష్టురాలా! ఓ పాపిష్ఠురాలా! ఓ సీతా! నిన్నిప్పుడే, ఈరోజే

చీల్చివేసి, నీ మాంసాన్ని మా చిత్తము వచ్చినట్లు తినేస్తాము' అని బెదిరించినారు.

అంతవరకు పడుకొని నిద్రపోతూవున్న ముసలి రాక్షసి త్రిజట లేచి, ఆ రాక్షసాంగన లందరినీ చూచి, 'ఓ రాక్షసాంగన లారా! నన్ను తినండి. జనకరాజసుతను, దశరథ మహారాజు కోడలిని, లోకమంతా ప్రేమించే ఈ సీతాదేవిని భక్షించవద్దు. రాక్షస నాశనము, ఈ సీతాదేవి పెనిమిటికి అభ్యుదయము అయ్యే కల నాకు వచ్చింది. అది భయంకరమైన కల. నా ఒళ్ళు గగుర్పొడిచింది' అని చెప్పింది.

ఆ త్రిజట చెప్పింది విని రాక్షాసాంగనలు భయపడి పోయినారు. ఏమి కల వచ్చింది? చెప్పు చెప్పు అన్నారు. ఆ త్రిజట ఈ విధంగా చెప్పటం మొదలు పెట్టింది. "ఏనుగు దంతాలతో చేసిన దివ్యమైన శిబికను ఒకదానిని ఒక వెయ్యి హంసలు ఆకాశ మార్గాన మోసుకొని వచ్చినవి. రాముడు తెల్లటి పూలదండలు, తెల్లటి వస్త్రాలు ధరించి లక్ష్మణునితో కూడా ఆ పల్లకిలో కూర్చుని వచ్చినాడు. సీతాదేవి తెల్లటిచీర కట్టుకొని సముద్రం మధ్యన శ్వేతపర్వతము మీద కూర్చుని వున్నది. సూర్యుడితో వెలుతురు వలె, రాముడితో సీతాదేవి కనిపించింది. నాలుగు దంతాలతో పెద్ద పర్వతమంత ఏనుగును రాముడు లక్ష్మణుడితో ఎక్కడం నేను చూచాను. దేహకాంతులతో తేజరిల్లుతూ వున్న ఆ అన్నదమ్ములు సీతాదేవి దగ్గరకు పోయినారు. శ్వేత పర్వత శిఖర సమీపాన ఆకాశంలో రాముడెక్కిన ఏనుగును సీతాదేవి ఎక్కింది. అంతట ఆ కమలలోచన పెనిమిటి ఒడిలో నుంచి లేచి సూర్య చంద్రులను

పట్టుకున్నది. అది నేను చూచాను. ఆ అన్నదమ్ములు, ఆ విశాలాక్షి కూర్చున్న ఆ ఏనుగు లంకాపట్టణం మీద ఆకాశంలో కనిపించింది. అంతట తెల్లటి ఎనిమిది ఎద్దులు కట్టిన రథం మీద రాముడు సీతాదేవితో ఇక్కడికి వచ్చినాడు. ఆ పురుషోత్తముడు రాముడు సీతాదేవితోను, తమ్ముడు లక్ష్మణుడి తోను సూర్యసమానమైన దివ్య పుష్పక విమానమెక్కి తూర్పు దిక్కుగా పోయినాడు. మహావిష్ణువు వంటి ఆ పరమ పరాక్రమవంతుని రాముని సీతాదేవితో, లక్ష్మణుడితో నేనట్లా కలలో చూచినాను. స్వర్గాన్ని పాపాత్ములు సంపాదించలేరు. అదేవిధంగా ఆ మహాతేజోవంతుని రాముని సురాసురులు గాని, రాక్షసులు గాని, మరెవరైనా గానీ జయించ లేరు.

రావణాసురుడు గన్నేరు పూలదండలు వేసుకొని, ఎర్రటి వస్త్రములను కట్టుకొని, దేహమంతా నూనెతో తడిసిపోయి, తప్పత్రాగి, కైపెక్కి నేలమీద పడిపోయినాడు. అంతేకాదు రావణా సురుడు పుష్పక విమానము నుంచి నేలకూలినాడు. అప్పుడతని నెత్తిమీద వెంట్రుకలు లేవు. నల్లటిగుడ్డ కట్టుకున్నాడు. ఒక ఆడుది అతనిని లాక్కొనిపోతూ వున్నది. ఆ రావణాసురుడు ఎర్రటి పూల దండలు వేసుకొని, రక్తచందనము ఒంటికి పూసుకొని, నూనె త్రాగుతూ, నవ్వుతూ నాట్యమాడుతూ, పిచ్చెక్కిన వాడివలె వికృత చేష్టలు చేస్తూ, గాడిదలు కట్టిన రథము మీద ఎక్కి పోవడము చూచినాను. అతడు ఆ రథము దిగి, ఒక గాడిదనెక్కి అమిత వేగంగా దక్షిణదిక్కుకు పోతున్నాడు. అట్లా పోతూ పోతూ భయం వేసి తెలివితప్పి, ఆ గాడిద మీద నుంచి అతడు తలక్రిందులుగా

నేలకూలాడు. వెంటనే లేచి అడుగులు తడబడుతూ భయము వలన, కైపు వలన దేహము స్వాధీనము తప్పిపోయింది. కట్టుకొన్న గుడ్డలు ఊడిపోయినవి. పిచ్చెక్కిన వాడివలె పిచ్చిమాటలు మాట్లాడుతూ దుర్గంధంతో దుస్సహముగాను, భయంకరంగాను, చీకటిగాను, నరకంగాను వున్న అమేధ్యపు బురదగుంటలో పడి మునిగిపోయినాడు. ఎర్రచీర కట్టుకొని, దేహమంతా బురద పూసుకొని కారునలుపు ఆడుది ఒకతె రావణాసురుడి మెడకు తాడుకట్టి, దక్షిణదిక్కుకు లాగుకొనిపోతూ వున్నది. అదే విధముగా కుంభకర్ణుడు కూడా కనిపించినాడు. రావణాసురుడి కొడుకు లందరూ నూనెతో తడిసిపోయినారు. రావణాసురుడు పందిని, ఇంద్రజిత్తు మొసలిని, కుంభకర్ణుడు ఒంటెను ఎక్కి దక్షిణదిక్కుగా పోయినారు.

తెల్లటి పూలదండలతో, తెల్లటి వస్త్రాలు, తెల్లటి గంధము మైపూతతోను విభీషణుడు ఒక్కడు కనిపించినాడు. అతనికి శ్వేతచ్ఛత్రము పట్టినారు. శంఖాలు పూరించినారు. దుందుభులు మ్రోగించినారు. నృత్త గీత వాద్య ధ్వనులు చెలరేగినవి. మేఘ గంభీర ధ్వనులు చేస్తూ దివ్యమైన నాలుగు దంతాల ఏనుగు ఒకటి సర్వాలంకారముతో వచ్చింది. విభీషణుడు తన నలుగురు మంత్రులతో కూడ ఆ ఏనుగుని ఎక్కి ఆకాశములో తిరగడం మొదలుపెట్టినాడు.

“రాక్షసులందరూ ఎర్రబట్టలు కట్టుకొని, ఎర్రటి పూలదండలు వేసుకొని, వాద్యాలు వాయిస్తూ, పాటలు పాడుతూ, నూనె త్రాగుతూ వున్నారు. రమణీయమైన ఈ లంకాపట్టణ బహిద్వారాలు,

గోపురాలు కూలిపోయి గుఱ్ఱాలతోను, రథాలతోను, ఏనుగులతోను సముద్రంలో మునిగిపోయింది. రావణాసురుడు ఏలుతూ వున్న ఈ లంకాపట్టణానికి రామదూతగా ఒక వానరుడు వచ్చినాడు. వాడు మహా బలవంతుడు. ఆ వానరుడు ఈ లంకాపట్టణాన్ని దహించి వేయడం నేను చూచినాను. రాక్షస స్త్రీలు నూనె త్రాగి నాట్య మాడుతూ, వికటంగా నవ్వుతూ, పెద్ద పెద్ద కేకలు వేస్తూ భస్మరాసులైపోయిన ఈ లంకాపట్టణంలో తిరుగసాగినారు. కుంభ కర్ణుడు మొదలగు రాక్షసవీరులు ఎర్రబట్టలు కట్టుకొని, పేడ మడుగులో మునిగిపోయినారు.

ఓ రాక్షస స్త్రీలారా! మీరందరూ ఇక్కడి నుండి తొలగి పోవలెను. లేకపోతే నాశనమైపోతారు. రాముడు ఈ సీతాదేవి దగ్గరకు వచ్చి తీరుతాడు. అతడు కుపితుడైపోయి రాక్షసులతో పాటు మిమ్మల్నీ చంపివేస్తాడు. ఈ సీతాదేవి లోక పూజ్యురాలు. ఆ రాముడి ప్రియురాలు. ఈమె అతనిని అనుసరించి వనవాసము చేయడానికి వచ్చింది. మీరు ఈమెను బెదిరించి బాధపెట్టారని ఆ రాముడు తెలుసుకొని మిమ్మల్నందరినీ చంపివేస్తాడు. కనుక మీరు ఇక క్రూరవాక్యాలు కట్టిపెట్టవలెను. ఈ సీతాదేవితో మంచి మాటలు చెప్పండి. ఈ సీతాదేవిని బ్రతిమాలుకుందాము. ఇదే తరణోపాయ మని నాకు తోస్తూ వున్నది. ఇప్పుడు సీతాదేవి అనుభవిస్తున్న దుఃఖ మంతా తీరిపోతుంది. ఈమె పెనిమిటి తప్పకుండా వస్తాడు. ఈమె ఉత్తమోత్తమమైన సంతోషం అనుభవిస్తుంది.

ఓ రాక్షసాంగనలారా! ఈమె ఏమనుకుంటుందో అని మీరు అనుకోవడం వల్ల లాభం లేదు. ఈమెను ప్రార్థించండి.

రాముడి నుంచి రాక్షసులకు ఘోరమైన ఆపదలు రాబోతున్నవి. ఓ స్త్రీ లారా! ఈ జనక పుత్రికకు మొక్కండి. ఈమెను ప్రసన్నురాలిగా చేసుకోండి. మీరు మహత్తరమైన ఆపదలపాలు కాకుండా మిమ్ము లను కాపాడే సామర్థ్యము ఈమెకు మాత్రమే వుంది. నా కల యథార్థ మవుతుంది. ఈ విశాలాక్షి అవయవాలేవీ విరూపము కాలేదు. ఇప్పుడు ఈమెలో దుఃఖలక్షణాలు కొంచెమైనా కనబడటం లేదు. ఈమె దేహకాంతి మాత్రము కాస్త మాసిపోయింది. ఈమె దివ్యభోగాలు అనుభవించ వలసినదిగానీ, ఇట్లా దుఃఖాలపాలు కావలసింది కాదు. ఈమె ఇప్పుడు దుఃఖము అనుభవిస్తూ వుంది. మన రాక్షసరాజు వినాశము, రాముడి విజయము, వైదేహీదేవి అభీష్టసిద్ధి మనము త్వరలో చూస్తాము. ఈ సీతాదేవికి సంతోష సమయము త్వరలోనే సంప్రాప్తము కానున్నది. అది తెలియ చెప్పటానికే నాకు ఈ కల వచ్చింది. అదిగో ఈ పద్మపత్రాయతాక్షి ఎడమకన్ను అదురుతూ వుంది. అంతేకాదు ఈ వైదేహి ఎడమ భుజము ఏ కారణమూ లేకుండా గగుర్పొడిచినట్లు వణకుతూ వుంది. అందువల్ల రాముడు త్వరలోనే వస్తాడని తెలుస్తూ వుంది. అదిగో పింగళ పక్షి చెట్టుకొమ్మమీద గుడ్లప్పగించి, పదే పదే మహా మధురముగా కూస్తూ వున్నది. అంటే రానున్న రాముడికి స్వాగతం చెబుతూ మాటిమాటికీ సంతోషాన్ని వెల్లడిస్తూ వున్నది. కాబట్టి రాముడు త్వరలోనే వస్తాడు" అని త్రిజట చెప్పింది.

ఆ రాక్షస ప్రభువు రావణాసురుడు వెళ్ళిపోతూ చెప్పిన మాటలకు దుఃఖంతో బాధపడుతూ, అడవి మధ్యమున సింహము ఎదురైన ఆడ ఏనుగు వలె సీతాదేవి భయపడిపోయింది. చుట్టూ

మూగిన రాక్షసాంగనల మాటలకు, రావణాసురుని బెదిరింపులకు ఆ భీరువు, విజనారణ్యమున వదిలిపెట్టి పోయిన చిన్న కన్నె మాదిరిగా ఏడ్చింది. అంతట ఆమె తనలో తానే, నన్నిట్లా అవమానిస్తూ వుంటే, క్షణకాలమైనా బ్రతికి వుండకూడదు. అయ్యో! నాకు చావు రాకుండా బ్రతికి వున్నానే! 'కాలము రానిదే చావురాదు' అని పెద్దలు చెప్పిన మాటలు నిజము కాబోలు! నా సంతోషము అయిపోయింది. నా హృదయము దుఃఖముతో కొట్టుకులాడుతూ వుంది. వజ్రాయుధంతో కొట్టిన పర్వత శిఖరము వలె ముక్కలు ముక్కలై పోకుండా, నా గుండె స్థిరంగా వున్నది. చూడటానికి రోతవేస్తే, రావణాసురుడు నన్నెట్లాగూ చంపివేస్తాడు. అందువల్ల నా అంతట నేనే చచ్చిపోతే దోషమేమీ లేదు. యథార్థంగా దోషము లేదు. బ్రతికి వుండవలెనని అనుకొనేటట్లైతే, నా మనసు రావణాసురుడికి ఇవ్వవలెను. ద్విజుడు అద్విజుడికి మంత్రమెన్నడూ చెప్పడు. నేనూ అదేవిధంగా నా మనసు వాడికి ఎంతమాత్రమూ ఇవ్వను. రావణాసురుడు నాకు పెట్టిన గడువు కాలం లోపల ఆ లోకనాథుడు రామప్రభువు రాకపోయినట్లైతే, గర్భములో చనిపోయిన శిశువును తీసిన శస్త్రకుడివలె నా అవయవాలను రాక్షసులు తోడేస్తారు. ఇంతకూ రెండు మాసాలు గడిచిపోయాయి. ఎంతోకాలము దుఃఖం అనుభవిస్తున్నప్పటికీ రాజాపరాధం చేసినందువల్ల, ప్రాతఃకాలాన చంపివేయడానికి కట్టి వేసిన దొంగ అనుభవించే దుఃఖము నేను అనుభవించవలసి వచ్చిందే!

అయ్యో ఓ రామా! లక్ష్మణా! ఓ సుమిత్రా! రామప్రభువును

కన్న ఓ కౌసల్యా! నేను మందభాగ్యురాలిని. ఉప్పెనగాలికి మహా సముద్రంలోని నౌకవలె నేనిప్పుడు కొట్టుకులాడుతున్నాను. పిడుగు పాటుకు రెండు ఉద్ధండమైన సింహాలు చచ్చిపోయినట్లు, జింక రూపము ధరించిన ఆ రాక్షసుడి చేతిలో నా వలన ఆ రాజ పుత్రులు రామలక్ష్మణులు చనిపోయినారేమో? అంతే అయివుంటుంది. యముడే అప్పుడు జింక రూపము ధరించి నన్ను వ్యామోహ పెట్టి వుంటాడు. అవును అంతే! నా పెనిమిటిని పొమ్మన్నాను. మూఢురాలను. ఆయన తమ్ముడు లక్ష్మణుని కూడా వుండనివ్వ కుండా పంపించి వేశాను.

ఓ రామా! ఓ సత్యవ్రతా! ఓ దీర్ఘబాహు! నీవు నిండు చంద్రునివంటి వాడవు. ప్రాణికోటికి మేలు చేసేవాడవు. అందరినీ సంతోషపెట్టే వాడవు. నేనిప్పుడు రాక్షసుల చేతిలో చావ బోతున్నట్లు నీకు తెలియదే? ఓ ప్రభూ! మీరు తప్ప నాకు మరొక దైవము లేకపోవడం, నా ఈ ఓర్పు, నేనిట్లా నేలమీద పడి వుండటము, ధర్మము తప్పకుండా వుండటము, నా పాతివ్రత్యము కృతఘ్నునికి చేసిన ఉపకారమువలె ఫలమేనా?

ఓ నాథా! మిమ్ములను ఎడబాసినందువల్ల నేను కృశించి పోయినాను. నా దేహము వివర్ణమై పోయింది. మిమ్ములను చేరగలనన్న ఆశ ఇప్పుడు నిరాశ అయింది. ఇంతకాలమూ నేను పాటించిన ధర్మము వ్యర్థమేనా? నా పాతివ్రత్యము నిరర్థకమేనా? ఓ స్వామీ! మీరు పితృ ఆజ్ఞా పరిపాలనము నియమబద్ధంగా పూర్తి చేస్తారు. చరిత్రవ్రతు లౌతారు. అరణ్యము నుండి అయోధ్యకు పోతారు. మీ కష్టాలు గట్టెక్కుతాయి. మీరు నిర్భయంగా విశాల

నేత్రలైన ఎంతోమంది స్త్రీలతో హాయిగా క్రీడిస్తూ వుంటారు. ఓ ప్రభూ! మీ మీద నాకున్న అనురాగం వలన నా మనసంతా మీ మీద లగ్నం చేయడము, మీ కోసం తపస్సు చేయడము నా నాశనానికి కారణములైనాయి. నా తపస్సంతా వ్యర్థమై పోయింది. ఛీ ఛీ దురదృష్టపు బ్రతుకు బ్రతికి యుండటం ఎందుకు? ప్రాణము వదలిపెట్టవలెను. విషము తినికానీ, ఆయుధంతో గానీ తొందరగా ఈ ప్రాణము వదలవలెను. ఈ రావణాసురుని పట్టణంలో నాకు విషముగాని, ఆయుధముగాని ఇచ్చే దాత ఎవడు? ఎవడూ లేడు అనుకున్నది.

ఈ విధంగా పరిపరివిధాలుగా ఆలోచిస్తూ, ఆ సీతాదేవి సర్వాత్మనా రాముని తలచుకొని ఏడ్చింది. ఆమె నోరు ఎండి పోయింది. వణకుతూ, అట్లాగే ఆలోచిస్తూ, పూలు విరగబూసిన ఇరుగుడు చెట్టు దగ్గరకు పోయింది. ఆ చెట్టు మొదట్లో నిలుచున్నది. శోకముతో తపించిపోతూ అనేకవిధాల ఆలోచించింది. తన జడను గొంతుకు ఉరిపోసుకొని వెంటనే చచ్చిపోవాలని అనుకున్నది. ఆ మృదుగాత్రి అట్లా నిశ్చయించుకొని ఆ ఇరుగుడు చెట్టుకొమ్మ పట్టుకొని నిలుచున్నది. ఆ శుభాంగి అప్పుడు రాముని గురించి, లక్ష్మణుని గురించి, తన వంశాన్ని గురించి ఆలోచించ సాగింది. అప్పుడామెకు శుభ నిమిత్తాలు అనేకములు తోచినవి. శోక నిమిత్తాలు కానీ, ఆ శుభసూచకాలు లోకప్రసిద్ధమైనవి. అది వరకు అటువంటి శుభనిమిత్తాలు చూచినప్పుడు అవన్నీ సిద్ధించి నవి. ఆమెకు ధైర్యం వచ్చింది.

శ్రీమంతుడైన వాడిని సేవకులు కమ్ముకున్నట్లు, సంతోషము

ఏ మాత్రమూ లేకుండా పరమదైన్యంతో శింశుపా వృక్షము దగ్గరకు పోయిన ఆ శుభాంగిని సీతాదేవిని శుభ నిమిత్తాలు కమ్ము కున్నాయి. నల్లటి కనుపాపలతో, విశాలమైన తెల్లటి కనుగుడ్లతో, ఎఱ్ఱటి కనుకొలకులతో, వంకరలు తిరిగిన కనురెప్పలతో వున్న ఆ శుభకేశిని శుభనేత్రాలలో వామ నేత్రం చేపదెబ్బతిన్న కమలంవలె అదిరింది. నాణ్యమైన నల్లటి ఆడుగంధము పూసుకున్న ఆమె గుండ్రటి వామభుజము, అదివరకు రాముడు పట్టుకొన్న ఆమె వామభుజము గబగబా అదిరింది. బలిసి, ఒక దానితో ఒకటి ఒరుసుకు పోయిన ఏనుగు తొండాలవంటి ఆమె అందమైన రెండు తొడలలోను, ఎడమ తొడ రాముడు ఎదుటికి వచ్చినట్లుగా వణకింది. తెల్లటి కనులతో, గుండ్రంగా కొనలుతేరిన పలు వరుసతో, పొంకమైన అవయవాలతో వున్న శుభాంగి కట్టుకొన్న బంగారురంగు చీర వళ్ళు ఇచ్చింది.

ఇదివరకు ఇటువంటి నిమిత్తాలు చక్కగా భరించడము ఆమె ఎరుగును. ఈ నిమిత్తాలను, ఇటువంటివే ఇతర నిమిత్తాలను ఆమె గమనించింది. ఎండకు, గాలికి ఎండిపోయిన విత్తనము వానకు మొలకెత్తినట్లు, సీతాదేవికి ఆశ మొలకెత్తింది. దొండ పండు వంటి క్రింది పెదవులతోను, చక్కని కనుబొమ్మలతోను, అందమైన కనులతోను, తెల్లటి పలువరుసతోను శోభాయమానమైన సీతాదేవి ముఖబింబము అప్పుడు రాహువు నోటిలో నుండి వెలువడిన చంద్రబింబము వలె భాసించింది. దుఃఖము పోయి, కలవరమణిగి, తాపము శమించి, సంతోషము వచ్చిన సీతాదేవి ముఖబింబ మప్పుడు శుక్లపక్ష చంద్రునివలె శోభించింది.

శింశుపా వృక్షము మీద దాగివున్న హనుమంతుడు, రాక్షసాంగనలు సీతాదేవిని బెదిరించడం చూచినాడు. త్రిజట తన స్వప్న వృత్తాంతము చెప్పడం కూడా విన్నాడు. అశోకవనంలో వున్న ఆ సీతాదేవి, నందనోద్యానంలోని దేవతాస్త్రీవలె కనిపించింది. హనుమంతుడు ఆమెను చూచి అనేకవిధాల ఆలోచించసాగినాడు.

ఈ సీతాదేవిని వెదకడానికి లక్షలకొద్దీ వానరులు అన్ని దిక్కులకూ బయలుదేరినారు. నా పూర్వపుణ్యము వల్ల ఈ సీతాదేవి నాకిక్కడ కనిపించింది. గూఢచారివలె ఎవరికీ తెలియకుండా ఇక్కడికి వచ్చాను. శత్రుబలము తెలిసిపోయింది. రాక్షసుల తారతమ్యాలు తెలిసినవి. ఈ లంకాపట్టణమంతా చూడటమూ అయ్యింది. రావణాసురుని ప్రభావము తెలుసుకున్నాను. ఇంతింతని పొగడనలవికాని ఆ మహానుభావుని, ఆ సర్వభూత దయాపరుని, తన పెనిమిటిని, రాముని చూడవలెనని ఈ సీతాదేవి ఉవ్విళ్ళూరుతున్నది. ఈమె నిప్పుడు ఓదార్చడం ఎంతైనా మంచిది. ఈ పూర్ణచంద్ర నిభానన ఇదివరకెన్నడూ ఏ దుఃఖమూ ఎరుగదు. ఇప్పుడీమె దుఃఖపడవలసి వచ్చింది. అంతేకాదు ఈమె తన దుఃఖానికి అంతము తెలియకుండా బాధపడుతున్నది. ఈమె నిప్పుడు ఊరడించవలెను.

ఇట్లా దుఃఖముతో తపించిపోతూ వున్న ఈమెను ఓదార్చకుండా వుండటం తప్పు. నేనీమెతో మాట్లాడకుండా నాదారిన నేను పోయినట్లైతే, ఈ యశస్విని సీతాదేవి తనను కాపాడేవారు ఎవరూ లేరనుకొని ప్రాణం వదులుతుంది. నేనీమెతో మాట్లాడి పోయినట్లైతే, ఆ సీతాదర్శన లాలసుని, రాముని ఓదార్చడానికి

వీలవుతుంది. అయితే ఈ రాక్షసాంగనల ఎదుట ఈమెతో మాట్లాడకూడదు. ఇక నేనేమి చేయవలెను? కర్తవ్య మేమిటి? చిక్కే వచ్చింది. ఈ రాత్రి గడిచిపోయే లోపుననే నేనీమెను ఓదార్చ వలెను. లేకపోయినట్లైతే ఈమె ప్రాణం వదులుతుంది, సందేహం లేదు.

నేను ఈ సుమధ్యమతో మాట్లాడకుండా ఇక్కడి నుంచి పోయేట్లయితే సీతాదేవి తనతో ఏమి చెప్పమన్నది? అని రాముడు నన్నడిగితే, నేనేం బదులు చెప్పగలను? ఇక్కడి నుంచి వెంటనే వెళ్ళిపోయి, నేను సీతాదేవితో ఏమీ మాట్లాడలేదు. అందువల్ల ఆమె నాతో ఏమీ చెప్పలేదు అని చెప్పేటట్లయితే రాముడికి నామీద మహా చెడ్డకోపం వస్తుంది. అతడు తన తీక్షణ దృష్టులతో నన్ను దహించి వేస్తాడు. నేను పోయి రామకార్యార్థము సుగ్రీవుని ప్రోత్సాహపరచి, సేనలను ఇక్కడికి తీసుకొనివచ్చే లోపుననే, ఈ సీతాదేవి ఇక్కడ ప్రాణత్యాగం చేస్తుంది. అందువల్ల నేను చేసే ప్రయత్నం వృథా అయిపోతుంది. నేను ఇక్కడనే వుండవలెను.

ఈ రాక్షసస్త్రీలు ఏమరినప్పుడు నాకు అవకాశం దొరుకుతుంది. పరమ దుఃఖంలో నున్న ఈ సీతాదేవిని అప్పుడు మెల్లగా ఊరడించ వచ్చును. ఇప్పుడు నేను చాలా చిన్న ఆకారంలో నున్నాను. నేను వానరుడను. మానవుని వలె సంస్కృత భాషలో మాట్లాడతాను. వీళ్ళు, ఈ రాక్షసస్త్రీలు ఆ భాష తెలుసుకోలేరు. నేను బ్రాహ్మణుడివలె సంస్కృతములో మాట్లాడినట్లైతే, సీతాదేవి వానరుడిట్లా సంస్కృతములో మాట్లాడటం ఏమిటి? అని సందే

హిస్తుంది. నన్ను రావణాసురుడని సందేహపడుతుంది. అందువల్ల అర్థవంతమైన కోసల దేశపు భాషలోనే అవశ్యం మాట్లాడవలెను. ఈమెను మరొక భాషలో ఊరడించలేము.

ఇదివరకు ఈ సీతాదేవిని రాక్షసులు భయ పెట్టినారు. ఇక నా రూపాన్ని చూచి, నా మాటలు విని ఈమె మరింత భయపడి పోతుందో ఏమో? రావణాసురుడు కామరూపుడని ఆ విశాలాక్షికి తెలుసు. అందువల్ల ఈ పతివ్రత నన్ను చూచి రావణాసురుడేనని అనుకొని మరింత భయపడి పోతుంది. కెవ్వున కేక వేస్తుంది. ఆ కేక వింటూనే రాక్షస స్త్రీ లందరూ యమభృత్యులవలె వెంటనే నా మీదికి వస్తారు. ఆ వికృతాననలు నా చుట్టూ మూగి నన్ను పట్టుకోవడానికి గానీ, చంపివేయడానికి గానీ శక్తికొద్దీ ప్రయత్నం చేస్తారు. చిన్న కొమ్మల మీదినుండి పెద్ద కొమ్మల మీదికి, అక్కడ నుండి చెట్లపైకి నేను పరుగెత్తుతూ వుంటే, నన్ను చూచి అనుమానిస్తారు. భయపడి పోతారు. అట్లా పరుగులెత్తే నా మహదాకారం చూచి అందరూ వెర్రికేక పెడతారు. మరింత భయపడిపోయి ఈ రాక్షసాంగన లందరూ రాక్షస రాజ భవనంలో రావణాసురుడు కావలి యుంచిన రాక్షసుల నందరినీ పిలుచుకొని వస్తారు. వాళ్ళు శూలాలు, చిల్లకోలలు, కత్తులు మొదలగు నానావిధ ఆయుధాలతోను భయంకరంగా పోరాడటానికి వచ్చి నామీద పడతారు. నా చుట్టూ కమ్ముకుంటారు. నన్నెటూ పోనివ్వకుండా అన్నివైపులా అడ్డగిస్తారు. నేను ఆ రాక్షస సైన్యాలతో పోరాడతాను. ఈ రాక్షసులలో మహాచురుకైన వాళ్ళు అనేక మంది వున్నారు. వాళ్ళు నన్ను పట్టుకున్నా పట్టుకోవచ్చు.

అట్లా అయ్యేట్టుగా వుంటే, సీతాదేవికి రామ వృత్తాంతం చెప్పటం వుండదు. నేను మహా సముద్రం దాటిపోవడం జరుగదు. పైగా ఈ రాక్షసులు హింసాభిరుచులు. అందువల్ల వీళ్ళు ఈ సీతాదేవిని చంపివేస్తే చంపివేయవచ్చును కూడా. లేదా నన్నైనా చంపవచ్చును. ఇట్లా అయ్యేట్లయితే, రామ సుగ్రీవుల కార్యము పాడైపోతుంది. ఈ లంకకు ఎటూ దారిలేదు. ఈ పట్టణానికి చుట్టూ సముద్రం వుంది. అందుకుతోడు రాక్షసులు కూడా కావలి వున్నారు. ఇటువంటి గోప్యమైన ప్రదేశములో సీతాదేవి వున్నది.

ఒకవేళ పోరాటములో ఈ రాక్షసులు నన్ను చంపివేసినా, పట్టుకొని బంధించివేసినా రామ కార్యసాధనకు తోడ్పడగలవాడు మరొకడు లేడు. నన్ను ఈ రాక్షసులు చంపివేసినట్లైతే, ఈ నూరు యోజనాల సముద్రమును దాటి రాగలవాడు వానరులలో మరొకడు లేడు. నేనెంత ఆలోచించినా తోచడం లేదు. ఎన్ని వేలమంది రాక్షసులతోనైనా పోరాడే సామర్థ్యం నాకున్నది. ఈ రాక్షసులను పోరాటంలో చంపివేయగలను కానీ పోరాటంలో అలసిపోయిన తరువాత ఈ సముద్రము దాటి నేనెట్లా ఆవలి గట్టుకు చేరగలను? ఇంతకూ యుద్ధాలలో జయాపజయాలు ముందుగా నిశ్చయించడానికి వీలులేదు. ఇట్లా అవుతుందో, అట్లా అవుతుందోనని సందేహం వచ్చే పనులు చేయడం నాకిష్టం లేదు.

సంశయాస్పదమైన పనులను ప్రాజ్ఞుడైనవాడు ముందు వెనుక లాలోచించకుండా నిర్విచారముగా చేయడు. అయితే నేను మాట్లాడకుండా పోయేటట్లైతే ఈ సీతాదేవి ప్రాణత్యాగం చేస్తుంది. మాట్లాడితే చిక్కు వస్తుంది. దూత వివేకం లేకుండా దేశకాల

విరుద్ధముగా ప్రవర్తిస్తే, కానున్న పనులు కూడా సూర్యోదయ మవుతూ వుంటే, చీకట్లవలె నాశనమైపోతాయి. ఇట్లా చేయవచ్చు అట్లా చేయకూడదు అని ముందుగా నిశ్చయించుకున్నప్పటికీ వివేకము లేని దూతలు తాము సర్వమూ తెలిసిన పండితుల మనుకొని పనులు పాడుచేసుకుంటారు. రామకార్యము చెడిపో కుండాను, నేను సముద్రము దాటిన శ్రమ వృథా అయిపోకుండాను ప్రవర్తించవలెను. అందుకు మార్గమేమిటి? నా మాటలు ఈ సీతా దేవి వినడమెట్లా? విని ఈమె భయపడకుండా వుండటమెట్లా? అని ఆ మతిమంతుడు హనుమంతుడు ఆలోచించసాగినాడు.

(శిష్యుడు, గురువుని అంగీకరించేటపుడు పరీక్ష చేసుకోవాలి. అంగీకరించిన తర్వాత మరి వదలకూడదు. పరీక్ష చేసుకోకుండా అంగీకరించకూడదు. అది రామాయణంలో సీతాదేవి హనుమంతుడిని దైవము యొక్క చిహ్నాలు ఏమిటో నాకు చెప్పు అని అడిగింది. అంతకు ముందు గురువు శిష్యపరీక్ష చేసుకున్నాడు. రావణుడు రావటం, మాట్లాడటం, ఈ రాక్షసాంగన లందరూ రావటం, బాధపెట్టటం, సీతాదేవి రావణుడికి, రాక్షసాంగనలకి సమాధానంగా పలికిన పలుకులు, చెప్పిన మాటలు బట్టి జీవాత్మ, పరమాత్మ యందు మాత్రమే అనురక్తి కలిగియున్నదని, ఇతరములందు, భోగ విషయములందు అనురక్తి లేక వున్నదని తెలుసుకున్న హనుమంతుడు లేక సద్గురువు. ఆ విధంగా సద్గురువు శిష్యుణ్ణి అనుగ్రహించటానికి దిగివస్తాడు. అలా దిగివస్తే చక్కని శ్రద్ధాళువు అయినటువంటి శిష్యుడు సద్గురువుని కూడా తనవంతు పరీక్ష చేసుకోవాలి. అపుడు తనకి విశ్వాసం ఏర్పడితే, అటుపైన గురు

శిష్య సంబంధం. అంతేగానీ వాడు వెంటపడ్డాడు కాబట్టి నేనూ వెంటపడతాను. వాళ్ళందరూ దణ్ణం పెడుతున్నారు కాబట్టి నేనూ పెడతాను. అదికాదు standard. అది రామాయణంలో చక్కగా చెప్పబడింది.

అందుకని సద్గురువెలాగూ తన శిష్యుణ్ణి పరీక్ష చేసి శిష్యుడిగా అంగీకరించవచ్చు లేదా సమకాలికుడిగా తనతోపాటు వుండనిస్తాడు. అంతే తప్ప శిష్యుడిగా అంగీకరించడు. శిష్యుడిగా అంగీకరించడంటే హృదయంలో అంగీకరించడు. అలాగే శిష్యుడు కూడా సద్గురువుని పరిపూర్ణంగా ఆశ్రయించేట్లయితే ఆ ఆశ్రయానికి ముందు పరీక్ష పెట్టుకోవాలి. నిజమైన సత్సాధకుడు ఎవరంటే సత్యం గురించి తపన చెందేవాడు. దానికోసమే సద్గురువు కాబట్టి అటువంటి తాపము ఇక్కడ జీవాత్మ అయినటు వంటి సీతాదేవి యందు పరిపూర్ణంగా వున్నది. అందుచేత ఆ సద్గురువు అనేటువంటి హనుమంతుడు దైవం యొక్క చిహ్నాములను చక్కగా వివరించి చెప్పాడు. ఎన్ని వివరించాడో చూడండి. రాముడు నగ్నంగా నిలబడితే ఏవేవి స్పష్టంగా చూడచ్చో ముందు వెనుక అన్నీ కూడా చూసి చెప్పినట్లుగా చెప్పేశాడు. అంటే అర్థం ఏమిటంటే కూలంకషంగా దైవస్వరూపాన్ని సద్గురువు తను చూచింది చూచినట్లుగా చెపుతాడు. అది అక్కడ జరిగింది.

వివేకానందుడికి రామకృష్ణుడు అలా చూపించాడు. ఎందు కంటే వివేకానందుడు చాలా పరీక్ష చేశాడు రామకృష్ణుడిని. రామకృష్ణుడు ఆ పరీక్షలో చక్కగా వివేకానందుడికి నచ్చే పద్ధతిలో నీకు తెలిసిన రాముని చెబుతానన్నాడు. నాకు తెలిసిన రాముడు

కాదు. ఎటువంటి రాముడి గురించి నీకు చెపితే నువ్వు నమ్ముతావో అట్లా చెపుతా నన్నాడు. అట్లా చెప్పాడు. అట్లా వివేకానందుడికి మనస్సు దాటి, మనస్సు హరింపబడి నటువంటి, తన్మయత చెంది నటువంటి, ఏ వికారము లేనటువంటి, అమృతమైనటువంటి, బ్రహ్మతత్వము అని దేన్నైతే అంటారో దానియందు మాత్రమే మక్కువ.

రామకృష్ణుడు ప్రతినిత్యం కాళికాదేవిని చూస్తూ వుంటాడు కదా! దేవుణ్ణి చూశావా అంటే కాళికాదేవిని చూపిస్తే, సరే వస్తాలే అంటాడు వివేకానందుడు. ఎందుకంటే వివేకానందుడు నమ్మినటు వంటి దైవము నామము, రూపములకు అతీతమైనటువంటి దేవుడు. కాబట్టి అతను ఏ దైవాన్ని ఆరాధన చేస్తున్నాడో, ఆ దైవాన్ని అతనికి చూపించినట్లైతే అతడు తనను సద్గురువు అని గుర్తిస్తాడు. దైవం యొక్క దూత అని గుర్తిస్తాడు. అలా కాకపోతే గుర్తించడు. ఎందుకంటే రామకృష్ణుడికి ఆ మొత్తం తత్త్వం చూడటం కన్నా, మంగళ స్వరూపిణి అయినటువంటి అమ్మవారి రూపంలో దైవాన్ని చూడటం ఇష్టం. వివేకానందుడికి అది ఇష్టం కాదు. ఆయన మొదట్నుంచీ బ్రహ్మసమాజం. ఆయన పుడుతున్న సందర్భంలో కాశీ నుంచి ఒక నక్షత్రం ఆకాశంలో వచ్చి కలకత్తాలో పుట్టినట్లుగా రామకృష్ణుడు దర్శిస్తాడు. అతడు శివ స్వరూపుడని తెలుసు. అందుచే అతనికి నామరూపాతీతమైన దైవమే ప్రియంగా వుంటుంది. అది కారణంచేత వివేకానందుడు రామకృష్ణుణ్ణి అడిగితే చూపిస్తాను రా, నా ప్రక్కన కూర్చో అని మంచం మీద ప్రక్కన కూర్చో పెట్టుకొని కాలు అతని తొడమీద వేసి కూర్చుంటాడు. ఒక

క్షణంలో వివేకానందుడికి మొత్తం అంతా మనసనేది లేక మాయం అయిపోతుంది. ఒక విశ్వరూపదర్శనం అయిపోతుంది. అపరి మితమైన వెలుగు అంతా ఏర్పడుతుంది. రూపం చూద్దామన్నా కనపడదు. ప్రక్కన రామకృష్ణుడు కనపడడు. మంచం కనపడదు. అక్కడున్న భవతారిణి ఆలయము కనపడదు. ఏమీ కనపడదు. కలకత్తా కనపడదు. అలా జరిగే సరికి ఆ తర్వాత రామకృష్ణుడు కాలుతీసి చూచావా దైవాన్ని అంటే దణ్ణం పెడతాడు. అదే విధంగా అది భ్రమ అనుకుంటాడేమో అని చెప్పి ఇంకోసారి ఇలా చేస్తాడు. అపుడూ అలాగే అయిపోతుంది. అలా చేస్తూంటే వివేకానందుడు మాటి మాటికీ అలా చెయ్యొద్దని అంటాడు. అక్కడ శిష్యుడూ అలాంటి వాడే, సద్గురువూ అలాంటి వాడే.

అందుకని హనుమంతుడు సీతాదేవిని పరిపూర్ణముగా పరీక్ష చేస్తున్నాడు. అంతేకాదు మళ్ళీ ఆవిడచేతకూడ ఆవిడ పేరు, ఊరు, ఆమె ఎవరికి సంబంధించిందీ అన్నీ చెప్పించుకున్నాడు. నేను రాముడికి సంబంధించినదాన్ని అని చెపుతుంది. ఆ తర్వాత ఆవిడ కూడా పరీక్ష పెడుతుంది.

అది మన సనాతన సంప్రదాయంలో ముఖ్యమైనటువంటి విషయం. అంతేగానీ ఏదో పామరులవలె ఎట్లాపడితే అట్లా కొట్టుకు పోవటం అన్నది లేదసలు. ఏం చదువుకోం కాబట్టి మనకు తెలియదు. ఒక సద్గురువు దొరికితే అసలు చదువుకోం. మనకేం అక్కర్లేదు. ఆయన వున్నాడని. ఆయన అవన్నీ చదువుకొని వచ్చాడు. అవన్నీ పరిశీలించటానికి వచ్చాడు. అవే రాస్తాడు. మళ్ళీ

అవే బోధిస్తాడు. మనం చదువుకోకపోయినా వింటామేమో అని. పోనీ ఆయన రాసింది అనే వ్యామోహం చేత చదువుకుంటామేమో అని. రామాయణం మొదట్నుంచీ రాసిందున్నా, మన గురువుగారు రాసిందని మనం చదువుకుంటాం కదా! భాగవతం మన గురువు గారు వ్రాసింది చదువుకుంటాం గానీ, పోతన ఏం రాశాడో, వాల్మీకి ఏం రాశాడో మనకక్కర్లేదు! వాళ్ళు మళ్ళీ చెప్పడం అంటూ వస్తే, మళ్ళీ అదే రామాయణం, భాగవతం, భారతం, ఉపనిషత్తులు చెపుతారు. ఎందుకంటే ఇంకోటి చెప్పటానికి లేదు కదా! అందుచేత ఒక సద్గురువుని సమీపించేటపుడే శిష్యుడు చాలా తపన చెంది వుండాలి. అట్లా తపన చెంది ఇంకోటి అక్కర్లేదనుకున్న వాడికి సద్గురువు.

శిష్యుడికి ఎటువంటి అర్హత లుండాలి అనేది సీతాదేవి లంకలో ఏ విధంగా వున్నది? అది తప్ప ఇంకోటి అక్కర్లేదు. అది దొరక్కపోతే చచ్చిపోతేనే సుఖం అనుకున్నదట ఆవిడ. అటువంటి జీవి విషయంలో దైవం ఎంత అప్రమత్తుడై దూతను పంపిస్తాడు అనేది- రాముడు పంపటం, హనుమంతుడు రావటం, హను మంతుడు కూడా పరీక్ష చేసుకోవటం. రాముడికి తగ్గట్టే ఈమె వున్నది, రాముడిని చాలా త్వరగా చేరవలసినటువంటి భావం ఈమెకి వుంది అనే భావం ఆయనకు స్థిరపడుతుంది.

ఇటువంటి ఘట్టాలన్నీ రహస్యముగా సుందరకాండలో వున్నాయి. ఇక్కడ ఇవన్నీ గురు శిష్యులకి సంబంధించిన రహస్యా లున్నాయి కాబట్టి ఇది సుందరమైనకాండ అయింది.

# 8

హనుమంతుడు అమ్మవారి దరిచేరి ఆమెకు సందేహ నివృత్తి అయ్యేటటువంటి పద్ధతిలో తననుగూర్చి, సుగ్రీవునిగూర్చి, సుగ్రీవుని యొక్క సమస్యలుగూర్చి, సుగ్రీవుడితో రాముడు చేసుకున్న స్నేహముగూర్చి, వాలి సంహారముగూర్చి, అటుపైన రాముడు సీతాన్వేషణమునకై చేసినటువంటి ప్రయత్నములో భాగంగా తనను దక్షిణ దిశకు పంపించటంచేత తను ఆ విధంగా సముద్ర లంఘనం చేసి వచ్చినట్లు, రాముని యొక్క ఆవేదన, రామునియొక్క పరిస్థితి, అమ్మవారు రావణాసురునిచేత అపహరింప బడుతున్నటువంటి సందర్భంలో ఋష్యమూక పర్వతంమీద తన నగలను కొన్నింటిని కట్టి జారవిడవడం... ఇటువంటి సన్నివేశాలను గుర్తుచేసి, అటుపైన రాముని ప్రశంసించి, రాముని గుణగణాలన్నీ చాలా వివరంగా చెప్పి, ఆమెకు తనయందు నమ్మకం కలిగేటట్లు ప్రయత్నం చేస్తాడు.

(అదీ, మనం సాధకులుగా, సాధనాపరంగా శిష్యుడు సద్గురువును అంగీకరించడానికి ముందు, సద్గురువు దైవంచేత ప్రేరణ చెంది, జీవులను ఉద్ధరించడానికి వచ్చినవాడేనా, లేక బూటకమా అని తెలియడ మనేటటువంటి సన్నివేశం మనకిక్కడ

కనిపిస్తుంది. రకరకములుగా సీతాదేవి హనుమంతుణ్ణి పరీక్షిస్తుంది. అన్నిటికీ ఆయన చక్కగా, సవివరంగా సమాధానములు చెబుతూ దైవము యొక్క స్వరూప స్వభావము లన్నిటినీ ఆవిష్కరిస్తాడు.)

ఆ విధంగా చెప్పినందువల్ల ఆ హనుమంతుడు రామదూతే అని సీతాదేవి నమ్మింది. ఆమెకు అమిత సంతోషము వేసింది. ఆనందబాష్పాలు వదిలింది. తెల్లని కనుగుడ్లతోనూ నల్లని కను కొలకులతోనూ ఉన్న ఆ విశాలాక్షి ముఖబింబ మప్పుడు రాహువు వదిలిన చంద్రబింబము వలె శోభించింది. అతడు స్పష్టముగా వానరుడే కాని మరి ఒకడు కాదు అని ఆమె అనుకుంది. అంతట హనుమంతుడు మళ్ళీ ఆ ప్రియదర్శిని సీతాదేవితో, "ఓ మైథిలీ! నీకు నేను ఇది అంతా చెప్పినాను. ఊరడిల్లు. నేను ఏమిటి ఎట్లా చేయడము నీకు ఇష్టమో అది చెప్పు. నేను మళ్ళీ రాముని దగ్గరకు పోతాను.

(వానరుడు అంటే మహాత్ముడు అనీ, కోతి అనీ రెండు అర్థాలున్నాయి.)

"ఓ దేవీ! మహర్షులు ప్రేరేపించినందువల్ల వానరవీరుడు కేసరి, శంబసాదనుడు అనే రాక్షసుణ్ణి యుద్ధములో చంపాడు. నేను ఆ కేసరి భార్యకు వాయుదేవుడి అనుగ్రహమువల్ల పుట్టాను. ప్రభావంలో నేను ఆ వాయుదేవుడితో సరిసమానము అయిన వాణ్ణి" అని హనుమంతుడు చెప్పాడు.

ఆ మహాతేజోవంతుడు మారుతాత్మజుడు తనను సీతాదేవి నమ్మేటందుకు మళ్ళీ వినయంతో, "ఓ మహాభాగా! నేను వానరుడను.

ఆ బుద్ధిసంపన్నుడు రామప్రభువు నన్ను దూతగా పంపించినాడు. ఓ దేవీ! ఇదిగో చూడు, రామ నామాంకితము అయిన ఉంగరము. నీవు నన్ను నమ్మడానికోసము ఈ ఉంగరము ఆయన నాకు ఇచ్చాడు. నేను తెచ్చాను. ఊరడిల్లు. నీకు శుభము అవుతుంది. నీ దుఃఖాలు అన్నీ నాశనమై పోతాయి" అంటూ ఉంగరము ఇచ్చినాడు.

(చిట్టచివరకు సద్గురువు తాను భగవంతుని ప్రతినిధినే అని తెలుపడానికి భగవత్సాక్షిగా వుండేది, జీవునికి నమ్మకము, దృఢమైన విశ్వాసమును కలిగించేదొకటి అందించి, తద్వారా శిష్యునికి తనయొక్క ఎరుకను తెలియ పరుస్తాడు.)

సీతాదేవి ఆ ఉంగరము తీసుకున్నది. పరిశీలించి చూచింది. తన పెనిమిటి వచ్చినట్టుగా సంతోషపడ్డది. ఆ విశాలాక్షి తామ్ర శుక్లాయత నేత్రాలు వికసించాయి. భర్తృ సందేశానికి ఆమె దేహము పులకరించింది. సిగ్గు వచ్చింది. సంతోషము వేసింది. ఆ మహాకపిని హనుమంతుణ్ణి ఎంతో మెచ్చుకొన్నది.

"ఓ వానరుడా! నీవు ఒక్కడవే ఈ రాక్షస పదాన్ని తిరస్క రించ కలిగినావు. నీవు పరాక్రమశాలివి. సమర్థుడవు. ప్రాజ్ఞుడవు. సముద్రంలో నూరుయోజనాల విస్తీర్ణాన్ని గోవుపాదము అంతగా చేసి దాటివచ్చావు. నీది పొగడవలసిన పరాక్రమము. ఓ వానర పుంగవా! నీవు సామాన్యమైన వానరుడవు కావు. నీవు రావణా సురుడికి భయపడలేదు. నీవు సంభ్రమ పడలేదు. ఆ విజితాత్ముడు రామప్రభువు నిన్ను పంపించాడు. కాబట్టి నీతో నేను మాట్లాడు

తున్నాను. ఆ దుర్ధర్షుడు రామప్రభువు నీ పరాక్రమము ఎరుగ కుండానూ, నిన్ను పరీక్షించకుండానూ పంపించి ఉండడు.

(సద్గురు లక్షణాలు ఇలా ఉంటాయి. అతడు ధీమంతుడై ఉండాలి. ఎట్టి పరిస్థితులలోనూ భయపడక సమర్థుడై ఉండాలి. ప్రాజ్ఞుడు అంటే సమస్తము తెలిసినవాడై ఉండాలి. ఎంతటి విషయాన్నైనా సులభంగా అవగాహన చేసుకుని దానికి పరిష్కా రము చేయగల మహాత్ముడై ఉండాలి. అహంకార ప్రజ్ఞ ఎంత పెద్దదైనప్పటికీ దానికి భయపడకూడదు. ప్రాపంచిక జీవితంలో ఎంతో ఉన్నత పదవిలో ఉన్నవారియందు, అధికారుల యందు, సామాన్యుల యందు సమభావం కలిగివుంటూ, అధికారులు, ధనవంతులు కనబడగానే తొట్రుపాటుగాని, కంగారు పడటంగాని, వాళ్లని సంతోషపెట్టడం కానీ చెయ్యడు. ఎవరొచ్చినా అలాగే ఉంటుంది. అహంకార పురుషునివల్ల నీవు భయపడలేదు. భ్రమ చెందలేదు. ఇతనికి బాగా డబ్బుంది, పదవి ఉంది, తెలివితేట లున్నాయి, మనకి పనికి వస్తాడు అని సద్గురువుకి ఉండదు. సద్గురువుకు సత్యమే అనగా దైవమే పనికి వస్తుంది. మిగతావి ఏవీ పెద్ద విషయాలు కావు. అలాంటి వాళ్ళకంటే సద్గురువుకి దైవ సహాయమే ముఖ్యం. దైవంతో ముడిపడినవాడు ఇతరులను కించ పరచడు. తాను వారికి లొంగడు. భయపడడు. భ్రమ చెందడు. ఇవన్నీ మనం గుర్తుపెట్టుకుని, సద్గురువులు ఎలా ప్రవర్తిస్తున్నారో చూసుకుంటూంటే, మనక్కూడా కొంత అవగాహన అవుతుంది. భారతీయ సంప్రదాయంలో గురుశిష్య సంబంధంలో గురువు శిష్యుడిని ఎంత పరీక్ష చేస్తాడో, శిష్యుడుకూడా గురువుని అంతే

పరీక్ష చేసుకుని, పరస్పరం అంగీకరిస్తే, అది జన్మ జన్మల బంధము. ఆత్మీయ బంధము. అంతే కాదు. అది వీడని బంధంగా నిలచి పోతుంది.)

“నా భాగ్యవశంవల్ల ఆ ధర్మాత్ముడు, ఆ సత్యసంధుడు రామప్రభువు, ఆ పరాక్రమశాలి లక్ష్మణుడూ కుశలంగా ఉన్నారు. కాకుత్థ్సుడు కుశలంగా ఉన్నట్లయితే సముద్రము మొలనూలుగా ఉన్న ఈ భూమిని ప్రళయాగ్నివలె దహించివేసేవాడు. ఎందుకో ఊరకున్నాడు. ఆ అన్నదమ్ములు దేవతలనైనా నిగ్రహించే శక్తి మంతులు. అయితే నా దుఃఖాలకు అంతం లేదేమో! ఆ రామ ప్రభువు నా కోసము దుఃఖపడడం లేదా? నన్ను తీసుకుని పోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాడా? ఆ రామప్రభువు దీనుడుగా లేడా? సంభ్రాంతచిత్తుడై మైమరచి పోయినాడా? పురుష ప్రయత్నం చేస్తున్నాడా? ఆ పరంతపుడు విజిగీషువుగా మిత్రుల విషయంలో సామదానోపాయాలనూ, శత్రువుల విషయంలో దాన భేద దండో పాయాలనూ అనుష్ఠిస్తున్నాడా? ఆ మహానుభావుడు స్నేహితులను సంపాదించుకొన్నాడా? ఇతరులు కూడా తమకు అతడు కావలెనని కోరుకుంటున్నారా? మంచిమిత్రులు ఉన్నారా? ఆ మిత్రులు ఆయనను తమకు ముఖ్యుడు అనుకొంటున్నారా?

“ఆ రామప్రభువు దేవతల అనుగ్రహాన్ని ఆశిస్తున్నాడా? ఆయన పురుష ప్రయత్నానికి దైవం అనుకూలంగా ఉంటుందా? నేను ఇతర దేశములో ఉన్నందువల్ల నామీద స్నేహం ఆయనకు పోలేదా? నాకు ఈ దుఃఖం లేకుండా చేస్తాడా? ఆయన ఎప్పుడూ సుఖాన్ని అనుభవించవలసినవాడు. దుఃఖాన్ని అనుభవించ

వలసినవాడు కాడు. దుఃఖము ఎక్కువైపోయి, ఆయన కృశించి పోయినాడా? ఆయనకు కౌసల్యా సుమిత్రాదేవిల క్షేమమూ, భరత శత్రుఘ్నుల క్షేమమూ అప్పుడప్పుడూ తెలుస్తూ ఉన్నదా? ఆ పూజనీయుడు నా నిమిత్తము దుఃఖపడుతున్నాడా? అనన్య మనస్కుడుగా లేడు కదా! నన్ను కడతేరుస్తాడా?

"ఆ భ్రాతృవత్సలుడు భరతుడు నా కోసం భయంకరమైన మంత్రులను ఇచ్చి (ఇరవైఒక్కవేల ఎనమన్నూట డబ్బై రథాలూ, అన్నే ఏనుగులూ, అరవై ఐదువేల ఆర్నూటపది గుఱ్ఱాలూ, ఒకలక్షా తొంభైవేల మున్నూట ఏబదిమంది పదాతులూ ఉండే) ఓ అక్షౌహిణీ సైనాన్ని అన్నగారికి పంపిస్తాడా? ఆ శ్రీమంతుడు వానరాధిపతి సుగ్రీవుడు, దంత నఖాయుధాలతో పోరాడే వానర వీరులను వెంటపెట్టుకొని నా కోసం రామప్రభువుతో వస్తాడా? ఆ సుమిత్రా నంద వర్ధనుడు, ఆ సకలాస్త్రకోవిదుడు లక్ష్మణుడునూ ఆయన వెంటవచ్చి బాణాలతో రాక్షసులను చంపివేస్తాడా? భయంకరంగా మంటలు మండే బాణాలకు సుహృజ్జనులతో కూడ రావణా సురుడు యుద్ధంలో చావడం త్వరలో నేను చూస్తానా? నేను లేకపోవడము వల్ల బంగారంవలె మెరిసిపోతూ, పద్మమువలె సుగంధములు గుబాళిస్తూ ఉండే ఆ రామప్రభువు ముఖారవిందం నీళ్ళు అడుగంటి ఎండతాకిడికి శోషిల్లిన పద్మంవలె అయి పోయిందా? ధర్మసిద్ధికోసము రాజ్యం వదిలిపెట్టి పాదచారి అయి నన్ను వెంట పెట్టుకుని మహారణ్యానికి వచ్చినప్పుడు ఆ రామ ప్రభువు వ్యథపడలేదు, భయపడలేదు, దుఃఖపడలేదు. ఆ మహాను భావుడు ఇప్పటికీ అట్లాగే మనోధైర్యంతో ఉంటూ ఉన్నాడా?

నామీద ఉన్న స్నేహము ఆ రామప్రభువుకు ఆయన తండ్రిమీద కానీ, తల్లిమీదకానీ, మరి ఎవరిమీదకానీ లేదు. ఆయన మీద నాకు ఉన్న స్నేహమునూ అటువంటిదే. ఆయన సంగతి తెలిసే టంత వరకూ నేను జీవించి ఉండవలె ననుకున్నాను" అంటూ మహార్థముగానూ, మధురార్థముగానూ చెప్పి రాముణ్ణి గురించి మనోహరమైన మాటలు వినడానికోసం ఊరుకున్నది.

(ఎటువంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి, ఎటువంటి ధీరత్వంతో రాముడున్నాడు అని తెలుసుకునేటువంటి ఉద్దేశంతో ఆయన గురించి ఇంకా వినాలనేటువంటి ఉద్దేశంతో ఆ విధంగా ప్రశ్నించింది.)

అప్పుడు ఆ భయంకర పరాక్రముడు మారుతాత్మజుడు చేతులు జోడించి శిరస్సు వంచి, "ఓ కమలాక్షీ! రామప్రభువు నీవు ఇక్కడ వున్నట్లు ఎరుగడు. అందుచేత దేవేంద్రుడు తన భార్య శచీదేవి అనుహ్లాదుడి దగ్గర వుంది అని తెలియగానే ఆమెను తీసుకుని పోయినట్లు, నీవు ఎక్కడవుందీ తెలియక నిన్ను రాముడు ఇంతవరకూ ఇక్కడనుంచి తీసుకుని పోలేదు. నేను పోయి చెప్ప గానే, రామప్రభువు ఇక్కడకు వచ్చి నిన్ను తీసుకొని పోతాడు. నేను పోయి చెప్పీ చెప్పడంతో వానర సేనా సమూహాలనూ, భల్లూకసేనా సమూహాలనూ వెంటపెట్టుకుని రామప్రభువు వస్తాడు. క్షోభపెట్ట నలవికాని మహాసముద్రాన్ని తన బాణ సమూహాలతో స్తంభించి పోయేట్లు చేస్తాడు. ఈ లంకాపట్టణానికి వస్తాడు. రాక్షసుల నందరినీ నిర్మూలనం చేస్తాడు. దారిన అడ్డమయ్యే సురాసురులను, మృత్యువును రామప్రభువు సంహారము చేస్తాడు.

(రామప్రజ్ఞకు సురలు, అసురులు చివరకు మృత్యువైనా అడ్డుపడలేదు. అందుకే రాముడు సర్వ రక్షకుడు, జగద్రక్షకుడు. శరణు వేడిన వారికి ఆ విధమైన రక్షను ఆయన ఇస్తాడు. అందుచేతనే ఇన్ని యుగాలైనా రాముని ఆశ్రయంచేతనే ఈ భరతభూమి ఈ విధంగా ముందుకు సాగుతున్నది. ఎన్ని రకాల కష్టా లొచ్చినా ఇది ముందుకే సాగుతున్నది.)

"ఓ పూజ్యురాలా! నీవు కనపడకుండా ఉన్నందువల్ల రామ ప్రభువు దుఃఖసముద్రంలో మునిగి సింహము పీడించిన ఏనుగు వలె సుఖము లేకుండా బాధపడుతున్నాడు. (తనయందు అనురాగము కలిగి ఉన్నాడా, లేక కోపంగా ఉన్నాడా అని తెలుసుకునేందుకు ప్రశ్నించింది) సుందరమైన నేత్రాలతో, దొండ పండువంటి మనోహరమైన పెదవులతో, ధగధగ మెరిసే కుండలాలతో ఉదయించే పూర్ణచంద్రుడి వలె రామప్రభువు నీకు కనపడతాడు. నీవు చూస్తావు. నేను మలయ పర్వతం మీద, వింధ్య పర్వతంమీద, మేరుపర్వతం మీద, మంధర పర్వతం మీద, దుర్ధరపర్వతం మీద దొరికే కందమూల ఫలాలమీద ఒట్టుపెట్టుకొని చెప్పుతున్నాను. ఓ దేవీ! ఐరావతం మీద దేవేంద్రుడి వలె ప్రస్రవణ పర్వతం మీద రామప్రభువును నీవు త్వరలోనే చూస్తావు.

"ఓ దేవీ! నీపై దుఃఖముతో రామప్రభువు మాంసము తినడంలేదు. మధ్యం త్రాగడంలేదు."

(హనుమంతుడు తిండిమీద ఒట్టుపెట్టుకోవడమంటే అదో పెద్ద విషయం. అలాగే రాముడు మాంసాహారి అని, త్రాగేవాడని

కూడ తెలుస్తుంది. అది క్షత్రియ ధర్మం కదా! బుద్ధుడు వచ్చేదాకా బ్రాహ్మణులుకూడా శాకాహార నియమం పెట్టుకోలేదు. శ్రాద్ధంలో కూడా మేక మాంసం వండి పెట్టేవారు. బుద్ధుడి శాకాహార ప్రతిపాదనని ముందుగా అంగీకరించినవారు బ్రాహ్మణులే. ఆ తరువాత వైశ్యులు. ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు. మాంసాహారం కన్నా శాకాహారమే ఎక్కువ ఉపయోగమని గుర్తించారు. అది మానవజాతిలో పరిణామ కథ. రాముడికి కృష్ణుడికీ ఈ విషయం తేడా ఉంది. శ్రీ కృష్ణుడు ఐదువేల సంవత్సరముల క్రితం, అంటే బుద్ధునికన్నా రెండువేల ఐదు వందల సంవత్సరాల ముందు దేహం తీసుకున్నప్పటికీ, ఆయన దేహం పాలు, పెరుగు, వెన్నలతో పెరిగింది. కూరగాయలు, పప్పుదినుసులు, ధాన్యము ఎక్కువగా తీసుకున్నవాడు. యోగ స్థితిలో ఉన్నవారు ఎంత తేలికైన ఆహారం తీసుకుంటే అంత మంచిది. మొద్దుగా ఉండే ఆహారం తీసుకుంటే అంత మత్తు వస్తుంది. అంత బరువు పెరిగి చేతన తగ్గుతుంది. ఆ విధంగా జీవించాలి అన్న సందేశాన్ని శ్రీకృష్ణుడు ఐదువేల సంవత్సరాల ముందే మనకు అందించి వెళ్ళాడు.)

"వానప్రస్థుడివలె సాయంకాల మప్పుడు మాత్రము ఒక పర్యాయమే కందమూలాలను తింటున్నాడు. ఆ మహానుభావుడి మనస్సు అంతా నీ మీదనే ఉంది. తన ఒంటి మీద వాలే ఈగలను కానీ, దోమలనుకానీ తోలుకోడు. పురుగులనైనా, పాములనైనా తోలడు. నీవు లేనందువల్ల కామ పరవశుడై ఎప్పుడూ నిన్నే ధ్యానము చేస్తూ ఉన్నాడు. నీ వియోగము వలన ఎప్పుడూ

శోకపరాయణుడుగా ఉంటున్నాడు. నిన్ను గురించి తప్ప మరి దేనిని ఏ కొంచెమూ ఆలోచించడం లేదు. ఎప్పుడూ నిద్రపోవడం లేదు. ఒక వేళ నిద్ర పట్టినా 'సీతా! సీతా!' అని మనోహరంగా పిలుస్తూ నిద్ర మేలుకొంటాడు. ఒక పండునైనా, ఒక పువ్వునైనా, మనోహరమైనది ఇంకా దేనిని అయినా చూడగానే ఆ రామ ప్రభువు, 'అయ్యో! ప్రియురాలా!' అని నిన్ను తలచుకొంటూ నిట్టూర్పులు విడుస్తాడు.

"ఓ దేవీ! ఆ దృఢవ్రతుడు, ఆ మహాత్ముడు రామప్రభువు ఎప్పుడూ పరితాపపడుతూ, 'సీతా! సీతా!' అని నీ పేరు పెట్టి పిలుస్తూ, నిన్ను పొందడానికి ప్రయత్నం చేస్తూ ఉన్నాడు" అని చెప్పాడు.

(ఇట్లా హనుమంతుడు చెప్పింది ఆ వైదేహి విన్నది. రాముడితో సరిసమానంగా దుఃఖపడుతూ ఉన్న ఆమె దుఃఖం కొంత ఉపశమించింది. శరత్కాలారంభంలో మిగిలి ఉన్న మబ్బులలో చంద్రుడు ఉదయించిన శుక్లపక్ష రాత్రివలె ఆమె కనిపించింది.)

హనుమంతుడు చెప్పింది అంతా ఆ పూర్ణచంద్ర నిభానన సీతాదేవి విన్నది. అంతట ధర్మయుక్తంగా, "ఓ హనుమంతుడా! రామప్రభువు ఎప్పుడూ నన్ను తప్ప మరి దేనినీ తలచుకోవడం లేదు అని చెప్పి నన్ను సంతోష పెట్టావు. నా వలన ఆ మహానుభావుడు నిరంతరమూ దుఃఖ పరాయణుడుగా ఉంటూ ఉన్నాడు అని చెప్పి నన్ను దుఃఖ పెట్టినావు.

(అంటే ఆయన దుఃఖపడిపోతూ ఉంటే ఈవిడ దుఃఖపడి పోతుంది. ఇప్పుడు ఈవిడ దుఃఖపడిపోతోందంటే ఆయన దుఃఖ పడిపోతాడు. ఇలా ఇద్దరూ దుఃఖపడిపోతూంటే పనికాదు కదా! కానీ వారి ప్రేమ అటువంటిది కనుక అలాగే చెప్పాలి. 'ఆ విధంగా చెప్పడంచేత నాకు కూడా దుఃఖం కలుగుతోంది' అంటోంది.)

"నీవు ఈ విధంగా అమృతమూ విషము కలిపినట్టుగా నాకు చెప్పినావు."

(నువ్వడిగింది అది. అలా చెప్పకుండా ఉత్త అమృతమే చెపితే విషమైపోతుంది. విషం కలిపియిస్తే, అపుడు లోపల కొంచెం ఉపశమనం చెంది, బయటకు మాత్రం 'పాపం వాళ్ళ కెంత కష్టం వచ్చిందీ' అంటారు. కానీ లోపల, మనలానే కష్టపడే వారొక రున్నారనే తృప్తి ఒకటుంటుంది కదా! మనిషి లోపల ఎన్ని పొరలుంటాయో చెప్పలేం. బాగా సుఖపడేవాడికి అంతకన్నా సుఖంగా ఉన్నవాడి గురించి చెప్పకూడదు. చెప్తే ఏడుస్తాడు. 'ఇలా ఎవరికి ఉందండీ?' అని చెప్పాలి. అప్పుడు వాడు పొంగు తాడు. అలాగే, దుఃఖంలో ఉండేవాడికి అంతకంటే దుఃఖంలో ఉండేవాడి గురించి చెప్పాలి. అక్కడ తగ్గించాలి, ఇక్కడ పెంచాలి. అలా ఇప్పుడు రెండూ కలిపి చెప్పావు, సంతోషం అంటోంది.)

"మహదైశ్వర్యంలో ఉన్నా, దారుణమైన కష్టాలు అనుభవిస్తూ ఉన్నా తాటితో కట్టేసి లాక్కొని పోయినట్లు దైవం మానవుణ్ణి ఎక్కడికో తీసుకుని పోతుంది. (కాలము దైవమే కదా! ఎవరినైనా, ఎప్పుడైనా, ఎక్కడనుంచైనా పీక గలదు. వాడు సరాసరి రోడ్డు మీదకు వచ్చేస్తాడు.)

ప్రాణికోటి దైవాన్ని నిగ్రహించడము అసంభవం. (అంతే కదా! రాముడంతటి వాడికే వచ్చిందంటే మనం లెక్కే లేదు.) నిజం. నేనూ, ఆ రామప్రభువు, లక్ష్మణుడూ మహా కష్టాల పాలై ఎట్లా కొట్టుకులాడుతున్నామో చూడు. సముద్ర మధ్యంలో నౌక పగిలిపోవడంవల్ల నీటిలో పడి ఈదుతూ అలసిపోయిన వాడివలె, ఇప్పుడు దుఃఖ సముద్రంలో మునుగుతూ తేలుతూ ఉన్న రామ ప్రభువు ఎప్పుడు గట్టెక్కుతాడో? ఓ హనుమంతుడా! నా పెనిమిటి రాక్షసుల నందరినీ సంహారం చేసి రావణాసురుణ్ణి వధించి, లంకా పట్టణాన్ని నిర్మూలనము చేసి నన్ను ఎప్పుడు చూస్తాడో? నాకు రావణాసురుడు సంవత్సరం గడువు పెట్టినాడు. ఈ గడువుకాలం సంవత్సరమూ గడిచిపోయే లోపలనే ఆయన ఇక్కడికి రావాలి అని చెప్పు. ఈ గడువు కాలము వరకూ నా బొందిలో ప్రాణం ఉంటుంది. ఆ క్రూరకర్ముడు రావణాసురుడు నాకు పెట్టిన గడువులో ఇప్పుడు పదోమాసము జరుగుతూ ఉంది. ఇంకా రెండు మాసాల గడువు కాలమే మిగిలి ఉంది.

(పది నెలలు చాలా వేచి ఉన్నాను. కేవలం నీ మీద వ్యామోహంకొద్దీ సహనం చూపించాను. కానీ, మరొకరైతే ఈ పాటికి ముక్కలు ముక్కలుగా తరిగేసి తినేసేవాడినని రావణుడు చెప్పాడు. గడువింకా రెండు నెలలే అని చెప్పాడు.)

"ఓ హనుమంతుడా! రావణాసురుడి తమ్ముడు విభీషణుడు అనే వాడు నన్ను రామ ప్రభువు దగ్గరకు పంపించివేయడానికి ప్రయత్నము చేశాడు. కాని, రావణాసురుడికి అట్లా చేయడానికి ఏ

మాత్రమూ ఇష్టము లేకపోయింది. అందుకు ఆ రాక్షసుడు ఎంత మాత్రం ఒప్పుకోలేదు. రావణాసురుడు ఇప్పుడు కాలవశంగతుడై ఉన్నాడు. మృత్యుదేవత వాణ్ణి పట్టుకొని పోవడానికి యుద్ధం కోసము వెతుకుతూ ఉంది. విభీషణుడి పెద్దకూతురు 'వల' అనే ఆమెను, ఆమె తల్లి నా వద్దకు పంపించింది. ఆ కన్నె నాకు ఈ సంగతి చెప్పింది.

(అంటే వాళ్లకి ధర్మానుష్ఠాన బుద్ధి ఉన్నది కాబట్టి ఈమెకు ఉపశమనం కలిగించటానికి మేమూ మీ పార్టీయే, ఇక్కడున్నామని చెప్పింది.)

"ఓ హనుమంతుడా! నా పెనిమిటి శీఘ్రంగానే వచ్చి నన్ను కలుసుకొంటాడు. సందేహం లేదు. ఏమంటే, నా అంతరాత్మ పరిశుద్ధముగా ఉంది. నాకు అట్లా తోస్తున్నది. ఆ రామప్రభువులో ఎన్నో సద్గుణాలు ఉన్నాయి. ఉత్సాహము, పౌరుషము, బలము, దయ, కృతజ్ఞత, శౌర్యము, ప్రభావమూ అనేవి అన్నీ మూర్తీభవించినవి. జనస్థానములో తమ్ముడు దగ్గర లేకుండానే పధ్నాలుగు వేలమంది రాక్షసులను ఆయన ఒక్కడే సంహారము చేశాడు. అటువంటివాడికి ఎటువంటి శత్రువు అయినప్పటికిన్నీ బ్రతికి ఉండలేదు.

(Demonstrate చేసి చూపించాడు. ముహూర్తంన్నర అంటే 6 నిమిషాలలో 14 వేల మందిని చంపడం అంటే మామూలుగా అయ్యే పని కాదు. అందునా వారందరూ రాక్షసులు, చాలా బలవంతులూను.)

ఎన్ని కష్టాలు వచ్చినా ఏ మాత్రమూ చలించడు. దేవేంద్రుడి ప్రభావము శచీదేవి ఎరుగును. రామప్రభువు ప్రభావము నేను ఎరుగుదును. బాణ సమూహాలు అనే కిరణాలతో ఆ రామ దివాకరుడు రాక్షసులు అనే జలాలను ఎండగొడతాడు అంటూ, రాముడికోసం దుఃఖంతో కృశించిపోయిన ఆ సీతాదేవి బొటబొట కన్నీళ్ళు కార్చింది.

(నా మనసులో రామునిగూర్చి ఏనాడైనా వేరే భావన కలిగి ఉంటే, అతడు రాడేమోనన్న భయం కలుగుతుంది. నా అంతరాత్మ పరిశుద్ధంగా ఉన్నది కాబట్టి నాకోసం ఆయన వచ్చి తీరుతాడు. ఇదీ ఒక భక్తునికి ఉండాల్సిన నమ్మకం. నీవు ఎప్పటికప్పుడు భావంచేత, భాషచేత, కర్మచేత శుద్ధిగా ఉన్నావా? ఉంటే తృప్తి చెందకు, ఇంకా శుద్ధి చేసుకో. ఎంత అంటే, బహిఃకరణములు, అంతఃకరణములు కూడా శుద్ధి చేసుకోవాలి. బయటకు శుచిగా చాలామంది ఉంటారు. లోపల శుచిగా కొంతమంది ఉండక పోవచ్చు కదా! అందువల్ల బయట లోపలా శుచిగా ఉన్నా, దైవము నీ వద్దకు వచ్చేంత వరకు ఇంకా శుద్ధి చేసుకోవాలి.

అలా శుచి అవడం కోసమే సీతాదేవి తన ప్రవర్తనయందు కానీ, తన అంతఃచేతనయందు కానీ మాలిన్యం లేకపోయినప్పటికీ, సతతమూ ఆ రాముని గురించి తలచుకుంటూ, అట్లా శ్వాసయే రామునిగా, అతను వచ్చేంతవరకూ నిలచివుంది. అప్పుడు ఆ శుద్ధి పరిపూర్తి అవుతుంది. మనకు బంధాలద్వారా చాలా బాధ లుంటాయి. ఇంట్లో వాళ్ళు, బయటివాళ్ళూ పీకుతూనే ఉంటారు.

దైవానుష్ఠానము చేసుకునేటప్పుడు దైవం గుర్తుంటాడా, ఇవన్నీ గుర్తుంటాయా? వీరందరినీ చూస్తున్నప్పుడు, దైవమే వీరందరి రూపంలో ఉన్నాడని, తనని పరీక్షిస్తున్నాడని గుర్తుంటే, దైవ ముంటాడు. వీరంతా వేరుగా ఉన్నారనుకుంటే, వాళ్ళే ఉంటారు. దైవమెప్పటికీ ఉండడు. ఎవరేడ్పించినా ఏడుపు తప్పదని కూర్చునే కన్నా, దైవమే అనుకుంటే ఒక మెట్టెక్కుతాం. మన మెందుకో ఎంత తెలిసినా, ఆ ఒక్క విషయం చాలా సులభంగా మరిచి పోతుంటాం.

అమ్మవారు రావణుని గురించి ఆలోచించకుండా, రాముని గురించే ఆలోచిస్తూంటుంది. అంతటి రావణుడొచ్చినా రాముడి గురించే మాట్లాడింది. అందుకే సమస్యల గురించి ఆలోచించడం కాకుండా, సమస్యల రూపంలో ఉన్న దైవాన్ని గురించి ఆలోచించడమనేది సరైన పరిష్కారం. అదీ శుద్ధి! రోజూ ఎంత సేపు దైవాన్ని గుర్తుపెట్టుకుంటాం? పావుగంట, అరగంట లేక గంటన్నరా? మిగతా సమయాల్లో ఆ శుద్ధినంతా చెరిపేసు కుంటున్నాంగా! మళ్ళా సాయంత్రం ఆ మురికంతా కడుక్కోడానికి మరో పావుగంట దైవాన్ని గుర్తు పెట్టుకుంటే సరిపోతుందా? మురికి చేసుకునేది ఎక్కువ, కడుక్కునేది తక్కువ అవుతుంది.

కానీ ఇక్కడ ఆమె ఏమి చెబుతోందంటే, సతతమూ ఆయనను మనసులో నిలిపి, పరిశుద్ధంగానే ఉన్నాను కాబట్టి ఆయన వస్తాడు. నన్ను రక్షిస్తాడు అన్న నమ్మకం నాకు ఉన్నది. అంతే కాని, తప్పకుండా ఆయనను చేరుకుంటాను అని చెప్పడం లేదు.

ఆయనను చేరుకోవడమనేది అహంకారం. ఆయన వచ్చి మనల్ని అనుగ్రహించడమనేది నిరహంకార స్థితి. ఇదీ ఇక్కడ అవగాహన చేసుకోవాల్సిన విషయం.

ఈ మాటల్లో ముఖ్యమైన మాటేమిటంటే 'నా పెనిమిటి శీఘ్రంగా వచ్చి నన్ను కలుసుకుంటాడు.' నేను తొందరగానే ఆయన్ని కలుసుకుంటాను అనడం లేదు. ఆయన వచ్చి నన్ను కలుసుకుంటాడు అన్నమాటలు భారతీయ జ్ఞానంలో చాలా ముఖ్యం. 'నేను దైవం దగ్గర కెళ్తాను. ఆత్మసాధన చేస్తాను అనుకుంటే, అహంకారం అడ్డుపడుతుంది. దైవం దగ్గరకెళ్ళడానికి ప్రయత్నం చెయ్యకుండా ఆత్మశుద్ధి ఏర్పరచుకుంటే, ఆయనే మన దగ్గరకు చేరతాడు. భావశుద్ధిగాను, భాషశుద్ధిగాను, చేతన శుద్ధి గాను ఉండాలి. ఉంటే తృప్తిచెందక ఇంకా ఇంకా శుద్ధిగా ఉండాలి. అంతఃకరణ బహిఃకరణ శుద్ధిగా ఉండాలి. మనం ఈ విషయం చాలా సులభంగా మరచిపోతాం. సమస్యల గురించి కాకుండా, సమస్యలరూపంలో ఉన్న దైవం గురించి ఆలోచించడం నిజమైన పరిష్కారం. సతతము ఆయనయందే మనసు నిలిపిన వాడికి ఆయనయందు విశ్వాసం ఉంటుంది. మనం చేరుకోవడం అహంకారం. ఆయన వచ్చి మనలను చేరుకోవడం నిరహంకారం.

"నా ఆత్మ, అంతరాత్మ పరిశుద్ధంగా ఉంది" అంటే 'నీకే తెలిసిపోయిందా నీ అంతరాత్మ పరిశుద్ధంగా ఉందని' అని అంటాడేమో అని, 'నాకు అట్లా తోస్తున్నది' అన్నది. అందుచేత 'ఆయన తప్పకుండా వస్తాడు. ఆయన వచ్చి నన్ను రక్షిస్తాడు' అని ఆమెకు దృఢంగా భావన కలిగింది.)

సీతతో హనుమంతుడు “ఓ దేవీ! నేను పోయి చెప్పీ చెప్పడంతోటే రామప్రభువు వానరసేనా సమూహాలతోనూ, భల్లూక సేనా సమూహాలతోనూ బయలుదేరి వస్తాడు. ఓ సుందరాననా! అట్లాకాదు అనేట్లయితే ఇప్పుడే నిన్ను యీ దుఃఖము నుంచి నేను తప్పించివేస్తాను. నీవు నా వీపుమీద కూర్చో, నీతో కూడ నేను ఈ సముద్రాన్ని దాటిపోతాను. నా శక్తి యేమి అని చెప్పేది? రావణా సురుడితో కూడా ఈ లంకా పట్టణాన్ని నా వీపుమీద పెట్టుకొని సముద్రాన్ని దాటిపోగలను.”

(రావణాసురుడిని మొత్తం లంక అంతటినీ కూడా నా వీపుమీద పెట్టుకుని తీసుకు వెళ్ళిపోగలను. నా గురించి నేను ఏమని చెప్పుకోగలను? చెప్పుకుంటే బాగుండదు. కానీ హను మంతుడు చెప్పుకోవచ్చు. కానీ చెప్పుకోలేదు కదా! ఏమంటే, ‘నేను శివ ప్రజ్ఞని, పుట్టడంతోనే బంగారు శరీరంతో పుట్టాను. నన్ను కడుపులో ఉండగానే వాలి చంపాలని ప్రయత్నించాడు....” ఇలా అన్నీ చెప్పుకోవచ్చు కానీ చెప్పుకోలేదు కదా! దూత తన గురించి చెప్పుకోడు. తాను ఎవరి ప్రతినిధిగా వచ్చాడో వారి గురించి చెప్తాడు. కానీ ఈవిడకి దుఃఖం పోవాలంటే, నేనే ఈ పని చేయ గలను అని ధైర్యం ఇవ్వడానికి చెప్తాడు. ఏ సద్గురువు కూడా నా శక్తి ఇంతటిదీ అని చెప్పడు. ఏదో కొంచెం చూచాయగా తెలియ పరుస్తాడు తప్ప నేనింతవాడినీ, అంతవాడినీ అని చెప్పుకోడు. చెప్పుకుంటే సద్గురువు కాడు.

ఆత్మస్తుతి చేసుకునేవాడు సద్గురువు కాడు. గురు ధర్మం బ్రాహ్మణ ధర్మం. క్షాత్ర ధర్మం రక్షిస్తే బ్రాహ్మణ ధర్మం దానికి

దోహదం చేస్తుంది. వశిష్ఠుడే తలచుకుంటే ఏది అవదు? అంటే, క్షాత్రాన్ని నిర్వహించవలసినవాడు దాన్ని సక్రమంగా నిర్వహించ లేకపోతే అప్పుడు బ్రాహ్మణ ధర్మం రంగంలోకి దిగుతుంది.

రాముడు వెంటనే వస్తాడు. అందరినీ చీల్చి పారేస్తాడు. నిన్ను తీసుకుని వెళ్ళిపోతాడు అని, అలా కాదంటే ఇప్పుడే నిన్ను ఈ దుఃఖం నుండి తప్పించి వేస్తాను అంటాడు. ఇదీ బ్రాహ్మణ ధర్మం, బ్రహ్మ ధర్మం.

బ్రహ్మధర్మం, క్షాత్రధర్మం తెలియాలంటే కర్దమ ప్రజాపతి, స్వాయంభువ మనువుల సంభాషణ చదవాలి భాగవతంలో. మనువులందరూ క్షాత్ర ధర్మం కలిగినవారు. ప్రజాపతు లందరూ బ్రహ్మ ధర్మం కలిగినవారు. బ్రహ్మధర్మం ముందు క్షాత్రధర్మం ఎలా వినయ విధేయతలు కలిగి వుంటుందో స్వాయంభువ మనువు కర్దముడి ముందు ఆ విధంగా ప్రవర్తించి చూపిస్తాడు. ఆయనే చెప్తాడు. "మీరు సరాసరి భగవంతుని ముఖం నుండి వచ్చినవారు, మీరు బ్రహ్మవేత్తలు. మేము భగవంతుని యొక్క సృష్టిలో ధర్మాన్ని రక్షించడానికి ఆయన యొక్క బాహువుల నుంచి వచ్చినవారము, మేము ధర్మ రక్షకులము. మీకూ మాకూ మధ్య సత్సంబంధాలుండాలి. మేమేదైనా పొరపాటు చేస్తే మీరు సరిదిద్దాలి.

ఇలాంటి భాషణం 'పురుషమేధం'లో మాస్టర్ ఇ.కె. గారు వ్రాసి ఇచ్చారు. క్షాత్రధర్మం నశించినప్పుడు బ్రాహ్మణ ధర్మమే క్షాత్ర ధర్మాన్ని కూడా నిర్వహిస్తుంది. పరశురాముడు అలా

నిర్వర్తించి క్షాత్ర ధర్మ దోషాలను నిర్మూలించడానికి యుగాలకొద్దీ- కృతయుగ సంధికాలం నుంచి త్రేతాయుగ సంధికాలం వరకూ, రాముడు వచ్చేవరకూ తపస్సు చేస్తాడు. అంతే కాదు, ద్వాపర యుగంలో కూడా ఆయన తపస్సు కొనసాగుతుంది. అంత కోల్పోవాలి. అందుకని వాళ్ళు దిగరు. అందుకనే విశ్వామిత్రుడు కూడా బ్రాహ్మణ ధర్మాన్ని అంటే బ్రహ్మ ధర్మాన్ని తానంగీకరించి నందువల్ల, తనకుండే సమస్త శక్తులూ రాముని కందించాడే తప్ప, తనకు తాను రావణుని మట్టు పెట్టాలని చూడడు. అలాగే హను మంతుడు కూడా బ్రహ్మ ధర్మంలో ఉన్నవాడు. రాముడికి సాయం చేయటమే తప్ప, తనకు తానుగా ఏమీ చేయడు. కానీ ఒకవేళ రాముడు చేయలేని పరిస్థితి వచ్చినా, సమయం మించిపోతోందనే స్థితి వచ్చినా నేనే ఇదంతా చేసేయ గలనమ్మా అని చెప్పడంలో ఉద్దేశం అది.

శివధర్మం మనకి బ్రహ్మ ధర్మంగా, విష్ణుధర్మం క్షాత్ర ధర్మంగా చెబుతారు. విష్ణువు పరిపాలకుడు. అందుకనే సృష్టిలో అధర్మాన్ని తొలగించి ధర్మాన్ని రక్షిస్తూ ఉంటాడు. శివుడు దానికి అతీతుడు. అందుచేత ఆయన అందరికీ ఒకే విధంగా ప్రతిస్పందిస్తాడు. సజ్జనులకూ వరాలిస్తాడు, దుర్జనులకూ వరాలిస్తాడు. సజ్జనులు దుర్జనులు అన్న భావం బ్రహ్మ ధర్మంలో లేదు. ఈ సృష్టి ఎందు కంటే, పరిపాలనకి ఆవల అందరూ జీవులే. "అందుచేత దుష్టాత్ము లకు ఇటువంటి వరము లీయరాదు" అని విష్ణువు చెబితే, 'అలాగే' అని మర్నాడు వస్తే, వరమిచ్చేస్తాడట శివుడు. ఒక భస్మాసురుడి కిచ్చి, దాని పర్యవసానం తెలిసినప్పుడు మళ్ళా రావణాసురుడికి,

హిరణ్యకశిపుడికి ఇవ్వకూడదు కదా! ఎవరు వచ్చి అడిగినా, వారికి ఇవ్వకూడదు అనేది ఏమీ వుండదు. శుక్రాచార్యుడంతటివాడు, బృహస్పతికి సరిసమానమైన వాడు. రావణుడు మళ్ళీ చాలా తీవ్రంగా ప్రార్థన చేసి, నాకేదైనా మార్గం చూపించంటే, నువ్వు ధర్మం వైపు లేవు, అందుకని నీకు మరో మార్గం చూపించినా గెలవవు. కానీ నీవడిగావు కాబట్టి, నేనివ్వవలసిన ధర్మం ఉన్నది కాబట్టి ఒక హోమం చెప్తాను. దానిని రాత్రి పూట నిరంతరాయంగా చేసుకోవాలి. పగటి పూట యుద్ధం చేసుకోవచ్చు అని చెప్తాడు. అది తెలిసిన హనుమంతుడు ఆ హోమాన్ని భగ్నం చేస్తాడు. శుక్రాచార్యుడు అదేమిటి అలా చేయవచ్చా అంటే, అది బ్రాహ్మణ ధర్మం అన్నాడు. బ్రహ్మధర్మం అలా ఉంటుంది.

అలాగే విదురుడున్నాడు. ఆయన నిర్వహించేది బ్రహ్మ ధర్మం. ధర్మాధర్మాలు చెప్పడం వరకే తప్ప, యుద్ధం చేయటమనేది ఆయనకి ఉండదు. ఇలా ధర్మాలు రకరకాలుగా ఉంటాయి. మనకి మామూలుగా అర్థం కావు. మనలో శుద్ధి పెరిగినకొద్దీ అవన్నీ తెలుస్తాయి. అందుకని హనుమంతుడు అన్నాడు. అంటే అతను సరాసరి శివుడే. ఎప్పుడు అవతారమూర్తి దిగివచ్చినా, శివాంశ కూడా దిగివచ్చి దోహదం చేస్తుంది. అందుచేత ఒకవేళ అలా కుదరకపోతే, నేనే ఈ పని చేసేస్తాను అని ధైర్యం చెప్పటానికి ఈ మాటలు చెప్తాడు. హనుమంతుడితో శివాంశ కూడా ఉండడం వలన అలా అనగలిగాడు.)

"ఓ మైథిలీ! వ్రేల్చిన హవిస్సును అగ్నిహోత్రుడు తీసుకొని

పోయి దేవేంద్రుడికి ఇచ్చేటట్టు నిన్ను నేను మోసుకొనిపోయి ఆ రామప్రభువుకు సమర్పిస్తాను.

(రాముడు దేవేంద్రుడైతే నేను అగ్నిహోత్రుణ్ణి అని చెప్తున్నాడు. అగ్ని అంటే శివుడే. వేదాల్లో శివుణ్ణి అగ్ని అంటారు.)

"రాక్షస సంహారానికి లక్ష్మణుడితోకూడా ప్రయత్నం చేస్తూ వున్న మహావిష్ణువు వంటి రామప్రభువును నీవు ఇప్పుడే చూస్తావు. ఐరావత శిరంమీద కూర్చున్న దేవేంద్రుడివలె ప్రశ్రవణ పర్వతం మీద కూర్చుని నిన్ను చూడవలెను అని తహతహ లాడుతూ వున్న ఆ మహాబలవంతుడు రామప్రభువు నిన్ను ఇప్పుడే చూస్తాడు.

"ఓ మంగళస్వరూపిణీ! నీవు నా వీపుమీద కూర్చో! నా మాట ఉపేక్షించవద్దు. ఆ రామ ప్రభువు దగ్గరకు నిన్ను తీసుకొని పోతాను. మనోజ్ఞుడైన చంద్రునితోనూ, అమిత కాంతిమంతుడైన సూర్యుడితోనూ నీవు మాట్లాడుతూ వున్నట్లుగా ఉంటుంది. అంతలో నేను ఈ సముద్రాన్ని ఆకాశమార్గంలో దాటిపోతాను. ఓ దేవీ! నేను ఇక్కడనుంచి తీసుకొని పోయేటప్పుడు రాక్షసులు చూచినా ఇబ్బంది ఉండదు. నా అంతటి గమనవేగము కలవాడు ఈ లంకాపట్టణ ములో ఎవడూ లేడు. నన్ను వెంబడించి రాక్షసులు పట్టుకోవడము ఉత్తది. నేనెంత సులభంగా ఇక్కడికి వచ్చానో, అంత సులభంగా నిన్ను నా వీపున ఎక్కించుకొని ఆకాశమార్గాన సముద్రాన్ని దాటి పోతాను. సందేహపడవద్దు" అని చెప్పాడు.

హనుమంతుడు చెప్పిన ఈ మాటకు సీతాదేవి ఎంతో

సంతోషపడ్డది. ఆశ్చర్యంతోనూ, సంతోషంతోనూ ఆమె దేహము ఉప్పొంగి పోయింది.

"ఓ హనుమంతుడా! నీవు నన్ను అంత దూరం ఎట్లా మోసుకొనిపోతావు? నీవు చేయదలచుకొన్నది పరమ సాహసకృత్యంగా నాకు తోస్తున్నది. నీది కాస్త దేహము. నా భర్త దగ్గరకు ఎట్లా మోసుకొనిపోవలె ననుకున్నావు?" అని సీతాదేవి ప్రశ్నించింది.

ఆ కాంతిమంతుడు, మారుతాత్మజుడు సీతాదేవి అట్లా ప్రశ్నించినందువల్ల, తనను ఆమె తక్కువవాడిగా భావిస్తున్నది అనుకున్నాడు. "ఈ హసితేక్షణ నా బలము ఎరుగదు. నా ప్రభావము ఎరుగదు. నేను ఎంత శక్తిమంతుణ్ణి అయిందీ ఈమె ఊహించలేదు. ఈమె నా మహదాకారము చూస్తే సరిపోతుంది" అనుకొని ఆ అరిమర్దనుడు, ఆ ప్లవంగసత్తముడు, ఆ వాయు పుత్రుడు హనుమంతుడు తన మహదాకారము చూపించడానికి ఆ చెట్టు అవతలకు ఎగిరి తన దేహాన్ని పెంచడము మొదలుపెట్టినాడు. మేరుమందర పర్వతాల అంత ఎత్తు జ్వలితాగ్నిహోత్ర కాంతులతో ఆ సీతాదేవి ఎట్టఎదుటికి పోయి హనుమంతుడు నిలుచున్నాడు. ఆ మహా బలవంతుడు ఎర్రటి ముఖముతోనూ, వజ్రాయుధాల వంటి కోరలతోనూ, పెద్దపులి గోళ్ళవంటి గోళ్ళతోనూ, పరమ భయం కరమైన ఆకారంతో నిలుచుని చేతులు జోడించి సీతాదేవితో, "ఓ దేవీ! పర్వతాలతోనూ, వనాలతోనూ, కోట బురుజులతోనూ, బహిర్ద్వారాలతోనూ ఉన్న ఈ లంకాపట్టణాన్ని రావణాసురుడితో కూడా ఎత్తుకునిపోయే శక్తి నాకు ఉంది. ఓ మంగళ స్వరూపిణీ!

నీ బుద్ధి స్థిరము చేసుకో. ఉపేక్షించవద్దు. ఆ రామప్రభువు దుఃఖం రూపుమాసిపోతుంది” అని చెప్పినాడు.

ఆ పద్మపత్ర విశాలాక్షి ఆ భయంకరాకారుణ్ణి, మారుతాత్మజుణ్ణి చూచి “ఓ మహావీరుడా! నీ ధైర్యమూ, నీ బలమూ, వాయువు వంటి నీ గమనశక్తి, అగ్నిహోత్రుని వంటి నీ తేజమూ చూస్తున్నాను. నిన్ను తెలుసుకొంటున్నాను. నీవు ఇంతవాడవు అయినందువల్లనే అంతులేని సముద్రాన్ని దాటి ఇక్కడకు వచ్చినావు. నన్ను మోసుకుని పోయే సామర్థ్యం నీకు ఉంది. అయితే, నీవు వచ్చిన పని అయింది. ఇక ఆ మహాత్ముడి కార్యసిద్ధిని గురించే నీవు అవశ్యమూ ఆలోచించవలెను.

“ఓ పుణ్యాత్ముడా! నేను నీతో బయలుదేరడం మంచిపని కాదు. నీవు వాయువేగంతో ఎగిరిపోతూ ఉంటే నాకు ఒళ్ళు తెలియకుండా పోతుంది. నీవు అమితవేగంతో సముద్రము మీద ఆకాశమార్గాన పోతూ ఉంటే, నాకు భయమువేసి నీ వీపుమీద నుంచి నేను జారి సముద్రములో పడిపోతే పడిపోవచ్చును. అట్లా ఒళ్ళు తెలియకుండా సముద్రములో పడిపోగానే తిమింగలాలూ, నక్రాలూ, మత్స్యాలూ నన్ను మ్రింగివేస్తాయి. ఓ హనుమంతుడా! శత్రువులను నాశనము చేసే శక్తి నీకు ఉంది. కానీ నీతో వచ్చే సాహసము నేను చేయను. నీవు వెంట మరి ఒకరిని తీసుకుని పోయేటట్లయితే, నీవు సురక్షితంగా పోగలవో లేదోనని నాకు సందేహంగా ఉంది. నీవు నన్ను వీపున ఎక్కించుకొని ప్రయాణం కాగానే ఆ దుష్టాత్ముడు రావణాసురుడు నిన్ను పట్టుకోవలసింది

అని భయంకరులైన రాక్షసులను ఆజ్ఞాపిస్తాడు. వాళ్ళు అప్పుడు నీ వెంటపడతారు.

“ఓ వీరుడా! శూలాలతోనూ, ముద్గరాలతోనూ, వివిధా యుధాలతోనూ రాక్షసశూరులు నీ చుట్టూ మూగుతారు. నన్ను తీసుకుని పోయేటట్లయితే అటువంటి అప్పుడు నీ పని ఏమవు తుందోనని నాకు సందేహంగా ఉంది. అనేకమంది రాక్షసులు సాయుధులుగా ఆకాశంలో నిన్ను చుట్టుముట్టితే నీవు ఒంటరి వాడవూ, నిరాయుధుడవూ నన్ను కాపాడుతూ ఎట్లా పోరాడుతావు? నీవు ఆ క్రూరకర్ములతో పోరాడుతూ ఉంటే, నేను భయార్తనయి నీ వీపుమీదనుంచి క్రిందపడిపోతే పడిపోవచ్చును. రాక్షసులు భయంకరులు, వాళ్ళు అందరూ మహాకాయులు, మహాబలవంతులు, పోరాటములో ఎట్లాగైనా నిన్ను జయిస్తారు. ఒకవేళ అట్లా కాకపోయినట్లయితే నీవు యుద్ధం చేస్తూ పరవశుడవయితే నేను క్రిందపడిపోతాను. ఆ పాప రాక్షసులు అప్పుడు నన్ను పట్టుకుని పోతారు.

“ఓ హనుమంతుడా! యుద్ధంలో జయాపజయాలు ఎవరూ ముందుగా నిర్ణయించలేరు. నీవు జయించలేకపోయేటట్లయితే, రాక్షసులు నీ చేతులలో నుంచి నన్ను లాగుకొనిపోయి ముక్కలు ముక్కలుగా నరికి వేస్తారు. లేదా నన్ను పట్టుకుని నాకు ప్రాణాపాయం అయ్యేట్టు బాధ పెడతారు. అట్లా అయ్యేటట్లయితే, నీవు ఇంత దూరమూ శ్రమపడి వచ్చి చేసిన ప్రయత్నమంతా నిష్ఫల మయిపోతుంది.

"ఓ మతిమంతుడా! నీవు సర్వ రాక్షసులనూ చంపివేయ కలవు. నన్ను అవలీలగా తీసుకొని పోగలవు. అట్లా నీవు నన్ను తీసుకుని పోయేట్లయితే రామప్రభువు కీర్తి పాడైపోతుంది. జన స్థానములో రావణాసురుడు మాయ సన్యాసి వేషం వేసుకుని వచ్చి భార్యను దొంగిలించుకునిపోతే, ఆ దుష్టాత్మ్మణ్ణి యుద్ధములో వధించలేక రామప్రభువు ఒక వానరుణ్ణి పంపించి రావణాసురుడి మాదిరిగానే దొంగిలించేట్టు చేసి భార్యను సంపాదించుకొన్నాడు అని శూరులు హేళన చేస్తారు.

"అట్లా కాకపోయేట్లయితే నీవూ, నీతోపాటు వానరులూ, రామలక్ష్మణులూ కనుక్కోలేని రహస్య ప్రదేశాలలో రాక్షసులు నన్ను దాచి పెడతారు. అప్పుడు నీవు నాకోసం చేసిన ప్రయత్నమంతా నిరర్థకమైపోతుంది. అందువల్ల, నీవుపోయి చెప్పు. ఆ రామ ప్రభువును నీ వెంట పెట్టుకొని వస్తే ఎంతైనా బాగుంటుంది. ఓ హనుమంతుడా! ఆ మహాత్ముడి రామప్రభువు ప్రాణమూ, ఆయన తమ్ముల ప్రాణాలూ, సుగ్రీవుడి ప్రాణమూ, ఆయన వంశీయుల ప్రాణాలూ నా క్షేమం మీద ఆధారపడి ఉన్నవి. నాకు ఏదైనా అపాయము అయ్యేట్టయితే దుఃఖంతో కృశించిపోతూ ఉన్న ఆ రామ లక్ష్మణులు బ్రతకటం ఉత్తది. వారే కాదు. అప్పుడు సమస్త భల్లూకవీరులూ, వానర వీరులూ ప్రాణాలు వదిలిపెడతారు.

"ఓ హనుమంతుడా! నాకు నా పెనిమిటి మీదవున్న భక్తివలన నేను రామప్రభువును తప్ప మరి ఒకరి దేహము తాకను."

(అంటే, 'వీరోచితంగా నున్న తీసుకువెళితే, అప్పుడు నేను వీర్యశృంఖ నవుతాను. అతను దొంగతనం చేసి తీసుకువచ్చాడు కాబట్టి, నేను దొంగతనంగా వెళితే ఆయనకేం కీర్తి? అందుకని నేనిక్కడే ఉంటాను, ఆయన్ని తీసుకు రా!' అని చెప్పిందామె. రెండు చెప్పింది. అవి 1. నేను నీతో వస్తే రాముడికి అపకీర్తి. 2. నాకొక ధర్మం ఉన్నది. నేను ఎవరి శరీరాలనూ ముట్టుకోను.)

"రావణాసురుడు నన్ను బలవంతంగా పట్టుకొన్నాడు. అప్పుడు ఏమి చేయడానికి నాకు శక్తి లేకపోయింది. నా పెనిమిటి ఎక్కడ ఉన్నాడో అనే దిగులులో ఉన్నాను. నేను వివశనై ఉన్నాను. ఏమి చేసేది? రామప్రభువు ఇక్కడకు వచ్చి రావణాసురుణ్ణి సబాంధవంగా సంహారము చేసి నన్ను ఇక్కడనుంచి తీసుకుని పోయేటట్లయితే ఆయన గౌరవానికి, శౌర్యానికీ తగినట్లుగా ఉంటుంది. ఆ మహా పరాక్రమవంతుడు రామప్రభువు యుద్ధంలో శత్రువులను మర్దించే పరమ పరాక్రమ కృత్యాలను గురించి విన్నాను. వినడమే కాదు, స్వయంగా చూశాను. దేవ దానవ యక్ష రాక్షస గరుడ గంధర్వులలో ఏ ఒక్కడూ ఆయనకు సాటి అయిన వాడు లేడు. ఆ మహాబలవంతుడు, దేవేంద్రుడితో సరిసమానమైన ఆ పరమ పరాక్రమవంతుడు రామప్రభువు చిత్ర విచిత్రముగా మెరిసే కార్ముకము తీసుకొని గాలికి చెలరేగిన అగ్నిహోత్రమువలె మంటలు మండుతూ తమ్ముడితో కూడా యుద్ధంలో నిలుచుంటే, ఆయన వంక ఎవడు తేరిపార చూడగలడు?

"ఆ రామప్రభువు యుద్ధంలో శత్రువులను మర్దిస్తూ, మదపు టేనుగువలె విహరిస్తూ, సూర్య కిరణాలవంటి బాణాలతో

ప్రళయ కాల సూర్యుడి వలె విజృంభిస్తే ఎవడు బ్రతికి ఉండ గలడు?

"ఓ హనుమంతుడా! నీవు నా పెనిమిటి రామప్రభువునూ, లక్ష్మణుణ్ణీ, వానరసేనా సమూహాలనూ వెంటనే ఇక్కడికి తీసుకునిరా! ఎంతో కాలమునుంచి దుఃఖంతో కృశించిపోతూ ఉన్న నన్ను సంతోషపెట్టు" అని సీతాదేవి చెప్పింది.

(ఇందులోకూడా మనకి ఒక రహస్య మున్నది. అహంకార పురుషుని సంహరిస్తే తప్ప జీవునికి ముక్తి లేదు. తప్పించుకుంటే ఉపయోగం లేదు. తప్పించుకుంటే అహంకార పురుషుడు మళ్ళీ చెలరేగి ఇంకోరకంగా జీవుడిని బంధిస్తాడు. జీవుడిలో భాగమే అహంకారం. వాడిని, వాడి సైన్యాన్నీ దైవస్పర్శచేత నిర్మూలిస్తే కాని, జీవుడు నిరహంకారి కాడు. అందుచేత ఆ విధంగా దైవమే వచ్చి నాకు ఈ విధంగా ముక్తి ప్రసాదిస్తే బాగుంటుంది తప్ప వేరే పద్ధతి బాగుండదు. పుణ్యక్షేత్రాలకు, సద్గురు సందర్శనాలకు వెళ్ళినప్పుడు, అహంకార ప్రజ్ఞ వెనకబడి వినయము, భక్తి ఆషాఢభూతి లెవెల్‌లో చూపిస్తూ వుంటాము. అది దాటి రాగానే అది కబళించి వేస్తుంది. మళ్ళీ మొదటికి వస్తాము.

గుళ్ళో గుంజీలు తీస్తారు, లెంపలు వాయించుకుంటారు, బయటకు రాగానే ఆటో వాడితో తగవు పెట్టుకుంటారు. అందుకని గుమ్మం దాటి లోపలికి వెళితే, ఎంతసేపు ఉంటాడులే, బయటకు రాగానే పట్టుకుందామని చూస్తూ ఉంటుంది అహంకార ప్రజ్ఞ. అందుకని ఈ అహంకార ప్రజ్ఞను, దానియొక్క సైన్యంతో

సహా దైవస్పర్శ చేత నిర్మూలనం కావిస్తే తప్ప జీవికి మోక్షం లేదు అనేది ఇందులో అంతర్గతంగా గోచరిస్తూ ఉంటుంది.

అందుచేత గురువు చేత ఉద్ధరింపబడినా, శిష్యుడు ఆ స్థితియందు నిలబడగలగాలి. గురువు సాన్నిధ్యంలో శిష్యుడు అహంకారం కలిగి ఉండడు. కానీ, ఒకసారి గురువు మరుగవగానే అహంకారం మళ్ళీ వచ్చి చేరుతుంది. సమస్త విద్యలూ వినయంగా నేర్చుకున్న శిష్యుని, మిగతా సాధన అంతా గృహస్థాశ్రమం స్వీకరించి నీ అహంకారాన్ని నీవే జయించు అంటాడు. అప్పుడు భగవదనుగ్రహం చేత తన అహంకారాన్ని పరిపూర్ణంగా నిర్మూలించుకోవటం వల్లనే ముక్తి. రాముడు వచ్చి వీళ్ళందరినీ సంహరించడమంటే, దైవస్పర్శ తగలగానే మన వరకూ అసుర స్పర్శ నిర్మూలింపబడుతుంది. అదే సరైన మార్గం తప్ప నేనేదో నీతో పారిపోయి వచ్చేస్తే ఉపయోగం లేదు, అంటుంది సీతాదేవి. అంటే దైవమును నమ్మినదాన్ని మరొకరి సహాయం పుచ్చుకోవడమనేది భక్తి కాదు కదా! అందుకే సద్గురువును ఆశ్రయించిన వాళ్ళు ప్రపంచంలో ఇంక ఎవరినీ, దేనినీ అడక్కూడదు. అది ఒక దీక్ష. భార్యాభర్తల సంబంధంలాంటిదే గురుశిష్య సంబంధం. అలాగే ఒక సద్గురువు పాదాలను ఆశ్రయించిన తర్వాత కూడా ఇంకా అక్కడకి ఇక్కడకీ పోయి అడుగుతున్నా మనుకోండి, ప్రయోజనం సున్నే!

ఒకచోట ఒక దీక్ష అందుకున్న తరువాత వాడే అంతా. అలాగే ఇక్కడ సీత రాముణ్ణి శరణు జొచ్చింది. 'కష్టాలున్నాయండీ, భయమేస్తోంది' అంటే 'రామనామం చేసుకోండి' అని ఎవరైనా దీక్ష ఇచ్చి, ఉపాసన ఇచ్చారనుకోండి. ఈ లోపల ఎవడో వచ్చి రాముడు

కాదండీ, నవగ్రహాలను బట్టి మీకు శని బాగోలేదనో, రాహువు బాగోలేదనో చెప్పారనుకోండి, ఈ రాముణ్ణి వదిలేసి, ఆ రాహువు వైపో కేతువు వైపో చూస్తూ ఉంటాం. ఇప్పుడు ఆ రామునికంటే వీళ్ళెక్కువైపోయారు. ఆ రాముడు అట్లా చూస్తూంటాడు. అంతే కాదు, మరోచోట తాయెత్తు కట్టుకుంటే ఆ తాయెత్తుని చూసి రాముడు నవ్వుకోవాలన్నమాట! అటు రాముడంటూంటాడు, ఇటు తాయెత్తంటాడు. మళ్ళా దేనిచుట్టూనో తిరుగుతుంటాం!

ఏదో ఒకటే. అంటే నీలో నియతి ఉంటే, నీలో నమ్మక ముంటే ఆ నమ్మకమే నిన్ను రక్షిస్తుంది. దైవానికి ఏ రూపమైనా ఏ నామమైనా ఒకటే. అంతా ఒకటే. పదార్థం వండి పెట్టుకుని, ఇది కాదు మరొకటి వండుకుంటే కడుపు నిండుతుంది అని అది వండి, అది కాదని మరొకటి, ఇలా వండుకోవటమే జరుగు తూంటుంది. రుచి ఎప్పుడు చూస్తావు? అందుకే 'రాముడే పరమ ధర్మము నాకటంచు' కూర్చుంది ఆవిడ. అందుకే 'రాముడే వచ్చి రక్షించుకుంటాడయ్యా! నన్ను' అని అంది. ఇది శరణాగత మార్గం. దైవాన్ని ఆ విధంగా ఆశ్రయించిన వాళ్ళను వాళ్ళే రక్షించు కుంటారు. ఏదైనా ఒకటి పెట్టుకుంటే, ఏమి చేసినా అదే అనుకోవాలి. తిట్టనివ్వండి, కొట్టనివ్వండి, చావనివ్వండి, అక్కడే పడుండాలి. అది ఒక వ్రతం. అది ఒక దీక్ష. అలా వున్న వాళ్ళకి ఎవరూ ఏ అపకారమూ చేయలేరు.

మార్కండేయుడు ఈ కోవకు చెందినవాడు. మార్కండేయుణ్ణి శివలింగం వదల వద్దని చెప్పారు. ఆ యముడు వచ్చినా వదల్లేదు. పాశమేస్తే వదల్లేదు. పీకినా రాలేదు. ఐనాకూడా చాలాసార్లు

ప్రయత్నించాడు. నానా భయంకరంగా బాధ పెడ్తూంటే, శివు డొచ్చి, 'ఏమిటి అర్థం కాలేదా? ఇప్పుడు పాశమేస్తే వాడిమెళ్ళో పడలేదుట అంటే, నీకర్థం కావద్దూ ఇది నీ పని కాదనీ' అంటాడు. ఐనా ఇంకా పాశం వేస్తూంటే, 'ఇంకోసారి పాశమేశావంటే పొడిచేస్తా!' అన్నాడు శివుడు. అందుచేత ఏది నమ్మకముంటే అదే ఉండాలి. నీ నమ్మకమే నీ గురువు. నీ నమ్మకమే నీ దైవం. అలా సీతాదేవి నిశ్చల భక్తిని చూపిస్తుంది.

హనుమంతుడు 'నా వీపుమీద కూర్చుంటే నిన్ను రాముడి వద్దకు చేరుస్తా'నన్నపుడు, సీతాదేవి వస్తానంటే తీసుకువెళ్ళేవాడు కాదేమో! ఈవిడింతేనా అనుకుంటాడు. ఇంత పతివ్రత పరపురుషుణ్ణి ఎలా తాకుతుంది? ఊరికే ధైర్యంకోసం చెప్పాడు. 'ఆయన వచ్చేలోపల నిన్ను మింగేస్తాడేమోనన్న భయం నీ కుండడం చేత ఇలా చెప్తున్నాను తప్ప, నీవు చెప్పినదే సరియైన విషయం' అంటాడు. అందుకని మనకి వ్రతం, ఒక పాతివ్రత్యం, వ్యభిచారం లేని జీవితం అయి ఉండాలి. పతివ్రతలు తమ పాతివ్రత్యం చేత పతిని రక్షించుకున్నారు. దైవానికి జీవునికీ అలాంటి సంబంధమే ఉంటుంది. మాస్టర్ ఇ.కె. గారు, 'నీ మొగుడు నీకు మగవాడే. అలాగని ఇతరులంతా మగవాళ్ళు కాకపోలేదు. నీకు ఈయనే మొగుడు' అనేవారు. ఆ పరిధి గుర్తించి వాటిని మన్నించుకుంటూ ఉంటే ఏ బాధ ఉండదు. ఇతర గురువులను నిందించకూడదు. మిగతా గురువులు నా గురువులాంటి వారు కాదనటం తప్పు.

సీతాదేవి దీక్షలో ఉన్నటువంటి వ్యక్తి. అందువల్ల హను మంతుడు రమ్మన్నా అతనితో బయలుదేరలేదు. అందులోని ధర్మం

మనం అర్థం చేసుకోవాలి. రామాయణం చదువుకుంటున్నప్పుడు ధర్మాలు వచ్చినచోట కాస్త ఆగి వాటి గురించి విచికిత్స చేసుకుంటూ, విచారణ చేసుకుంటూ చదువుకోవాలి. ఆ విధంగా విచారణ చేసుకుంటే అమ్మవారు హనుమంతుడితో అన్న మాటలు అర్థమవుతాయి.)

సీతాదేవి చెప్పిన మాటలు ఆ వాక్య విశారదుడు హనుమంతుడు విన్నాడు. సంతోష పడ్డాడు. ఆమెను చూచి, "ఓ దేవీ! నీ దర్శనం శుభప్రదము."

(ఒకసారి ఒక గురువుగారి దగ్గరకు వెళ్ళినపుడు సద్గురువు దర్శనం చాలా ఆశీఃఫలమని నేనంటే సత్శిష్యుల దర్శనం కూడా అంతే అని ఆయన అన్నారు. ఎందుకంటే గురువులు చాలామంది ఉంటారు. సరియైన శిష్యులు కనబడరు. సద్గురువుకోసం మామూలుగా జనులు ఎలా వెతుక్కుంటారో సదాచార సంపన్నుడైన ఒక శిష్యుడికోసం ఒక సద్గురువు అలా వెతుక్కుంటాడు. గురువు లెక్కువమంది ఉన్నారు. అట్లా సత్శిష్యుని దర్శనం కూడా గురువుకి చాలా శుభప్రదం. అందుకే కదా! రామకృష్ణుడు వివేకానందుని చూసి అమితంగా ఉబ్బిపోతూంటాడు.)

"నీ స్త్రీ స్వభావానికీ, పతివ్రతవు అయిన నీ అణకువకూ తగినట్టుగా చెప్పినావు."

(ఇక్కడ స్త్రీ స్వభావ మనవచ్చు, శిష్యుని స్వభావ మనవచ్చు. శిక్షణ కోసం ఎంతమంది గురువులనైనా ఆశ్రయించవచ్చు. దీక్ష మాత్రం ఒక గురువు దగ్గరే పుచ్చుకోవాలి. కనపడిన ప్రతివారి

దగ్గరా దీక్ష పుచ్చుకోవడం తప్పు. ఎందుకంటే రకరకాల మహాత్ము లను కలిసినప్పుడు మనకి రకరకాల విషయాలు తెలుస్తూంటాయి. అవన్నీ మనం అందుకొని త్వరితగతిని మన దీక్షని పూర్తి గావించు కుని సిద్ధిని పొందవచ్చు. ఆ తేడా తెలియకపోతే ఏమవుతుంది? ప్రతి చోటా దీక్ష పట్టినట్టవుతుంది. అన్ని దీక్షలుండవు. ఒకటే దీక్ష ఉంటుంది. "వినదగు నెవ్వరు చెప్పిన" అన్నట్లు ఎవరు చెప్పినా వినవచ్చు. మహాత్ములను దర్శించాలి, వారి ఆశీర్వచనం కావాలి, ప్రశ్నించాలి, తెలుసుకోవాలి. కానీ నీ గురువు నీ గురువే!)

"నా వీపుమీద కూర్చుని సముద్రంలో నూరు యోజనాల దూరము దాటిపోవడం ఏ స్త్రీకీ సాధ్యము కాదు."

(గురువుకి జీవుణ్ణి దైవం వద్దకు తీసుకుని వెళ్ళే శక్తి వున్నప్పటికీ జీవునికి ఆ శక్తి ఉండదు. ఒక్కసారి దైవదర్శనం కావింపచేసి ఆయనలో లయం కావించవచ్చు కదా! అని శిష్యుడు అంటే గురువు నవ్వుతాడు. ఎందుకంటే నీలో ఉండే అణువుల్లోని చేతనని బట్టి, నిన్ను తనలా తయారుచేసుకుని ఇటు వచ్చేందుకు చేయాల్సిన సాధన గూర్చి ఆయన చెప్తుంటారు. శిష్యుడి సాధనని గమనిస్తూ, ఇంకా సాధన కావాలి లేకపోతే దారిలోనే పేలిపోతా వంటారు.

మరువు మహర్షి అంతటివారు 'మేము కనబడకూడదని కాదు, మేము కనబడితే మీరు పేలిపోతారు. ఎప్పుడు మీకు కనబడదామా అని తహతహ లాడిపోతూంటాం. కానీ కనబడితే మీరుండరే!' అని అంటారు. వాళ్ళకి కూడా మనకి కనబడలేక

పోతున్నామనే దిగులు ఉంటుందిట! అందుకని అప్పుడప్పుడు ఒక వేలు, ఒక కాలు, ఒక కన్ను అలా కనిపిస్తుంటారు. 'అలా కొంచెం కొంచెంగా అలవాటు చేసి, నెమ్మదిగా క్రమశః మా రూపం చూపించాలి తప్ప, ఒక్కసారి నీవు చూశావంటే 'ఢాం' అని పేలిపోతావు అంటారు.

మామూలుగా ఒక సద్గురువు దర్శనం అయితేనే జ్వరం వస్తుంది. జబ్బు చేస్తుంది. ఎందుకంటే, లోపల ఉన్నవన్నీ బయటకు వస్తూంటాయి. అది అగ్ని వంటిది. అందుచేత ముందు నిన్ను బాగా వేడికి అలవాటు పడేలా చేసి, బాగా వేసవిలో కూడా చల్లగా వుంది అనేటటువంటి స్థితికి చేరుకుంటే ఎప్పుడో అప్పుడు మెల్లగా అటు పట్టుకు పోవచ్చు. అందుకని క్రమశః తయారు చేసుకోవాలి. 'నిన్ను నా వీపుమీద కూర్చోమన్నప్పుడు నీవు చాలా చక్కగా చెప్పావు. నా వేగానికి నా వీపుమీద ఎవ్వరూ కూర్చోలేరు. ఏ జీవికీ సాధ్యం కాదు'.)

"ఓ దేవీ! నీవు జనకరాజ పుత్రివి. రామ ప్రభువుని తప్ప అన్యుణ్ణి తాకను అని రెండవ కారణము చెప్పినావు. ఇది ఆ మహాత్ముడి భార్యవు అయిన నీకు అనుగుణంగా ఉంది. ఓ దేవీ! నీవు తప్ప మరి ఏ ఆడుదీ ఈ విధంగా చెప్పదు."

(ఏదో గట్టెక్కించడానికి ఎవరో వచ్చారు, వాడితో పోతే సరిపోతుంది అని అనుకోకూడదు. తనమీద తనకి నమ్మకం లేకపోయినా, తను నమ్మిన దైవం, గురువు మీద నమ్మకం లేకపోయినా, ఎవరు దొరికితే వారితో 'నువ్వే ఏదో దాటించేసేయ్!

తీసుకుపో' అంటే కుదరదు. 'అవదులే!' అంటాడు. 'ఊరికే నా సామర్థ్యం గురించి చెప్పడం తప్ప, నువ్వెక్కి రాలేవులే!' అంటాడు. ఆవిడ అదే చెప్పింది. 'జారిపోతానేమో' అని. 'నేను, అంత దూరం దైవాన్ని చేరంత దూరం నిన్ను పట్టుకు కూర్చోలేను' అంది. అది మర్కట న్యాయంగా ఉంటుంది. ఏమంటే, కోతి ఇష్టం వచ్చినట్టుగా ఎగురుతూ ఉంటుంది. ఈ చెట్టుమీదనుంచి ఆ చెట్టు మీదకు, ఇంతలోనే మరో కొమ్మమీదకు. ఆ పిల్ల పట్టుకు కూర్చోవాలి కదా! మరి ఈ కోతి సముద్రం దాటుతూంటే, 'ఈ వేగంలో పట్టుకుని కూర్చోవడం సామాన్యమా? అయ్యే పని కాదు కదా! అందుచేత అది వీలుపడే విషయం కాదులే!' అని చెప్తున్నాడు.)

"ఓ దేవీ! నీవు రావణాసురుణ్ణి తృణీకరించి అన్న మాటలు విన్నాను. నీవు నీ గొంతుకు ఉరి పెట్టుకోడానికి చేసిన ప్రయత్నమునూ చూశాను. ఇది అంతా నిరవశేషంగా ఆ రామప్రభువుకు విన్న విస్తాను. నాకు నీవు చెప్పిన సమాధానమూ చెప్తుతాను. ఓ దేవీ! అనేక కారణాల వలన నీవు దుఃఖపడడం కన్నులారా చూశాను. ఆ రామప్రభువు మీద నాకు ఉన్న స్నేహాతిశయం వలన నా మనస్సు కరిగిపోయింది. నేను నిన్నూ, ఆ ప్రభువునూ సంతోష పెట్టవలె ననుకున్నాను. అందువల్ల అట్లా నా వీపుమీద కూర్చోవలసింది అనీ, నేను తీసికొని పోతాను అనీ చెప్పాను. ఈ లంకా పట్టణానికి ఎవడూ రాలేడు. ఈ సముద్రము దాటి ఇక్కడికి రావడము అశక్యం. నా సామర్థ్యం నీకు చూపించవలె ననుకున్నాను. అందు కోసం అట్లా చెప్పాను. నాకు ఆ మహానుభావుడిమీద ఉన్న

భక్త్యావేశము, స్నేహాతిశయము వలన నిన్ను వెంటనే ఆయన దగ్గరకు చేర్చవలె ననుకొన్నాను, అట్లా చెప్పాను అంతే.

"ఓ దేవీ! నీకు నాతో కూడా రావడము ఇష్టం లేదు కనుక ఆ రామప్రభువు నమ్మకము కోసము ఆయన ఎరిగి వున్నది ఏదైనా ఒకటి గుర్తుగా ఇవ్వు" అని హనుమంతుడు అడిగినాడు.

ఆ విధంగా హనుమంతుడు కోరినదానికి దేవకన్య వంటి ఆ సీతాదేవి కన్నీళ్ళు కారుస్తూ, మాటలు తడబడుతూ, "ఓ హను మంతుడా! నేను నీకొక మంచి గుర్తు చెబుతాను. నా ప్రియుడికి ఆ వృత్తాంతము జ్ఞాపకం వస్తుంది. పూర్వము మేము చిత్రకూట పర్వతం మీద ఈశాన్య ప్రదేశాన, మందాకినీ తీరాన, కందమూల ఫలాలు సమృద్ధంగా దొరికేచోట సిద్ధాశ్రమం అనే ప్రదేశంలో ఋష్యాశ్రమంలో నివసిస్తూ వచ్చాము. అక్కడ నానావిధ పుష్ప సుగంధాలు గుబాళించే వనంలో మేము ఒకనాడు విహరించి నాము. జలక్రీడలతో ప్రొద్దుపుచ్చినాము. నా పెనిమిటి అలసిపోయి, నా తొడమీద తలపెట్టుకొని నిద్రపోయినాడు. అప్పుడు ఒక కాకి నా చుట్టూ తిరుగుతూ నన్ను ముక్కుతో పొడిచింది. నేను ఆ కాకిని మట్టిగడ్డతో కొట్టి తరిమినాను. అయితే ఆ కాకి అక్కడే దాక్కుంటూ మళ్ళీ మళ్ళీ రావటం మొదలుపెట్టింది. అది తెచ్చుకున్న మాంసాన్ని అవతలకి పోయి ముక్కుతో పొడుస్తూ, మళ్ళీ నా మీదికి వచ్చింది. ఆ కాకిని తోలడానికి నేను నా వడ్డాణము ఊడలాగుతుంటే, నేను కట్టుకున్న చీర జారింది. ఆ వడ్డాణపు చప్పుడుకు నా పెనిమిటి నిద్రలేచి, నన్ను చూచి ఎగతాళి చేసినాడు. నాకు సిగ్గు వేసింది.

కోపం వచ్చింది. ఏడ్చినాను. నా మాంసం తినడానికి వచ్చి నన్ను పొడుస్తున్న ఆ కాకిని తోలడానికి నా వడ్డాణం ఊడతీస్తే, నా చీర జారిపోతే నన్ను చూచి నవ్వినందుకు కోపగించుకుంటూ, ఆ కాకిని తోలక పోయినందుకు ఏడుస్తూ ఆయన ఒడిలో తలపెట్టుకొని పడుకున్నాను. నేనప్పుడు చాలా సేపు నిద్ర పోయినాను. ఆ తరువాత ఆయన నన్ను నిద్రలేపి, నా తొడపై తాను పడు కున్నాడు. ఆ కాకి మళ్ళీ వచ్చి, నా స్తనాంతరములో గోళ్ళతో గీకింది. అదట్లా పైకెగురుతూ, క్రిందకు వస్తూ ముక్కుతోను, గోళ్ళతోను గీరుతూ వుంటే, రక్తము ఆయన మీద పడ్డది. ఆ రక్తానికి తడిసి, సుఖంగా నిద్రపోతున్న ఆ పరంతపుడు, ఆ కాంతి మంతుడు నిద్రలేచినాడు. ఆ మహాబాహువు అప్పుడు నా స్తనాల మధ్య గాయాన్ని చూచి కృద్ధుడయ్యాడు. త్రాచుపాము బుసలవలె నిట్టూర్పులు విడుస్తూ, 'ఓ దేవీ! నీ స్తనాంతరములో గాయం చేసిన వాడెవడు? కోపంతో చెలరేగిన పాముతో ఆటలాడుతున్న వాడెవడు?' అని నన్నడిగి అన్నివైపులా పరిశీలిస్తూ, నెత్తురు కారుతూ వున్న గోళ్ళతోను, ముక్కుతోను నాకు ఎదురుగుండా కూర్చుని వున్న కాకిని చూచినాడు. అది సామాన్యమైన కాకి కాదు, దేవేంద్రుని పుత్రుడు. గాలి అంత వేగంగా నేలమీదకు వచ్చినాడు. ఆ మహాబాహువు, ఆ మతిమంతుడు ఆ కాకిని కోపంతో చుర చురా చూచినాడు. క్రూరమైన ఆలోచన చేసి, కూర్చున్న అస్తరణం లోనుంచి ఒక దర్భకర్రను తీసి, బ్రహ్మాస్త్రంగా అభిమంత్రించి ఆ కాకిమీద వదిలినాడు. అది ప్రళయకాలాగ్నివలె జ్వలిస్తూ కాకిమీద

తిరుగుతూ ఆ కాకికి ఎదురుగా పోయింది. అప్పుడా కాకి ఆకాశానికి ఎగిరింది. మంత్ర ప్రభావంతో మంటలు మండుతూ వున్న ఆ దర్భకర్ర కూడా ఆ కాకితో పాటు పైకి ఎగిరింది. అట్లా ఆ బ్రహ్మాస్త్రం కాకి వెంటబడి అది ఎక్కడికిపోతే, ఇది అక్కడికి పోయింది. ఆ కాకి తనను కాపాడేవారికోసం సమస్త లోకాలు తిరిగింది. ఆ కాకి తండ్రియైన దేవేంద్రుడు కానీ, దేవతలు కానీ, దేవర్షులు కానీ దానిని కాపాడలేదు. అది ముల్లోకాలు తిరిగింది. దానికి తనను కాపాడే వారెవరూ కనబడలేదు. అంతట అది రామప్రభువు దగ్గరకు వచ్చి శరణు వేడింది. చంపి వేయవలసి నంత నేరం చేసింది. అయినప్పటికీ ఎవరూ కాపాడేవారు లేక ఆ కాకి తననే శరణు వేడినందువల్ల ఆ సర్వలోక శరణ్యుడు దయతో దాని ప్రాణాలను కాపాడ దలచుకున్నాడు. అంతట ఆ కాకితో బ్రహ్మదేవతాకమైన ఈ అస్త్రాన్ని వ్యర్థము చేయటం అశక్యం. అందువల్ల ఏమి చేయమంటావో నీవే చెప్పు అని అన్నాడు.

అప్పుడు కాకి 'ఓ ప్రభూ! నీవు ఆ బ్రహ్మాస్త్రంతో నా కుడి కంటిని దహించ వేయవలసింది' అని చెప్పింది. అప్పుడు ఆ దర్భపోచ కుడికంటిని దహించి వేసింది. అట్లా తన కుడికంటిని ఇచ్చి ప్రాణము కాపాడుకొని రామప్రభువుకు, దశరథ మహారాజుకు నమస్కారం చేసి, తనదారిన అది పోయింది అని చెబుతూ రాముని ఉద్దేశించి, ఓ ప్రభూ! నా కోసం కాకిపైనే బ్రహ్మాస్త్రం వదలి నావు. నీ దగ్గరనుంచి నన్ను దొంగిలించుకు పోయినవాడిని ఎందుకు క్షమిస్తున్నావు? ఓ పురుషోత్తముడా! నీవు మహోత్సాహివి.

నామీద దయవుంచు. నాథా! నీవు నాకు నాథుడవై యున్నా, నేను అనాథవలె అయిపోయినాను. దయయే పరమ ధర్మమని నీవే చెప్పావు.

ఓ ప్రభూ! నీవు పరాక్రమశాలివి. మహా బలవంతుడవు. నిరవధిక గుణవంతుడవు. నిన్ను ఎదిరించగల వారెవరూ ఈ జగత్తులో లేరు. సముద్రంవలె నీవు గంభీరుడవు. సముద్ర వలయుతమైన ఈ భూభాగాని కంతటికీ నీవే ప్రభువు. నీవు దేవేంద్రునితో సరిసమానమైన వాడవు. ఓ ప్రభూ! సమస్త శస్త్రాస్త్ర విద్యలలో నీవు శ్రేష్ఠుడవు. సత్యసంధుడవు. ఈ రాక్షసుల మీద నీ అస్త్రాన్ని ఎందుకు వదలకుండా వున్నావు? అని చెప్పి హనుమంతుని చూస్తూ, "ఓ హనుమంతుడా! యుద్ధంలో నాగులు కానీ, గంధర్వులు కానీ, రాక్షసులు కానీ రామప్రభువు పరాక్రమానికి చాలరు. ఆ మహాపరాక్రమశాలి నా విషయంలో ఏ కొంచెం తొందర కలిగినా తన తీక్షణ బాణాలతో రాక్షసుల నందరినీ నాశనం చేసి, నన్నెందుకు తీసుకొనిపోలేదు? ఆ మహా వీరుడు, ఆ మహాబలవంతుడు, ఆ పరంతవుడు లక్ష్మణుడైనా అన్నగారి ఆజ్ఞను శిరసావహించి ఎందుకు నన్ను కాపాడకుండా వున్నాడు? కారణం ఏమిటి? ఆ పురుషోత్తముడు, ఆ వాయు, అగ్ని సమ తేజోవంతుడు, దేవతలకైనా ఎదిరించ నలవికాని ఆ రామ లక్ష్మణులు నన్నెందుకిట్లా ఉపేక్షించి ఊరుకున్నారు? నేనేదో మహాపాపం చేసి వుంటాను. సందేహం లేదు. అందువల్లనే ఆ పరంతపులు సర్వ సమర్థులైనప్పటికీ నన్ను కలుసుకోకుండా వున్నారు" అని జాలి పుట్టేటట్లు కన్నీళ్ళు కారుస్తూ చెప్పింది.

ఆ మాటలకు ఆ తేజోవంతుడు “ఓ దేవీ! నీ మీద దుఃఖంతో ఆ రామప్రభువు అన్నిటిపై విముఖుడుగా వున్నాడు. నేను సత్య ప్రమాణం చేసి చెబుతున్నాను. రామప్రభువు దుఃఖపడగానే లక్ష్మణుడూ దుఃఖ పడిపోతున్నాడు. నేనెట్లాగో నీ దర్శనం చేశాను. ఇది దుఃఖానికి సమయం కాదు. ఓ దేవీ! నీ ఈ దుఃఖమంతా అచిర కాలంలోనే పటాపంచలై పోతుంది. నిన్ను చూడవలెనని ఉత్సాహపడుతున్న ఆ పురుష సింహులు అచిరకాలంలోనే ఈ లంకాపట్టణాన్ని భస్మం చేసివేస్తారు. ఓ విశాలాక్షీ ! రామప్రభువు యుద్ధంలో ఆ క్రూరకర్ముని రావణాసురుని, సబాంధవంగా సంహారం చేసి, నిన్ను తీసుకొని అయోధ్యా పట్టణానికి పోతాడు. ఓ దేవీ! ఆ రామప్రభువుకు, మహాబలవంతుడైన ఆ లక్ష్మణునికీ, మహా పరాక్రమవంతుడైన ఆ సుగ్రీవుడికీ, వానరవీరులకు నన్నేమి చెప్పమంటావో నీవు అది చెప్పు” అని అడిగాడు.

సీతాదేవి దుఃఖముతో “ఓ హనుమంతుడా! కౌసల్యాదేవి కన్న ఆ సర్వలోక పూజ్యుడికి, ఆ మానవంతుడికి నేను సాష్టాంగ నమస్కారము చేశానని, ఆయన క్షేమం అడిగానని చెప్పు. ఆ లక్ష్మణుడు, సుమిత్రాదేవి సత్పుత్రుడు నానావిధ ద్రవ్యాలను, భోగ భాగ్యాలను, సమస్త రత్నాభరణాలను, దాసదాసీ జనాన్ని, ఈ పృథ్వి మీద దుర్లభమైన సమస్త ఐశ్వర్యాన్ని వదులుకొని, తన తల్లికి తండ్రికి నచ్చచెప్పి, రామప్రభువు వెంట మహారణ్యానికి వచ్చాడు. ఆ ధర్మాత్ముడు అన్నగారి మీద ప్రేమాతిశయంతో అడవిలో అన్న గారికి సేవ చేస్తూ వున్నాడు. ఆ మహానుభావుడు, ఆ సింహ స్కంధుడు, ఆ ప్రియదర్శనుడు లక్ష్మణుడు నన్ను తన తల్లివలె, ఆ

రామప్రభువును తండ్రివలె భావించినాడు. నన్ను రావణాసురుడు దొంగిలించుకొని రావడం ఆ పరాక్రమశాలి ఎరుగడు. ఆ కాంతి మంతుడు, ఆ సమర్థుడు, ఆ మితభాషి మా మామగారి వంటి వాడు. ఆ రామప్రభువు ఏ భారం వేస్తే, ఆ భారమంతా వహిస్తూ వుంటాడు. ఆ లక్ష్మణుడు వెంట ఉండటం వల్లనే చనిపోయిన తండ్రి గురించి ఆ రామప్రభువు తలచుకొనడం లేదు. ఆ లక్ష్మణు నికి నా మాటగా నేను క్షేమంగా వున్నానని చెప్పు. హనుమంతుడా! ఈ కార్యం నెరవేరడానికి, రామప్రభువు నా దుఃఖము పోగొట్ట డానికి నీవు కర్తవు. నీ నుంచే ఆ మహానుభావుడు నన్ను తీసుకొని పోయే ప్రయత్నం చేస్తాడు. నీవు నా పెనిమిటితో ఈ విధంగా చెప్పమన్నానని పదే పదే చెప్పవలెను. “ఓ రామ ప్రభూ! నేను ఇంకా ఒక్క మాసమే జీవించి వుంటాను. మాసం దాటిన తరువాత నేను బ్రతికి యుండటం ఉత్తది. నేను శపథం చేసి చెబుతున్నాను. దేవేంద్రుడి రాజ్యలక్ష్మిని పాతాళ లోకం నుంచి విష్ణుమూర్తి తీసుకొని వచ్చినట్లు, పాపకర్ముడు రావణాసురుడు దొంగిలించు కొని వచ్చిన నన్ను రామప్రభువు తీసుకొని పోవలెను” అని చెప్పి, తన చీరకొంగున దాచియుంచిన దివ్యసుందరమైన చూడామణిని తీసి యిచ్చింది.

హనుమంతుడు ఆ చూడామణిని తీసుకున్నాడు. అది చేతికి తొడుక్కోవటానికి వీలుకానందువల్ల వేలికి పెట్టుకున్నాడు. అంతట ఆమెకు ప్రదక్షిణ నమస్కారాలు చేసి, వినయంతో పక్కన నిలు చున్నాడు. ఆమె దర్శనమైనందువల్ల ఎంతో సంతోషపడి పోయినాడు. అతడి దేహము అక్కడ వున్నదే కానీ మనసంతా

రాముడి దగ్గరే వున్నది. ఆ సీతాదేవి సిగలో పెట్టుకొనే చూడా మణిని తీసుకున్న హనుమంతుడు గాలి కదిలించి వదిలిపెట్టిన పర్వతంవలె సంతోషించినాడు. మళ్ళీ ప్రయాణమైనాడు. సీతాదేవి చూడామణిని యిచ్చిన తరువాత హనుమంతుని చూచి, “ఓ వానరపుంగవా! ఈ చూడామణిని ఆ రామప్రభువు బాగా ఎరుగును. దీనిని చూడగానే నన్ను, మా అమ్మను, మా మామ గారు దశరథ మహారాజును తలచుకుంటాడు. నన్ను రామ ప్రభువుతో మా అత్తగారింటికి పంపించేటప్పుడు ఈ చూడామణిని ఇవ్వడం మా అమ్మ మరచిపోయింది. ప్రయాణమైపోతూ వుండగా, మా అమ్మకు జ్ఞాపకం వచ్చి, దీనిని తీసుకొనివచ్చి నాకు, మా మామగారి సమక్షంలో యిచ్చింది. అందువల్ల ఈ చూడామణిని చూడగానే నా పెనిమిటి సంతోషిస్తాడు.

ఓ హనుమంతుడా! నేను నీతో మళ్ళీ చెబుతున్నాను. నీవు ఆ రామప్రభువును ప్రోత్సాహ పరచవలెను. ఈ పనిని ఎట్లా ముగించవలెనో అదంతా నీవే ఆలోచించవలెను. ఈ పనికి నీవు కర్తవు. నీవు ప్రయత్నం చేసి నా దుఃఖాన్ని పోగొట్టవలెను. నీవు ఆలోచించి ప్రయత్నం చేసినట్లైతే నా కష్టాలన్నీ గట్టెక్కుతాయి” అని చెప్పింది. అట్లాగే అని ఆ భీమవిక్రముడు శపథం చేసి, వైదేహికి నమస్కారం చేసినాడు. ప్రయాణమైపోతున్న ఆ హనుమంతుని, సీతాదేవి చూసి కన్నీళ్ళు కారుస్తూ గద్గద కంఠంతో, “ఓ హను మంతుడా! నీవు రామలక్ష్మణులకు, సుగ్రీవుడికి, ఆయన మిత్రులకు, వానర వృద్ధులకు, ఇంకా తక్కిన వానర ముఖ్యులకు నా స్థితిగతులు చెప్పు. నేను వారి క్షేమం అడిగినానని చెప్పు. నన్ను ఆ

రామప్రభువు ఈ దుఃఖ సముద్రంలో నుంచి కడతేర్చేటట్లు నీవు చేయవలెను. ఎట్లా చెబితే నేను జీవించి వుండగా ఆ కీర్తిమంతుడు వచ్చి నన్ను చూస్తాడో, అట్లా ఆయనకు చెప్పి నీవు పుణ్యం కట్టుకో. నీ ఉత్సాహ వాక్యాలకు ఆయనకు పౌరుషము పెరిగి నన్ను తీసుకొనిపోయేలా చెప్పవలెను. నా సందేశాన్ని నీవు ఎట్లా చెబితే ఆ పరమ పరాక్రమశాలి నన్ను తీసుకొనిపోతాడో అట్లా నీవు ఆయనకు చెప్పవలెను" అన్నది.

హనుమంతుడు శిరము వంచి, చేతులు జోడించి "ఓ దేవీ! నేను చెప్పీ చెప్పడంతోనే ఆ రామప్రభువు వానరవీరులను, భల్లూక వీరులను వెంటబెట్టుకొని వచ్చేలా చేస్తాను. ఆ మహానుభావుడు శత్రువులందరినీ జయించి నీ దుఃఖాన్ని పోగొడతాడు. ఆయన బాణాలకు ఇక్కడి రాక్షసులెవరూ ఆయన ఎదుట నిలువ లేరు. ఆయన విజయుడుగా నిన్ను వెంట తీసుకొనిపోతాడు. సాగర పర్యంతమైన ఈ భూమిని ఏలుతాడు. ఓ జనకనందినీ! రామ ప్రభువు నీ కారణం వలన ఈ జగత్తునంతా జయిస్తాడు" అని చెప్పినాడు.

ఇంత చక్కగా మాట్లాడినందుకు సీతాదేవి హనుమంతుని మెచ్చుకుంటూ, అతనివంక పదే పదే చూస్తూ, భర్తమీద వున్న స్నేహాతిశయంతో "ఓ హనుమంతుడా! నీవు అరిందముడవు. నీవు కావలెననుకుంటే, ఇక్కడే ఎక్కడైనా రహస్య ప్రదేశంలో ఒకరోజు వుండి నీ అలసట తీర్చుకో. ఆ మరునాడు ప్రయాణమై పో. నీవు ఇక్కడ నాకు దగ్గరలో వుండేటట్లయితే నేను కొంతసేపైనా దుఃఖము లేకుండా వుంటాను. ఓ హనుమంతుడా! నీవు వెంటనే

తిరిగి రావలెను. అందుకు ఇప్పుడే ప్రయాణమై పో. అయితే నీవు తిరిగి వచ్చేలోగా నా ప్రాణం వుంటుందో, పోతుందో సందేహమే. నీవిక్కడి నుండి వెళ్ళిపోయిన తరువాత నా దుఃఖము ఇప్పటికన్నా ఎక్కువవుతుంది. అందువలన నీవు త్వరగా రావలెను సుమా! నాకిప్పుడు ఒక పెద్ద సందేహం వచ్చింది. నీకు సహాయంగా వచ్చిన భల్లూక వీరులు, వానరవీరులు నీతోపాటు ఈ సముద్రము దాటలేకనే కదా అవతలిగట్టున వున్నది. వారందరూ అపారమైన సముద్రాన్ని ఎట్లా దాటివస్తారు? రామలక్ష్మణులు ఎట్లా ఇక్కడికి వస్తారు. సముద్రాన్ని దాటివచ్చే శక్తి ఆ వాయుదేవుడికి, గరుత్మంతుడికి, నీకు వుంది. ఇక మరెవరికీ లేదు. అందువల్ల ఈ సముద్రం దాటేపని నెరవేరడం ఎట్లా? అందుకు ఉపాయం ఏమిటో చెప్పు.

"హనుమా! నీవు కార్యవిదులలో శ్రేష్ఠుడవు. ఆలోచించి చెప్పు. నీవు ఒక్కడివే ఈ కార్యాన్ని సాధించ గల్గుతావు. నీకు అంత శక్తి వుంది. అందువల్ల నీకు కీర్తి వస్తుంది. కానీ ఆ రామ ప్రభువు సంపూర్ణమైన సైన్యముతో వచ్చి యుద్ధం చేసి, రావణాసురుని సంహారము చేసి విజయుడిగా నన్ను పిలుచుకొనిపోతేనే నాకు యశస్కరంగా ఉంటుంది. అంతేకాదు ఆ శత్రు మర్దనుడు తన పాదాలతో ఈ లంకాపట్టణాన్ని ధ్వంసంచేసి నన్ను పిలుచుకొని పోతేనే ఆయన శౌర్యానికి, గౌరవానికి అనుగుణంగా వుంటుంది. అందువల్ల ఆ ఆహవ సూర్యుడికి అనురూపమైన పరాక్రమంతో ఈ పని నెరవేరేటట్లు నీవు చూడవలెను" అన్నది.

ఇట్లా అర్థవంతంగా సీతాదేవి చెప్పిన మాటలు విని

హనుమంతుడు “ఓ దేవీ! వానర భల్లూక సేనలకు ప్రభువు, వానర శ్రేష్ఠుడు, సత్త్వగుణ సంపన్నుడైన సుగ్రీవుడు ఈ కార్యాన్ని సాధించ డానికి కృతనిశ్చయుడై యున్నాడు. అతడు రాక్షస సంహారానికి వేలకొద్దీ, లక్షలకొద్దీ, కోట్లకొద్దీ వానర, భల్లూక వీరులను వెంట బెట్టుకొని తక్షణమే వస్తాడు. ఆ వానర భల్లూక వీరు లందరూ పరమ పరాక్రమవంతులు, సత్త్వ సంపన్నులు, మహాబలవంతులు. వాళ్ళు అటు ఆకాశం వరకు ఎగిరిపోగలరు. ఇటు పాతాళ లోకం వరకు దిగిపోగలరు. అడ్డంగా ఎంత దూరమైనా ఏ అంతరాయమూ లేకుండా పోగలరు. వాళ్ళందరూ సుగ్రీవుడి ఆజ్ఞను జవదాటరు. సుగ్రీవుడు మనసా సంకల్పించుకుంటే చాలును. ఏ పని అయినా అయిపోతుంది. ఆ వానర భల్లూక వీరులు ఎటువంటి మహత్తర కార్యాలనైనా ఇట్టే సాధించగలరు. వాళ్ళందరూ మహోత్సాహులు. వాయుమార్గాన అనేక పర్యాయములు పర్వతాలతోను, మహా రణ్యాలతోను, మహాసముద్రాలతోను వున్న ఈ భూభాగాన్నంతా తిరిగి చూశారు. ఆ సుగ్రీవుడి సన్నిధిలో నాతో సరిసమానమైన వారు, నాకన్నా అధికులు ఎంతోమంది వానరు లున్నారు. నాకన్నా తక్కువైనవాడు ఒక్కడూ లేడు. నేనే సముద్రాన్ని దాటి ఇక్కడికి వచ్చాను. ఇక నాకన్నా బలవంతుల సంగతి నేను చెప్పనవసరం లేదు. అత్యంత సమర్థులను రాజులెప్పుడూ మొట్టమొదట పంపించరు. చూచి రావటానికి సామాన్యులనే పంపిస్తారు. వానర భల్లూకవీరుల గురించి నీవు దిగులు పడవలసిన అవసరం లేదు. వానర సేనలన్నీ ఒక్క గంతువేసి, ఈ లంకలో వచ్చి పడతాయి. ఆ మహాబలవంతులైన రామలక్ష్మణులను నా వీపుమీద ఎక్కించుకొని

తీసుకొని వస్తాను. ఉదయించే సూర్యచంద్రుల వలె వారిని నీవు చూస్తావు. వానర వీరులు బాణాలు వదలి ఈ లంకాపట్టణాన్ని ధ్వంసం చేస్తారు. రావణాసురుని సబాంధవంగా సంహారం చేసి, ఆ రామప్రభువు నిన్ను వెంటబెట్టుకొని అయోధ్యకు పోతాడు. ఓ దేవీ! నీవు ఓర్చుకో. రోజులు లెక్కపెట్టుకుంటూ వుండు. నీకు శుభం అవుతుంది. జ్వలితాగ్ని హోత్రంవలె ఆ రామప్రభువు అచిర కాలంలోనే వస్తాడు. నీవు చూస్తావు అని చెప్పి హనుమంతుడు సీతాదేవిని ఓదార్చి పోబోతూ మళ్ళీ, ఓ దేవీ! శత్రు సంహారకుడైన ఆ రామప్రభువు, ధనుర్ధరుడైన లక్ష్మణుడు త్వరలోనే ఈ లంకా ద్వారమున నీకు కనబడతారు.

ఓ పూజ్యురాలా! భల్లూక వీరులను, వానర వీరులను, కొండలంతటి వాళ్ళను, ఏనుగు లంతటి వాళ్ళను, మహా మేఘా లంతటి వాళ్ళను గుంపులు గుంపులుగా వచ్చి ఈ లంకాపట్టణం మీద పడటం నీవు చూస్తావు. సింహనాదాలు చేస్తూ వాళ్ళందరూ సింహాలవలెను, పులుల వలెను కోరలతోను, గోళ్ళతోను రాక్షసు లతో యుద్ధం చేయడం చూస్తావు. ఓ దేవీ! నీవు దిక్కులేని దానివలె ఏడవ వద్దు. మనసులోనైనా దుఃఖపడవద్దు. శచీదేవికి దేవేంద్రుడి వలె నీకు నీ నాథుడు రామప్రభువు వున్నాడు. ఈ లోకంలో ఆ మహానుభావుడికన్నా అధికుడెవడూ లేడు. ఆ అన్నదమ్ములిద్దరూ నీకు ఆశ్రయులు, ఆత్మీయులు. వారిద్దరూ అగ్నిదేవుడు, వాయు దేవుడు వంటివారు. రాక్షసాలయం అనే భయంకరమైన ప్రదేశంలో నీవు అట్టే కాలము వుండవు. నీ పెనిమిటి రామప్రభువును నేను

పోయి కలుసుకోవడమే తరువాయి. ఆయన వచ్చి ఈ లంక మీద పడతాడు. ఓ పూజ్యురాలా! కొంతకాలము ఓర్చుకో” అని చెప్పాడు.

ఆ బుద్ధిమంతుడు హనుమంతుడు చెప్పినది విని సీతాదేవి తన మేలుకోసం “ఓ హనుమంతుడా! నన్ను సంతోషపెట్టే వృత్తాంతం చెప్పావు. నిన్ను చూస్తూ వుంటే, సగం ఎదిగి మండు టెండలకు మాడిపోయి, వానజల్లుకు తేరుకున్న పైరుభూమి వలె కార్యసిద్ధి సగం అయినట్లు తోస్తున్నది. ఇట్లా శోకంతో కృశించి పోయిన అవయవాలతో వున్న నేను ఆ పురుషసింహుని చేరేటట్లు నీవే చేయవలెను. నామీద దయవుంచు. నాకోసం ఆ రామప్రభువు దర్భకర్రను బ్రహ్మాస్త్రంగా చేసి కాకి కంటిని పోగొట్టినాడని నీకు గుర్తుగా చెప్పాను. ఇంకొక గుర్తు చెబుతాను. ఒకనాడు నా నుదుటను బొట్టు చెదరిపోయింది. నాకా సంగతి తెలియదు. ఆ మహానుభావుడు నవ్వులాటకు మనశ్శిలను తీసి నా చెక్కిలిమీద బొట్టుగా వుంచినాడు. ఇది చెప్పు. ఆయనకు జ్ఞాపకం వస్తుంది. ఓ హనుమంతుడా! ఆ మహా పరాక్రమవంతుడు మహేంద్ర, వరుణుల వంటి వాడే. రావణాసురుడు నన్నిట్లా దొంగిలించుకు వచ్చి రాక్షసుల మధ్య వుంచితే ఎట్లా ఊరుకున్నాడు? నేనీ దివ్యమైన చూడామణిని ఎంతో జాగ్రత్తగా దాచి వుంచాను. ఇంత దుఃఖంలోను నేను ఈ చూడామణిని చూస్తూ ఆ పుణ్యాత్ముని చూచినట్లు ఇంతవరకు సంతోషపడుతూ వచ్చాను. రత్నాకర సంబంధమైన మణులు పొదిగిన చూడామణిని ఆ మహానుభావుని కోసం ఇప్పుడు నీ చేతికి ఇచ్చాను. శోకలాలసగా ఇక నేను బ్రతికి వుండలేను. ఆయన కోసం సహించనలవి కాని దుఃఖాలను, హృదయాన్ని ఛేదించే ఈ

రాక్షసాంగనల మాటలను ఇంతకాలము ఓర్చుకున్నాను. నేనిక ఒక మాసమే జీవించి వుంటాను అని ఆ శత్రుసూదనుడితో చెప్పు. ఈ మాసం గడిచిపోయిన తరువాత నేను ఒక్క క్షణమైనా జీవించి యుండను. ఆ మహానుభావుని చేరకుండా నేనిక బ్రతికి యుండడం ఉత్తది.

"ఓ హనుమంతుడా! ఈ రాక్షసరాజు రావణాసురుడు భయంకరుడు. వీడి దృష్టి నేను భరించ లేకుండా వున్నాను. నేను ఇటువంటి ఆపదలో వున్నానని తెలిసినా కూడా ఇదివరకటివలె ఆ మహానుభావుడు ఉపేక్షించినట్లైతే, నేను ప్రాణంతో వుండను" అని జాలి పుట్టేటట్లు కన్నీళ్ళు కారుస్తూ సీతాదేవి చెప్పిన మాటలకు హనుమంతుడు. "ఓ దేవీ! రామప్రభువుకు ఏమీ తోచక ఏ పని చేయడానికీ విముఖుడై యున్నాడు. నేను సత్య ప్రమాణంగా చెబుతున్నాను. ఆ రామప్రభువు నిన్ను తలచుకొని దుఃఖపడు తున్నాడు. ఆయన దుఃఖపడడం చూచి లక్ష్మణుడు తపించిపోతూ వున్నాడు. నేనెట్లాగో వచ్చి నీ దర్శనం చేశాను. ఈ క్షణం నుంచి నీవు దుఃఖపడ నవసరం లేదు. ఓ దేవీ! అతిత్వరలో నీ దుఃఖం అంతమై పోతుంది. ఆ పురుషసింహులు, ఆ అరిందములు రామ లక్ష్మణులు నిన్నెప్పుడు చూడటమా అని తహతహ లాడుతున్నారు. నేను పోయి చెప్పగానే వారిక్కడికి వస్తారు. ఈ లంకాపట్టణాన్ని భస్మం చేసి, నిన్ను అయోధ్యకు తీసుకొనిపోతారు అని చెప్పి, ఓ దేవీ! నా రామప్రభువును ఇంకా సంతోషపెట్టే గుర్తు ఏదైనా వుంటే ఇవ్వు" అని అడిగినాడు.

అందుకు సీతాదేవి హనుమంతునితో "ఓ వీరుడా! నీకు

నేను ఉత్తమోత్తమమైన చూడామణిని ఇచ్చాను. నా కేశపాశంలో పెట్టుకుంటూ వున్న దివ్యాభరణం. దానిని చూచి రామప్రభువు నిన్ను నమ్ముతాడు" అని సీతాదేవి చెప్పింది.

ఆ కాంతిమంతుడు హనుమంతుడు అంతట సీతాదేవికి నమస్కారం చేసి ప్రయాణ సన్నద్ధు డయ్యాడు. ఎగిరిపోయేటందుకు దేహాన్ని పెంచడం మొదలుపెట్టినాడు. అప్పుడతనిని చూస్తూ సీతా దేవి కన్నీళ్ళు కారుస్తూ, "ఓ హనుమంతుడా! ఆ అన్నదమ్ములకు, సుగ్రీవుడికి, అమాత్యులకు, తక్కిన అందరికీ నేను క్షేమంగా వున్నానని చెప్పు. నన్ను ఈ దుఃఖ సముద్రం దాటించి అవతలకి తీసుకొని పోయేటట్లు నీవు ఆ రామప్రభువుకు నచ్చచెప్పవలెను. నా దుఃఖాన్ని గురించి, రాక్షసుల బెదిరింపుల గురించి చెప్పు. సుఖంగా పో. నీకు దారిలో ఏ అంతరాయమూ రాదు" అన్నది. ఇక చేయ వలసింది కాస్తే వుంది అనుకుంటూ, హనుమంతుడు మనసులో ఉత్తర దిక్కును ఊహించినాడు.

(ఒక సద్గురువును సత్సాధకుడు ఏం కోరాలి అన్నది విపులంగా వున్నది. సద్గురువును ఇతర విషయాలను కాక సత్సాధకుడు ఆత్మతత్త్వాన్ని లేక పరతత్త్వాన్ని కోరుకోవాలని తెలుస్తున్నది. అప్పుడే సత్యమును సాధించగలిగి సత్సాధకుడు అవుతాడు. సత్యమన్నది దైవానికి మరొకపేరు. సద్గురువు వచ్చి నప్పుడు అతడు ఏ సత్యాన్ని తెలుసుకున్నాడో, ఆ సత్యం తనను కూడా చేరేలా అనుగ్రహించమని కోరాలి. తన అహంకారంతో ఎంత బాధపడిందో ఆమె చెప్పింది. భగవత్సాన్నిధ్యంలో గల భక్తుడు కష్టపడితే భగవంతు డేవిధంగా స్పందిస్తాడన్నది వాయస

ఘట్టం ద్వారా తెలుస్తుంది. కాకి బారినుండి రక్షించడానికి ఆ కాకిని ఎంతగా శిక్షించడానికి పూనుకున్నాడో, ఇప్పుడు ఇంత బాధ లనుభవిస్తూంటే ఎందుకూరుకున్నాడో అని మాటిమాటికీ అడగడంలో, నేను లేడిని కోరటంచేత దైవ సాన్నిధ్యానికి దూరమయ్యాను. అలా దూరమవటం చేత ఆయన అనుగ్రహానికి కూడా నోచుకోలేదు. ఆయన రక్షణకు కూడా నోచుకోలేదేమో అని ఆమెకు దిగులు.

దైవము నందుండే భక్తుడు, దైవమునుండి వేరే ఏదో కోరటంవల్ల ఆ భక్తుడికి ఏర్పడే పరిస్థితులు వేరు. అదివరకు ఆమె దైవ సాన్నిధ్యంలో వుంది. ఇపుడు అహంకార పురుషుని ఆధీనంలో వున్నది. అందుచేత నా కోరికే నన్నీవిధంగా దుఃఖంలో ముంచింది. ఆయనకు దయలేదా? ఆయన త్వరగా రావాలి. నన్ను రక్షించాలి అని మాటిమాటికీ అడుగుతుంది. అలా చేసిపెట్టడానికి సద్గురువు ఒక్కడే సమర్థుడు. ఎందుకంటే దైవము నుండి వచ్చిన దూత సద్గురువు. సద్గురువు చెయ్యగల నిజమైన కార్యం పరతత్త్వంతో చేర్చటమే. "నాకు నమస్కరించిన వారిని నా అంత వారిని చేస్తా" నని చెప్పటంలో ఉద్దేశ్యం అదే.

అందుచేత ఒక సద్గురువును ఒక సత్సాధకుడు ఏం కోరాలి? అని ప్రశ్నిస్తే సీతాదేవిలో గల తీవ్రమైన తపన, ఆర్ద్రత, శ్రద్ధ, భక్తి ద్వారా తెలుస్తుంది. మనలో నిజమైన భక్తి వుంటే దైవము నందే జీవిస్తాం. దైవమే రక్షిస్తాడు. 'దైవానికే శరణు' అన్న దృఢ నిశ్చయం కావాలి. వేరే ఎవరికీ లొంగను అనే ధీమంతమైన స్థితిని పోతనామాత్యుడు చూపిస్తాడు. ఎన్నిసార్లు చెప్పినా త్వరగా తీసుకొని రమ్మని మాత్రమే చెప్పింది.

హనుమంతుడు శ్రీరాముని అంగులీయకమును తెచ్చి చూపినా, వెంటనే నమ్మలేదు. అది శ్రీరాముడు పారవేసుకుని వుంటే ఈయన తెచ్చివుండవచ్చు లేదా రాక్షస మాయ కావచ్చు అని అనుమానం. ఎన్నో విధాలుగా పరీక్షించి చివరకు ఆయన సద్గురువే, దైవము నుండి వచ్చినవాడే, దైవమునకు నన్ను చేర్చగలిగిన వాడే, దైవమును నాకు అనుగ్రహించ గలిగిన వాడే అని నమ్మి తనకు, దైవమునకు మాత్రమే తెలిసిన వృత్తాంతమును చెప్పినది. చూడా మణికి ఇంకో భావం వున్నది. అది శిరోమణి కూడా. దానిని చూస్తే సీతకు రాముడు, రామునికి సీత గుర్తుకు వస్తుంది. అంటే ఈ రోజుకి కూడా నేను అదేవిధమైన అనురాగంతో వున్నాను. పశ్చాత్తప్తయై వున్నాను. నా కోరికే మనల్ని విడదీసింది అని బాధ పడింది. ఆత్మావలోకనము, ఆత్మ పరిశోధనము, చేసిన తప్పులకు పశ్చాత్తాపము, ప్రాయశ్చిత్తము మన సంస్కారములలో వున్నది. తప్పించుకొని తిరగటంలో లేదు. తప్పించుకొని ప్రయోజనమూ లేదు. తన దుఃఖ సమయంలో మంచి వార్త చెప్పిన దూత అపుడే వెళ్ళిపోతానంటే బాధపడుతుంది. కానీ నెల గడువులో ఒక రోజు తగ్గుతుందని వెళ్ళిపొమ్మంటుంది. తనను రక్షించేవాడు అని నమ్మింది. రామునికి, లక్ష్మణునికి, సుగ్రీవాదులకు ఏమి చెప్ప మంటావు అని అడిగితే రామునికీ, లక్ష్మణునికీ సందేశాలిచ్చి ఊరుకుంటుంది. చాలాసేపు హనుమంతునితో, నీవే చేతనైన వాడివి, సమర్థుడివి, నువ్వే ఈ కార్యానికి కర్తవు, నీవే ఎట్లైనా ఈ కార్యాన్ని నిర్వర్తించు అని చెప్పి చూడామణిని ఇచ్చింది. తనకన్నా సుగ్రీవాదులు చాలా గొప్పవాళ్ళని చెప్పినా, తన నమ్మికలో మార్పుండదు. మామూలుగా ఒకరికన్నా ఇంకొకరు గొప్ప అని తెలియగానే

వీరిని విడిచిపెట్టి వెళ్ళిపోతూంటాము. తనకి దారి చూపించిన వాడు, తనకి సద్విషయములు చెప్పినవాడు ఆయనే.

సుగ్రీవుడు హనుమంతునికి రాజే కావచ్చు, సమర్థుడే కావచ్చు. కానీ తనకు తెలిసినది ఇతనే. అందుకనే నీవే చేయి. నీవే చేయగలవు అని చెప్తుంది. సుగ్రీవునికి చెప్పింది రెండు వాక్యాలే. హనుమంతునికి చాలా వాక్యాలు చెప్పింది. అంతే అతడే దీనికి ఉపాయము. అతనికన్నా ప్రతిభావంతులు వుంటే వుండవచ్చు గాక! నాకు తారసిల్లిన సద్గురువే నాకు ఉపాయము అనే భావంలో ఆమె అతని గురించే భావిస్తుంది. హనుమంతుడు మిగిలిన వీరులను గురించి ఎంత పొగిడినా కానీ, నిజానికి వారెవరూ రాలేదు. పైగా రాముడు హనుమకే ఉంగరం ఇచ్చాడు గానీ, వేరేవారికి కాదు. సుగ్రీవుడు మిగిలిన యోధులందరినీ తలోప్రక్కా పంపినా, హనుమంతుడు ఎక్కడికి వెళ్ళినా అతనికే ఇద్దామను కున్నాడు. రామునికి తెలుసు ఇతడే కార్యసిద్ధి కలిగించేవాడని. అందుకని రాముడే నమ్మినటువంటి దూత. రామదూత! కనుక హనుమ ఎందరి గురించి చెప్పినా, నా వరకు రాముడు పంపిన దూతవు నీవే. అందుచేత నేను నీ ద్వారానే కార్యం నిర్వర్తించుకో దలిచాను. నీకు అంతా తెలుసు. కనుక దైవంతో మాట్లాడి, దైవానుగ్రహం సంపాదించి పెట్టగలిగిన వాడివి నువ్వు. నా మాటగా చెప్పినదానికన్నా నీ మాటే చెల్లుతుంది. నేను అశక్తు రాలిని. అనుగ్రహం కలిగేట్లు చూడమని మరీమరీ చెప్తుంది.)

# 9

హనుమంతుని సీతాదేవి ప్రశంసా వాక్యాలతో సన్మానించిన తరువాత అతడు అవతలికి పోయినాడు. ఆలోచించినాడు. ఇక చేయవలసిన పని కొంచెమే మిగిలివుంది. సీతాదేవిని చూడటం అయిపోయింది. సామ దాన భేదాలలో ఈ మూడింటికి రాక్షసులు లొంగరు. రావణాసురుడు మూర్ఖుడు, అందువల్ల వీడి దగ్గర సామోపాయమే పనిచేయదు. వీడు ధనవంతుడు, అందువల్ల దానోపాయ ప్రసక్తే లేదు. ధనమున్న వాడికి ధనమిచ్చి మెప్పించ లేము. మూర్ఖునికి జ్ఞానమిచ్చి మెప్పించలేము. "చేరి మూర్ఖుని మనసు రంజింపరాదు." వాడు మూర్ఖంగానే వుంటాడు. బలదర్పి తుడు. అందుకని భేదోపాయానికి లొంగడు. కాబట్టి పరాక్రమమే పనిచేస్తుంది. అహంకార ప్రజ్ఞను బెదరగొడదాం అని భావన ఏర్పరచుకున్నాడు హనుమ. అహంకార ప్రజ్ఞకు అనుపానంగా వుండే రాక్షస ప్రజ్ఞలలో కొందరిని తనే నిర్మూలిస్తే మంచిదని ఆలోచించాడు.

(మనలో నిర్మూలింపబడవలసిన అశుభ వాసనలన్నీ తొలగించడానికి సద్గురువు పూనుకుంటాడు. జీవుడు దైవాన్ని చేరడానికి అతనిలో వున్న అశుభ వాసనలే అతనికి అడ్డుగా

నిలుస్తాయి. లంకలో అంతా ఆకళింపు చేసుకుంటున్నాడు. శరీరం పలుచగా వుండాలి. మందంగా వుంటే ఆత్మజ్ఞానం అందదు. విభూతియోగం భగవద్గీతలో చదువుకున్నపుడు కుబేరుడనే గంధర్వుడు మనలోవున్న సూక్ష్మశరీరాన్ని రక్షించేవాడుగా వుంటాడు. ఆ గంధర్వసేన అంతా అందుకే పనిచేస్తుంది.

మన శరీరంలో వుండే రాక్షసులు శరీరాన్ని రక్షించడానికి, దానికి ఏ మాత్రం బాధ కలుగకుండా చూస్తారు. అంటే దేహంలో దేహిని బంధించి దేహం పెరిగేటట్లు చూస్తూ వుంటారు. మందం పెరిగి, శరీరం మందగించేటట్లు చూస్తూ వుంటారు. బుద్ధి పని చేయక, కేవలం భౌతిక విషయములు మాత్రమే తెలిసేటట్లు సలహా ఇస్తుంది. ఉదయం లేవమంటే లేవదు. జీవునికి అంత రాయాలు లోపలినుంచే వస్తూ వుంటాయి. ఎందుకంటే అవి దేహ సౌకర్యం కోరుతూ వుంటాయి. అది దేహాత్మభావం. జీవాత్మ భావం కాదు. కర్తవ్యం వున్నపుడు బహిర్ముఖమైన ఆలంబనలు, సౌకర్య ములు కోరరు మహాత్ములు. అంతర్ముఖమైన ఆలంబమై వుంటారు. రాక్షసులు రక్షస్సులు. అంటే జీవుడి దేహాన్ని కాపాడేవారు మాత్రమే. ఈ దేహం ఎప్పుడైనా చచ్చేదే. చావని దాంట్లోకి జీవుడు ఎదగాలంటే శరీర ధర్మాలను అధిగమించాలి. శరీరం మీద పదను ఏర్పరచు కోవాలి. పదను లేనివారికి సద్గురువు ఒక కార్యక్రమాన్ని పెడతారు. ఎందుకంటే శరీరంలోని రాక్షసులు చచ్చి పోవాలి. మనకు తెలిసినవి కూడా ఆచరించము. ఆహార నియమాల్ని పాటించం. చేయవలసిన పని వున్నపుడు సౌకర్యా సౌకర్యాలతో, సుఖదుఃఖాలతో, లాభనష్టాలతో సంబంధం లేదు. సద్గురువులు

శరీరంలో చేరి దేహాన్ని వంచుతారు. అందుకే మనము ఉదయాన్నే లేవాలి. మన పూజలన్నీ కన్యాలగ్నంలో ప్రారంభం కావాలి. నిజంగా భగవద్భక్తి గలవారు మూడింటికే లేవాలి. అది మనవల్ల కాదని, సద్గురువే అందుకు పూనుకుంటాడు.)

ఇక్కడ మరొక ఉపాయం పనిచేయదు. ఇక్కడ రాక్షసులతో పోరాడి కొంతమందిని చంపివేస్తే కాస్త మెత్తబడతారు. భయం ఏర్పడుతుంది. ఆజ్ఞాపించిన కార్యానికి విరోధం లేకుండా అనేక పనులు చేయగలవాడే, ఏ పని చేయడానికైనా సమర్థుడవుతాడు. స్వల్ప కార్యమైనప్పటికీ ఒక్క కారణంతో సాధించడం సాధ్యం కాదు. కార్య సాధనకు వివిధ ఉపాయాలు తెలుసుకున్నవాడే కార్యాన్ని సాధించగలడు. నేను రావణాసురుడి బలాబలాలను ఇక్కడనే నిశ్చయించాలి. యుద్ధంలో రాక్షసులకు, వానరులకు వుండే తారతమ్యం తెలుసుకోవాలి. ఇట్లా అన్ని విషయాలు తెలుసుకొని పోయేటట్లైతే సుగ్రీవాజ్ఞను చక్కగా నేరవేర్చినట్లవుతాను. ఇప్పుడు నాకు, రాక్షసులకు సహించనలవి కాని యుద్ధం జరిగితేనే వారి బలము, నా బలము బయట పడుతుంది. మంత్రివర్గంతోను, సేనా నాయకుడితోను రావణాసురుడి బలము నన్నెదుర్కొంటే వారి బలమేమిటో, వారి పథకమేమిటో విశద మవుతుంది. అపుడు నా దారిన నేను పోవచ్చును.

అశోకవనము దేవేంద్రుని నందనోద్యానం వలె నానావిధ వృక్షాలతోను, నానావిధ లతలతోను నేత్రపర్వంగాను, మనోహరం గాను వుంది. ఎండిపోయిన అడవిని అగ్నిహోత్రునివలె ఈ అశోకవనాన్ని నేను ధ్వంసం చేసివేస్తాను. ఈ వనమంతా విరిగి

పడిపోయినట్లైతే రావణాసురుడికి నా మీద తప్పకుండా కోపం వస్తుంది. అంతట వాడు రథాలతోను, గుఱ్ఱాలతోను, ఏనుగుల తోను, త్రిశూలాలు, ఇనుపగుడియలు మొదలగు ఆయుధాలతో పెద్ద సైన్యాన్ని నామీదకు పంపిస్తాడు. అప్పుడు నాకు, వారికి మహా భయంకరమైన యుద్ధం జరుగుతుంది. ఓర్వలేని ప్రచండ పరాక్రమంతో నేను రాక్షసులతో పోరాడుతాను. రావణాసురుడు పంపించిన సైన్యానంతా నాశనం చేసివేసి, నా దారిన నేను హాయిగా కిష్కింధకు పోతాను అని హనుమంతుడు అనుకున్నాడు.

(ఇదీ సద్గురువు చేసే కార్యం. ఆయన మనను బహిః కరణాలు పెట్టే బాధల నుండి తప్పించి, అంతఃకరణాలలో ప్రవేశించడానికి మార్గం ఏర్పరచి అవరోధాలన్నీ తీసివేస్తాడు. అలా తీసివేస్తే అంతర్ముఖుడై, అంతఃకరణాలు చేతనాయుతమై చక్కగా పనిచేస్తాయి.)

అంతట ఆ భయంకర పరాక్రమవంతుడు, మారుతాత్మజుడు కృద్ధుడైపోయి, తన తండ్రి వాయుదేవుని వలె చెలరేగి ఆ అశోక వనంలోని మహోన్నత వృక్షాలన్నిటినీ విరిచివేయ మొదలు పెట్టినాడు. నానావిధ వృక్షాలు, లతలు ఫెళ ఫెళ ధ్వనులతో నేలకూలాయి. మత్తెక్కిన రకరకాల పక్షులు వికృతంగా కూస్తూ పైకెగిరి పోసాగాయి. క్రీడాపర్వతాలన్నీ పడిపోయాయి. కోనేళ్ళ మెట్లన్నీ విరిగిపోయాయి. క్షణలేశంలో ఆ అశోకవనం వికృతంగా కనిపించింది. పెద్ద పెద్ద చెట్లన్నీ పడిపోయి, కార్చిచ్చుతో తగలబడి పోయిన మహారణ్యంవలె అయిపోయింది. ఆయా పెద్ద పెద్ద మ్రానులన్నీ కూలిపోయినందువల్ల ఆ యా పుష్పలతలు భయ

విహ్వాలులైన స్త్రీలవలె కనిపించినవి. లతాగృహాలు, చిత్రగృహాలు, శిలా గృహాలు కూలిపోయినవి. మహాసర్పాలు, క్రూరసర్పాలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. రావణాసురుడి భార్యలకు భోగ స్థానమైన ఉద్యానవనాన్ని అట్లా మొదలంటా నాశనం చేసి, హనుమంతుడు సంతోషంతో పోరాటానికి ఎదురు చూస్తూ అశోకవనం మధ్యన కూర్చున్నాడు.

అశోకవనంలో ఫెళ ఫెళలాడుతూ చెట్లు విరిగిపోతున్న ధ్వనులు, అక్కడి పక్షి సంఘాలు ఎగిరిపోతూ పెట్టిన కూతలు లంకాపట్టణమంతా వినిపించాయి. అందరూ భయపడిపోయారు. అక్కడ పక్షి సంఘాలతో పాటు మృగ సంఘాలు కూడా భయపడి అరుస్తూ, అన్ని దిక్కులకీ పరుగెత్తుతున్నాయి. రాక్షస నాశనాన్ని సూచించే అశుభ నిమిత్తాలు కనిపించాయి. ఆ అశోకవనంలో కావలి వుంటున్న వికృతాననలు, రాక్షసాంగనలు చెట్లు విరిగి పోతున్న మహా ధ్వనులకు ఉలిక్కిపడి నిద్రలేచి, మహాకారంతో భయంకరంగా వున్న హనుమంతుని చూచినారు. ఆ మహాబాహువు, ఆ మహాసత్త్వుడు, ఆ మహాబలవంతుడు హనుమంతుడు ఆ రాక్ష సాంగనల నందరినీ చూచి, వాళ్ళను ఇంకా భయపెట్టవలె ననుకొని తన మహాకాయాన్ని ఇంకా భయంకరంగా పెంచాడు. ఆ రాక్ష సాంగనలు పర్వతమంత ఎత్తున వున్న ఆ అతికాయుని చూచి సీతాదేవి దగ్గరకు పోయి “ఓ సీతా! వీడెవడు? వీడిని ఎవడు పంపించినాడు? ఎక్కడి నుంచి వచ్చినాడు? ఎందుకోసం వచ్చి నాడు? నీతో ఏం మాట్లాడినాడు? మాకు చెప్పు. ఓ శుభగా! మాకు చెప్పు. నీకేం భయం లేదు. వీడు నీతో ఏం మాట్లాడి నాడు?” అని అడిగారు.

ఆ మహాసాధ్వి, ఆ సర్వాంగ సుందరి సీతాదేవి, నానావిధ భయంకర రూపాలు ధరించే రాక్షసుల గురించి నేనేమీ ఎరుగను. అట్లా తెలుసుకునే శక్తి నాకు లేదు. వీడెవడో, ఏం చేస్తున్నాడో మీకే తెలుసును. పాము కాళ్ళు పాముకే తెలియవలెను. సందేహం లేదు. నేను కూడా ఇతనిని చూచి భయపడుతున్నాను. ఇతనెవరో నేనెరుగను. ఎవరో మరి? ఈ వచ్చినవాడు కామరూపుడైన రాక్షసుడని నేను అను కుంటున్నాను అని చెప్పింది.

సీతాదేవి మాటలు విన్న కొందరు రాక్షసాంగనలు భయపడి, నాలుగు దిక్కులా పరుగెత్తినారు. కొందరక్కడనే ఉండిపోయినారు. కొందరు వికృతాననలు ఆ మహాకాయుని, ఆ భయంకరాకారుని గురించి చెప్పడానికి రావణాసురుడి దగ్గరకు పోయినారు. "రాజా! భయంకరాకారుడు, అమిత పరాక్రమవంతుడు అయిన ఒక వానరుడు సీతాదేవితో మాట్లాడి అశోకవన మధ్యమున వున్నాడు. వాడెవడని మేము ఎన్నో విధాల ఆ హరిణలోచనను అడిగినాము. ఆ జానకి మాకేమీ చెప్పలేదు. వాడు దేవేంద్రుడి దూతకానీ, కుబేరుడి దూతకానీ లేదా సీతాన్వేషణ కాంక్షతో రాముడు పంపించిన దూతనో అయి వుంటాడు. ఆ అద్భుతరూపుడు తమ ప్రమదావనాన్ని నాశనం చేశాడు. మనోహరమైన మృగాలు, పక్షులు భయపడి పారిపోయాయి. వాడీ వనములో పాడుచేయని చోటు లేదు. ఆ జానకి కూర్చున్న చోటు మాత్రం పాడుచేయలేదు. ఆమెకు ఇబ్బంది లేకుండా వుండటానికో లేక అలసిపోయినందు వల్లనో అక్కడి చెట్లను ఏమీ చేయలేదు. వాడు అలసిపోవడమేమిటి? వాడు ఆమెను కాపాడవలెనని అనుకున్నాడు. అందు

కోసమే ఆ చోటు పాడుచేయలేదు. అందమైన పూలతోను, చిగురు టాకులతోను వున్న పెద్ద ఇరుగుడు చెట్టు క్రింద సీత వుంది. ఆ చెట్టును ఆ వానరుడు ముట్టుకోలేదు. ఓ మహోగ్రుడా! ఆ ఉగ్రరూపుని మహోగ్రంగా శిక్షించవలెను. వాడు సీతతో మాట్లాడి నాడు. ఈ అశోకవనాన్ని నాశనం చేశాడు. ఓ రాక్షసేశ్వరుడా! నీ మనను వుంచిన ఆ సీతతో ఎవడైనా మాట్లాడితే వాడిని బ్రతక నివ్వటమే?" అన్నారు.

రావణాసురుడు ఆ రాక్షసాంగనల మాటలు విన్నాడు. కోపంతో కనుగుడ్లు త్రిప్పినాడు. హోమం చేసిన అగ్నిహోత్రునివలె మండిపోయినాడు. మండుతున్న దీపంలో నుంచి మంటతో నూనె బిందువులు నేలరాలినట్లు కృద్ధుడైపోయిన రావణాసురుడి రెండు కళ్ళ నుంచి వేడి వేడి కన్నీటి బిందువులు రాలినాయి. అప్పుడా మహా తేజోవంతుని హనుమంతుని నిగ్రహించడానికి తనతో సరి సమానమైన శూరులను, కింకరులనే వారిని ఆజ్ఞాపించినాడు. కూటాలు, ముద్గరాలు మొదలగు ఆయుధాలను తీసుకొని మహోదరాలతో, మహాదంష్ట్రలతో వున్న ఆ మహాబలవంతులు, ఆ ఘోరరూపులు కింకరులనే వాళ్ళు యుద్ధ సన్నద్ధులై హను మంతుని పట్టుకోవలెననే ప్రయత్నంతో ఆ భవనం నుండి బయలుదేరినారు. అశోకవన ద్వారంలో యుద్ధ సన్నద్ధుడై యున్న హనుమంతుని దగ్గరకు, మిడుతలు అగ్నిహోత్రుని దగ్గరకు వెళ్ళి నట్లు పోయినారు. నానావిధ రంగులతో వున్న గదలను, బంగారు కట్లు వేసిన ఇనుప గుదియలను, సూర్యసమాన కాంతులతో తేజరిల్లుతున్న బాణాలను వాళ్ళు హనుమంతుని మీద వేసినారు.

ఇనుప గుదియలతోను, శూలాలతోను, అడ్డకత్తులతోను, ఈటెల తోను, చిల్లకోలలతోను వారు హనుమంతుని చుట్టూ అప్పటి కప్పుడు ముగినారు. అతని ఎదుటకుపోయి కొంతమంది నిలుచున్నారు.

అప్పుడా తేజోవంతుడు, ఆ కాంతివంతుడు, ఆ పర్వతాకారుడు హనుమంతుడు తన తోకతో నేలను కొట్టి పెద్ద పొలికేక వేశాడు. మరింతగా దేహాన్ని పెంచినాడు. లంకాపట్టణం అంతా వినిపించేలా భుజాలను చరుచుకున్నాడు. భుజతాడనం వల్ల అయిన మహాధ్వనికి పక్షులు ఆకాశం నుండి నేలకూలినాయి. అంతట పెద్ద గొంతుతో "ఆ అతిబలవంతుడైన రాముడికి జయము! మహాబలవంతుడైన లక్ష్మణుడికి జయము! రాముడు కాపాడిన సుగ్రీవుడికి జయము! ఓ రాక్షసులారా! కోసలాధీశుని రామునికి నేను దాసుడిని. నా తండ్రి వాయుదేవుడు. నా పేరు హనుమంతుడు. నేను ఎటువంటి శత్రు సైన్యాలనైనా సంహారం చేయగలను. నేను రాళ్ళతోను, చెట్ల బడితలతోను పోరాటానికి దిగితే వెయ్యిమంది రావణాసురులు వచ్చినా నన్ను తట్టుకోలేరు. రాక్షసులందరూ చూస్తూ వుండగానే లంకాపట్టణాన్ని పడగొడతాను. సీతాదేవికి నమస్కారం చేసి, నా పని పూర్తిచేసుకొని పోతాను" అని చెప్తూవుంటే, కింకరులనే రాక్షసులు భయపడి పోయారు.

సంధ్యాకాల మేఘం వలె రక్తకాంతులతో తేజరిల్లుతున్న మహోన్నతకాయుని చూస్తూ రాజాజ్ఞను బట్టి నిశ్శంకముగా భయంకరమైన వివిధ ఆయుధాలను పట్టి ఎదిరించారు. హను మంతుడు తనచుట్టూ మూగిన రాక్షసులందరూ ఇట్లా ఎదిరించ

గానే ఆ అశోకవన బహిర్ద్వారానికి అమర్చిన భయంకరమైన పెద్ద ఇనుప గుదియను ఊడలాగినాడు. దానితోనే రాక్షసుల మీద పడ్డాడు. వారందరినీ ఇట్టే చంపివేసినాడు. గరుత్మంతుడు మహా సర్పాలను పట్టుకొన్నట్లు, హనుమంతుడు తళతళలాడుతున్న ఆ ఇనుప గుదియను పట్టుకొని ఆకాశాని కెగిరినాడు. మళ్ళీ పోరాటం కోసం ఆ అశోకవన బహిర్ద్వారము దగ్గరకు వచ్చి నిలుచున్నాడు. భయపడి పారిపోయిన రాక్షసులు కొందరు రావణాసురుడి దగ్గరకు పోయి, హనుమంతుడు కింకరు లందరినీ చంపివేసినాడని చెప్పినారు. ఆ మహాబలవంతు లందరూ చనిపోవడం విని రావణాసురుడు గుడ్లు మిటకరించి అప్రతిమాన పరాక్రమవంతుడు, సమర్థుడు, దుర్జయుడు అయిన జంబుమాలిని పిలిచి హనుమంతుని మీదికి పొమ్మని ఆజ్ఞాపించినాడు.

(సీతాదేవి హనుమంతుని గురించి ఎందుకు చెప్పలేదంటే సద్గురు దర్శనం రహస్యంగా భావించింది. సద్గురువు గురించి నీకేం తెలియదు. ఇచ్చింది పుచ్చుకొని సాధన చేసుకోవాలి. సత్యం తెలిసినప్పుడే ఆయన గురించి తెలుస్తుంది. నీకు తెలియటమన్నది నీలో పెరుగుతుందే కానీ మరొక విధంగా తెలియదు.)

కింకరులనే రాక్షసులను సంహరించిన తరువాత హనుమంతుడు ఆలోచించ సాగినాడు. నేను ఈ అశోకవనాన్ని నాశనం చేశాను. కానీ, ఇక్కడున్న ఈ చైత్య ప్రాసాదాన్ని వదలిపెట్టాను. ఇప్పుడు ఈ భవనాన్ని అందరూ భయపడి పోయేటట్లు పగులగొట్టవలె నను కుంటూ హనుమంతుడు తన బలము చూపించదలచి, పైకెగిరి మేరుపర్వత శృంగమంత ఎత్తున వున్న ఆ చైత్య ప్రాసాద భవనం

పైకి పోయినాడు. పర్వతమంత ఎత్తున వున్న ఆ ప్రాసాదము మీద సూర్యుడివలె తేజరిల్లుతూ పగులగొట్ట నలవికాని ఆ ప్రాసాదాన్ని పగులగొట్టుతూ పారిజాతపర్వతంవలె విరాజిల్లినాడు. అతడు తన ప్రభావంతో దేహాన్ని మరింత పెంచి, లంకాపట్టణమంతటా వినిపించేటట్లు భుజస్ఫాడనం చేసినాడు. చెవులు గింగుర్లెత్తే ఆ మహాధ్వనికి పక్షులు నేలకూలినవి. ఆ చైత్య ప్రాసాదము బయట కావలియున్న రాక్షసులు దద్దరిల్లి చనిపోయినారు. ఆ రాక్షసు లందరూ భయభ్రాంతులయ్యేలా సింహనాదం చేసినాడు. ఆ మహా ధ్వనికి అక్కడ కావలియున్న సమస్త రాక్షసులు ఈటెలతోను, గండ్ర గొడ్డళ్లతోను, కత్తులతోను హనుమంతుని మీదకు పోయినారు. వాళ్ళందరూ హనుమంతుని చుట్టూ మూగినారు.

ఆ మారుతాత్మజుని చుట్టూ మూగిన రాక్షస సమూహము గంగాజలాలలో సుడిగుండంవలె కనిపించింది. అప్పుడు ఆ వాతాత్మజుడు క్రుద్ధుడై పోయినాడు. పరమ భయంకరమైన రూపం ధరించి ఆ మహాబలవంతుడు ఆ చైత్య ప్రాసాదానికి అమర్చియున్న బంగారు స్తంభాన్ని పెకలించినాడు. స్తంభాన్ని చేతితో పట్టుకొని గిరగిరా త్రిప్పినాడు. అలా త్రిప్పుతూ వుండగా, అందులో నుంచి అగ్నిహోత్రము పుట్టింది. అది ఆ చైత్య ప్రాసాద భవనానికి అంటు కున్నది. భగభగ మంటలు లేచినవి. ఆ భవనమంతా అట్లా మంటల్లో కాలిపోతూ వుంటే, దేవేంద్రుడు వజ్రాయుధంతో కొట్టేటట్లు హనుమంతుడు తన చేతిలోవున్న ఆ బంగారు స్తంభముతో ఆ నూరుమంది రాక్షసులను కొట్టి చంపివేసి, ఆకాశానికి ఎగిరి పోయినాడు.

ఆకాశంలో నిలుచుని లంకాపట్టణంలోని వారందరికీ వినిపించేటట్టుగా పెద్దగొంతుతో, "ఓ రాక్షసులారా! సీతాదేవిని వెదకడానికి వానర రాజైన సుగ్రీవుడు మహా పరాక్రమవంతులైన, అమిత బలవంతులైన నాబోటి వారలను వేలకు వేలమందిని పంపించినాడు. మేము ఈ భూమి అంతటా తిరుగుతున్నాము. మాలో కొందరు పది ఏనుగుల బలం కలవారు, కొందరు నూరు ఏనుగుల బలం కలవారు, కొందరు వాయుదేవుడంతటి వేగ వంతులు. వానర సేనా నాయకుల బలము ఇంత అంత అని చెప్పనలవి కాదు. కోరలు, గోళ్ళు ఆయుధాలుగా చేసుకొని పోరాడే వందలకొద్దీ, వేలకొద్దీ, కోట్లకొలది వానర వీరులతో సుగ్రీవుడు ఇక్కడికి వస్తాడు. మిమ్ముల నందరినీ చంపివేస్తాడు. మీ రాజైన రావణాసురుడు, మహాత్ముడైన రామునిమీద బద్ధవైరం పెట్టుకున్నాడు. ఇక మీ రాజు వుండడు. మీరు కూడా వుండరు. ఈ లంకాపట్టణం వుండదు. సర్వనాశనం అయిపోతుంది."

(అహంకార పురుషునికి సద్గురువు హెచ్చరిక ఇది. దేహంలో రకరకాల ప్రకోపాలు వచ్చినప్పుడు వాటిని ఆశ్రయించక, సీతాదేవి లాగ దైవమునే ఆశ్రయిస్తే, గురువు ప్రకోపాలన్నిటినీ సర్దుతాడు. ఇది భారతీయ సంప్రదాయంలో గురుశిష్య సంప్రదాయంలో వుంది. నీకుగా నీవు సర్దుబాటు చేసుకోలేనివి, నీవు త్రికరణశుద్ధిగా దైవాన్ని ఆశ్రయిస్తే, దైవ సమానుడైన సద్గురువు వచ్చి మనకు సహాయం చేసి, మనలను ఉత్తీర్ణులను చేస్తాడు.)

రావణాసురుడి ఆజ్ఞను శిరసావహించి ప్రహస్తుని పుత్రుడు జంబుమాలి హనుమంతుని మీదకు బయలుదేరినాడు. అతడు

అమిత బలవంతుడు, మహాకాయుడు. పెద్ద పెద్ద కోరలతో, పెద్ద పెద్ద మిడిగుడ్లతోను, ధగధగలాడే కుండలాలతోను వుండే భయంకరుడు. సమర దుర్జయుడు. ఎర్రటి పూలతోను, ఎర్రటి బట్టల తోను ఇంద్రధనుస్సు లాంటి పెద్ద ధనుస్సు తీసుకొని, పిడుగు చప్పుళ్ళవలె ఆ ధనుస్సు మ్రోగిస్తూ బయలుదేరినాడు. ఆ ధనుష్ఠంకారానికి దిక్కులు, విదిక్కులు, భూనభోంతరాళాలు ప్రతి ధ్వనించినవి. అట్లా అమితవేగంతో కంచర గాడిదలు కట్టిన రథము మీద వస్తూవున్న జంబుమాలిని హనుమంతుడు చూసినాడు. ఉప్పొంగి పోయి పెద్దపెట్టున సింహనాదం చేసినాడు. గువ్వగూళ్ళతో వున్న ఆ బహిద్వారము దూలం మీద కూర్చునివున్న హనుమంతుడిని జంబుమాలి చూచి, అతని ముఖానికి గురిచేసి ఒక అర్ధచంద్రాకారపు బాణాన్ని, తలకు గురిచేసి మరో పది బాణాలను వదలినాడు. ఆ బాణాలు తగిలిన హనుమంతుడి ముఖం ఎర్రబడి, శరత్కాలంలో సూర్యకిరణాలకు వికసించిన ఎర్ర తామరపువ్వువలె శోభించింది. నెత్తురుతో తడిసిన హనుమంతుని ముఖము అప్పుడు ఆకాశంలో రక్తచందన బిందువులతో తడిసిన మహాపద్మం వలె తేజరిల్లింది.

ఆ హనుమంతుడికి అప్పుడు తీవ్రమైన కోపం వచ్చింది. ఎదుటను పెద్ద రాయి కనిపించింది. ఆ మహాబలవంతుడు హనుమంతుడు ఇట్టే ఆ రాయిని పెకలించి, తన బలంకొద్దీ జంబుమాలి మీదకు విసిరివేసినాడు. జంబుమాలి ఆ రాతిని గురిచేసి పది బాణాలు వదలినాడు. ఆ రాయి ముక్కలై పోయింది. విసిరివేసిన రాయి వ్యర్థమై పోవడం చూచి, ఆ చండవిక్రముడు హనుమంతుడు ఒక పెద్ద సాలవృక్షాన్ని ఇట్టే పెళ్ళగించి, గిరగిరా

త్రిప్పసాగినాడు. అట్లా గిర్రున తిప్పుతున్న సాలవృక్షం మీద ఆ జంబుమాలి కొన్ని బాణాలు వదలి, దాన్ని ముక్కలు ముక్కలు చేసి, హనుమంతుడి భుజం మీద ఐదు బాణాలను, వక్షస్థలం మీద ఒక బాణాన్ని, మరో పది బాణాలను దేహమంతటను వదలినాడు. కాయ మంతటా బాణాలు గుచ్చుకున్న ఆ మతిమంతుడు, ఇనుప గుదియలను తీసుకొని అమితవేగంతో త్రిప్పుతూ, గబుక్కున ముందుకు పోయి చటుక్కన జంబుమాలి వక్షస్థలం మీద కొట్టినాడు. జంబుమాలి క్రిందపడిపోయినాడు. అంతట హనుమంతుడు ఆ ఇనుప గుదియలతో జంబుమాలి తలను, మోకాళ్ళను, చేతులను చితుకకొట్టినాడు. అంతటితో ఆగకుండా ఆ రథాన్ని, ఆ రథానికి కట్టిన గాడిదలను నాశనం చేసినాడు. జంబుమాలి మహాకాయ మంతా ముక్కముక్కలై పోయింది. ఆభరణాలు చెక్కుచెదరకుండా అతడు నేలమీద పడిపోయినాడు.

మహా బలవంతులైన కింకరులు చచ్చిపోవడమే కాకుండా, జంబుమాలి సంహారము కూడా రావణాసురుడు విన్నాడు. కోపంతో కన్నులు ఎర్రబడిపోయినాయి. ఎర్రకన్నులు తిప్పుతూ అమిత బలవంతులు, అత్యంత వీర్యవంతులు, మహా పరాక్రమవంతులైన అమాత్య పుత్రులను హనుమంతుని మీదికి పొమ్మని ఆజ్ఞాపించి నాడు. రావణాసురుడు ఆజ్ఞాపించినందువల్ల ఆ మంత్రిపుత్రులు అగ్నిహోత్రుని వంటి కాంతిమంతులు, మహాబలవంతులు, అస్త్రశస్త్ర విదులు, అమిత పరాక్రమవంతులు అయిన ఏడుగురు రాక్షసులు హనుమంతుని మీదకు బయలుదేరినారు. వారివెంట మహాసైన్యం నడిచింది. వారేడుగురు ధానుష్కులు, పరస్పర జయ ఈషణులు.

బంగారు జాలర్లు వేసిన ధ్వజాలతోను, పతాకాలతోను, మేఘ గంభీర ధ్వనులు చేసే మహారథాల మీద ఏడుగురూ తప్తకాంచన ధనుస్సులు సారిస్తూ, మెఱపులు మెరిసే మేఘాలవలె రావణాసుర రాజభవనం నుండి బయలుదేరినారు. అప్పుడు వారి తల్లులు, బంధువులు, స్నేహితులు కింకరులను చంపివేసిన హనుమంతుని మీదికి పోతున్నారని శోక సంభ్రాంతులై పోయినారు. ఆ మంత్రి పుత్రులు తప్తకాంచన భూషణాలు ధరించి, ఆ రథాల మీద ఒకరి రథాన్ని ఒకరు ఒరుసుకుంటూ, అశోకవన బహిఃద్వారము దగ్గరకు పోయినారు. వారేడుగురూ నీలమేఘాలవలె కనిపించినారు. వారి రథాల ధ్వనులు మేఘ గర్జనలవలె వినిపించినవి. వారు తమ బాణాలను వర్షధారలవలె కురిపిస్తూ మహా మేఘాలవలె విహరించినారు.

హనుమంతుడు ఆ బాణవర్షంలో మునిగి పోయినాడు. వానజల్లు కమ్ముకున్న హిమవత్ పర్వతమువలె అయిపోయినాడు. అంతట ఆ హనుమంతుడు చటుక్కున నిర్మలాకాశాని కెగిరి, ఆ ఏడుగురూ వదిలిన బాణాలను, రథాల వేగాన్ని వ్యర్థం చేసినాడు. ధనుష్మంతులైన ఆ రాక్షసులను తప్పించుకొని ఆ వీరుడు హనుమంతుడు, ఆకాశమున విహరిస్తూ ఇంద్ర ధనుస్సు వున్న మేఘాలతో క్రీడించే వాయుదేవుడివలె తేజరిల్లినాడు. మహా భయంకరంగా కేకలు వేస్తూ, ఆ మహా సైన్యాన్ని భయపెడుతూ రాక్షసుల మీదికి అమితవేగంతో దూకి, కొందరిని అరచేతులతో చరచినాడు. కొందరిని పాదాలతో పడదన్నినాడు. కొందరిని పిడికిళ్ళతో పొడిచినాడు. కొందరిని తన గోళ్ళతో చీల్చినాడు. కొందరిని తన వక్ష

స్థలంతోను, కొందరిని తన తొడలతోను చంపివేసినాడు. అతని మహా ధ్వనులకు కొందరు నేలకూలినారు. అట్లా రాక్షసులు నేలకూలుతూ, చచ్చిపోతూ వుంటే రాక్షస సైన్యమంతా భయపడి, దశదిశలా పరుగులెత్తింది. ఏనుగులు వికృతంగా అరిచాయి. గుఱ్ఱాలు నేలకూలాయి. రథాలమీద ధ్వజాలు, ఛత్రాలు ముక్కలు ముక్కలయ్యాయి. ఆ దారిన నెత్తురు ఏరులుకట్టి పారింది. అప్పుడు లంకాపట్టణంలో నానావిధ వికృత ధ్వనులు బయలుదేరినాయి. ఆ మహావీరుడు, ఆ మహా బలవంతుడు, ఆ ప్రచండ పరాక్రమవంతుడు బలవృద్ధులైన రాక్షసులను చంపివేసి, మళ్ళీ వచ్చే రాక్షసులతో పోరాడటానికి ఎదురుచూస్తూ, అశోకవన బహిర్ద్వారాన నిలుచుని వున్నాడు.

హనుమంతుడు మంత్రిపుత్రులను చంపినాడని రావణాసురుడు విన్నాడు. క్రుంగిపోయినాడు. జాగ్రత్తగా ఆలోచించినాడు. నీతి శాస్త్ర విశారదులు, వీరులు, వాయువేగ సమానులు, సేనానాయకులు అయిన విరూపాక్ష యూపాక్షులను, దుర్ధరుడు, ప్రహలుడు, భాసకర్ణుడు అనే ఐదుగురు రాక్షసులను పిలిచి, సేనానాయకులారా! మీరు మహాబలవంతులు. మీరు గుఱ్ఱాలతోను, ఏనుగులతోను, రథాలతోను బయలుదేరిపొండి. ఆ వానరుని నేను శిక్షించవలెను. మీరు ఆ వానరుని పట్టుకొచ్చే ప్రయత్నం చేయండి. దేశ కాల విరోధమైన పని చేయవద్దు. వాడు చేస్తున్న పనులనుబట్టి వాడు వానరుడని అనుకోవడానికి వీలుకాకుండా వున్నది. ఎన్ని విధాల ఆలోచించినా వాడు మహాభూతంగా తోస్తున్నాడు. మనలనందరినీ నాశనం చేయవలె ననుకొని

దేవేంద్రుడు వానిని సృష్టించినాడేమో! నేను మీ అందరినీ వెంట బెట్టుకొని నాగులను, యక్షులను, అసురులను, మహర్షులను జయించి నాను. అందువల్ల వారు మాకు అవశ్యము అపకారము తలపెట్టి వుండవచ్చును. అందులో సందేహం లేదు. మీరు మీ బలమంతా ఉపయోగించి వాడిని పట్టుకోవలెను. వాడు భయంకర పరాక్రముడు. కాబట్టి వాడిని పట్టుకొని రావలసిందే!

నేను పూర్వము వాలిని, సుగ్రీవుని, మహా బలవంతుడైన జాంబవంతుని, వానర సేనా నాయకుడైన నీలుని, ఇంకా ద్వివిదుడు మొదలగు వానరవీరులను చూచియున్నాను. వారికెవరికీ వీడికున్నంత భయంకర గమనం లేదు. వారు ఇంత కాంతిమంతులు కారు. ఇంత పరాక్రమవంతులు కారు. ఇంత ఆలోచన వారికెవరికీ లేదు. ఇంత బలము, ఇంత ఉత్సాహము వారి కెవరికీ లేదు. వానరుడికి వున్న మహత్తర రూపము కూడా వారికి లేదు. ఇదంతా ఆలోచిస్తూ వుంటే, వానర రూపంలో వున్న మహాభూతమేమో అనిపిస్తోంది. మీరు ప్రయత్నం చేసి ఈ వానరుణ్ణి నిగ్రహించవలెను. మీరు మహా పరాక్రమవంతులు. ముల్లోకాలలో వున్న దేవతలు, అసురులు, మానవులు ఏకమైనా యుద్ధంలో మీ ఎదుట నిలువజాలరు. అట్లా అయినప్పటికీ యుద్ధంలో జయాపజయాలు ముందుగా నిశ్చయించ డానికి వీలుకాదు. జయమును కాంక్షించే నీతిజ్ఞులు ముఖ్యంగా ప్రయత్నంతో తమను తాము రక్షించుకోవలెను. కాబట్టి మీరు అజాగ్రత్తగా ప్రవర్తించక, జాగ్రత్తగా ప్రవర్తించవలెనని చెప్పినాడు.

(హనుమంతుని గురించి రావణాసురుడు చెప్పినటువంటి ఈ భావము మనకు కూడా ఒక కనువిప్పు. ఆయన ముందు

వాలిగానీ, సుగ్రీవుడు గానీ ఎందుకూ కొరగారు. కానీ వానికి బంటువలె వుంటాడు. ఇది సత్సాధకుడికి చాల ముఖ్యమైన విషయం. మనం ఎంతటివాళ్ళ మన్నది ఎదుటి వాళ్ళకు తెలియ వలసిన అవసరం లేదు. ఎంత తక్కువగా, వినయంగా, నిగూఢంగా వుంటే అంత మంచిది. అంతేకానీ వున్నదంతా బయట పెట్టుకొని విఱ్ఱవీగడం కూడదు. ఈయన సద్గురువు కాబట్టి, జగద్గురువు కాబట్టి, సరాసరి శివాంశము కాబట్టి ఎలా వుండాలో చూపిస్తున్నాడు. నిజానికి అతడే (హనుమంతుడే) రావణుని సంహారము చేయ వచ్చు. కానీ అతని పని కాదు. వాలిని కూడా అతనే సంహరించ గలడు కానీ అది అతని పని కాదు. ఎందుకంటే కార్యకారణములు అన్నీ కూడా బాగా తెలిసినటువంటి విజ్ఞుడు సద్గురువై యుంటాడు. ఎవరి గురించి ఎవరు జన్మ ఎత్తారో రెండింటినీ తెలిసి వుంటారు. అందుచేత వారిచేత వారినే సంహరింప చేయడానికి తాను దోహదము చేయాలి తప్ప, తనకు బలముంది కదాని దిగడం పద్ధతి కాదు.

మహాభారత యుద్ధంలో శ్రీకృష్ణుడు కూడా అలాగే నిర్వర్తిం చాడు. తనకుగా కురుసైన్యమును ముహూర్త మాత్రంలో సంహ రించగల శక్తి వున్నప్పటికీ, ఎవరిచేత ఎవరు మరణించవలెనను కార్యకారణ సంబంధం వున్నది కాబట్టి దానిని నిర్వర్తింపచేయుట గానీ, మనకు శక్తి వున్నదని, సమర్థత వున్నదని, మనది కాని పని మనము చెయ్యకూడదు. హనుమంతుడు ఇంతపని చేసి కూడా రావణుని ఏమీ చేయడు. ఎందుకంటే కొంత భయం కలిగించి వెళ్ళాలనే. రాముని గూర్చి కొంత భయమెలాగూ వుంది రావణునికి.

భయముంది కాబట్టే దొంగతనంగా ఎత్తుకొచ్చాడు. కాబట్టి ఆ భయము కొంత పెంపొందించాలని, నాలాంటివాళ్ళు చాలామంది వున్నారు జాగ్రత్త, సంధి చేసుకో, సీతాదేవిని అప్పచెప్పు అని చెప్పవచ్చు. అహంకార పురుషుడు వినడు. ఎందుకంటే వాడు ఒకసారి అహంకారమునకు దొరికిపోయినటువంటి వాడు. ఎన్ని మంచి మాటలు చెప్పినా వినడు. ఎక్కదు. వాడి నాశనము వాడు పరిపూర్ణంగా చేసుకున్నంతవరకు ఎక్కదు. ఆ చిట్టచివరి శ్వాస అప్పుడు మాత్రము సమస్తమూ తెలుస్తుంది. అంతవరకు ఏమీ తెలియదు. అంతవరకు కొట్లాడుతూనే వుంటారు. రావణుడైనా, దుర్యోధనుడైనా, కంసుడైనా, కర్ణుడైనా అంతే. అది కేవలము అహంకారమునకు దొరికిపోవడం జరుగుతుంది.

అహంకారమును జయించిన ప్రజ్ఞ సద్గురువు ప్రజ్ఞ. అందుచేత సద్గురువు ముందు ఎవరైనా నేను చాలా గొప్పవాడినని ప్రయత్నిస్తే, ఏం మాట్లాడడు. అయివుండుగాక. శుభం అంటాడు. ఈ పరాక్రమము హనుమంతుడిది. సుగ్రీవుడికి తెలియదు, వాలికి తెలుసు. హనుమంతుడు గర్భములో వున్నప్పుడే వాలి సంహరించ డానికి పూనుకుంటాడు. ఎందుకంటే తనకన్నా చాలా బలవంతుడు పుట్టబోతున్నాడు అని తెలుస్తుంది. అతనిముందు తను ఏ మాత్రమూ పనికిరాడని తెలుస్తుంది. ఆ సందర్భములో వాలి, హనుమంతుణ్ణి సంహరించడానికి ప్రయత్నం చేస్తాడు. అపుడు వీలుపడకపోతుంది. బాగా కాగిన బంగారము అంజనాదేవి యోనిలో పోస్తాడు కదా! ఆ బంగారమంతా శిశువునకు కవచంగా తయారై, ఆయన కాంచన విగ్రహము అయిపోయాడు. కాబట్టి

అటువంటి కాంతివంతుడు, ధైర్యవంతుడు. ఆ రహస్యము ఆయనకు తెలుసు. వాలికి తెలుసు. ఇపుడు రావణాసురుడికి అనుమానము వచ్చింది. సుగ్రీవునికి తెలియదు. చాలామందికి తెలియదు. ఎందుకంటే రాజ రహస్యాలు రాజుతోనే చచ్చిపోతాయి. అందుకని వాలి అట్లా దాచివుంచాడు. అట్లా క్షత్రియ ధర్మములో రహస్యాలు దాచడము వంటిది అతి ఉత్తమమైనటువంటిది. అది ఎవరికీ కుదరదు. క్షాత్రధర్మము వుండేవాళ్ళే రాజరహస్యములు దాచి వుంచుతారు.

అందుచేత ఆ విధంగా హనుమంతుని గూర్చి రావణాసురుడు చెప్పిన వాక్యాలనుండి తెలిసిన దేమిటంటే మొత్తము వానరవీరులు ఎవరిలో కూడా ఇతనితో సరిపోయేవాడు ఎవడూలేడు. ఎందుకంటే వాలి, రావణాసురుడిని తన చెవిలో పెట్టుకొని ఉత్తర సముద్రము, దక్షిణ సముద్రము, తూర్పు సముద్రము, పడమర సముద్రములలో ప్రతిరోజూ స్నానము చేసి, అర్ఘ్యం యిచ్చి, ఆ తర్వాత తన దైనందిన కార్యక్రమాలు చేసేవాడు. రోజూ నాలుగు సముద్రాల లోనూ స్నానము చేస్తూవుంటే, ఈ రావణాసురుడికి ప్రతివాడి తోనూ పోట్లాడే దురద ఒకటి వుంది. దాని కారణంగా వాలితో పోట్లాడదామని వెళితే వాడిని చిన్నగా మడిచి చెవిలో పెట్టుకొని మార్నింగ్ బాత్ నాలుగు చోట్లా చేసివచ్చేవాడు. అటువంటి వాలి కూడా ఈయనముందు పనికిరాడని చెపుతున్నాడు. ఇదీ హనుమంతుడు.

కాబట్టి, ఎంతటివాడు హనుమంతుడు అంటే ఇంతటివాడు అని చెప్పడానికి ఏమీలేదు. ఎంతటి వాడు అంటే తన కార్యాన్ని

అది ఎంతటి దుర్లభమైన, దుర్ఘటమైన, దుస్సాహసమైన, దుర్గమ మైన "దుర్గమకార్య జగతికే జేతే" - తనదైతే నిర్వర్తించ గలడు. తనదికాని దాని జోలికి పోడు. కృష్ణుడు తనదికాని దాని జోలికి పోలేదు. హనుమంతుడు తనదికాని దాని జోలికి పోలేదు. తగుదునమ్మా అని మనకు సమర్థత వుందని అన్నిటిలోనూ వేళ్ళు పెట్టకూడదు. అందుచేత హనుమంతుని గురించి ఎవరికీ తెలియదు. రాముడు పసికడతాడు. ఇతడు సమస్తమూ తెలిసినవాడు. ఇతనికి తెలియనిదేమీ లేదు అని తెలుసుకుంటాడు. అది మొట్టమొదట వారిద్దరి మధ్య జరిగినటువంటి ఆ సమాగమములోనే రామునికి అవగాహన మవుతుంది.

హనుమంతుడేమీ చెప్పడు. చాలా మామూలుగా వుంటాడు. సాధారణంగా వుంటాడు. ఉన్నప్పటికీ రాముడు తెలుసుకుంటాడు. తెలుసుకొని లక్ష్మణుడికి హెచ్చరిక చేస్తాడు. ఇతనివల్లనే ఏ కార్య మైనా అవుతుందని. అందుకనే ఉంగరము కూడా హనుమంతునికే ఇస్తాడు. రామునికి తెలుసు. రావణునికి భయం చేత ఇప్పుడు తెలుస్తుంది. అందుకు ఆ విధంగా వున్నదున్నట్లుగా చెప్పాడు. ఇతడు కోతి అనుకోవద్దు. వానర రూపంలో వున్నాడు కానీ వానరుడు కాదు. సుగ్రీవుని సామ్రాజ్యంలో వున్నటువంటి ఈ విశిష్టమైన వానరు లందరూ కూడా దైవాంశలే. దేవతలే రక రకములుగా అంశలు పట్టుకొని వచ్చారు. అందుచేత వారందరూ విశిష్టమైనటువంటి జీవులే. అయినప్పటికీ ఈయన విశిష్టత మనకు మొట్టమొదట కన్పిస్తుంది. రామాయణములో వాల్మీకి, రావణుని నోటిద్వారా తెలిపి, మనకందరకు హనుమంతుని గురించి ఆయన

అప్రతిహత పరాక్రమము ఇక్కడ మనకు ఆవిష్కరిస్తుంది. అక్కడ రాముని దగ్గర అతని సంపూర్ణ జ్ఞానము హనుమంతునిది ఆవిష్కరిస్తుంది. అందుచేత మనము ఈ విధంగా అవగాహనము చేసుకోవాలి హనుమంతుణ్ణి.)

అంతట ఆ మహాబలవంతులు, అగ్నిహోత్రము వంటి ఆ తేజోవంతులు ఐదుగురు రాజాజ్ఞను శిరసావహించి మదించిన ఏనుగులతోను, అమితవేగంగా పోయే గుఱ్ఱాలతోను, సమస్త సైన్యాల తోను, వివిధ తీక్షణాయుధాలతోను బయలుదేరి హనుమంతుడి మీదకు పోయినారు. అశోకవన బహిర్ద్వారము దగ్గర ఉదయిస్తున్న సూర్యునివలె తన దేహకాంతులతో తేజరిల్లుతున్న ఆ మహాసత్త్వుని, ఆ మహాబలవంతుని, ఆ మహోత్సాహుని హనుమంతుని ఆ రాక్షససేనా నాయకులు చూశారు. వెంటనే వారందరూ ఆ మహాకాయుని చుట్టూ మూగారు. ఆయా భయంకరమైన ఆయుధాలతో ఎదిరించినారు.

అప్పుడు దుర్ధరుడనే రాక్షససేనా నాయకుడు పసుపుపచ్చ మొనలతోను, తామర రేకులవంటి కాంతులతోను వున్న ఐదు బాణాలను హనుమంతుని శిరముపైకి వదలినాడు. ఆ ఐదు బాణాలు తలమీద తగలగానే హనుమంతుడు దశదిశలూ పిక్కటిల్లిపోయేటట్లు సింహనాదం చేశాడు. అలాచేసి ఆకాశాని కెగిరినాడు. అప్పుడా మహాబలవంతుడు దుర్ధరుడు కూడా ఆకాశాని కెగిరి తీక్షణమైన బాణాలు హనుమంతుడి మీదకు వదలినాడు. శరత్కాలంలో వర్షము కురిసే మేఘాన్ని అతి సులభంగా వాయువు అడ్డగించేటట్లు, బాణవర్షం కురిపిస్తున్న

ఆ దుర్ధరుని హనుమంతుడు అడ్డగించాడు. దేహాన్ని మరింత పెంచి, చటుక్కున ఎంతో ఎత్తున పైకెగిరి, మహా వేగంతో పిడుగుల గుంపు పర్వతము మీద పడ్డట్టు ఆ దుర్ధరుడి రథం మీదికి దూకినాడు. అప్పుడు దుర్ధరుడు నేలకూలినాడు. ఎనిమిది గుఱ్ఱాలు చచ్చి, రథము నొగకట్టు విరిగిపోయి నేలకూలింది.

అట్లా దుర్ధరుడు చచ్చి నేలకూలడం చూచి ఎదిరించనలవి కాని అరిందములు విరూపాక్ష, యూపాక్షులిద్దరూ ఆకాశమున కెగిరినారు. ఆ స్వచ్ఛ ఆకాశములో వున్న హనుమంతుని ఎదురు రొమ్ము మీద ఇనుప గుదియలతో కొట్టారు. గరుత్మంతుని వంటి ఆ పరాక్రమవంతుడు, ఆ మహాబలవంతుడు హనుమంతుడు అమిత వేగంతో ఆ విరూపాక్ష, యూపాక్షులను కొట్టి చటుక్కున నేలమీదకు వచ్చాడు. అంతట వాయుపుత్రుడు ఒక మద్దిచెట్టును చటుక్కున ఇట్టే పెకలించి విరూపాక్ష, యూపాక్షులను కొట్టి చంపాడు.

ఇట్లా ముగ్గురు బలవంతులైన రాక్షసులను హనుమంతుడు చంపివేయడం చూచి, ప్రహలుడు మహావేగంతో హనుమంతుని ఎదిరించినాడు. అమితవీరుడైన భాసకర్ణుడు మహాకోపంతో శూలంతో మహావీరుడైన హనుమంతుడి మీదకు పోయినాడు. వారిద్దరూ ఒక ప్రక్కనుండి హనుమంతునితో పోరాటము సాగించారు. ప్రహస్తుడు కరకైన అడ్డకత్తితోను, భాసకర్ణుడు శూలంతోను పోరాడినారు. హనుమంతుడి దేహమంతా నెత్తురు కమ్ముకొని బాలసూర్య ప్రభలతో తేజరిల్లింది. అప్పుడతడు మృగాలతోను, పాములతోను, చెట్లతోను వున్న ఒక పర్వతాన్ని పెకలించి, ఆ రాక్షసు లిద్దరినీ చంపివేశాడు. ఆ ఐదుగురు సేవా నాయకులను చంపివేయడమే

కాక మిగిలిన సైన్యాన్నంతా చిందరవందరగా చంపినాడు. అసుర సంహార సమయంలో దేవేంద్రుడు చేసినట్లు, అప్పుడు హను మంతుడు ఆ రాక్షస సైన్యంలో కలత పుట్టించి వారి గుఱ్ఱాలను, వారి గుఱ్ఱాల చేతనే చంపించినాడు. వారి ఏనుగులతోనే వారి ఏనుగులను చంపించినాడు. వారి రథాలను వారి రథికుల చేతనే పడగొట్టించినాడు. వారి యోధులతో వారి యోధులే కలహించి, ఒకరి నొకరు చంపుకున్నారు. చచ్చిపడిపోయిన ఏనుగులతోను, గుఱ్ఱాలతోను, విరిగి పడిపోయిన మహారథాలతోను, చచ్చి పడిపోయిన రాక్షస కళేబరాలతోను ఆ నేలమీద దారి తెలియ కుండా పోయింది. ఆ మహాపరాక్రమవంతుడు హనుమంతుడు రాక్షససేనా నాయకులను, వాళ్ళ సైన్యాలను, వాహనాలను నాశనం చేసి ప్రళయ కాలంలో ఉగ్రుడయ్యే యమునివలె అశోకవన బహిర్ద్వారము వద్దకు మళ్ళీ వచ్చి రాక్షసుల కోసం ఎదురుచూస్తూ వున్నాడు.

(అశోకవన బహిద్వారం ఒక తోరణం లాగా వుంటుంది. ఆ తోరణం పైన ఆయన కూర్చుంటాడు. ఎవరన్నా రాక్షసులు వస్తే, క్రిందకు వచ్చి వారిని చంపేసి, మళ్ళీ వచ్చి తోరణం మీదనే కూర్చుంటాడు. అలా తోరణం మీద కూర్చోవట మంటే ఉదరవితానం పైన వుంటాడని అర్థం. బయట మనసుచేత, ఇంద్రియములతో, శరీరంతో పనులు నిర్వర్తించటానికి దిగివచ్చినా, పనులైపోయిన తరువాత సద్గురువు యొక్క స్వస్థానం హృదయము. యోగులు, సాధువులు, సిద్ధు లందరూ ఇక్కడ వుంటారు. శిరస్సులోకి వెళ్ళి దివ్యప్రణాళిక తెలుసుకొని, దేహాన్ని ఆధారంగా

పనులు నిర్వర్తించి, మళ్ళీ హృదయంలో వుంటారు. అలాంటివారి హృదయంలో దైవం వుంటాడు.)

ఐదుగురు సేనానాయకులను, వారివెంట పోయిన సైన్యాన్ని, వారి వాహనములను హనుమంతుడు నాశనం చేసినాడని రావణాసురుడు విన్నాడు. ఎట్టఎదుట వున్న తన కుమారుడు అక్షుని చూచినాడు. ఆ యుద్ధోన్మత్తుడు, ఆ మహా పరాక్రమ వంతుడు అక్షకుమారుడు తనను హనుమంతుడి మీదకు పొమ్మని తండ్రి తనవంక చూశాడని తెలుసుకున్నాడు. బంగారు పొదిగిన కార్ముకము తీసుకున్నాడు. బ్రాహ్మణోత్తముల ఆజ్యాహుతులకు మంటలు మండే అగ్నిహోత్రము వలె ఆ సదస్సులో లేచి నిలచి నాడు. బాలసూర్య ప్రభలతో ధగధగలాడుతూ వున్న తప్తకాంచన రథం వచ్చింది. అది తపోబలంతో ఆర్జించిన రథం. తపస్సులో రథంలాంటివన్నీ వస్తాయి. అయితే సత్సాధకుడు వీటితో తృప్తి చెందక, ఆత్మసాధనకై ముందుకు వెళ్తాడు. అలాంటి వారికివి సామాన్య విషయాలు. మనోవేగంతో పోయే ఎనిమిది గుఱ్ఱాలు ఆ రథమునకు పూన్చి వున్నవి. దానిని సురాసురు లెవ్వరూ ఎదిరించ లేరు. ఏ అడ్డూ లేకుండా పరుగులెత్తుతుంది. ఆకాశంలో సైతం అది సంచరిస్తుంది. అమ్ముల పొదులు, ఎనిమిది ఖడ్గాలు, వరుసగా శక్తి తోమరాలు మొదలగు ఆయుధాలు, వ్రేలాడుతున్న గంటలు, సూర్యచంద్రుల వంటి కాంతులతో వెలుగుతున్న బంగారు, వెండి పూలదండలు, యుద్ధానికి అవసరమైన సమస్త ఉపకరణాలు ఆ రథంలో వున్నాయి. అక్షకుమారుడు ఆ రథం మీద బయలు దేరినాడు. ఆ రథ ఘోషలతోను, ఆ రథం వెంట బయలుదేరిన

గుఱ్ఱాలు, ఏనుగులు మొదలగువాటి మహాధ్వనులతో ఆకాశము, పర్వతాలతో వున్న ఈ భూమి మార్మోగిపోయింది.

ప్రళయకాలంలో అగ్నిహోత్రునివలె తేజరిల్లుతున్న హనుమంతుని అశోకవన బహిర్ద్వారము దగ్గర అక్షకుమారుడు తన తేనెకన్నులతో చూచినాడు. చాలా పరిణామంలో వున్నవారికే తేనె కళ్ళుంటాయి. హనుమంతునికి, సుగ్రీవునికీ కూడా తేనెకళ్ళే. ఆశ్చర్యపడ్డాడు, కలవరపడ్డాడు. అతడెంత పరాక్రమవంతుడన్నదీ తెలుసుకున్నాడు. శత్రువులను జయించే ఆ హనుమంతుడి పరాక్రమాన్ని, వేగాన్ని, తన బలాన్ని సరిచూచుకున్నాడు. ఆలోచించినాడు. ప్రళయకాల సూర్యునివలె తేజరిల్లినాడు. పోరాటంలో నిగ్రహించనలవికాని ఆ స్థిర పరాక్రమవంతుని హనుమంతుని చూచినకొద్దీ అక్షకుమారునికి కోపం పెచ్చు పెరిగింది. మనసు దిటవు పరచుకున్నాడు. స్థిరచిత్తుడై మూడు తీక్షణమైన బాణాలు వదలి, హనుమంతుని పోరాటానికి పురికొల్పాడు. ఎంతటి శ్రమనైనా లక్ష్యము చేయకుండా శత్రువును జయించే సామర్థ్యం ఆ హనుమంతునికి వుందని అతడు తెలుసుకున్నాడు. చేతిలో బాణాన్ని ధనుస్సును పట్టుకొని యుద్ధ సూచకంగా హనుమంతుని వంక తేరిపార చూశాడు. ఒక్క క్షణం ఆలోచించి బంగారు పతకం అమర్చిన బాహుపురులతోను, సొగసైన కుండలాలతో వున్న ఆ అక్షకుమారుడు ప్రచండ పరాక్రమంతో, అమిత ఉరవడితో చెలరేగి పోరాడే హనుమంతుని మీదికి పోయాడు.

ఆ ఉభయుల పోరాటానికి సురాసురు లందరూ సంభ్రమము పడిపోయారు. అప్పుడు భూమిమీద ఘోరంగా దుమ్మురేగింది.

సూర్యుడు ఎండకాయడం మానివేశాడు. గాలివీచడం ఆగిపోయింది. కొండలన్నీ కదలిపోయాయి. భూమ్యాకాశాలు రెండూ ధ్వనించాయి. సముద్రం అల్లకల్లోలమైంది. గురిపెట్టడంలోను, బాణాన్ని ఎక్కు పెట్టడంలోను, ఎక్కుపెట్టిన బాణాన్ని వదలడంలోను అక్షకుమారుడు అత్యంత నిపుణుడు. బంగరు మొనలతోను, రెక్కలతోను వున్న విషసర్పాల వంటి మూడు తీవ్రమైన బాణాలను హనుమంతుడి తలను గురిచేసి వదలినాడు. ఆ మూడు బాణాలు పోయి సరిగా హనుమంతుడి శిరము మీద నాటుకున్నాయి. నెత్తురు ధారలు కట్టి, అతని గుండ్రని నేత్రాలను తడిపివేశాయి. ఆ రక్తధారలతో హనుమంతుడు అప్పుడే ఉదయిస్తున్న సూర్యునివలె, నెత్తిన నాటుకున్న బాణాలు సూర్యుని కిరణాలవలె కనిపిస్తున్నాయి.

నానావిధ ఆయుధాలతో చిత్రవిచిత్రంగా మెరిసిపోతున్న ధనుస్సుతోను పోరాటానికి తలపడ్డ అక్షకుమారుని చూచి మెచ్చు కొని, హనుమంతుడు పోరాటానికి తలపడ్డాడు. మిట్ట మధ్యాహ్న సూర్యుడివలె అతి ఉగ్రుడైపోయి, మహాకోపం వచ్చి, అగ్నిహోత్రం వలె జ్వలిస్తూ, తన నేత్రాలతో కాల్చివేసేటట్లు అక్షకుమారుని, అతని సైన్యాన్ని, అతని వాహనాన్ని చూశాడు. తన ధనుస్సును ఇంద్రధనుస్సు వలె చేసి, తన బాణాలను వర్షధార వలె కురిపించదలచుకొని అక్షకుమారుడు పర్వతం మీద మహామేఘం వానలు కురిసినట్లు పర్వతాకారుడైన హనుమంతుని మీద బాణముల వర్షం కురిపించాడు. భయంకర పరాక్రమంతో, అధిక తేజంతో ఆకాశంలో మహా మేఘంవలె తిరుగుతున్న అక్ష కుమారుని చూచి, హనుమంతుడు సింహనాదం చేశాడు.

ఆ అక్షకుమారుడు బాలుడు. పరాక్రమంతో గర్వించి, మహాకోపంతో కన్నులెర్రబడిపోయి మదించిన ఏనుగు తెలియక పెద్ద గుట్టమీదకు పోయినట్లు, హనుమంతుడి మీదికి పోయినాడు. అంతట హనుమంతుడు తన బాహువులను, తొడలను భయంకర ముగా విదిలిస్తూ, చటుక్కున ఆకాశాని కెగిరాడు. అట్లా ఆకాశాని కెగురుతున్న హనుమంతుని చూచి అక్షకుమారుడు రథముతో కూడా ఆకాశానికెగిరి పర్వతం మీద రాళ్ళవలె హనుమంతుడి మీద బాణవర్షము కురిపించాడు. మనోవేగంతో సంచరించే ఆ చండ పరాక్రమవంతుడు హనుమంతుడు అక్ష కుమారుని బాణాలకు చిక్కకుండా ఆ బాణాల నడుమనే తిరుగుతూ ఆకాశంలో విహరించినాడు. ఆకాశాన్నంతా బాణాలతో కప్పివేస్తున్న ఆ అక్ష కుమారుని చూచి మెచ్చుకుంటూ ఆలోచించసాగినాడు. అంతలో అక్షకుమారుడు వదలిన రెండు బాణాలు వచ్చి హను మంతుని ఎదురు రొమ్ములపై పడ్డాయి.

అంతట హనుమంతుడు పెద్ద పెట్టున అరచినాడు. ఈ అక్షకుమారుడు మహాబలవంతుడు. పిల్లవాడైనప్పటికీ గడిదేరి, సూర్యుడివలె తేజరిల్లి మహత్కార్యము నిర్వహిస్తున్నాడు. వీడికి యుద్ధ తంత్రమంతా తెలుసును. వీడిని చంపివేయడ మెట్లాగో నాకు తోచడంలేదు. మహా పరాక్రమవంతుడు. అతి సాహసంతోను, హెచ్చరికతోను పోరాడుతున్నాడు. నాగులు, యక్షులు, దేవతలు మెచ్చుకునేట్లు వీడు ఇప్పుడు నా ఎట్టఎదుట నిలుచుని పరాక్రమం తోను, ఉత్సాహంతోను యుద్ధము చేస్తున్నాడు. వీణ్ణి చంపకుండా ఉపేక్షించినట్లైతే, వీడు ఉత్తరోత్తరా మమ్ములను తప్పకుండా బాధ

పెడతాడు. ఇప్పుడు వీడిని చంపివేయడమే తగిన పని. చెలరేగు తున్న అగ్నిహోత్రాన్ని ఎంతమాత్రమూ ఉపేక్షించరాదు అని నిశ్చయించుకొని హనుమంతుడు అక్ష కుమారుడి రథానికి కట్టిన ఎనిమిది గుఱ్ఱాల మీదకు ఆకాశంలో నుంచి దూకి అరచేతులతో చరచి చంపివేసినాడు. ఆ రథం యిరుసును విరగ తన్నినాడు. గుఱ్ఱాలు పడిపోయి, నొగ తొలగిపోయి ఆ రథం ఆకాశం నుండి నేలమీద పడిపోయింది.

అంతట అక్షకుమారుడు నేలకూలిన రథం వదలిపెట్టి ధనుస్సు, ఖడ్గము తీసుకొని మహర్షి దేహాన్ని వదలి స్వర్గానికి పోయేటట్లు ఆకాశాని కెగిరినాడు. వాయువు వంటి మహా పరాక్రమమున్న హనుమంతుడు సిద్ధులు విహరించే ఆకాశంలోకి అట్లా ఎగిరివస్తున్న అక్షకుమారుని చూచి, వాడి రెండు పాదాలు పట్టుకొని గరుత్మంతుడు మహాసర్పాన్నివలె వెయ్యిమార్లు గిరగిరా త్రిప్పి అమితవేగంతో నేలమీద పడవేసినాడు. అక్షకుమారుడు చేతులు, కాళ్ళు, నడుము విరిగి దేహము నుండి నెత్తురు కారుతూ ఎముకలు, కాళ్ళు నలిగిపోయి, కళ్ళు గూళ్ళు కప్పి, కట్టుకున్న దట్టీ ఊడిపోయి నేలమీద పడ్డాడు.

అప్పుడు జ్యోతిశ్చక్రములో తిరిగే మహావ్రతులైన మహర్షులు, భూతాలు, యక్షులు, పన్నగులు, దేవతలు, దేవేంద్రుడు చూచి ఆశ్చర్య పోయినారు.

(మొత్తము ప్రణాళిక దిగివచ్చినప్పుడు అందరికీ కొంచెం కొంచెం తెలుస్తుంది. మొత్త మెవరికీ తెలియదు. హనుమంతుడు

ఇంతటి వాడని దేవేంద్రునికి కూడా తెలియదు. ఎందుకంటే మొత్తము ప్రణాళికలో పైవాడు ఏమి చేస్తున్నాడో క్రిందవాళ్ళకు తెలియచేయరు. క్రిందవాళ్ళకు ఎంతవరకు తెలియాలో అంత వరకే తెలుస్తుంది. అందుచేత దేవేంద్రుని దగ్గర నుండి చాలా మంది ఈ వానర సైన్యములో వచ్చి పుట్టారు. ఆ వచ్చి పుట్టిన వారిలో ఈయనొకడు వచ్చి చేరాడు. ఈయన దేవేంద్రునికి అవగాహన కాలేదు. ఎందుకంటే తెలియని పై లోకము నుండి ఒక పథకము ప్రకారము ఈయనవచ్చి ఈ శరీరంలో వున్నాడు. అందుచేత తెలియడానికి అవకాశముండదు. లేకపోతే ఆశ్చర్యపడ వలసిన అవసరముండదు గదా!)

దేవేంద్రుని వంటి అక్షకుమారుని అట్లా చంపివేసిన హను మంతుడు ఆ అశోకవన బహిర్ద్వారమునకు పోయి, ప్రళయకాల యముని వలె మరలా నిలుచున్నాడు.

అక్షకుమారుని మరణవార్త తెలిసిన రావణాసురుడికి దుఃఖం వచ్చింది. చెడ్డకోపం వచ్చింది. దేవేంద్రుని వంటి తన కుమారుని ఇంద్రజిత్తుని పిలిచి, నాయనా! నీవు బ్రహ్మదేవుణ్ణి ఆరాధించి అనేక దివ్యాస్త్రాలు సంపాదించినావు. నీవు శస్త్రాస్త్ర వేత్తలలో శ్రేష్ఠుడవు. దేవతలలో కూడా దేవేంద్రుని జయించినావు. సురాసురు లందరూ ఏకమైనప్పటికినీ నీవు జయించగలవు. యుద్ధంలో నీ అస్త్రబలానికి సురులు కానీ, అసురులు కానీ నిలబడ లేరు. మరుద్గణాలు కూడా నిలువలేరు. నీతో పోరాడి జయించ గలవారు ముల్లోకాలలోనూ ఎవరూ లేరు. నీ భుజ పరాక్రమము,

నీ తపోబలము నిన్ను కాపాడుతూ వున్నవి. నీవు దేశ కాల విభాగాలు చక్కగా ఎరిగినవాడవు. మహా మతిమంతుడవు. యుద్ధములో నీ పరాక్రమానికి అవశక్యమైనదేదీ లేదు. నీ బుద్ధిబలముతో ముందుగా ఆలోచిస్తే, నీకు అసాధ్యమైనదేదీ లేదు. ముల్లోకాలలోను నీ దేహబలాన్ని, నీ అస్త్రబలాన్ని ఎరిగిన వాడెవడూ లేడు. నీవు నాతో సరిసమానమైన తపోబలము, పరాక్రమము కలవాడవు. యుద్ధ సంకట సమయంలో నీకు తప్పకుండా జయము సమకూరుతుంది. నీవు వున్నందువల్లనే నాకు ఏ దుఃఖమూ లేదు.

(పట్టపురాణి కొడుకు మేఘనాథుడు. చాలా దివ్యసంపత్తితో వున్నటువంటివాడు. రావణుని తర్వాత రావణుడంతటివాడు. తండ్రితో సరిసమానమైనటువంటివాడు. ఇంద్రుని జయించి తండ్రికి అప్పచెప్పినవాడు. అందుచే ఇతనికి ఇంద్రజిత్తు అని పేరు. అసలు పేరు మేఘనాథుడు.)

నాయనా! కింకరు లందరూ చనిపోయారు. జంబుమాలి, మంత్రిపుత్రు లేడుగురు, సేనా నాయకులు ఐదుగురూ చచ్చిపోయారు. గుఱ్ఱాలు, మహారథాలు, సైన్యమూ నాశనమైపోయాయి. నీ తమ్ముడు అక్ష కుమారుడు కూడా హతుడై పోయినాడు. నాయనా! నీ మీద నాకున్న నమ్మకము మరెవరి మీదనూ లేదు. నీవు శత్రు సంహారకుడవు.

ఓ మతిమంతుడా! నీవు ఆ హనుమంతుడి మహాబలాన్ని, వాడి ప్రభావాన్ని, పరాక్రమాన్ని, నీ బలాన్ని గురించి ఆలోచించు.

నీ బలానికి అనుగుణంగా అమితవేగంతో నీవు వాడితో కూడా పోరాడవలెను. మన సేన నాశనమై పోకుండా నీ బలము, శత్రు బలము చూసుకుంటూ పోరాడవలెను. నాయనా! ఆ వానరుడు, సైన్యాలను గుంపులు గుంపులుగా చంపి వేస్తున్నాడు. నీవు ఏ సన్నాహముతో పోతే ఆ శత్రువు హతమైపోతాడో ఆ విధంగా పోవలెను. వజ్రాయుధాలు తీసుకొని మన సేనలన్నీ వాడి మీద పడ్డప్పటికిన్నీ వాడు చెక్కుచెదరడు. వాడికున్న వేగము వాయువుకు లేదు. వాడు అగ్నిహోత్రము వంటివాడు. వాడిని ఏ ఆయుధం తోనూ చంపటానికి అలవి కాదు. ఇదంతా చక్కగా ఆలోచించి నీవు ఏమరుపాటు లేకుండా, కార్యము చెడకుండా, దివ్యమైన నీ అస్త్రబలాన్ని స్మరించుకుంటూ వాడిమీదకు పో. అమోఘంగా విజృంభించు. నిన్ను యుద్ధానికి పంపించడం నాకు ఇష్టం లేదు. అయితే రాజధర్మాన్ని బట్టి, క్షాత్రధర్మాన్ని బట్టి పంపిస్తున్నాను.

ఓ అరిందమా! నీవు వివిధాయుధాలతో యుద్ధం చేయడం నీ పాండిత్యముతో తెలుసుకో. నీవు నానావిధ ఆయుధములతో యుద్ధము చేయడంలో నీ పాండిత్యం తెలుసుకో. జయించు అని చెప్పినాడు.

అంతట ఆ మహాబలవంతుడు, ఆ మహా పరాక్రమవంతుడు, దేవతల వంటి ప్రభావము గల ఆ ఇంద్రజిత్తు యుద్ధానికి పోదలచి తండ్రికి ప్రదక్షిణం చేసినాడు.

(ఇది ముఖ్యం. ముందువాళ్ళు చేయలేదు. ఎందుకంటే తండ్రి అంటే పరబ్రహ్మ తత్త్వమే. మనం ఆత్మ అయితే, అది

పరమాత్మ క్రింద లెక్క. ఆయన నుంచే మనం దిగివచ్చాం. కాబట్టి తండ్రి జగత్పితకు ప్రతీకగా గోచరిస్తాడు. తండ్రి యందు అలాంటి భావం కలిగియుండాలి. తల్లి యందు కూడా జగన్మాత భావం కలిగి యుండాలి. అందుకే వినాయకుడు కూడా ఈ విధంగా శివునిచుట్టూ ప్రదక్షిణం చేశాడు. ఇవన్నీ శుభసూచకాలు. ఇంద్రజిత్తు ద్వారా రావణుని చేరి చూడవచ్చు. గురుతత్త్వాన్ని అహంకార తత్త్వం పట్టలేదు. మనం దేనినీ పట్టుకోకపోతే, మనలను కూడా ఏదీ పట్టదు. ఇదొక శాశ్వత ధర్మసూత్రం. పట్టులేక కర్తవ్యం మాత్రం నిర్వర్తిస్తూ వుండాలి. రావణుడు అంటే మనస్సు. మనసే అహంకారానికి ప్రతీకగా దేహాన్ని కాపాడుకుంటూ, ఆత్మను దేహానికి దాసుడిగా చేస్తూ వుంటుంది. జీవాత్మను దేహానికి దాసుడిగా చేస్తుంది. జీవాత్మను పరమాత్మకు దాసునిగా చేసేది గురుప్రజ్ఞ.)

ఆ కాంతిమంతుడు, ఆ పద్మపత్రాక్షుడు, ఆ మహా తేజో వంతుడు ఇంద్రజిత్తు పర్వకాలంలో మహాసముద్రంవలె హను మంతుని మీదకు బయలుదేరినాడు. తీక్షణ దంష్ట్రలతో వున్న నాలుగు పెద్దపులులు పూన్చిన రథం వచ్చింది. ఆ పెద్దపులులు గరుత్మంతునితో సరిసమానమైన వేగంతో పోతాయి. ఆ రథం మీద దేవేంద్రుడి వంటి ఇంద్రజిత్తు ఎక్కినాడు. అమితవేగంతో హనుమంతుడున్న చోటికి పోయినాడు. హనుమంతుడు ఆ ఇంద్రజిత్తు రథఘోషాన్ని, అల్లెత్రాటి ధ్వనినీ విన్నాడు. మళ్ళీ యుద్ధము చెయ్యబోతున్నందుకు ఎంతో సంతోషపడ్డాడు. అప్పుడు ఆ రణపండితుడు ఇంద్రజిత్తు పెద్ద ధనుస్సును తీసుకొని పదునైన

ములుకుల బాణాన్ని సంధించి, హనుమంతుని మీద వదలినాడు. అప్పుడు దిక్కులన్నీ మాసిపోయినాయి. క్రూరమృగాలు నానావిధాల అరచినాయి.

ఆ యుద్ధం చూడటానికి జ్యోతిశ్చక్రంలో సంచరించే నాగులు, యక్షులు, మహర్షులు, సిద్ధులు వచ్చినారు. ఆకాశంలో పక్షి సంఘాలు సంతోషంతో గుంపులు కట్టి తిరుగుతూ పెద్దగా అరచినాయి. రథం మీద అతివేగంతో వస్తున్న ఇంద్రజిత్తును, ఆ వేగవంతుడు హనుమంతుడు చూచి సింహనాదము చేశాడు. తన దేహాన్ని పెంచాడు. రథము మీద వున్న ఇంద్రజిత్తు విచిత్రమైన కార్ముకాన్ని తీసుకొని నారి సారించి, పిడుగుల ధ్వని చేశాడు. అంతట ఆ మహా వేగులు, ఆ మహాబలవంతులు, యుద్ధమంటే ఏ మాత్రమూ భయములేని ఆ వీరులు బద్ధవైరులైన దేవేంద్రుడు, అసురేంద్రులవలె ఆ హనుమంతుడు, ఇంద్రజిత్తు ఒకరినొకరు ఎదుర్కొన్నారు. ఆ మహారథుడు ఇంద్రజిత్తు వదిలే బాణాలను హనుమంతుడు తప్పించుకొని అప్రమేయ బలంతో తన తండ్రి వాయుదేవుని వలె ఆకాశంలో విహరించ సాగాడు. ఇంద్రజిత్తు చక్కని రెక్కలు కట్టిన బాణాలను తీశాడు. వాటి ములుకులకు బంగారము పొదిగివుంది. ఆ బాణాల కొసలు వంగి వున్నాయి. అవి పొడుగాటివి. వాటికి తీక్షణమైన మొనలున్నవి. ఆ బాణాలను వజ్రాయుధ వేగంతో హనుమంతుని మీదకు వదలినాడు. హనుమంతుడు వాటి నన్నిటినీ తప్పించుకోవడానికి ఇట్టే నేల మీదకు వచ్చాడు. ఆ ఇంద్రజిత్తు రథధ్వనులు మద్దెళ్ళు, తప్పెట్లు,

భేరులు మొదలగువాటి ధ్వనులవలెను, అల్లెత్రాడు లాగుతున్న వింటి ధ్వనిని విని హనుమంతుడు మళ్ళీ ఆకాశాని కెగిరినాడు.

అట్లా హనుమంతుడు ఇంద్రజిత్తు గురిపెట్టి వదిలిన బాణాలన్నీ వ్యర్థం చేస్తూ, ఆ బాణాల మధ్య ప్రదేశంలో తిరిగినాడు. ఇంద్రజిత్తు బాణాలకు ఆ వాయుపుత్రుడు హనుమంతుడు ఎదురుగా నిలుచుని, బాణాలు వచ్చిపడే సమయానికి చేతులు చాచి ఆకాశానికి ఎగిరేవాడు. ఆ ఉభయులూ అమితవేగులు, యుద్ధ విశారదులు. సమస్త ప్రాణికోటి ఆశ్చర్యపోయేటట్లు పోరాడినారు. హనుమంతుని కొట్టడం ఎట్లాగో ఇంద్రజిత్తుకు తెలియలేదు. ఇంద్రజిత్తును కొట్టడం ఎట్లగో హనుమంతునికి తెలియలేదు. ఇద్దరూ దేవతలతో సరిసమానమైన పరాక్రమవంతులు. ఒకరి నొకరు జయించలేకపోయారు. బాణాన్ని గురి పెట్టడంలోను, బాణాన్ని ఎక్కుపెట్టడంలోను, ఎక్కుపెట్టిన బాణాన్ని వదలడంలోను ఇంద్రజిత్తు మహా గట్టివాడు. అతడు గురిపెట్టి వదలిన అమోఘమైన బాణాలన్నిటినీ హనుమంతుడు తప్పించుకున్నాడు. తన బాణాలన్నీ అట్లా వ్యర్థమై పోయినందుకు ఇంద్రజిత్తు దుఃఖపడి పోయినాడు. వానరుని చంపివేయడం అలవికాదని అనుకున్నాడు. వాడిని పట్టుకొనే ఉపాయం ఆలోచించినాడు. అంతట ఆ శస్త్రాస్త్రవిదుడు ఇంద్రజిత్తు, హనుమంతుని మీద బ్రహ్మాస్త్రాన్ని వదలినాడు.

ఆ అస్త్ర శస్త్రవేత్త, ఆ మహాబాహువు హనుమంతుడు ఇంద్రజిత్తు వదలిన బ్రహ్మాస్త్రానికి కట్టుబడి పోయినాడు. దేహచేష్ట లుడిగి పోయినవి. నేలమీద పడిపోయినాడు. తాను బ్రహ్మాస్త్రానికి కట్టుబడిపోయినట్లు, తన దేహ వ్యాపారా లుడిగిపోయినట్లు

హనుమంతుడు తెలుసుకున్నాడు. అది స్వాయంభువ మంత్రాలతో అభిమంత్రించిన బ్రహ్మాస్త్రమని తెలుసుకోగానే బ్రహ్మ అనుగ్రహం కోసం ఆలోచించినాడు. పూర్వము బ్రహ్మదేవుడు తనకిచ్చిన వరాన్ని గుర్తు చేసుకున్నాడు. బ్రహ్మదేవుడు, దేవేంద్రుడు, వాయుదేవుడు తన నెప్పుడూ కాపాడుతూ వుంటారని, తాను భయపడ నక్కర లేదని, ఆ బ్రహ్మాస్త్రానికి కట్టుబడి వుండవలసిందేనని, దానిని విడిపించుకొనే శక్తి తనకు స్వయంగా లేదని అనుకున్నాడు. అంతే కాకుండా తనను రాక్షసులు పట్టుకోవడం తనకు లాభమేనని, అందువల్ల తాను రావణాసురుడితో మాట్లాడటం సంభవిస్తుందని, శత్రువులు తనను పట్టుకోవడమే కావలెనని నిశ్చయించుకున్నాడు.

చక్కగా ఆలోచించి పనులుచేసే ఆ పరవీర హంత హనుమంతుడు, అప్పుడు తనకు ఎదురుగుండా రాక్షసులు వచ్చి బెదిరిస్తూవుంటే, చేష్ట లుడిగిపోయినాడు. నిశ్చేష్టుడుగా వున్న ఆ అరిందముడు హనుమంతుని రాక్షసులు జనపనారతోను, నార చీరలతోను నేసిన తాళ్ళతో కట్టివేసినారు. అట్లా బలవంతంగా రాక్షసులు కట్టివేస్తూవుంటే, తాను కుతూహలంతో రావణాసురుని చూసి తీరుతానని అనుకొని హనుమంతుడు ఊరుకున్నాడు. ఆ వీర్యవంతుని, హనుమంతుని రాక్షసులు అట్లా తాళ్ళతో కట్టివేయ గానే బ్రహ్మాస్త్రబంధం వదలిపోయింది.

(ఇంకో బంధం వేస్తే, బ్రహ్మాస్త్రం పనిచేయదు. అది అన్నిటి కంటే శ్రేష్ఠమైనది. దానిపైన ఇంకో అస్త్రాన్ని ప్రయోగం చేస్తే అది పనిచేయదు.)

హనుమంతుడు బ్రహ్మాస్త్ర బంధము నుండి విడిపోయినాడు. అది చూచి ఇంద్రజిత్తు విచారపడ్డాడు. ఆలోచించసాగినాడు. అయ్యో! మహత్కార్యం నిరర్థకమై పోయిందే. బ్రహ్మాస్త్ర స్వభావాన్ని ఈ రాక్షసులు ఆలోచించలేదు. బ్రహ్మాస్త్రం ప్రతిహతమైన తరువాత మరి ఏ అస్త్రమూ పనిచేయదు. రాజు అందరినీ సంశయిస్తాడు అని ఇంద్రజిత్తు అనుకున్నాడు. బ్రహ్మాస్త్రము విడివడి పోయినప్పటికీ రాక్షసులు తనను తాళ్ళతోకట్టి బాధపెడుతూ ఈడ్చుకొని పోతూ వుంటే హనుమంతుడు ఊరకున్నాడు. ఆ క్రూరరాక్షసులు హను మంతుని కట్టెలతో కొడుతూ, పిడికిళ్ళతో పొడుస్తూ రాజభవనానికి లాక్కొని పోయినారు.

# 10

అలా తాళ్ళతో కట్టి లాక్కొని వచ్చిన హనుమంతుని, ఇంద్రజిత్తు రాజభవనంలో అందరికీ చూపించినాడు. పెద్ద ఏనుగు వలె తాళ్ళతో కట్టివేసి తీసుకొచ్చిన హనుమంతుని చూచి రాక్షసు లందరూ వీడెవడు? వీడిని ఎవడు పంపించినాడు? ఇంతకూ వీడు ఇక్కడికి ఎందుకు వచ్చినాడు? ఏమి పనిమీద వచ్చినాడు. వీడు ఎవడి ఆశ్రయుడు? అని ఒకరినొకరు ప్రశ్నించుకున్నారు. కొందరు రాక్షసులు మహా కృద్ధులైపోయి, వీడిని చంపివేయవలెను, దహించి వేయవలెను, వీడిని నమిలి మ్రింగివేయవలెనని అన్నారు. ఆ మహాబలవంతుని, హనుమంతుని రాక్షసులు రావణాసురుని సభా భవనానికి లాక్కొని పోయినారు. మహారత్నాలతో అలంకరించిన ఆ సభాభవనంలో రావణాసురుని, తన పాదాల సమీపంలో వున్న మంత్రి వృద్ధులను హనుమంతుడు చూచినాడు. వికృతాకారులైన రాక్షసులు ఈడ్చుకొని వస్తున్న హనుమంతుని, ఆ మహా తేజోవంతుడు రావణాసురుడు చూచినాడు.

మిట్ట మధ్యాహ్నపు సూర్యునివలె తేజరిల్లుతున్న ఆ కాంతి వంతుడిని, ఆ మహా బలవంతుడిని, రావణాసురుని హను మంతుడు చూచినాడు. అంతట ఆ భయంకర పరాక్రమవంతుడు

హనుమంతుడు, రావణాసురుడు చేసిన పనికి తాను ఆశోకవనం పాడుచేస్తే రావణాసురుడు తన దగ్గరకు వస్తాడని అనుకున్నందుకు, తననే రాజభవనానికి రావణాసురుడు రప్పించుకున్నందుకు ఆశ్చర్యపడి పోయినాడు. రోషతామ్రాక్షుడైపోయి రావణాసురుని వంక చూచినాడు. రావణాసురుడు శ్రేష్ఠమైన బంగారంతో చేసి, ముత్యాలు చుట్టిన కిరీటం పెట్టుకున్నాడు. వజ్రాలు, మహార్హమైన రత్నాలు, మణులు పొదిగినందువల్ల చిత్ర విచిత్ర కాంతులతో ఎంతో అందముగా వున్న ఆభరణాలు ధరించినాడు. కస్తూరి మొదలగు సుగంధ ద్రవ్యాలతో ఘుమ ఘుమలాడే రక్తచందన మైపూతలతో, ఎర్రటి విశాల నేత్రాలతో భయంకరముగాను, దర్శనీయముగాను వున్నాడు. తీక్షణమైన దంష్ట్రలు తళతళలాడుతూ, పెదవులు వ్రేళ్ళాడుతూ, పదితలలు ధగ ధగలాడుతూ వున్నాయి.

ఆ కాంతిమంతుడు, ఆ పరాక్రమవంతుడు నానావిధ సర్పాలు వ్యాపించిన శిఖరాలతో వున్న మంధర పర్వతంవలె తేజరిల్లుతూ వున్నాడు. అతడు కాటుకరాశి వలె నల్లగాను, అతని వక్షస్థలాన వున్న ముక్తాహారము పూర్ణచంద్ర కాంతులతోను విరాజిల్లుతూ, కొంగలు కమ్ముకున్న నల్లనిమేఘంవలె కనిపించాడు. చందన చర్చ చేసిన భుజకీర్తులతోను, దండ కడియాలతోను అలంకరించిన అతని బాహువులు ఐదు తలల మహాసర్పాలవలె తోచినవి. స్ఫటిక మణులతో చేసి నవరత్నాలు పొదిగిన ఆస్తరణాలు పరచిన సింహాసనం మీద కూర్చుని వున్నాడు. చక్కగా సింగారించుకొని యువతులు సమీపంలో నిలుచుని వింజామరలు వీస్తూ వున్నారు.

దుర్ధర్షుడు, ప్రహస్తుడు, మహాపాశుడు, నికుంభుడనే నలుగురు మంత్రులు ఆ రావణాసురుని చుట్టూ కూర్చున్నారు. ఆ నలుగురు మంత్రులు బలదర్పితులు, తత్త్వజ్ఞులు. చుట్టూ నాలుగు సముద్రాలు వున్న ఈ లోకమువలె రావణాసురుడు ఆ నలుగురు మధ్యన కూర్చున్నాడు. ఆ నలుగురు మంత్రులే కాకుండా ఇంకా అనేక మంది రాక్షస మంత్రులు అక్కడ కూర్చునివున్నారు. వారందరి మధ్యన దేవేంద్రునివలె, అమిత తేజోవంతమైన మేరుశిఖరంవలె, ఆకాశంలో వున్న నూతన నీలమేఘంవలెను కూర్చునియున్న రావణాసురుని హనుమంతుడు చూచినాడు. భయంకర పరాక్రము లైన రాక్షసులు తనను బాధ పెడుతున్నప్పటికీ రావణాసురుడి వైభవానికి హనుమంతుడు ఆశ్చర్యపడి పోయినాడు. అతని తేజస్సుకు నిశ్చేష్టుడై పోయినాడు. మనసులో ఆలోచించసాగినాడు.

ఆహా! రాక్షసరాజు రూపం. ఆహా! వీడి ధైర్యం, వీడి బలం, వీడి కాంతి ఆశ్చర్యాన్ని కలుగజేస్తున్నాయి. వీడు సకల శుభ లక్షణాలతో వున్నాడు. ఆహా! అధర్మము ఒక్కటీ లేకపోయినట్లైతే, ఈ రావణాసురుడు దేవేంద్రుడితో కూడా దేవరాజ్యం ఏల గలిగేవాడు. వీడు చేసిన భయంకరము, క్రూరము, జనకంటకము అయిన పనులకు దేవతలు, దానవులు, సర్వ లోకాలు భయపడి పోయాయి. వీడికి కోపం వస్తే, ఈ జగత్తునంతా సముద్రంలో ముంచివేయ గలడు. వీడికి అంత శక్తి వుంది అని మతిమంతుడు హనుమంతుడు రావణాసురుని ప్రభావాన్ని గురించి అనుకున్నాడు.

సమస్త లోకాలను ఏడిపించే ఈ రావణాసురుడికి మహా కోపం వచ్చింది. గోరోచన వర్ణ నేత్రాలతో ఎట్టఎదుట తేజరిల్లు

తున్న హనుమంతుని చూచి, మనసులో సందేహించి ఆలోచించ సాగినాడు.

పూర్వం నేను కైలాసపర్వతాన్ని కదిలించినప్పుడు నాకు శాపం పెట్టిన ఆ నందీశ్వరుడు ఈ వానరరూపంలో ఇక్కడికి వచ్చినాడా ఏమిటి? రోషతామ్రాక్షుడై పోయినాడు. మంత్రి సత్తముడైన ప్రహస్తుని చూచి సమయానికి తగినట్లుగాను, అర్థ వంతముగాను వీడు ఎక్కడి నుండి వచ్చినాడు? వీడు రావడానికి కారణ మేమిటి? అశోకవనాన్ని ధ్వంసం చేయడంలోను, రాక్షసాంగనలను బెదిరించడంలోను వీడి ఉద్దేశ్య మేమిటి? ఈ విషయాలన్నీ ఈ దురాత్ముని అడిగి తెలుసుకోవలసింది. చొరనలవి కాని నా లంకా పట్టణానికి వీడెట్లా వచ్చినాడు? ఎందుకు యుద్ధం చేసినాడు? ఈ దుర్మతిని అడిగి తెలుసుకోవలసింది.

ప్రహస్తుడు అంత హనుమంతుని చూచి, "ఓ కపీ! ఊరడిల్లు. నీకు శుభమవుతుంది. నీవు భయపడవద్దు. నిన్ను దేవేంద్రుడు పంపించినాడా? లేక కుబేరుడేమైనా పంపించినాడా? కాకపోతే యమధర్మరాజు కానీ, వరుణదేవుడు కానీ నిన్ను చారుడిగా పంపించినారా? ఎప్పుడూ విజయము కాంక్షించే మహావిష్ణువు నిన్ను దూతగా పంపించినాడా? నీవెందుకు ఈ లంకాపట్టణానికి వచ్చినావు? ఎవరు పంపించినప్పటికీ మేము నిన్నేమీ చేయము. భయపడకుండా జరిగినది జరిగినట్లు చెప్పు. నిన్ను విడిచిపెడ తాము. ఓ కపీ! నీవు రూపమాత్ర వానరుడిగా వున్నావు. నీ తేజస్సు నీ రూపానికి అనుగుణంగా లేదు. నీ సంగతి అంతా యథార్థము

చెప్పు. అబద్ధము చెప్పేటట్లయితే, నీకు ప్రాణాలు దక్కవు. ఎందు కోసం నీవు లంకాపట్టణానికి వచ్చావో అదంతా చెప్పు" అని అడిగినాడు.

హనుమంతుడు రావణాసురుని చూస్తూ, "ఓ రాక్షసరాజా! నేను దేవేంద్రునికి గానీ, యమధర్మరాజుకు గానీ, వరుణదేవుడికి గానీ దూతను కాను. కుబేరుడితో నాకు స్నేహము లేదు. నన్ను మహావిష్ణువు ఇక్కడికి పంపించలేదు. నేను వానర జాతీయుణ్ణి. రాక్షసులకు రాజైన నీ దర్శనము చేయవలెననుకొని వచ్చాను. నాబోటి వాళ్ళకు నీ దర్శనము దొరకడం దుర్లభం. అందువల్ల నీ అశోకవనాన్ని ధ్వంసం చేశాను. బలవంతులైన రాక్షసులు నాతో యుద్ధము చేయడానికి వచ్చారు. నేను నా దేహాన్ని కాపాడు కోవటానికి వాళ్ళతో యుద్ధం చేశాను. వాళ్ళు చచ్చిపోయారు. దేవాసురులెవ్వరూ నన్ను ఏ అస్త్రంతోను, ఏ పాశంతోను బంధించ లేరు. నాకు ఈ వరం బ్రహ్మదేవు డిచ్చాడు.

(హనుమంతుణ్ణి ఏ అస్త్రము, ఏ పాశము బంధించలేదు. అన్నిటికన్నా వరుణపాశం బలమైనది. అందుకని మనను ఏ పీడలు పట్టి వున్నా హనుమంతుణ్ణి తలుచుకుంటే పోతాయి. "నాసై రోగ హరై సబపీరా" (పీడాకి రూపాంతరము). ఏ గ్రహపీడనైనా పోగొట్టగల జగద్గురువు. అందరూ తప్పనిసరిగా ధ్యానించవలెను. రాముడికి తన స్వరూపం చెప్పలేదు. రావణుడు అహంకార పురుషుడు కనుక హెచ్చరించడానికి చెప్పాడు.)

రాక్షసరాజైన నిన్ను చూడవలెనన్న ఆశతో నేను బ్రహ్మాస్త్రానికి

బద్ధుడనయ్యాను. బ్రహ్మాస్త్ర బంధము విడిపోయింది. కానీ నన్ను రాక్షసులు బంధించి నీ దగ్గరకు తెచ్చారు. నేనిప్పుడు రాజకార్యము కోసం ఇక్కడికి వచ్చినాను. నన్ను అమిత తేజోవంతుడు, అప్రమేయ ప్రమేయుడు అయిన రామప్రభువు దూతగా పంపినాడు. ఓ ప్రభూ! నేను నీకు హితము చెబుతాను వినవలసింది" అన్నాడు.

(దైవదూత అయిన సద్గురువు అహంకారాన్ని హెచ్చరించాలి. ఎందుకంటే సత్సాధకులు సైతం తమ సాధనలో కొన్ని సద్గుణాలు సముపార్జించినప్పుడు, పరహిత కార్యాలను నిర్వర్తించినప్పుడు వారిలో దర్పము, గర్వము, అహంకారము పెరగవచ్చు. చిన్నవారిని చిన్నచూపు చూడవచ్చు. ఇవన్నీ పతనానికి కారణాలు. అందుచేత సద్గురువు హెచ్చరించినపుడు జాగ్రత్తపడి, ఆయన చెప్పిన విషయాలను తు.చ. తప్పక పాటించడమే శరణ్యం. ఎందుకంటే సాధకులకు తెలియనిది, సద్గురువుకు తెలిసినదొకటి వుంటుంది. దానిని ఆయన తన జ్ఞానంచేత సంపాదించి వుంటాడు. మనం తర్కం చేయకుండా ఆయన చెప్పింది వినాలి, చేయాలి తప్ప మన కేదో తెలుసని సద్గురువు చెప్పినదాన్ని విచికిత్స చేసి, అందులోని ధర్మాధర్మాలను మనమే నిర్ణయించకూడదు.)

రావణుని ప్రశ్నలకు సమాధానంగా హనుమంతుడు హితము చెబుతూ నిర్భయంగాను, అర్థవంతముగాను, "ఓ రాక్షసరాజా! నేను సుగ్రీవుడు ఆజ్ఞాపించినందువల్ల ఈ లంకాపట్టణానికి వచ్చాను. అతడు వానరరాజు. నీకు సోదరుడి వంటివాడు. నీ క్షేమం విచారించమని నాతో చెప్పినాడు. అతడు నీతో చెప్పమన్న

ఇహపర సౌఖ్యప్రదము, ధర్మార్థ సహితమైన మాట చెబుతాను వినవలసింది.

అయోధ్యా నగరంలో దశరథ మహారాజు అనే ఆయన రాజ్యపాలనం చేసినాడు. అతడు దేవేంద్రుడి వంటి కాంతిమంతుడు. ప్రజలను కన్నతండ్రివలె కాపాడినాడు. ఆయన జ్యేష్ఠ పుత్రుడు, ప్రియపుత్రుడు రాముడు. ఆ రాముడు మహా సమర్థుడు. అమిత తేజోవంతుడు. ఆ మహాబాహువు పిత్రాజ్ఞ పరిపాలనకోసం తమ్ముడైన లక్ష్మణుని, తన భార్య అయిన సీతాదేవిని వెంటబెట్టుకొని దండకా రణ్యానికి వచ్చినాడు. ఆ సీతాదేవి విదేహ రాజపుత్రి. ఆమె ఆ మహారణ్యంలో కనబడకుండా పోయింది. ఆమెను వెదుకుతూ రాముడు తన తమ్ముడు లక్ష్మణుడితో ఋష్యమూక పర్వతానికి వచ్చినాడు. సుగ్రీవుడితో చేరినాడు. సీతాదేవిని వెదకి పెడతానని సుగ్రీవుడు రాముడితో శపథం చేసినాడు. రాముడు సుగ్రీవుడికి వానరరాజ్యము ఇప్పిస్తానని ప్రతిజ్ఞ చేసినాడు. ఆ ప్రతిజ్ఞ ప్రకారం రాముడు యుద్ధంలో వాలిని చంపి, సుగ్రీవుని సింహాసనంపై కూర్చోబెట్టాడు. నీవు వాలిని ఎరుగుదువు. అతనిని యుద్ధంలో రాముడు ఒక్క బాణంతో కొట్టివేసినాడు. సుగ్రీవుడు ప్రతిజ్ఞ తప్పనివాడు. సీతాదేవిని వెదకటానికి వానర సమూహాలను అన్ని దిక్కులకూ పంపించినాడు. ఇప్పుడు ఈ భూమిమీద అన్ని దిక్కు లను, పాతాళంలోను, ఆకాశంలోను లక్షలకొద్దీ, కోట్లకొద్దీ వానరులు సీతాదేవిని వెదకుతూ వున్నారు. వానరులలో కొందరు నేల అంటకుండా, ఏ అడ్డులేకుండా అమితవేగంతో పోయే మహా

బలవంతు లున్నారు. కొందరు గరుత్మంతుని అంత వేగముతో పోయేవారు, కొందరు వాయువేగంతో పోయేవా రున్నారు. నేను వాయుదేవుడి పుత్రుడను, నా పేరు హనుమంతుడు. ఓ రాజా! నేను కూడా ఆ సీతాదేవి కోసమే నూరు యోజనాల సముద్రాన్ని దాటి ఇక్కడికి వచ్చాను. సీతాదేవిని చూడటం కన్న, నాకు వేరే పనిలేదు. ఈ లంకాపట్టణమంతా తిరిగాను, నీ కాపుదలలో వున్న సీతాదేవిని చూశాను.

ఓ రాక్షసరాజా! నీవు శాస్త్రాలు చదివి, ధర్మ స్వరూపం తెలుసుకున్న వాడవు. దీక్షతో తపస్సు చేసినవాడవు. మహాప్రాజ్ఞుడవు. ఇట్లా పరదారలను చెరబట్టడం నీకు తగిన పని కాదు. నీ వంటి బుద్ధిమంతులు ధర్మవిరుద్ధమైన ఇటువంటి పని ఎంతమాత్రమూ చేయరు. ఈ పని ధర్మవిరుద్ధమే కాదు, ఈ పాడుపని వల్ల అనేక అపాయములు నీకు వస్తాయి. అపాయములు రావటమే కాదు, సమస్తాన్నీ, మూలంతో సహా నాశనం చేస్తుంది. అన్ని పాపపు పనులలోనికి పరదారను చెరబట్టటం చాలా నీచమైన పని. దానివల్ల సర్వమూ నాశనమౌతుంది.

(రావణుడు తపస్సు చేసినవాడు, గొప్పవాడు, అయినా మాయకు లోబడి ఇట్లా చేశాడు. దానికి అతీతమైనవారు అమ్మవారు, అయ్యవారు మాత్రమే. అమ్మవారు తలచుకుంటే ఎవరైనా మాయలో పడతారు. మారీచుడు చెప్పినా, హనుమంతుడు చెప్పినా వినడు.)

ఓ రాజా! రాముడికి కోపం వస్తే, లక్ష్మణుడికి కూడా కోపం

వస్తుంది. ఆ అన్నదమ్ములకు కోపం వచ్చి బాణాలు వదులుతూ వుంటే, వారి ఎదుట నిలువగల శక్తిమంతుడు సురలు, అసురులలో ఎవ్వరూ లేరు. ఓ రాజా! రాముడికి అపరాధం చేసి సుఖంగా వుండగలవాడు ముల్లోకాలలో ఎవ్వరూ లేరు. నీవు చేసింది అధర్మం. నీతో ఈ మాట చెప్పమని సుగ్రీవుడు నన్నిక్కడకు పంపించాడు. ఆలోచించు. సీతాదేవిని నీవు రాముడికి ఇచ్చివేయవలెను. అట్లా చేసేట్లయితే, నీవు ఇదివరకు చేసిన అధర్మము తొలగిపోతుంది. నీవు సకలైశ్వర్యాలతోను శుభంగా, సుఖంగా వుండగలుగుతావు.

(ఈ మొత్తం అంతా ఈశ్వరుడిదే. తన దగ్గర వున్నవన్నీ దైవమునకు చెందినవే. తనుకూడా దైవమునకు చెందినవాడే. అదీగాక అన్నీ నావే అనుకొంటే, అహంకార పురుషుడు జీవాత్మను బంధిస్తాడు. అన్నిటికీ గోవిందుడే యజమాని. దైవము మన దగ్గర వుంచాడు. ఎపుడు తీసుకుంటాడో తెలియదు. వాటిని ధర్మంగా సంరక్షించడమే మన పని. వాటికి నీవు ధర్మ కర్తవు. నీ తండ్రి యిచ్చిన సంపదను నీవు చక్కగా సంరక్షిస్తే, ఆయన నీకు ఇంకొంచెం ఇస్తాడు. పతంజలి యోగసూత్రాల్లో మొదటే 'ఆస్తేయం' అని చెప్పారు. అంటే దొంగబుద్ధి లేకుండటం. అహింస, సత్యం, బ్రహ్మచర్యం, ఆస్తేయం, అపరిగ్రహం అనే ఐదు గుణాలు మనం నేర్చుకోవాలి అని మొదటి తరగతిలో చెప్తారు. మొత్తం తరగతులు 8. 8వ తరగతి సమాధి, 7 ధ్యానం, 6 ధారణ. ఈ శరీరం మనం ధరించివున్నాం తప్ప, ఇందులో ఇరుక్కుని లేము అని స్వతహాగా తెలియడం. 5 తిరోధానం. లోపలికి సంకల్ప మాత్రం చేత వెళ్ళిపో

గలగాలి. 4 శ్వాస ద్వారా ప్రాణస్పందనలోకి చేరి, అందులో నుండి సూక్ష్మ స్పందనలోకి చేరి, 5వ క్లాసులోనికి ప్రవేశార్హత పొందాలి. 3లో శాశ్వతము, స్థిరము, సుఖము అయిన మనసు కలిగి వుండాలి. 2లో శుచి, శౌచము, అంతశ్శుచి, బహిశ్శుచి. మనస్సు శుభ్రంగా వుండాలి. ఇవి బయట, లోపలా ఎవరికి శుచిగా వుంటాయో వారికి నిష్కారణముగా సంతోష ముంటుంది. ఇది రహస్యము.

ఈ సంతోషంతో పాటు సద్గ్రంథములను పఠించుట, సద్గురు బోధనలు శ్రవణము చేయుట. ఇవి చేయుచూ తత్కారణ ముగా ఈశ్వరుని యందు శరణు చేయుట చేసినట్లైతే "శుచిశ్శౌచ సంతోష స్వాధ్యాయేశ్వర ప్రణిధానాని" వస్తుంది. అది యమము. అహింస- ఎవరినీ హింసించకుండుట. మనుషుల్ని చెప్పుచేతల్లో వుంచుట, దమించుట. మానసికంగా హింసించుట కూడా హింసే. త్రికరణశుద్ధి లోపలా బయటా ఒకే విధంగా వుండాలి. బ్రహ్మచర్యం- సత్సంతానం కోసమే పతీపత్నుల మధ్య ఆకర్షణ కలిగి వుండాలి. ఆస్తేయం, అపరిగ్రహం- ఊరికే ఇస్తే కూడా అర్హత వుందో లేదో తెలియకుండా తీసుకోరాదు. సృష్టిలో ఊరికే దొరకటం వుండదు. ఎదుటివారికి నీవు ఏ విధమైన ఉపకారాలు చేయకుండా తీసుకుంటే అటు నుంచి ఋణ పడవలసి వుంటుంది. తెలివి యివ్వటంలో వుంది కానీ, పుచ్చుకోవటంలో లేదు. తెలివితక్కువ వాళ్ళు పుచ్చుకోవటం గాదు దోచుకోవటం కూడా చేస్తారు. మనిషి పతనం చెందకుండా వుండడానికి యమ, నియమ, ఆసన మొదలగు కార్యక్రమాలు పతంజలి ఇచ్చాడు.

అలాగే ఈశావాస్యంలో ఇతరుల మనుషుల్ని, ధనాన్ని దొంగిలించకు అని మొదటి శ్లోకంలోనే చెప్పారు. అందుకే *"ఈశవాస్య మిదం సర్వం"* అని ఈశావాస్యోపనిషత్తులో చెప్పారు. అంటే ఈ మొత్తం అంతా ఆయనచే వ్యాపింపబడి, ఆయనచే నిర్వర్తింపబడుతున్నది. ఇక్కడ హనుమంతుడు రావణునితో నీవు దొంగబుద్ధి వలన ఇతరుల ధనాన్ని, భార్యను అపహరించుకొని వచ్చావు అని చెప్పాడు. ఇలా ధర్మాన్ని పాటించకుండా ఊరికే పూజలు, వ్రతాలు చేస్తే, సన్నివేశాల ద్వారా భగవంతుడే కొంత కొంతగా ధర్మాన్ని నేర్పుతూ వుంటాడు. తెలివిగలవాడు దానిని అవకాశంగా తీసుకొని ధర్మాన్ని పాటించి బాగుపడతాడు. నీ పిల్లలకు కూడా నీవు ధర్మకర్తవే. వారితో ప్రేమానురాగాలు పంచుకొని ధర్మాలు నేర్పాలి. దైవారాధన ధర్మాచరణకు దారితీయాలి. లేకపోతే దైవారాధన వలన ఉపయోగం లేదు. ధర్మస్వరూపం తెలుసుకోవటానికి, ధర్మాచరణం చేయటానికి కావలసిన స్ఫూర్తిని ఇమ్మని కోరటానికే దైవారాధన కానీ వేరే కాదు. రావణాసురుడు దైవారాధన, తపస్సు చేసినా ధర్మం తప్పటం వల్ల శివుడు గానీ, తపస్సు గానీ, తనకున్న జ్ఞానం గానీ రక్షించదు.)

ఓ రాజా! నేను సీతాదేవిని తెచ్చానని నీకెవరు చెప్పారు అని అడుగుతావేమో? నేను సీతాదేవిని స్వయంగా చూశాను. ఆమెను వెదకటానికి బయలుదేరిన వానరులందరికీ దుర్లభమైన సీతాదేవి దర్శనం ఈ లంకాపట్టణంలో లభించింది. ఇక మిగిలిన పని రాముడే చేసుకుంటాడు. ఆమె ఇప్పుడు శోకపరాయణగా వుంది. ఆమె నీ స్వాధీనంలో వుందని అనుకుంటున్నావే కానీ, నీ ప్రాణాలు

తీయడానికి తెచ్చిన ఐదు తలల మహాసర్పమని ఎరుగకుండా వున్నావు.

(మనం కూడా అట్లాగే ఎన్నో తెచ్చుకుంటాం. చాలా హింసలు పడుతూ వుంటాము. అక్రూరుడు శమంతకమణితో నానా కష్టాలు అనుభవించాడు. ఇతరుల వస్తువులను దొంగిలించి తెచ్చు కుంటే మనం ఎంత గొప్పవారమైనా, పుణ్యాత్ములుగా లోకంలో ప్రశస్తి పొందినా ధర్మం తనపని చేసుకుంటూ పోతుంది. మనకు కష్టాలు వచ్చినప్పుడు జీవితమంతా వెనక్కి తిరిగి చూసుకోవాలి.)

జఠరాగ్ని దీపనం ఎంత వున్నప్పటికీ భయంకర విషముతో కూడిన అన్నము తిని జీవించి యుండటం అశక్యము. అదే విధంగా దేవాసురు లందరూ ఏకమై స్వాధీనం చేసుకున్నప్పటికీ, సీతాదేవిని తమదాన్నిగా చేసుకోవడం ఉత్తది. ఓ రాజా! నీవు ఎంతో కష్టపడి తపస్సు చేశావు. అందుకు ప్రతిఫలంగా దీర్ఘాయుష్షు సంపాదించు కున్నావు. దాన్ని నాశనం చేసుకోవడం మంచిది కాదు. నీవు గొప్ప తపస్సు చేసి దేవతల చేత, అసురులచేత చావకుండా వరము సంపాదించుకున్నానని గర్వపడుతున్నావు. ఈ గొప్ప హేతువు నుంచి ఆ వరము వ్యర్థమైపోతుంది.

(తపస్సు చేసి, వరములు సంపాదించు కొన్నప్పటికీ ధర్మం తప్పటం చేత వరాలు పనిచేయవు. అంటే ఎన్ని ఆపదలు వచ్చి నప్పటికీ ధర్మంలో వుండటం చేత అయాచితంగా సహాయం దొరుకుతూ వుంటుంది. రాముడికి యుద్ధంలో అనేక సహాయాలు అయాచితంగానే దొరుకుతాయి. అర్జునుడు, ధర్మరాజు జీవితా

లలో కూడా ఇట్లాగే జరుగుతుంది. అదే కర్ణునికి అసూయ చేత ఏ వరాలు పనిచేయవు.)

సుగ్రీవుడు దేవతలలోని వాడు కాడు. అసురుడు కాడు. రాక్షసుడు కాడు. దానవుడు కాడు. గంధర్వుడు కాడు. యక్షుడు, పన్నగుడు కాడు. నీవు ఎవరివల్ల చావు రాకుండా వరము సంపాదించుకున్నావో సుగ్రీవుడు వారిలో ఎవరూ కాడు. అతడు వానరమాత్రుడు. సుగ్రీవుడి చేత చావకుండా నీ ప్రాణాలు ఎట్లా దక్కించుకుంటావో చెప్పు.

ఓ రాజా! ధర్మము అధర్మాన్ని హతమార్చి వేసి, సత్ఫలితాన్నిస్తుంది.

(దుష్ఫలితాలు ఎక్కువగా వస్తూవుంటే, ధర్మాచరణ విపరీతంగా చేయాలి. అలా చేస్తే శాపాలు కూడా వరాలుగా ఉపయోగిస్తాయి. అర్జునునికి ఊర్వశి, పేడి అయిపొమ్మని శాపం ఇస్తే, అది అతనికి అజ్ఞాతవాసంలో ఉపయోగంగా పరిణమించింది. ఆ సమయంలో ఉత్తర గోగ్రహణం అయింది. వీరులెవ్వరూ లేరు. అప్పుడు క్షాత్ర ధర్మం వహించి, అర్జునుడు తమ అజ్ఞాతవాసం భంగమవుతుందేమో అని కూడా భయపడకుండా యుద్ధానికి వెళ్ళాడు. వెళ్ళి, వాళ్ళను రక్షించుకుంటాడు. దానివల్ల పండితులు లెక్కవేసి, అజ్ఞాతవాసం పూర్తయినట్లు ప్రకటిస్తారు. అధర్మము ధర్మాన్ని జయించలేదు.)

నీవు చేసిన తపస్సు మొదలగు సత్కర్మల వల్ల సంపాదించిన ధర్మఫలాన్ని నీవింతవరకు అనుభవించావు. ఇక త్వరలోనే నీవు

అధర్మ ఫలాన్ని అనుభవిస్తావు. జనస్థానంలో రాక్షసు లందరినీ రాముడొక్కడే సంహారం చేశాడని జ్ఞాపకం తెచ్చుకో. అదే విధంగా వాలిని రాముడు ఒకే ఒక్క బాణంతో చంపివేసినాడని కూడా తెలుసుకో. రాముడు, సుగ్రీవుడు స్నేహితు లైనారని గమనించు. నీకు మంచి ఏదో ఆలోచించు. ఓ రాజా! నీ గుఱ్ఱాలను, ఏనుగు లను, నీ రథాలను, నీ లంకాపట్టణాన్ని నేను ఒక్కడినే నాశనం చేయగలను. అయితే రాముడట్లా నిశ్చయించలేదు. సీతాదేవిని అపహరించుకు పోయిన శత్రువులను తానే సంహారము చేస్తానని రాముడు వానర భల్లూక సమూహాల ఎదుట ప్రతిజ్ఞ చేశాడు. అందువల్ల నేను ఆ పని చేయలేదు.

"ఓ రాజా! సాక్షాత్తు దేవేంద్రుడైనప్పటికీ రాముడికి అపరాధం చేసి సుఖంగా వుండటం ఉత్తది. ఇక నీవంటివాడి విషయం వేరే చెప్ప నవసరం లేదు. నీ వశంలో వున్న సీతాదేవియే ఈ లంకా రాజ్యాన్నంతా నాశనం చేసి వేసే కాళరాత్రి అని తెలుసుకో. సీతావిగ్రహ రూపాన వున్న కాలపాశాన్ని నీ అంతట నీవే మెడకు తగిలించుకోవద్దు. నీకు హితము ఏదో ఆలోచించు. ఈ లంకా పట్టణంలో ఇప్పటికే సీతాదేవి ప్రభావము వల్ల మంటలు రగుల్కొం టున్నవి. ఇక రాముడి కోపానికి కోటబురుజులు, వీధులు మొదలైనవి సమూలంగా తగులబడి పోవడం నీవు చూస్తావు. నీ మిత్రులను, మంత్రులను, దాయాదులను, తోబుట్టువులను, కొడుకులను, హితులను, భార్యలను, భోగభాగ్యాలను, ఈ లంకాపట్టణాన్ని నాశనం చేసుకోవద్దు. ఓ రాక్షసరాజా! నేను రాముడి దాసుని. అందువల్ల నీ ప్రభావము నాకు తెలుసు. రాయబారిగా వచ్చాను.

అందువల్ల నేను నీకు హితము చెప్పుతున్నాను. అందులోను నేను వానరుడిని. అటు మానవుడినీ కాదు ఇటు రాక్షసుడినీ కాదు. మధ్యస్థుణ్ణి. కాబట్టి నేను నీకు హితము చెప్పటానికి తగినవాడను. నిష్పాక్షికంగా యథార్థం చెప్పుతున్నాను. అబద్ధమాడుట లేదు. నామాట నమ్ము.

ఆ మహాయశుడు రాముడు పంచభూతాలలో కూడా నచరాచరములైన సకల లోకాలను సంహారము చేయగలడు. తిరిగి సమస్త లోకాలను సృష్టించగలడు. అతడు మహావిష్ణువుతో సరిసమానమైన పరాక్రమవంతుడు. దేవతలలోగాని, అసురులలో గాని, యక్షులలో, విద్యాధరులలో గాని, గంధర్వులలో, సిద్ధులలో గాని, కిన్నెరులలో గాని, పన్నగులలో కాని ఎవరూ ఎక్కడా అతనితో పోరాడలేరు. నీవు ఆ నరలోకేశ్వరుడికి మహాపచారం చేశావు. ఇక నీవు జీవించడం దుర్లభం. త్రిభువనాలలోను అతడితో పోరాడగల వాడెవడూ లేడు. రాముడే నీ మీదికి యుద్ధానికి వస్తే, తనంతటి తాను చతుర్ముఖాలతో కూడిన ఆ సర్వాతిశాయి బ్రహ్మదేవుడు కానీ, ప్రళయకాలాన సమస్త భూతాలను సంహారంచేసే ఆ త్రినేత్రుడుగానీ, త్రిపురాంతకుడు రుద్రుడు కానీ, వృత్రాసుర సంహారము చేసిన దేవరాజు కానీ, వారు ముగ్గురూ ఏకమైనా కానీ నిన్ను రక్షించలేరు.”

ఇట్లా ఏ విధమైన భయమూ లేకుండా అప్రతిమానంగా, అమోఘంగా హనుమంతుడు చెప్పిన అప్రియ వాక్యాలను విన్న రావణుడు, వీడిని చంపెయ్యండి అని ఆజ్ఞాపించాడు. ఆ హను

మంతుని చంపవలసిందిగా రావణాసురుడు ఆజ్ఞాపించడం విభీషణుడు విన్నాడు. దూతను చంపడం అతనికి ఇష్టం లేకపోయింది.

(ఆ విభీషణుడు కార్యాకార్య జ్ఞానము కలవాడు అయినప్పటికి అతని మాట ఎవరూ వినని చోట అతనుండకూడదు. విదురుడు కౌరవ సభలో ఎంత భంగపాటు పొందుతాడో, విభీషణుడు కూడా రావణుని సభలో అంత భంగపాటూ పొందుతాడు. అధర్మం రాజ్యం ఏలుతున్నచోట కూర్చొని ధర్మం చెప్పేకన్నా, అక్కడనుండి వెళ్ళిపోవడం మంచిది. ఇతరుల కార్యాచరణతో మనకు ఖేదం వస్తుంటే, మనం తప్పుకోవాలి. లేకుంటే ఆ అధర్మాలలో మనకు కూడా భాగం వస్తుంది. భీష్ముడు, ద్రోణుడు, అశ్వత్థామ మొదలగువారు పుణ్యాత్ములైనప్పటికీ ద్రౌపదీ వస్త్రాపహరణ సమయంలో వుండడం చేత, సంహరింపబడటానికి అర్హత తెచ్చుకున్నారు. అది చూచిన వారందరూ అధర్ములే గనుక అందరూ సంహరింపబడవలసినదే అని కృష్ణుడు చెపుతాడు. అపుడే వారిని మృత్యువు ఆక్రమించింది. పదవి వున్నందువల్ల విదురుడు గానీ, విభీషణుడు గానీ అక్కడనుంచి తప్పుకో లేకపోయారు. తీవ్రమైన అవమానం జరిగితేనే గానీ బయటకి రాలేదు. అలాంటిచోట్ల వుండరాదు. కొలువు చేయరాదు.)

రావణాసురుడు క్రుద్ధుడై, దూతను చంపి వేయమని ఆజ్ఞాపించాడని తెలుసుకున్నాడు. ఆ వాక్య విశారదుడు విభీషణుడు పూజ్యుడైన తన అన్నగారిని చూచి, పరమహితముగా "ఓ రాజా! క్షమించు, కోపము త్యజించు. ప్రసన్నుడవు కావలెను. నా మాట

విను. మంచి చెడ్డలు తెలిసినవారు, పెద్దలు అయిన రాజులు దూతను చంపరు.

"ఓ వీరా! ఈ కపిని చంపడం రాజధర్మానికి విరుద్ధమైన పని. లోకాచారానికి వ్యతిరిక్తమైన పని. నీ వంటివాడు చేయవలసిన పని కాదు. ఈ సమస్త ప్రాణికోటిలోను నీవు సమస్త ధర్మాలు తెలిసినవాడవు. నీవు ఉపకారము మరచిపోని వాడవు. మంచి చెడ్డలు తెలిసినవాడవు. రాజధర్మ విశారదుడవు. పరమార్థ వేత్తవు. నీవంటి పండితులు కోపం వచ్చి, ఇట్లా ఆజ్ఞాపించేటట్లైతే శాస్త్ర పాండిత్యమంతా వృథా శ్రమ అయిపోతుంది. ఓ రాజా! నీవు శత్రు సంహారకుడవు. నీవిప్పుడు ప్రసన్నుడవు కావలెను. యుక్తా యుక్తాలను ఆలోచించి నిశ్చయించవలెను. దూతకు యోగ్యమైన దండనము విధించు" అని చెప్పాడు.

విభీషణుడు చెప్పిన ఈ మాటలు విని రావణాసురుడు మహాకోపంతో "ఓ విభీషణా! పాపిష్ఠివాళ్ళను చంపివేస్తే పాపము రాదు. వీడు పాపాచారుడు. అందువలన వీడిని చంపివేయ వలసిందే" అన్నాడు. విభీషణుడు బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు. రావణాసురుడికి చెడ్డకోపం వచ్చి అధర్మ మూలమైన ఆజ్ఞ చేశాడని అనుకున్నాడు. అది పెద్దలు మెచ్చని ఆజ్ఞ కనుక పరమ ధర్మంగా "ఓ లంకేశుడా! నీవు ప్రసన్నుడవు కావలెను. కోపం వదలిపెట్టు. ధర్మార్థాలను చెడగొట్టవద్దు. నా మాట విను. రాజా! ఎటువంటి క్లిష్ట సమయాలలోను దూతలను చంపకూడదని పెద్దలు చెప్పినారు. ఈ వానరుడు నిస్సందేహంగా గొప్ప శత్రువే. రాక్షస వీరులను చంపివేసినాడు. సేనా నాయకులను సంహారము చేసినాడు. మంత్రి

పుత్రులను హతమార్చినాడు. మన అక్షకుమారుని కూడా చంపి వేసినాడు. ఇంత అంత అని నిర్ణయించనలవికాని అప్రియమే చేసినాడు. అయినప్పటికీ దూతను చంపకూడదు. అది పెద్దల అభిప్రాయం. పెద్దలు దూతలకు అనేక విధములైన శిక్షలు చెప్పినారు. వాటిలో ఏదో ఒక విధమైన శిక్ష వేయవలెను కానీ చంపకూడదు. దూతకు అంగవికృతి చేయవచ్చును. కొరడాతో వ్రయ్యలు వ్రయ్యలుగా కొట్టి పంపించ వచ్చును. తల గొరిగించ వచ్చును. కాల్చి, ముద్రవేసి పంపవచ్చును. ఈ శిక్షలలో ఏదో ఒక శిక్ష విధించవచ్చును. కానీ, దూతను చంపినట్లు ఎన్నడూ మనం ఎక్కడా వినలేదు.

ఓ రాజా! నీవు ధర్మాలలో మంచి శిక్షణ పొందినవాడవు. మంచి చెడులు ఆలోచించి, పనులు చేస్తూవుంటావు. నీవు కోపం వచ్చినందువలన ఇటువంటి పని చేయవద్దు. మహా ధైర్యవంతులు కోపాన్ని అణచుకుంటారు. ఓ వీరుడా! ధర్మ నిరూపణలో నీ అంతటివాడు మరొకడు లేడు. నీవలె లౌకిక ఆచారాలు తెలిసిన వాడెవడూ లేడు. నీ అంతగా శాస్త్రాలు చదివినవాడు కూడా లేడు. నీకు వున్న బుద్ధికుశలత ఎవరికీ లేదు. సురాసురులలో నీకన్నా ఉత్తముడు మరొకడు లేడు. ఈ కపిని చంపడం వలన ఏ లాభమూ కనిపించడం లేదు. ఈ వానరుని ఇక్కడికి పంపించిన వాళ్ళను మనం వధించవలెను. వీడు చెడ్డవాడైనా, మంచివాడైనా వీణ్ణి శత్రువులు పంపించారు. అందువల్ల వీడు పరాధీనుడు. వాళ్ళు చెప్పమన్న మాటలు వీడు మనకు చెబుతున్నాడు. అది వీడి తప్పు కాదు. కాబట్టి వీడిని చంపడం మంచిది కాదు.

రాజా! వీడిని చంపివేస్తే, ఈ మహోదధిని దాటి ఇక్కడకు రాగల ఖేచరుడు మరొకడు లేడని నాకు తెలుసును. అయినప్పటికీ చెబుతున్నాను. అన్నా! నీవు పరపురంజయుడవు. కాబట్టి ఈ కోతిని చంపే ప్రయత్నం మానుకోవలెను. ఎదిరించివచ్చే దేవతలను, దేవేంద్రుని చంపవచ్చును కానీ దూతను చంపడం మంచిది కాదు. రాజా! నీవు యుద్ధ ప్రియుడవు. నీవు వీడిని చంపినట్లైతే బహు దూరదేశంలో వున్న ఆ గర్విష్ఠులను, రామలక్ష్మణులను యుద్ధానికి పురిగొల్పి ఇక్కడికి తీసుకొనిరాగల వాడెవడూ ఉండడు. నీకున్న పరాక్రమము, ఉత్సాహము, ధైర్యము సురాసురులకు ఎవరికీ లేదు. నిన్నెవడూ జయించలేడు. నీవు వాళ్ళను యుద్ధంలో చంపి వేయవలెను. నీకు శూరులు, హితులు, ఎంతో హెచ్చరిక కలవారు, మహా గుణవంతుల వంశాలలో పుట్టినవారు, అభిమాన ధనులు, ఆయుధ ధరులలో ఉత్తమోత్తములు అయిన భృత్యులు కోట్లకొద్దీ వున్నారు. అందువల్ల నీవు ఆజ్ఞాపించేటట్లైతే నీ సేనాధిపతు లెవరైనా కొంత సైన్యాన్ని తీసుకొనిపోయి ఆ మూఢులను, రామ లక్ష్మణులను నిగ్రహిస్తారు. వారికి మనవాళ్ళు తమ ప్రభావాన్ని చూపిస్తారు" అని చెప్పాడు.

ఆ సురలోక శత్రువు, ఆ మహాబలవంతుడు, ఆ నిశాచర రాజు రావణుడు తన తమ్ముడు విభీషణుడు చెప్పిన ఉత్తమ వాక్యాలను గురించి ఆలోచించి అంగీకరించాడు.

(కోపం వచ్చినపుడు వెంటనే పనులు చేయక కొంత ఆలస్యం చేస్తే, కోపం తగ్గి సరియైన నిర్ణయము చేయగలము. అందుకని కోపం వచ్చినపుడు సరియైన హితులెవరైనా సరే కొంత

ఆగుదాం అని చెప్పాలి. కోపం తగ్గిపోతుంది. అలాగే విభీషణుడు రావణుని పొగుడుతూ, ధర్మం చెపుతూ వున్నాడు. విభీషణుడు మంత్రి, తమ్ముడు గనుక ధైర్యంగా చెప్పినాడు.)

ఆ మహాబలవంతుడు రావణాసురుడు, తన తమ్ముడు విభీషణుడు చెప్పిన మాటలను విన్నాడు. విభీషణా! నీవు చక్కగా చెప్పావు. దూతను చంపివేయడం నింద్యమే. వీడిని మరొక విధంగా అవశ్యం శిక్షించవలెను. కోతులకు తోకంటే మక్కువ. అందువలన వీడి తోకను కాల్చవలెను. కాలిపోయిన తోకతో వీడు ఇక్కడి నుంచి వెళ్ళిపోవలెను. వీడు అంగవైకల్యంతో దుఃఖపడటం వీడి ఆప్త బంధువులు, స్నేహితులు, దాయాదులు మొదలగు వారందరూ చూడవలెను. వీడి తోకకు నిప్పంటించి, అది కాలుతూ వుంటే వీడిని చతుష్పథాలలో పట్టణమంతటనూ త్రిప్పవలెను. అంతట రాక్షసులందరూ రావణాసురుడి ఆజ్ఞను శిరసావహించి చెలరేగి చిరిగిపోయిన గుడ్డ పీలికలను తీసుకొనివచ్చి, హనుమంతుడి తోకకు చుట్టడం మొదలు పెట్టారు. అట్లా రాక్షసులు తన తోకకు గుడ్డ పీలికలు చుట్టుతూ వుంటే, అడవిలో ఎండు కట్టెలకు అంటు కున్న అగ్నిహోత్రమువలె హనుమంతుడు మనసా విజృంభించి నాడు. గుడ్డ పీలికలు చుట్టిన ఆ హనుమంతుని తోకకు రాక్షసులు నూనెతో తడిపి నిప్పంటించినారు. హనుమంతుడికి మహా చెడ్డ కోపం వచ్చింది. ముఖం ఎర్రబడిపోయింది. భగభగ మంటలు మండుతూ వున్న తన తోకను విదిలించి, ఆ రాక్షసు లందరినీ పడగొట్టాడు.

హనుమంతుడి తోకకు నిప్పంటించినారని అప్పుడు లంకలో వున్న రాక్షస స్త్రీలు, పురుషులు, బాలురు, వృద్ధులు అందరూ తెలుసుకొని సంతోషంతో హనుమంతుని చూడటానికి వచ్చారు. క్రూర రాక్షసులందరూ చేరి, ఆ పరాక్రమవంతుని మళ్ళీ తాడుతో కట్టినారు. అప్పుడు హనుమంతుడు ఈ రాక్షసులు నన్ను కట్టి వేస్తున్నారు. కానీ నన్ను వీళ్ళు నిగ్రహించ గలరా? ఈ తాళ్ళను తెంచి పైకెగిరి మళ్ళీ వీళ్ళను చంపివస్తాను. రామకార్యార్థము తిరుగుతున్న నాకు వీళ్ళు ప్రతీకారం చేయగలరా?

(దైవం పని తప్ప ఇంకొక పని లేదు. దైవం పని చేసే వాళ్ళను ఎవరూ అడ్డుకోలేరు. దైవం పనికి పుట్టాడు సద్గురువు. తానెవరో తెలుసుకొని, భగవదనుభూతి పొందుతున్నవారిని భగవంతుడు పంపిస్తాడు.)

వీళ్ళందరినీ నేనొక్కడినే చంపగలను. అయితే రాముడు తానే రావణాసురుని చంపవలెనని ప్రతిజ్ఞ చేశాడు. ఆ ప్రతిజ్ఞ సిద్ధించి అతడు సంతోషపడవలెను. కాబట్టి వీళ్ళు చేస్తున్న ఈ అవమానాన్ని సహించి నేను ఊరక వుండవలెను. వీళ్ళు ఈ రాక్షసులు నన్ను లంకాపట్టణమంతా త్రిప్పుతారు. మళ్ళీ ఒకసారి ఈ లంకా పట్టణాన్నంతా చూస్తాను. నేను రాత్రిపూట ఇక్కడికి వచ్చాను. అందువల్ల నగర రక్షణా పద్ధతులను చూడలేదు. కాబట్టి పగలు చూడటం అవసరమే అనుకున్నాడు. అంతట సంతోషంగా రాక్షసులు, తన ఆకారాన్ని కురచగా చేసుకున్న హనుమంతుని పట్టుకొని నగరమంతా త్రిప్పడానికి బయలుదేరినారు. శంఖాలు పూరిస్తూ, భేరులు మ్రోగిస్తూ, సింహనాదాలు చేస్తూ, భుజాలు

చరుచుకుంటూ ఆ అరిందముని హనుమంతుని రాక్షసులు వెంబడించినారు. తోక భగభగా మండుతున్నప్పటికీ అతడు హాయిగా ఆ లంకాపట్టణ వీధులలో నడువసాగినాడు. చిత్రవిచిత్రమైన విమాన గృహాలను, పైకి కనబడని పాతాళ గృహాలను, తీర్చిదిద్దిన చత్వారాలను, క్రిక్కిరిసివున్న ఇళ్ళను, శృంగాటకాలను, రచ్చలను, రాజవీధులను, చిన్న చిన్న నదులను, సందు గొందులను, రహస్య ద్వారాలను, మేఘాలతో సమానమైన ఉన్నత గృహాలను చూస్తూ వెళ్ళాడు. చత్వారాలలో, చతుస్తంభ మంటపాలలో, రాజ ద్వారాల లోను హనుమంతుడు వేగులవాడు అని రాక్షసులు చాటించారు. తోక మండుతున్న ఆ హనుమంతుని చూడవలెనన్న కుతూహలంతో ప్రతి ఇంట్లోనుంచి స్త్రీ, బాల, వృద్ధులు బయటికి వచ్చి ఆ హనుమంతుని చూసినారు. ఆ హనుమంతుని తోకకు నిప్పంటించి ఆ లంకాపట్టణంలో త్రిప్పుతూ వుంటే, రాక్షసాంగనలు సీతాదేవి దగ్గరకుపోయి వికృతంగా కళ్ళు తిప్పుతూ "సీతా! నీ దగ్గరకువచ్చి మాట్లాడిపోయిన ఆ ఎర్రటి ముఖం కోతి తోకకు నిప్పంటించి పట్టణమంతా ఊరేగిస్తున్నారు" అని చెప్పారు. వైదేహి ఆ భయం కరమైన వార్త విన్నది. ఆమెకు ప్రాణం పోయినట్లైంది. శోకముతో అమితంగా బాధపడ్డది. పరిశుద్ధురాలై ఆ కపి కోసం ప్రార్థించింది. ఓ అగ్నిహోత్రుడా! నేను పతిసేవ చేస్తున్నట్లైతే, నేను చేస్తున్న తపస్సుకు ఏమైనా బలం వున్నట్లైతే, నేను పతివ్రతను అయినట్లైతే హనుమంతుని తోకను దహించ వద్దు.

(హనుమంతుడు తనను తాను రక్షించుకోగలడు. కానీ ఇది మిత్రభావం. ఇంకోవిధంగా సద్గురువు సర్వ సమర్థుడైనప్పటికీ,

శిష్యుడు తనవంతు పని తను చేస్తూ వుండాలి. అంగరక్షకుడిలాగ వుండాలి. అందుకని "అవతుమాం అవతువక్తారమ్" అని ప్రార్థన చేస్తాం కదా! దేవతలంతా మాకు రక్షణ కలిగించండి. మేము సత్యమే పలుకుతాము. ఋతమే పలుకుతాము గనుక నాకు, మా గురువు గారికి రక్షణ కలగాలి. గురువు రక్షణ, శ్రేయస్సు కోరడం శిష్యుని కర్తవ్యం. ఇంకో మంత్రంలో "సహనావవతు... మావిద్విషావహై" అని చెప్తారు. ద్వేషము మా మధ్య కలుగకుండుగాక! అని అర్థము. నిజానికి హనుమంతునికి తోక కాలడం ఏమీ వుండదు. అన్ని బాణాలు తగిలితేనే ఏమీ కాలేదు. ఇక్కడ సీతాదేవి ఆమె ప్రయత్నం ఆమె చేసింది. అందువల్ల అగ్ని చల్లబడింది.

సత్సాధకుడైన శిష్యుడు జీవాత్మ, ఒక సద్గురువుకు రక్షణ కలగాలని కోరినట్లుగా భావన చెయ్యవచ్చు. సీతాదేవి శక్తి స్వరూపిణి. ఆమె తపోబలం చేత తోక కాలకుండా చల్లగా అనిపిస్తుంది.)

ఓ అగ్నిహోత్రుడా! ఆ ధీమంతుడికి, రామప్రభువుకు నామీద ఏ కొంచెమైనా దయ వున్నట్లైతే, నేను ఏ కొంచెమైనా అదృష్టవంతురాలను అయినట్లైతే, ఆయనకు నన్ను రక్షించాలన్న భావం పరిపూర్ణంగా వుంటే ఈ హనుమంతుని తోకను దహించ వద్దు. ఓ అగ్నిహోత్రుడా! ధర్మాత్ముడు రాముడు నన్ను కలుసుకో వలెనని అనుకుంటున్నట్లైతే, సదాచార సంపన్నుడైన హను మంతుడి తోకను దహించ వద్దు.

(ఆమె లక్ష్మణుని నిష్కారణంగా అన్న మాటలు ఆమెను

బాధపెడుతున్నాయి. అంతశ్చేతనలో ఆమె పొరబాట్లు ఆమెను బాధపెడుతున్నాయి. అంతశ్చేతన శుభ్రంగా వుంటే పొరపాటు వెంటనే తెలుస్తుంది. సజ్జనులను ఇంకొకళ్ళెవరూ అనక్కర లేదు. "వాచస్సత్యమశీమహి" సత్యం నీలోనే వుండి నిన్ను హెచ్చరిస్తుంది. నిర్మలమైన అంతఃకరణ కలిగియున్నప్పటికీ, మాయకు లోనైంది.)

ఓ అగ్నిహోత్రుడా! అబద్ధమాడని సుగ్రీవుడు నన్ను ఈ దుఃఖసముద్రం నుంచి దాటించవలెనని తలచుకున్నట్లైతే ఈ హనుమంతుడి తోక చల్లగా వుండవలెను. సుగ్రీవుడు అంతఃకరణ శుద్ధుడే. అతను కేవలం పొరపాటు పడినాడు తప్ప, అన్న భార్యను అపహరించాలనే దుర్బుద్ధితో లేడు. అది శ్రీరాముడు ముందు మాటలలోనే తెలుసుకుంటాడు. (మనతో వుండేవాళ్ళు అబద్ధం చెప్పకుండా, నిజం దాదాపుగా చెప్పేవాళ్ళై వుండాలి.) ఈ విధంగా సీతాదేవి అగ్నిహోత్రుని ఐదు రకాలుగా ప్రార్థించింది.

హనుమంతుడి తోకను ఆశ్రయించిన అగ్నిహోత్రుడు అదివరకే జ్వాలలతో ప్రదక్షిణం చేసినాడే కానీ, ఏమాత్రం వేడినీ అతనికి కలుగ నీయలేదు. అగ్ని, వాయువు ఇద్దరూ సన్నిహిత దేవతలు. వీరిరువురికీ హనుమంతుడు శిష్యుడు. అగ్నిదేవుడు వాత్సల్యంతో బాధించలేదు. హనుమంతుడి తండ్రి వాయుదేవుడు, సీతాదేవి నెమ్మదిగా వుండటానికి మంచుగాలి ఆ ప్రాంతంలో వీచినాడు.

(ఏదైనా కార్యక్రమం మొదలు పెట్టినప్పుడు చల్లని పిల్లగాలి వీచడం శుభకరం. మన పనుల బట్టి మనచుట్టూ వాతావరణం వుంటుంది. పరశురాముడు వచ్చినపుడు వాతావరణం భయం

కరంగా, వేడిగా అయింది. ఎండలో ఒక మేఘం రావటం, చిన్న చినుకు (చిరుజల్లు) పడటం శుభ సూచకం.)

అట్లా తోక కాలుతున్నప్పటికీ ఏ మాత్రమూ వేడి లేకపోయినందువల్ల హనుమంతుడు ఆశ్చర్యంతో ఇదేమిటి? తోక మండుతున్నప్పటికీ నన్ను ఈ మంటలు దహించడం లేదు? కొంచె మైనా బాధగా లేదే? మహాజ్వాలలు రేగుతున్నా, నా తోక చివరన చల్లగా వుందే! దీనికి కారణ మేమిటి? స్పష్టముగా తెలుస్తూనే వుంది. ఇదంతా రామప్రభావం.

(దైవం పని చేసేవాడిని దైవమే కాపాడుతుంది.)

నేను సముద్రం దాటుతుండగా పర్వతమొకటి పైకి లేచింది. పర్వత రూపాన పైకిలేచిన ఆ మైనాకుడు రాముడికి మేలు చేయడానికి త్వరపడ్డాడు. అదే విధంగా రాముడికి మేలు చేయడానికి ఇప్పుడు అగ్నిహోత్రుడు నాకు తోడ్పడుతున్నాడు. సీతాదేవి దయవల్ల, రాముడి ప్రభావం వల్ల, నా తండ్రి వాయుదేవుడి స్నేహితు డైనందువల్ల అగ్నిహోత్రుడు నన్ను కాపాడుతున్నాడు. నేనిప్పుడు హాయిగా వున్నాను అనుకుంటూ, ఇక తాను చేయవలసిన పనిని గూర్చి ఒక ముహూర్తం సేపు ఆలోచించినాడు.

అంతట హనుమంతుడు సింహనాదం చేసి పై కెగిరినాడు. పర్వత శిఖరమంత ఎత్తునవున్న లంకాపట్టణ ద్వారం మీదికి పోయినాడు. ఆ పర్వతాకారుడు, ఆ మహాధైర్యవంతుడు, ఆ కాంతి మంతుడు అంతట తన మహాకాయాన్ని కుంచించాడు. కట్టివేసిన

తాళ్ళన్నీ కుప్పకూలి పోయినాయి. అంతట ఆ కాంతిమంతుడు మళ్ళీ పర్వతాకారం ధరించి, మళ్ళీ నాలుగుదిక్కులా చూచి, ఆ బహిర్ద్వారానికి అమర్చిన ఇనుప గుదియను ఊడబెరికినాడు. ఆ ఇనుప గుదియతో ఆ మహాబాహువు అక్కడ కావలియున్న రాక్షసు లందరినీ కొట్టి చంపినాడు.

అప్పుడా రణచండ విక్రముడు మళ్ళీ లంకా పట్టణం వైపు చూశాడు. ఆ మహావీరుడి తోక భగభగా మండుతూ వున్నది. హనుమంతుడు లంకాపట్టణానికి వచ్చిన పనులన్నీ అయి పోయినాయి. అతడు లంకాపట్టణం చూస్తూ ఉత్సాహంతో చెలరేగి, ఇక తాను చేయవలసిన పనిని గురించి ఆలోచించినాడు. ఈ రాక్షసులను కష్టాలపాలు చేసిపోవడమే నా కర్తవ్యం.

(సద్గురు స్పర్శ మనలోపల వున్న దైత్యులను ప్రకోపింపచేసి, తర్వాత బలహీనులను భయ భ్రాంతులను చేస్తాడు. అందరినీ కలవరపరచి ధ్వంసంచేస్తే, మిగతాపని దైవం చూసుకుంటాడు. దైవకార్యానికి మార్గం సుగమం చేస్తాడు.)

ఈ పని ఒక్కటే మిగిలింది. అశోకవనాన్ని ఎలాగూ ధ్వంసం చేశాను. రాక్షస వీరులను చంపాను. సైన్యంలో కొంతభాగాన్ని సంహారం చేశాను. ఇక ఈ పట్టణంలో వున్న కోటను పాడు చేయవలెను.

(గృహస్థ ధర్మాన్ని స్వీకరించి ఆత్మసాధన చేయటం కోటలో వుండి పోట్లాడటం లాంటిది. గృహస్థ ధర్మం స్వీకరించకుండా వుంటే, మనలను కాంతావ్యామోహం వెంటబడి ఎప్పుడో ఒకప్పుడు

స్వీకరిస్తుంది. కోటనుంచి బయటకి వెళ్ళి యుద్ధం చేయడం సన్యాసాశ్రమము. కాబట్టి గృహస్థాశ్రమమే గమ్యాన్ని క్షేమంగా చేరుస్తుందని పెద్దలు చెబుతారు.)

ఈ కోటను కూడా తగులబెట్టినట్లైతే సముద్రం దాటివచ్చిన నా శ్రమంతా సఫల మౌతుంది. ఈ పనిని ఇప్పుడే నేను సులభంగా చేయవచ్చును. నా ఈ తోకను ఆశ్రయించుకొని వున్న అగ్నిహోత్రునికి ఈ లంకాపట్టణంలో వున్న ఉత్తమ గృహాలతో సంతర్పణ చేయటం తగినపని అనుకొని మండుతూ వున్న తోకతో మెఱపులు మెరిసే మహామేఘంవలె లంకాపట్టణం భవనాల మీదకు పోయినాడు. ఉద్యానవనాలను, ప్రాసాద గృహాలను చూచుకుంటూ ఈ ఇంటిమీది నుంచి ఆ ఇంటిమీదికి, ఆ ఇంటిమీది నుంచి ఈ ఇంటిమీదికి ఎగురుతూ ప్రహస్తుడి ఇంటి మీదికి పోయి నిప్పు ముట్టించాడు. అంతేకాదు మహాపాశుడి ఇంటికి వెళ్ళి కాలాగ్ని జ్వాలల వంటి అగ్నిహోత్రాన్ని వదలి పెట్టినాడు. అక్కడి నుండి వజ్రదంష్ట్రుడు, శుక్రుడి పారుడి ఇంటికి ఎగిరి, నిప్పు ముట్టించాడు. ఆ తరువాత ఇంద్రజిత్తు భవనానికి నిప్పు పెట్టాడు. జంబుమాలి, సుమాలి గృహాలకు నిప్పంటించి నాడు.

ఆ మహా పరాక్రమవంతుడు హనుమంతు డట్లా ఒక్కొక్క ఇంటికి నిప్పు ముట్టిస్తూ, విభీషణుడి ఇల్లు మాత్రం వదలిపెట్టాడు. రశ్మికేతువు గృహాన్ని, సూర్యశత్రువు భవనాన్ని, అశ్వకర్ణుడి ఆలయాన్ని, దంష్ట్రుని నిలయాన్ని, రోమశుడి మందిరాన్ని, యుద్ధోన్మత్తుడి సదనాన్ని, ధ్వజగ్రీవుడి నివాసాన్ని, విద్యజిహ్వుడి

వేష్టాన్ని, హస్తిముఖుడి నికేతనాన్ని, కరాళ పిశాచుల అవాసాలను, శోణితాక్షుని ఇంటిని, కుంభకర్ణుడి భవనాన్ని, మకరాక్షుడు, యజ్ఞ శత్రువు, బ్రహ్మ శత్రువు, నరకాంతకుడు, నికుంభుడు మొదలగు వారి ఇళ్ళనన్నిటినీ తగులబెట్టినాడు. ఆయా రాక్షసులు సంపా దించుకున్న మణిముక్త ప్రవాళాలన్నీ ఆ మంటలకు మాడి మసి అయిపోయాయి. ఆ మహా పరాక్రమవంతుడు హనుమంతుడు ఆ రాక్షసవీరుల ఇళ్ళకన్నిటికీ నిప్పు ముట్టించి రావణాసురుడి భవనం మీదకు పోయినాడు. సమస్త మంగళ ద్రవ్యాలతో మేరుమంథర పర్వతమంత ఎత్తున వున్న రావణాసురుడి రత్నభూషిత భవనానికి తన తోకతో వున్న నిప్పును అన్ని వైపులా ముట్టించి, ప్రళయకాల మేఘంవలె సింహనాదం చేశాడు. అప్పుడు వాయుదేవుడు, అగ్ని దేవుడు ఏకమై చెలరేగినందువల్ల ప్రళయ కాలములో వలె అగ్నిహోత్రుడు జ్వలించినాడు.

అట్లా జ్వాలలతో విజృంభించే అగ్నిహోత్రుని, వాయుదేవుడు ఆయా ఇళ్ళమీదకు తీసుకొని పోయాడు. అట్లా వాయువు అగ్ని హోత్రునికి తోడ్పడటం వలన లంకాపట్టణమంతా అచిర కాలంలో అంటుకొని భగభగా మండటం మొదలుపెట్టింది. బంగారు కిటికీల తోను, ముత్యాలు, రత్నాలు మొదలగు అలంకారాలతో వున్న పెద్ద పెద్ద భవనాలు తగులబడి నేల కూలినవి. అట్లా నిప్పంటుకున్న విమాన గృహాలు, పుణ్యాంతాన సిద్ధుల విమానాలు ఆకాశం నుండి నేలకూలినట్లు పడిపోయాయి. రాక్షసులందరూ తమతమ గృహాలు కాపాడుకోలేక భగ్నోత్సాహులై పోయారు. ఆర్జించిన సంపదలను పోగొట్టుకొని పరమదీనులై “ఆహా! వీడు సాక్షాత్తూ అగ్నిహోత్రుడే.

వానర రూపంలో ఇక్కడికి వచ్చాడు అని కేకలువేస్తూ, దిక్కులు తెలియకుండా పరుగులెత్తారు. పసిబిడ్డలకు పాలిస్తున్న ఆడవాళ్ళు, చుట్టూ అగ్నిహోత్ర జ్వాలలు కమ్ముకున్నందువల్ల భయభ్రాంతులై ఏడుస్తూ, తలముడులు విడిపోయి మేడల మీదినుంచి తటాలున క్రిందకు దూకినారు. అట్లా ఆకాశమంత ఎత్తునుంచి దూకుతున్న ఆ స్త్రీలు మేఘాలలో మెఱపులవలె మెరసినారు. వజ్రాలు, ప్రవాళాలు, వైఢూర్యాలతోను, ముత్యాలతోను, ఇంకా ఇతర మణులతోను తాపడం చేసిన భవనాల నుంచి ఆయా ధాతువులు కాలి కరిగి కారిపోవడం హనుమంతుడు చూచాడు. ఎన్ని ఎండు కట్టెలు వున్నప్పటికీ, ఎంత ఎండుగడ్డి వున్నప్పటికీ అగ్నిహోత్రుడు తృప్తిపడనట్లు హనుమంతుడు ఆ లంకాపట్టణంలో ఎన్ని ఇళ్ళు తగులబడిపోతున్నా తృప్తిపడలేదు. అదే విధంగా ఆ రాక్షసుల పీనుగులు ఎన్ని తనమీద పడుతున్నా భూమి తృప్తిపడలేదు.

అప్పుడు ఆ అగ్నిహోత్ర శిఖలు ఒకానొకచోట మోదుగపూల వలె, ఒకానొకచోట బూరుగుపూల వలె, ఒకానొకచోట కుంకుమ పూలవలె తేజరిల్లినవి. అప్పుడా వేగవంతుడు హనుమంతుడు త్రిపురాలను దహించివేసిన రుద్రునివలె తేజరిల్లినాడు. అమితవేగంతో హనుమంతుడు త్రికూటాచల శిఖరము మీద వదలిన ఆ అగ్నిహోత్రం లంకాపట్టణం చుట్టూ వ్యాపించి, పరమ భయం కరంగా జ్వలించింది. పొగలు, మంటలు ఆకాశాన్ని అంటు కున్నాయి. రాక్షసుల దేహాలలోని కొవ్వు అగ్నిహోత్రుడికి ఆజ్య ధారలయ్యాయి. అందువల్ల అగ్నిహోత్రుడు అమితంగా రేగినాడు. అప్పుడా అగ్నిహోత్రుడు కోటిసూర్యుల కాంతితో తేజరిల్లుతూ,

పిడుగుల చప్పుళ్ళు చేస్తూ బ్రహ్మాండాన్నంతా పగులగొడుతున్నట్లు ఆ లంకాపట్టణాన్ని దహించివేయ సాగినాడు.

తీక్షణ కాంతులతో మోదుగపూల వంటి మంటలు ఆకాశం వరకు వ్యాపించినాయి. ఆ మంటలతో పాటు పొగలు ఆకాశం వరకు వ్యాపించడం వల్ల అక్కడి మేఘఖండాలు నల్లకలువల వలె వికసించినవి. వీడు వజ్రపాణి అయిన దేవేంద్రుడో, సాక్షాత్తూ యమధర్మరాజో లేక రుద్రుడో, ప్రళయకాల సూర్యుడో తెలియటం లేదు. వీడు వానరుడు మాత్రం కాదు. సాక్షాత్తూ యముడు సకల లోకాలకు పితామహుడు. పరమ సృష్టికర్త అయిన చతుర్ముఖ బ్రహ్మదేవుని ప్రబల కోపం ఈ విధంగా వానర రూపాన రాక్షస సంహారం కోసం వచ్చిందేమో! అనంతము, అవ్యక్తము, అచింత్యము, ఏకము అయిన వైష్ణవ తేజము రాక్షసులను నాశనం చేయడానికి ఇప్పుడు తన మాయతో కపిరూపాన వచ్చిందేమో అని రాక్షసులు ఆశ్చర్యపోయి చెప్పుకుంటూ వుండగా రాక్షస సమూహాలతోను, గుఱ్ఱాలతోను, రథాలతోను, ఏనుగులతోను, పక్షి సంఘాలతోను, మృగాలతోను, వృక్షాలతోను ఆ లంకాపట్టణం గబగబా తగులబడి పోయింది. అదిచూచి ఏమి చేయడానికి తోచక రాక్షసులు దీనులైపోయి, వివిధ హాహాకార ధ్వనులతో ఏడ్చినారు.

ఆ మహాబలవంతుడు హనుమంతుడు ఆ లంకాపట్టణాన్ని అంతా అట్లా దహించివేసి, సముద్రం దగ్గరకు పోయి తోకను వున్న అగ్నిహోత్రాన్ని చల్లార్చుకున్నాడు. అప్పుడా మహా బలవంతుడికి మనసులో మహాభయం వేసింది. తనను తానే నిందించుకుంటూ, నేను ఈ లంకా పట్టణాన్ని ఎందుకు దహించి వేశాను? చాలా

చెడ్డపని చేశాను. కోపము రేగినప్పుడు నిప్పును నీళ్ళతోవలె కోపాన్ని తన బుద్ధిబలముతో చల్లార్చుకోవాలి. అట్లా కోపాన్ని అణచుకొనేవారే ధన్యులు. సామాన్యుడికి కోపంవస్తే పాపకార్యాలు చేయకుండా ఉండలేడు. గురువులనైనా చంపివేస్తాడు. పరుష వాక్యాలతో సత్పురుషులను తిరస్కరిస్తాడు. ఇది చెప్పవచ్చును, ఇది చెప్పకూడదు అనే జ్ఞానం వుండదు. ఇది చేయవచ్చును, ఇది చేయకూడదు అన్న విచక్షణ కూడా వుండదు. పాము ఎంతో ఓపికతో కుబుసాన్ని వదులుతుంది. అదేవిధంగా ఓర్పుతో కోపాన్ని వదలిపెట్టవలెను. అట్లా చేయగలవాడే మగవాడు.

(కోపం వచ్చినవాడు చెయ్యకూడని పనినైనా చెయ్యడానికి వెనుకాడడు. మాటలతో, చేతలతో ఇతరులను జీవితాంతం నొప్పిస్తాడు. గురువులు, పెద్దలు అన్న విచక్షణ వుండదు. ఓర్పు ద్వారా కోపం తగ్గే అవకాశం వుంది. చాలా బరువు బాధ్యతలు కలిగిన కార్యక్రమాలలో దిగి, మౌనంగా పనిచేయడం ద్వారా కోపం మాయ మౌతుంది. ఓర్పుతో కార్యక్రమాలు నిర్వహిస్తూ, శ్రమకోర్చి పనులు చేస్తే కోపం తగ్గిపోతుంది.)

అయ్యో! నేను సీతాదేవి వుందని కూడా ఆలోచించకుండా లంకాపట్టణానికి నిప్పు పెట్టాను. నేను స్వామి ద్రోహినైనాను. నేను దుర్బుద్ధిని, సిగ్గుమాలిన పని చేశాను. ఛీ ఛీ నేను పాపిష్ఠివాడిని. లంకా పట్టణమంతా తగులబడిపోయింది. సీతాదేవి కూడా కాలి పోయి వున్నట్లైతే, నేను నా అజ్ఞానం వల్ల స్వామికార్యం చెడగొట్టిన వాడనవుతాను. దేనికోసం ఇంత ప్రయత్నం జరిగిందో, అదంతా నేను చెరిచిన వాడనవుతాను. ఈ లంకాపట్టణాన్ని తగుల

బెట్టేటప్పుడు సీతాదేవిని కాపాడవలెనని నాకు తోచలేదు. అయ్యో! నేను కృద్ధుడనై మొత్తమంతా పాడుచేశాను. ఇప్పుడు ఈ లంకా పట్టణంలో దగ్ధముకాని ప్రదేశం ఒక్కటీ లేదు. పట్టణమంతా భస్మమై పోయింది. సీతాదేవి కూడా నాశనమై పోయిందేమో!

అట్లా జరిగి వున్నట్లైతే, నేనిప్పుడు ఇక్కడనే ప్రాణం వదలటం మంచిది. నేనిట్లా పనినంతా పాడుచేశాను. నేనిప్పుడు అగ్ని హోత్రంలో దూకడమా? సముద్రంలో పడి జలజంతువులకు ఆహారమైపోవడమా? నేను బ్రతికివుంటే సుగ్రీవుని చూడటం ఎలా? కోపం వచ్చి కోతి స్వభావం నుండి లంకాపట్టణాన్నంతా దహించి వేసినాడని ముల్లోకాలలోను ప్రసిద్ధి కెక్కుతాను. నేను వానరుడిని, చపలుడిని. కాపాడే సామర్థ్యం నాకున్నప్పటికీ నేను సీతాదేవిని కాపాడలేదు. రాజస స్వభావానికి ఒక వ్యవస్థ అంటూ వుండదు. అటువంటి రాజస స్వభావం నాలో చెలరేగింది. నేను దురదృష్టవంతుడిని. కోపంతో నాకు ఒళ్ళు తెలియకుండా పోయింది. నావల్ల ఈ లోకమంతా నాశనమై పోతుంది.

రాజస స్వభావమునకు ఒక వ్యవస్థ అంటూ వుండదు. అంటే ఒక పద్ధతి అంటూ వుండదు. రజోగుణము బాగా విజృంభించడం చేత వాడు అడ్డగోలుగా ఎట్లాపడితే అట్లా చేస్తాడు. అందుకని తను ఈ కోతి శరీరములో వుండడంచేత దాని స్వభావము ననుసరించి, నన్నీ విధంగా పని చేయించింది అని బాధపడ్డాడు. ఇదివరకు నాకు శుభనిమిత్తాలు ప్రత్యక్షంగా కనిపించినవే! వాటి గతి ఏమిటి? అవి జరుగవలెనే. ఆ శుభనిమిత్తాలు తప్పకుండా జరుగుతాయి. సీతాదేవి మంగళరూపిణి.

ఆమె ఎంతమాత్రమూ కాలిపోయి వుండదు. ఆమెను ఆమె తేజస్సే కాపాడి వుంటుంది. ఆమె అగ్నిహోత్రము. అగ్నిహోత్రమును అగ్నిహోత్రం ఎట్లా దహిస్తుంది? ఆమె ధర్మాత్ముడు రామప్రభువు భార్య. ఆమె తన పాతివ్రత్య మహిమవల్ల జీవించి వుంటుంది. అగ్నిహోత్రుడు ఆమెను స్పృశించలేడు. అగ్నిహోత్రుడు నన్నే దహించి వేయలేదు. నాకు వేడి అయినా ఏమీ కాలేదు. అది రాముడి ప్రభావమో, సీతాదేవి పుణ్యమహిమో అనుకున్నాడు.

రామప్రభువు మనఃకాంతను సీతాదేవిని, అగ్నిహోత్రుడు ఎందుకు దహించివేస్తాడు? ఆమె కాలిపోయి వుండదు. అగ్నిహోత్రుడు నా తోకకైనా హాని చేయలేదు. ఆ పూజ్యురాలిని కాపాడి వుంటాడు. ఆ సీతాదేవియే తన తపః ప్రభావముతో, తన సత్యబలముతో, తన పాతివ్రత్య మహిమతో అగ్నిహోత్రునైనా దహించి వేస్తుంది. ఆమెను అగ్నిహోత్రుడు దహించి వేయడ మేమిటి? అని అనుకుంటూ వుండగా, ఆకాశమార్గాన మాటలు వినిపించినవి. "ఆహా! ఎంత ఆశ్చర్యము! రాక్షసుల భవనాల మీద హనుమంతుడు భయం కరమైన అగ్నిహోత్రాన్ని వదలినాడు. ఎవరూ చేయనిపని చేశాడు. భవనాలన్నీ తగులబడిపోతూ వుంటే రాక్షసులు, స్త్రీలు, పురుషులు, బాలలు, వృద్ధులు భయపడి కోలాహల ధ్వనులతోను, ఆక్రందనల తోను పరుగు లెత్తుతున్నారు. రావణాసురుడి కోటబురుజులు, ప్రాకారాలు, బహిర్ద్వారాలు దగ్ధమైపోతున్నాయి.

అశోకవనంలో వున్న సీతాదేవి మాత్రము చెక్కు చెదరక హాయిగా వుంది. ఇది పరమాశ్చర్యం. ఇదివరకెన్నడూ ఇటువంటి ఆశ్చర్యం ఈ జగత్తులో జరుగలేదు" అని చారణులు చెప్పు

కుంటున్న అమృత వాక్కులను హనుమంతుడు విన్నాడు. సంతోష పడ్డాడు. సీతాదేవిని మళ్ళీ ప్రత్యక్షంగా చూచి, ఆమె అనుమతి పొంది, హనుమంతుడు తిరుగు ప్రయాణం చేయవలెనని అను కున్నాడు.

(శరీర స్వభావము ఒకటి మనమీద పనిచేస్తూ వుంటుంది అప్పుడప్పుడు. సద్గురువుకి కూడ అప్పుడప్పుడు శరీర స్వభావము వుంటుంది కదా ! అది పనిచేసే అవకాశము కూడా వుంటుంది. అది చెప్పడానికే ఇంత ప్రాజ్ఞుడు, ఇంత తేజోవంతుడు, ఇంత సిద్ధుడు, మహాయోగి అయిన హనుమంతునికి తన శరీర ప్రభావము, తనమీద పనిచేసిందేమోనని భయము వచ్చింది. నిజానికి లేదు. ఎందుకంటే తను విచక్షణతోనే భవనాలు ముట్టించాడు. దారిలో అన్ని గృహాలు కాల్చుకుంటూ వచ్చాడు. విచక్షణతోనే విభీషణుని గృహాన్ని ముట్టించకుండా వదిలేశాడు. అలాగే అశోకవనాన్ని అంతకుముందు ధ్వంసం చేయడం తప్ప, తాను వెళ్ళి అక్కడ ముట్టించలేదు. అందుచేత తనకున్నటువంటి కోతి శరీరము యొక్క స్వభావము చేత అపుడప్పుడు అలా మధ్య మధ్య భావాలు వస్తూ వుంటాయి. కొంత వికలమవుతూ వుంటుంది, అది ఒకటి.

రెండవది, సద్గురువు లోపలవుండే సమస్త అసుర శక్తులను ధ్వంసము చేసే సందర్భంలో జీవాత్మకి తేడాపడకుండా చేయాలి. ఎందుకంటే జీవాత్మకు తేడాపడేట్లుగా శరీరాన్ని దగ్ధం చేస్తే, ఇక ఆ శరీరంతో ఆ జీవాత్మ ఆ జన్మకి ఏమీ నెరవేర్చుకోలేదు. ఎందుకంటే ఆత్మసాధనకు కావలసినది శరీరము. అది పదనుగా

వుండాలి. ఆరోగ్యంగా వుండాలి. ఆయుర్దాయం వుండాలి. అందుకని చాలా త్వరితగతిని వున్న మరణాన్ని నిర్మూలనము చేయడం మొదలుపెడ్తే ఒక్కొక్కసారి జీవునికే హాని కలుగుతుంది. అందుకని సాధన విషయంలో సద్గురువు, శిష్యుని ఎడల అప్రమత్తంగా అతనికి ఎంతవరకు సాధన జరుగవలెనో అంతవరకే జరిగేటట్లు చూస్తాడు. అంతకుమించి జరిగితే ప్రమాద పరిస్థితి వున్నపుడు అది జరుగనీయకుండా చూస్తాడు. ఆ విధముగా ఎరుక గురువుకి వుంటుంది.

అదే విధంగా హనుమంతుడు ఇక్కడ చేసే పనులకు సజ్జనులు విభీషణుడు, సీతాదేవి రక్షింపబడ్డారు. అంటే సత్వ గుణము, జీవాత్మ దానిని మాత్రమే మిగిల్చాడు. రజోగుణము, తమోగుణము రావణుడు, కుంభకర్ణుడు వానియొక్క గృహములు కూడ దగ్ధం చేశాడు. వారికివున్న బలాలను దగ్ధము చేయడమే కోటను బలహీన పరచడం. కోటను బలహీనపరిస్తే, దైవము ప్రవేశించడానికి అవకాశ మేర్పడుతుంది. ఆ విధంగా ఏర్పడితే పని సులువవుతుంది. అందుచేత పని చేసినవా డవుతాడు. అది కారణంగా భృక్తరహిత తారక రాజయోగము కానీ, కుండలినీ యోగము కానీ, ఇంకొక యోగము కానీ సమర్థమైనటువంటి సద్గురువు నిర్వర్తిస్తే, జీవునికి హాని కలుగకుండా నిర్వర్తించడ మవు తుంది. సమర్థత లేనివాడు నిర్వర్తిస్తే జీవునికి హాని కలుగుతుంది. మాస్టరుగారు ఆ విషయము జాగ్రత్త వహించారు.

సమర్థుడైన సద్గురువు నిర్వహిస్తే జీవుడికి హాని కలుగదు. మాస్టర్ ఇ.కె. గారు, సి.వి.వి. గారి యోగవిషయంలో జాగ్రత్త

వహించారు. ఆయన ద్వారా యోగమందుకున్న వారికి మతి భ్రమణం కలుగలేదు. తాను అందుకున్న తత్త్వమును, దానిపై పరిపూర్ణ స్వామిత్వం రాకుండా ఇతరులకు అందిస్తే, వారికి అది పూర్తిగా వికటించవచ్చు. ఇతనికే వశం కాని విషయాన్ని ఇతను నియమించలేడు. సమర్థులైన శిష్యులకు, సమర్థత లేకపోయినా అదేపని చెయ్యాలనుకున్న వారికి తేడా కనిపిస్తుంది.

హనుమంతుడు ఇక్కడ జీవికి, సత్త్వ గుణమునకు ఏ మాత్రమూ తేడా పడకుండా ఇతర విధములైన గుణములకు, అసురశక్తులకు అన్నిటికీ తేడాపడేట్లుగాను, అవి బలహీనములయ్యేటట్లు ప్రయత్నము చేస్తాడు. అది చూసిన సిద్ధులు ఈ కార్యక్రమాన్ని చక్కగా నిర్వర్తించాడు అని చెప్పి సంతోషపడ్డారు. ఇది యోగపరంగా చెప్పుకోవచ్చు.)

## 11

హనుమంతుడు అంతట సీతాదేవి దగ్గరకు బయలుదేరాడు. శింశుపా వృక్షము మొదట్లో కూర్చున్న ఆమెకు నమస్కారం చేసి, "ఓ పూజ్యురాలా! నీవు సౌభాగ్యవశము వల్ల క్షేమంగా వున్నావు. నేను నిన్ను ఇప్పుడు చూచి ప్రయాణమై పోవడానికి వచ్చాను" అని నమస్కరించి బయలుదేరాడు. సీతాదేవి అట్లా ప్రయాణమైపోతున్న హనుమంతుని వంక పదేపదే చూచి, పెనిమిటి మీద ప్రేమాతి శయంతో "ఓ హనుమంతుడా! నీవు పరవీరహంతవు. నీవు ఒక్కడివే ఈ రాక్షసుల నందరినీ జయించి, నన్ను రామప్రభువు దగ్గరకు తీసుకొని పోగలవు. నీ బలము ప్రసంశనీయమైనది. అయితే ఆ శత్రు సంహారకుడు రామప్రభువు ఇక్కడికివచ్చి, ఈ లంకాపట్టణాన్ని తన బాణపరంపరలతో ముంచి, నన్ను తీసుకొని పోవలెను. అట్లా చేయడము ఆయన పరాక్రమానికి తగినట్లుగా వుంటుంది. అందువల్ల ఆ ఆహవ సూర్యుడు, ఆ మహాత్ముడు ఆయన కనురూపమైన పరాక్రమంతో ఇక్కడికి వచ్చి నన్ను తీసుకొనిపోయేట్లు నీవు చేయవలెను" అని చెప్పింది.

ఇట్లా వినయపూర్వకంగాను, యుక్తియుక్తం గాను, అర్థ వంతముగాను సీతాదేవి చెప్పిన మాటలు విని, "ఓ దేవీ! రామ

ప్రభువు వానర సమూహాలను, భల్లూక సమూహాలను వెంట బెట్టుకొని త్వరలోనే ఇక్కడికి వస్తాడు. శత్రువుల నందరినీ సంహారం చేస్తాడు. నీ దుఃఖాన్ని పోగొడతాడు" అంటూ ఆ మారు తాత్మజుడు హనుమంతుడు ఆమెను ఊరడించి ప్రయాణమై పోతూ ఆమెకు నమస్కారం చేసినాడు. అంతట ఆ అరిందముడు స్వామి దర్శన ఉత్సుకతతో అరిష్టమనే పర్వతం దగ్గరికి వెళ్ళాడు.

ఆ పర్వతం నల్లటి వనపంక్తులతోను, ఎత్తైన పద్మాక వృక్షాలతోను, ఒక వరుస కట్టుకున్నట్లుగ దాని శిఖరాల నడుమ వ్రేలాడుతున్న మేఘాలతో ఉత్తరీయం కప్పుకున్నట్లుగాను, ప్రేమాతి శయం వల్ల సూర్యుడి శుభకరమైన కిరణాలనే చేతులతో మేల్కొలుపుతూ వుంటే, ఆ పర్వతంమీద ధాతువులు కళ్ళు తెరుస్తూ మూస్తూ వున్నట్లు కనిపించింది. ఆ పర్వతముమీద జలప్రవాహాల గంభీరధ్వనులు వేదాధ్యయనం చేస్తున్నట్లుగా, అక్కడి సెలయేళ్ళ వివిధ ధ్వనులు తాళ మృదంగాది ధ్వనులతో సంగీతం ఆలా పిస్తున్నట్లుగా వినిపించినవి. ఎంతో ఎత్తు ఎదిగిన దేవదారు వృక్షా లతో ఆ పర్వతము చేతులు పైకెత్తి తపస్సు చేస్తున్న మహర్షిలాగ కనిపించినది.

ఆ పర్వతం మీదనుంచి అన్నివైపులా పడుతున్న జలపాతాల ఘోషలు రొదలు పెడుతున్నట్లు వినిపించినవి. కదలుతున్న నల్లని శరత్కాల వనాలతో ఆ పర్వతం వృద్ధాప్యం వచ్చినవాడు వణకు తున్నట్లుగా తోచింది. గాలి తాకిడికి ఆ పర్వతం మీద ధ్వని చేస్తున్న వెదుళ్లు పిల్లనగ్రోవులు ఊదుతున్నట్లుగా వినిపించినది. భయం కరమైన విషసర్పాలతో ఆ పర్వతము కోపంతో బుసలు కొడు

తున్నట్లుగాను, మంచు కమ్ముకున్న గంభీరమైన గుహలతో ఆ పర్వతము ధ్యానం చేస్తున్నట్లుగాను, కదులుతున్న మేఘాలు కమ్ము కొని చిన్న చిన్న కొండలతో ఆ పర్వతము నడుస్తున్నట్లుగాను, మేఘపంక్తులు దాటిన శిఖరాలతో ఆ పర్వతం ఆవరిస్తున్నట్లుగాను, ఇంకా ఎన్నో గుహలతో, ఎన్నో శిఖరాలతో ఆ పర్వతము శోభాయమానంగా కనిపిస్తోంది. పూలు పూసిన మద్దిచెట్లతోను, తాటిచెట్లతోను, ఇనుమద్ది చెట్లతోను, ఎంతో విరివిగా అల్లుకున్న వివిధ లతలతోను, నానావిధ మృగాలతోను, వివిధ ధాతువుల తోను, ఎన్నో సెలయేళ్ళతోను, పెద్ద పెద్ద రాతిబండలతోను ఆ పర్వతం నేత్రపర్వంగా భాసించింది.

ఆ పర్వతం మీద మహర్షులు, యక్షులు, గంధర్వులు, కిన్నరులు, ఉరగులు నివసిస్తున్నారు. అక్కడి గుహలలో సింహాలు నివసిస్తున్నాయి. పెద్దపులులు వున్నాయి. రుచ్యమైన కంద మూలాలు అక్కడ దొరుకుతాయి. వెంటనే రాముని చూడవలెననే ఉత్సాహంతో హనుమంతుడు ఆ పర్వతం మీదికి వెళ్ళాడు. ఆ హనుమంతుడి పాదాల తొక్కిడికి అందమైన ఆ కొండనెత్తాలలో శిలలు, మహాధ్వనులతో పిండి పిండి అయిపోయాయి. అక్కడి నుంచి ఎగిరి హనుమంతుడు ఆ సముద్రాన్ని దాటి అవతల గట్టుకు పోవలెనని అనుకున్నాడు. అందుకోసం దేహాన్ని పెంచాడు. మీనాలతోను, మహోరగాలతోను భయంకరంగా వున్న ఆ సముద్రాన్ని చూశాడు. తన తండ్రి వాయుదేవుడి వలె దక్షిణం నుంచి ఉత్తరదిక్కుకు పోవటానికి హనుమంతుడు ఆకాశాని కెగిరినాడు. అట్లా ఎగురుతున్న హనుమంతుని ఊపిరికి ఆ పర్వతము

సమస్త ప్రాణాలతోను కంపించి పోయింది. దాని శిఖరాలు, ఆ శిఖరాల మీద వున్న మహోన్నత వృక్షాలు, మహాధ్వనులతో విరిగి నేలమీద పడిపోయాయి. ఆ హనుమంతుడి ఊరువుల వేగానికి వజ్రాయుధపు దెబ్బతిన్నట్లు విరగబూసిన పూలతో చెట్లన్నీ నేలకూలినాయి.

ఆ కొండగుహలలో వుంటూ వున్న మహా బలవంతమైన సింహాలు, అప్పుడు ఆకాశాన్ని భేదించేట్లుగా గర్జించినవి. అక్కడ విహరిస్తున్న విద్యాధరాంగనలు భయపడి తటాలున అకాశానికి ఎగరడంలో వారి చీరలు జారిపోయాయి. వారి ఆభరణాలు చెల్లాచెదురై పోయాయి. అతి ప్రమాణంలో మహా బలవంతమైన మహాసర్పాలు తలలు, మెడలు నలిగిపోయి, మంటలు మండు తున్న నాలుకలతో బైటికి వచ్చాయి. కిన్నరోరగ గంధర్వ యక్షాదు లందరూ బాధపడుతూ ఆ పర్వతాన్ని వదలి, ఆకాశానికి ఎగిరి పోయారు. మహోన్నత వృక్షాలతోను, శిఖరాలతోను ముప్పై యోజనాల ఎత్తున, పది యోజనాల వెడల్పున శ్రీమంతముగా వున్న ఆ పర్వతము నేలమట్టమై పోయింది. తీరాన అలలు లేస్తున్న ఆ సముద్రాన్ని దాటడానికి హనుమంతుడు ఆకాశమార్గాన్ని పట్టాడు.

(హనుమంతుడు లంకకు ఎగరటం మహేంద్ర పర్వతం నుండి జరుగుతుంది. దానిని మన శరీరంలో విశుద్ధి చక్రంగా భావన చేయవచ్చు. అక్కడి నుంచి ఆకాశమార్గాన హనుమంతుడు (సద్గురువు) లంక (శరీరం) చేరతాడు. లంకలోని అరిష్ట పర్వతాన్ని మూలాధారంగా భావన చేయవచ్చు. మూలాధారం నుంచి జీవుడు

ఉద్ధరణ చెందవచ్చు. అలా పరిపూర్ణంగా ఉద్ధారణ చెందినవాడు జ్ఞాని.)

ఆ విధంగా హనుమంతుడు ఈ పర్వతము వంటి చక్రము ఆధారము చేసుకొని ఊర్ధ్వగతిగా ఎగిరి వెళ్ళడము జరిగింది. తీరాన అలలు లేస్తున్న ఈ సముద్రమును దాటివెళ్ళడానికి హనుమంతుడు ఆకాశమార్గం పట్టినాడు.

చంద్రుడు తెల్ల కలువగాను, సూర్యుడు నీరు కోడిగాను, పుష్య, శ్రవణ నక్షత్రాలు కలహంసలు గాను, మేఘాలు తీరాన వున్న నాచుగాను, పచ్చిక బయళ్ళుగాను, పునర్వసు నక్షత్రం తిమింగలం గాను, అంగారక గ్రహము మహా గ్రాహము గాను, ఐరావతం మహాద్వీపం గాను, స్వాతీ నక్షత్రం హంసగాను, చంద్ర కిరణాలు అలలుగాను, చల్లని నీళ్ళుగాను, యక్షులు, గంధర్వులు, భుజగులు వికసించిన తామరపూలు గాను, కలువలుగాను వున్న అంతులేని ఆకాశమనే సముద్రంలో హనుమంతుడు ఏ మాత్రమూ అలసట లేకుండా వాయువేగంతో మహానౌకవలె సాగిపోయినాడు.

ఆ హనుమంతుడు ఆకాశాన్ని మ్రింగి వేస్తున్నట్లుగాను, చంద్రుని ఒరుసుకొని పోతున్నట్లు గాను, నక్షత్రాలతో, సూర్య మండలముతోనూ వున్న ఆకాశాన్ని ఈడ్చుకొని పోతున్నట్లుగాను, రథ మేఘ సమూహాన్ని లాక్కొని పోతున్నట్లుగాను ఆకాశంలో పోతున్నాడు. ఆ మారుతాత్మజుడి కాంతి నుంచి మహామేఘాలు తెల్లగా, ఎర్రగా, నల్లగా, పసుపుపచ్చగా, ఆకుపచ్చగా, నలుపు ఎరుపు కలిసిన రంగులలో కనిపించాయి. మాటిమాటికీ మేఘాల

లోకి పోతూ, మళ్ళీ మళ్ళీ బయటికి వస్తూ మేఘాలు కప్పుకొని పోతూ వున్న చంద్రుని మాదిరిగా హనుమంతుడు అగుపించాడు.

(ఈ చంద్రుడనేది సుందరకాండలో చాలా ముఖ్యమైన సాంకేతికంగా వాల్మీకి మహర్షి వాడారు. ప్రతిసారీ హనుమంతుని చంద్రునితో పోలుస్తాడు. ఎందుకంటే చంద్రుడు 'ఆచార్య స్వరూపుడు' అని చెప్పుకోవడం జరిగింది. సూర్యుడు వెలుగును ప్రతిబింబింప చేస్తాడు. అలాగే దైవము యొక్క తత్త్వమును సద్గురువు తననుండి ప్రతిబింబింప చేస్తాడు. అలాగే దైవము యొక్క తత్త్వమును సద్గురువు తననుండి ప్రతిబింబింపచేసి, జీవులను ఉద్ధరిస్తాడు కాబట్టి చంద్రుని మాదిరిగా వెళ్ళిపోతున్నాడని చెపుతున్నాడు. మొదట్లో చాలాసార్లు హనుమంతుణ్ణి ఈ విధంగా చంద్రునితో పోల్చి బాగా చూపిస్తాడు.)

అలా మేఘ సమూహాలలో దారి చేసుకొని పోతూ, మేఘ గర్జన వంటి సింహనాదం చేస్తూ గరుత్మంతుని వలె హనుమంతుడు భాసించాడు. ఆ మహాతేజోవంతుడు హనుమంతుడు లంకా పట్టణాన్నంతా అల్లకల్లోలం చేసి, రాక్షస వీరులను చంపి, రావణాసురుని దుఃఖపెట్టి, భయంకరమైన సైన్యాన్ని నాశనం చేసి, వైదేహికి నమస్కారం చేసి, ఆమె ఆశీర్వాదంతో మళ్ళీ ఆ సముద్రాన్ని దాటుతూ మైనాక పర్వతాన్ని తాకినాడు. అంతట ఆ పరమ పరాక్రమవంతుడు అల్లెత్రాటి నుంచి వెలువడ్డ బాణం వలె మహా వేగంతో పోతూ, మహామేఘం వంటి మహేంద్ర పర్వతాన్ని చూచి, సంతోషంతో ఉప్పొంగిపోయి సింహనాదం చేశాడు. మేఘగర్జన వంటి ఆ సింహనాదానికి దిక్కులన్నీ పిక్కటిల్లి

పోయినాయి. ఆ వానర శార్దూలము అంగదాది వానరు లందరూ వున్న ప్రదేశ సమీపానికి చేరి, సుహృద్దర్శన ఉత్సుకతతో తోకను జాడిస్తూ మళ్లీ సింహనాదం చేశాడు.

గరుత్మంతుడు సంచారము చేసే ఆకాశంలో హనుమంతుడు చేసిన ఆ సింహనాదానికి సూర్యమండలముతో కూడా ఆకాశము బద్దలైపోకుండా వుందా? అన్నట్లుగా ఆ నాదం వినిపించింది. అప్పుడు ఆ సముద్రపు ఉత్తర తీరాన వున్న మహాబలవంతుడు ఆ మహాశూరుడు హనుమంతుడు ఎప్పుడెప్పుడు వస్తాడా అని ఎదురుచూస్తూ వున్న వానరులు మహా మేఘ గర్జనా ధ్వని వంటి హనుమంతుని సింహనాదాన్ని, అతని ఊరువుల వేగానికి అయిన మహాధ్వనిని విన్నారు. వాళ్ళందరూ ఏమి వినవలసి వస్తుందోనని అంతవరకూ దీన మనస్కులుగా వున్నారు. అప్పుడా హనుమంతుని సింహనాదాన్ని విని ఉత్సాహభరితులైనారు.

జాంబవంతుడు అప్పుడు పరమసంతోషంతో వానరు లందరినీ చూచి, "ఓ వానర పుంగవులారా! హనుమంతుడు అన్ని విధాలా కృతకృత్యుడై వస్తున్నాడు. కృతకృత్యుడు కాకపోతే అతని కంఠధ్వని ఇంత గంభీరంగా వుండదు" అన్నాడు. ఆ వానరు లందరూ హనుమంతుడి బాహువుల వేగానికి, ఊరువుల వేగానికి అయిన ధ్వనిని, అతని సింహనాదాన్ని విని సంతోషంతో ఎగిరి గంతులు వేసినారు. ఆ వస్తూ వున్న హనుమంతుని చూడటానికి చెట్లపైకి ఎక్కినారు. కొంతమంది పర్వత శిఖరాలపైకి పోయినారు. దూరదేశం నుంచి వస్తున్న వారిని చూచి మిత్రులు వస్త్రాలాడించి

నట్లుగా ఆ వానరు లందరూ సంతోషాతిశయంతో ఆయా చెట్ల చిటారుకొమ్మలపై కూర్చొని చిన్నచిన్న కొమ్మల నాడించినారు.

అప్పుడు ఆ బలవంతుడు హనుమంతుడు వాయువు పర్వతగుహలలో చొరబడి గర్జించేటట్లుగా గర్జించినాడు. మేఘ సమూహంవలె కనపడుతున్న హనుమంతుని ఆ వానరు లంతా చూశారు. చేతులు జోడించి నిలుచున్నారు. పర్వతాకారాన వున్న ఆ వేగవంతుడు హనుమంతుడు చెట్లు దట్టంగా వున్న ఆ మహేంద్ర పర్వతంపై దిగినాడు. సంతోషాతిశయంతో మనోహరమైన గట్టున రెక్కలు నరికివేసిన పర్వతంవలె ఆకాశం నుండి దిగినాడు. అప్పుడు వానర పుంగవులందరూ మహదానందంతో ఆ హను మంతుని చుట్టూ మూగినారు. అట్లా వచ్చిన ఆ వానరోత్తముడికి ఆ వానరులందరూ అత్యంత సంతోషంతో పళ్ళు, కందమూలాలు కానుకగా సమర్పించారు.

అప్పుడా హనుమంతుడు గురువులకు, వృద్ధులకు, జాంబ వంతుడు మొదలగు వీరులకు, యువరాజైన అంగదుడికి నమస్కారం చేసినాడు. తనను గౌరవించి సంతోషపెట్టిన అంగదుని, జాంబ వంతుని, తక్కిన వీరులను చూచి ఆ పరమ పరాక్రమవంతుడు, ఆ పూజ్యుడు హనుమంతుడు "చూచినాను సీతాదేవిని!" అని ఒక్క మాటలో చెప్పినాడు.

(ముందుగా ఏం జరిగిందో చెప్పిన తరువాత వివరాలు చెప్పాలి. లేకపోతే వారిలో భరించలేని ఉత్కంఠ పెరుగుతుంది. శుభవార్త అయితే ముందు ఫలితం, తరువాత వివరాలు చెప్పాలి.

అశుభవార్త అయితే ముందు వివరాలు చెప్పాలి. అలా సంస్కార వంతులు ప్రవర్తిస్తారు. మంచి ఫలితముతో వస్తుంటే, ముందు ఫలితాన్ని ప్రకటించి ఆ తరువాత వివరాలు చెప్పాలి.)

అంతట వాలిపుత్రుని అంగదుని హనుమంతుడు తన చేతులతో పట్టుకొని, ఆ మహేంద్ర పర్వతం మీద రమణీయమైన వన ప్రదేశానికి తీసుకొని పోయినాడు. అక్కడ అంగదుని సరసన కూర్చొని, "ఓ వానర పుంగవులారా! లంకాపట్టణంలోని అశోక వనంలో సీతాదేవి రామదర్శనంకోసం ఉపవాసాలు చేస్తూ నలిగి చిక్కిపోయి వుంది. ఆ పరమ పతివ్రత తలంతా జడలు కట్టుకొని పోయి ఏకవేణీధారగా వుంది. దేహము నిండా మురికి పేరుకొని వుంది. ఆమెను భయంకరమైన రాక్షసాంగనలు కావలి కాస్తున్నారు. నేను ఆ జనకాత్మజను సీతాదేవిని చూచినాను" అని చెప్పినాడు. సీతాదేవిని నేను చూచినాననే అమృతోపమానమైన హనుమంతుని మాటలువిని వానరులందరూ పరమానందభరితులైనారు. ఆ మహాబలవంతులలో కొందరు ఆ వాక్యం వినీ వినడంతోనే సింహ నాదం చేశారు. కొందరు భలే భలే అని కేకలు వేస్తే, కొందరు ఆబోతులవలె రంకెలు వేశారు. కొందరు కిలకిల ధ్వనులు చేస్తే, కొందరు గర్జిస్తున్న వారికి బదులు గర్జిస్తున్నారు. సంతోషాతి శయంతో కొందరు తమ పొడుగాటి తోకలు నేలకువేసి కొట్టినారు. మరికొందరు పర్వత శిఖరాల మీదికి ఎక్కి, అక్కడి నుంచి క్రిందకు దూకి, మదపుటేనుగులా వున్న హనుమంతుని తాకి చూశారు.

సీతాదేవిని చూశానని చెప్పి అట్లా వానరుల మధ్య ఊరక కూర్చుని వున్న హనుమంతుడితో అంగదుడు "ఓ వానరుడా! నీవు

నూరు యోజనాల సముద్రాన్ని ఎగిరిపోయావు. మళ్ళీ వచ్చావు. బలానికిగాని, పరాక్రమానికి గాని నీ అంతవాడు మరొకడు లేడు. ఆహా! నీకున్న స్వామిభక్తి మరెవరికీ లేదు. నీది ఆశ్చర్యము వేసే పరాక్రమము. నీ ధైర్యము అంతకన్నా ఆశ్చర్యమైనది. మా భాగ్యవశం వల్ల నీవు ఆ యశస్వినిని, రామపత్నిని చూడగలిగి నావు. ఆ రామప్రభువు సీతావియోగ దుఃఖము లేకుండా హాయిగా వుంటాడు. ఇదంతా మన అదృష్టం" అన్నాడు. అప్పుడు వానరు లందరూ సముద్ర లంఘనాన్ని గురించి, లంకాపట్టణాన్ని గురించి, సీతాదేవిని గురించి, రావణాసురుని గురించి వినవలెనన్న కుతూహలంతో పరమ సంతోషంతో చేతులు జోడించి హను మంతుని చుట్టూ రాతిబండల మీద కూర్చున్నారు.

అప్పుడు ఆ వానరుల మధ్య హనుమంతుడి తోను, జాంబ వంతుడితోను కూర్చుని వున్న అంగదుడు దేవలోకంలో దేవతల మధ్యన దేవేంద్రుడివలె తేజరిల్లినాడు. జాంబవంతుడు ఎంతో సంతోషపడ్డాడు. అతని దేహం పులకరించింది. హనుమంతుని చూచి, "ఓ హనుమంతుడా! నీవు సీతాదేవిని ఎట్లా చూశావు? ఆమె అక్కడ ఎట్లా వుంటూ వుంది? ఆ క్రూరకర్ముడు రావణాసురుడు ఆమె విషయంలో ఎట్లా నడుచుకుంటున్నాడు? ఉన్నదున్నట్లు చెప్పు. నీవు చెప్పేదంతా విన్న తరువాత ఏమి చేయవలసిందీ నిశ్చయిద్దాం. మనము రాముడి దగ్గరకు పోయినప్పుడు ఏది చెప్పవలెనో, ఏది చెప్పకుండా దాచవలెనో నీవు బుద్ధిమంతుడవు కనుక ఇప్పుడే నిర్ణయించి అంతా వివరంగా చెప్పు" అన్నాడు.

(కొన్ని మాటలు చెబితే ఉత్సాహపడతారు. కొన్ని మాటలు

చెబితే నిరుత్సాహ పడతారు. ఎవరికి ఏది ఎక్కడ చెప్పాలో వారికి అది చెప్పాలి. అందరికీ అన్ని విషయాలు చెప్పకూడదు. కోతులకు తన పరాక్రమం గురించి చెప్పాడు. రాముడి దగ్గర సీతాదర్శనం, లంకా ధ్వంసం, రావణుడికి హెచ్చరిక చేయటం ఇటువంటి బాధ్యతాయుతమైన కార్యక్రమాలు చెబుతాడు. తన వీర్యము, తన ప్రతాపము గురించి రాముని ముందు చెప్పడు. తనకన్నా పెద్దవారి దగ్గర తన ప్రతాపం ఎవరూ చెప్పుకోరు. చెప్పుకుంటే మూర్ఖత్వం. ఎప్పుడు, ఎక్కడ, ఎవరితో, ఎలా, ఏం మాట్లాడాలో హనుమంతుని భాషణం ద్వారా తెలుస్తుంది.)

అట్లా జాంబవంతుడు ప్రశ్నించినందుకు హనుమంతుడు పులకాంకితుడై, మనసా సీతాదేవికి నమస్కారం చేసి, ఇట్లా చెప్ప సాగినాడు. "ఓ వానరయోధులారా! నేను సముద్రం దాటడానికి ఏకాగ్రచిత్తంతో ఈ మహేంద్ర పర్వత శిఖరం మీదినుంచి ఆకాశం లోకి ఎగరటం మీరందరూ చూశారు. నేనట్లా ఎగిరిపోతూ వుండగా రమణీయమైన కాంచన పర్వత శిఖరమొకటి సముద్రంలో నాకు అడ్డం వచ్చింది. అది నాకు విఘ్నం కలిగించడానికి వచ్చిందను కున్నాను. స్వర్ణమయమైన ఆ పర్వతాన్ని పగులగొట్టి అవతలికి పోవలెనని నాకు బుద్ధి పుట్టింది. అంతట నేను దానిని తోకతో కొట్టాను. అది వెయ్యి బీట లిచ్చింది. అప్పుడా పర్వతము నా పూనిక తెలుసుకొని మానవస్వరంతో మధురంగా 'ఓ బిడ్డా!' అని సంబోధించి నన్ను సంతోషపెట్టి, నేను నీ తండ్రి వాయుదేవుడి స్నేహితుడను. నేను నీకు తండ్రివంటి వాడను. నేను ఈ సముద్రంలో వుంటున్నాను. నా పేరు మైనాకుడు. పూర్వము

పర్వతాలన్నిటికి రెక్కలు వుంటూ వున్నవి. అందువల్ల యథేష్టంగా పర్వతాలు ఈ భూమిమీద తిరుగుతూ ప్రజలను బాధపెడుతూ వుండేవి. అట్లా పర్వతాలు చేస్తున్న దుశ్చేష్టలను పాకశాసనుడైన దేవేంద్రుడు చూచినాడు. అతడు తన వజ్రాయుధంతో పర్వతాల రెక్కలు నరికివేయడం మొదలుపెట్టినాడు. నాయనా! అప్పుడు నీ తండ్రి వాయుదేవుడు దేవేంద్రుడి వజ్రాయుధం దెబ్బ తప్పించ డానికి నన్ను ఈ సముద్రం లోనికి వేగంగా తన బలంతో తోసినాడు. అట్లా నీ తండ్రి నాకు మహోపకారం చేసినాడు. అందుకు నీకు నేను సహాయం చేయవలెనని అనుకుంటున్నాను. అంతేకాదు, రాముడు ఈ జగత్తులో పరమ ధార్మికుడు. దేవేంద్రుడితో సరిసమానమైన పరాక్రమవంతుడు. నేను అతనికి సహాయ పడవలెను. నీవు అతని దూతవు. కాబట్టి ఈ రెండు కారణముల వలన సహాయము చేయవలె ననుకొని నేను సముద్రంలో నుంచి పైకి లేచాను. ఓ హనుమంతుడా! నీవిప్పుడు ఇక్కడ అలసట తీర్చుకొని కొంచెంసేపు తరువాత బయలుదేర వచ్చును అని పర్వత రూపంలో వున్న మైనాకుడు చెప్పాడు. నేను ఆ మహాత్మునికి నా పని గురించి తెలియచెప్పి అంతట ప్రయాణానికి ఉద్యుక్తుడ నైనాను. అతడు అనుజ్ఞ నిచ్చి మానవ స్వరంతో మాట్లాడిన ఆ మహాపర్వతం సముద్రంలోకి అంతర్ధానమై పోయింది.

అంత నేను అమితవేగంతో ఆకాశమార్గాన ముందుకు సాగినాను. చాలా దూరము ప్రయాణం చేశాను. అప్పుడు సర్పమాత సురసాదేవి ఆ సముద్రంలో కనిపించింది. ఆ సురసా

దేవి ఆకాశమార్గాన పోతూవున్న నన్ను చూచి, ఓ వానరుడా! దేవతలు నిన్ను నాకు ఆహారంగా ఇచ్చినారు. నేను నిన్నిప్పుడు మ్రింగి వేస్తాను. నాకు బహుకాలానికి నీవు దొరికావు అంటూ నోరు తెరిచింది. నేను ఆ సురసాదేవికి నమస్కారం చేశాను. నా ముఖం వెలతెలా పోయింది. ఆ సురసాదేవిని చూచి “ఓ దేవీ! దశరథమహారాజు పుత్రుడు రాముడు తమ్ముడైన లక్ష్మణునితోను, భార్య అయిన సీతాదేవితోను దండకారణ్యానికి వచ్చినాడు. ఆ పరంతపుడి భార్య సీతాదేవిని దురాత్ముడు అపహరించుకొని పోయాడు. ఆ కాంతిమంతుడు రాముడు ఆజ్ఞాపించినందువల్ల నేను ఆయన దూతగా సీతాదేవి దగ్గరకు పోతున్నాను. ఓ దేవీ! నీవు రాముడి రాజ్యంలో నివసిస్తున్నావు కనుక నీవు రాముడికి సహాయం చేయవలెను. నేనిప్పుడు పోయి సీతాదేవిని చూచి తిరిగి వచ్చి, ఆ వృత్తాంతము రాముడికి చెప్పి, మళ్ళీ నీ దగ్గరకు వచ్చి, నీ నోటిలో పడతాను. యథార్థము చెబుతున్నాను. నేను ఒట్టు పెట్టుకుంటున్నాను. నీవు నన్ను సందేహించవద్దు” అని సురసా దేవితో చెప్పాను. నేను ఎన్ని విధాలుగా చెప్పినప్పటికీ ఆ కామరూపిణి తనను దాటి ముందుకు పోవడానికి వీలులేదని, అట్లా పోనీయకుండా చేయడానికి తనకు వరముందని నాకు చెప్పింది. నా దేహమప్పుడు పదియోజనాల వెడల్పుండటం చూచి, ఆ సర్పమాత పదిహేను యోజనాల వెడల్పున నోరు తెరిచింది. అట్లా ఆమె నోరు తెరవడం చూచి, నేను క్షణంలో అంగుష్ఠమాత్ర శరీరుణ్ణి అయి వెంటనే ఆ సురస నోట్లోకి పోయి ఉత్తర క్షణాన

మళ్ళీ బయటకి వచ్చాను. వెంటనే ఆ సురసాదేవి తన ఎప్పటి రూపము ధరించి, “ఓ వానరుడా! నీవు మంచివాడవు. సుఖంగా పో. నీకు కార్యసిద్ధి అవుతుంది. సీతాదేవిని రాముడి దగ్గరకు చేర్చు. నిన్ను చూస్తే నాకు సంతోషంగా వుంది. నీవెప్పుడూ సుఖముగా వుండవలెనని” చెప్పింది.

అప్పుడు సమస్త భూతకోటి నన్ను ప్రశంసించింది. నేను గరుత్మంతునివలె మళ్ళీ ఆకాశానికి ఎగిరినాను. అంతలో నా నీడను ఏదో పట్టుకుంది. నాకది ఏమిటో తెలియదు. నా వేగం సన్నగిల్లింది. నేను అంతట అన్ని దిక్కులా చూశాను. నా వేగాన్ని ఏది అడ్డగించిందో అది నాకంటికి కనబడలేదు. అటువంటి విఘ్నము ఆకాశంలో వచ్చిందే అనుకొని దిగులుపడ్డాను. క్రింద జలాలవైపు చూచినాను. ఆ జలాలలో పడుకొనివున్న ఒక రాక్షసాంగనను, భయంకరాకారను చూశాను. ఆ రాక్షసాంగన నన్ను చూచి పెద్దపెట్టున అరుస్తూ, వికటంగా నవ్వుతూ ఏ విధమైన తొట్రుపాటు లేకుండా అమంగళంగా, “ఓ మహాకాయుడా! నీవెక్కడికి పోతున్నావు? నాకిప్పుడు ఆకలి వేస్తున్నది. ఆహారం కావలెను. బహుకాలము నుండి ఆహారం లేకుండా వున్నాను. నీవు నాకు ఆహారమై, నన్ను సంతోష పెట్టవలెను అన్నది. నేను ఆ రాక్షసిని చూసి మంచిదే అని, ఆ రాక్షసి కన్నా దేహాన్ని పెంచినాను. ఆ రాక్షసి కూడా నన్ను మ్రింగివేయడానికి నా దేహం కన్నా ఎక్కువగాను, భయంకరంగాను నోరు తెరిచింది. నేను కామ రూపుడనని కానీ, కావలెనని అట్లా వికృతరూపం ధరించినానని

కానీ ఆ రాక్షసి తెలుసుకోలేక పోయింది. అంతట క్షణలేశంలో నేను నా దేహాన్ని కుంచించి, రాక్షసాంగన నోట్లోకి పోయి, దాని గుండెకాయ ఊడబీకి పైకి వచ్చి, ఆకాశంలోకి ఎగిరాను. నేను దాని గుండెకాయ పీకివేయగానే ఆ రాక్షసాంగన చేతులు వ్రేళ్ళాడ వేసి భయంకరాకారంతో సముద్రంలో పడిపోయింది. అప్పుడు ఆకాశంలో సంచారము చేస్తున్న సిద్ధులు, చారణులు నన్ను చూచి, క్షణమాత్రంలో సింహికను చంపివేసినాడు అని ప్రశంసించడం నేను విన్నాను. అట్లా నేను ఆ సింహికను చంపివేసి, ఆఘాయిత్యపు పనిచేసినందుకు నన్ను నేను మెచ్చుకుంటూ, ఆకాశాన బహుదూరం ప్రయాణం చేశాను.

ఆ సముద్రము దక్షిణ తీరాన వున్న నానావిధ వృక్షాలు, లంకా పట్టణము నాకు కనిపించినవి. సూర్యుడు అస్తమించిన తరువాత రాక్షసులెవరికీ తెలియకుండా నేను ఆ లంకాపట్టణం లోకి పోయినాను. ఆ లంకాపట్టణంలో వున్న రాక్షసులందరూ భయంకర పరాక్రములు. నేను ఆ పట్టణంలోకి పోబోతుండగా ప్రళయకాల మేఘం వంటి ఆకారంతో ఒకానొక రాక్షసాంగన పెద్ద పెట్టున నవ్వుతూ నా ఎట్టఎదుట నిలుచుంది. భగభగ మండు తున్న అగ్నిహోత్రము వంటి తలవెంట్రుకలతో ఆ భయంకరాకార నన్ను చంపివేయడానికి నా మీదికి వచ్చింది. నేను ఆ రాక్షసిని నా ఎడమచేతి పిడికిటితో పొడిచినాను. దానిని జయించినాను. ఆ రాక్షసి నన్ను చూచి భయపడి, “ఓ వీరుడా! నేను లంకాపుర అధిదేవతను. నీవు నీ పరాక్రమంతో నన్ను జయించినావు. ఇక ఈ

లంకాపట్టణంలో సమస్త రాక్షసులను నీవు జయించగలవని" నాతో చెప్పింది.

నేను ఆ రాత్రంతా ఆ లంకాప్టణంలో సీతాదేవి కోసం వెదకినాను. రావణాసురుని అంతఃపురములోకి పోయినాను. ఆ సుమధ్యమ సీతాదేవి నాకు అక్కడ కనిపించలేదు. నేను దిగులుపడి అన్నివైపులా చూస్తూ వుండగా, చాలా ఎత్తైన ప్రాకారాలతో రావణాసురుని గృహోద్యానం కనిపించింది. నేను దాని ప్రాకారము మీదినుంచి ఎన్నో వృక్షాలున్న ఆ ఉద్యానవనంలోకి పోయినాను. ఆ అశోకవన మధ్యంలో ఒక పెద్ద ఇరుగుడు చెట్టు వుంది. నేను ఆ చెట్టు ఎక్కినాను. అక్కడినుంచి నేను ఒక బంగారు అరటితోటను చూచినాను. అక్కడ శింశుపా వృక్షం క్రింద ఆ వరవర్ణిని సీతా దేవిని చూశాను. ఆమె యౌవన మధ్యస్థ. ఆమె కనులు కమల పత్రాల మాదిరిగా వున్నాయి. ఉపవాసాలతో కృశించిపోయింది. ఒకే వస్త్రం దేహానికంతటికీ చుట్టుకొని వుంది. తలంతా దుమ్ము కొట్టుకొనిపోయింది. మనోవ్యథ, దేహతాపం వల్ల ఆమె అవయవా లన్నీ వాడిపోయి వున్నాయి. మాంసము తింటూ, నెత్తురు త్రాగు తున్న రాక్షసాంగనలు ఆమెచుట్టూ కావలియున్నారు. వాళ్ళందరూ వికృతాకారులు.

పెద్ద పులుల మధ్యనున్న లేడివలె వాళ్ళందరి మధ్య సీతా దేవి వుంది. ఆ రాక్షసాంగనలు ఆమెను మాటిమాటికీ బెదిరిస్తూ వున్నారు. ఆమె తలవెంట్రుకలన్నీ ఒకేఒక జడకట్టుకొని పోయినాయి. ఆమె నిరంతరము తన భర్తను గురించి ధ్యానం చేస్తూ వుంది. ఎప్పుడూ కటిక నేలమీద పడుకోవటం నుంచి ఆమె

దేహం వివర్ణమై పోయింది. హేమంతకాలంలోని కమలం వలె కనిపించింది. రావణాసురునికి మనసివ్వనందు వల్ల, నిర్బంధం వల్ల ఆమె చచ్చిపోవడానికి నిశ్చయించుకున్నది. అలా వున్న ఆ మృగశాబాక్షిని నేను చూచినాను.

ఆ యశస్వినిని చూస్తూ నేను ఆ శింశుపావృక్షం మీద కూర్చున్నాను. అప్పుడు రావణాసురుని భవనంలో చీర ఒరవళ్ళ, అందెల చప్పుళ్ళు మహాగంభీరంగా గలగలలు వినిపించాయి. నేను చాలా భయపడిపోయాను. నా దేహాన్ని మరింత చిన్నగా చేసుకొని ఒక చిన్న పిట్టవలె ఆకులమధ్య కూర్చున్నాను. అప్పుడా మహాబలవంతుడు రావణాసురుడు భార్యలందరితోను సీతాదేవి వున్నచోటికి వచ్చినాడు. ఆ వరారోహ సీతాదేవి రావణాసురుని చూచింది. తన ఊరువులు ముడుచుకొని స్తనాలు కనబడకుండా చేతులు కట్టుకొని కూర్చున్నది. ఆమె చాలా భయపడిపోయింది. దిగులు పడిపోయి అన్ని దిక్కులా చూడసాగింది. కాపాడే దిక్కులేక గడగడా వణకిపోయింది. పరమ దుఃఖములో మునిగిపోయింది. అట్లావున్న ఆ సీతాదేవిని రావణాసురుడు చూచి, “తలవంచి నమస్కారం చేసి నన్ను గౌరవించు. అన్ని భోగాలూ అనుభవించు. నాతో హాయిగా రమించు. ఓ సీతా! నీవు చాలా గర్వంతో వున్నావు. అందువలన నీవు నన్ను గౌరవించకుండా వున్నావు. నీకు రెండు నెలలు గడువిస్తున్నాను. గడువు కాలము లోపల నీవు నన్ను గౌరవించక పోయినట్లైతే నీ నెత్తురు త్రాగుతాను” అని చెప్పినాడు.

ఆ దుర్మార్గుడు రావణుడు అన్న మాటలు విన్న సీతాదేవి పరమ కోపంతో ఓ రాక్షసుడా! నీవు రాక్షసులలో అధముడవు. నేను

అద్భుత తేజోవంతుడైన రాముని భార్యను. దశరథ మహారాజు కోడలిని. నీవు దుష్టుడవు. నా భర్త లేనప్పుడు, ఆయన కళ్ళబడ కుండా నీవు నన్ను అపహరించుకొని వచ్చినావు. నీవు పరాక్రమ హీనుడవు. ఆ రామప్రభువుకు, నీకు ఏ పోలికా లేదు. అంతేకాదు. ఆయనకు దాసుడిగా వుండటానికి కూడా నీకు అర్హత లేదు. ఆయన యజ్వ, సత్యవాది అని చెప్పింది. ఇట్లా అంత పరుషంగా సీతాదేవి అన్న మాటలు రావణాసురుడు విన్నాడు. చితిలో అగ్నిహోత్రమువలె కోపంతో మండిపడిపోతూ, రెండు కళ్ళూ తెరిచి ఆమెను చూచినాడు. కుడి పిడికిలితో సీతాదేవిని కొట్టి చంపివేయ బోయినాడు. అప్పుడు స్త్రీలందరూ హాహాకారాలు చేసినారు. ఇంతలో ధ్యానమాలిని అనే రాక్షసాంగన ఆ స్త్రీల మధ్యనుంచి వచ్చి, ఆ పని చేయకుండా అతనిని నిషేధించింది. మదనతాపంతో కొట్టుకులాడుతున్న ఆ రావణాసురుడితో మధురంగా "ప్రభూ! నీవు దేవేంద్రునితో సరిసమానమైన పరాక్రమవంతుడవు. నీకు ఈమెతో ఏమి పని? దేవ, గంధర్వ, యక్ష కన్యలెందరో వున్నారు. వారితో క్రీడించు. ఈ సీతతో ఎందుకు?" అని చెప్పింది. అంతట ఆ స్త్రీలందరూ ఆ నిశాచర రాజుని ప్రసన్నుడిని చేసి, అతనిని భవనానికి పంపించారు.

అట్లా దశగ్రీవుడు వెళ్ళిపోగానే వికృతాననలు రాక్షసాంగనలు అతి పౌరుషము, పరమ దారుణము అయిన మాటలతో సీతాదేవిని బెదిరించినారు. సీతాదేవి వారి మాటలను ఒక గడ్డిపోచగా లెక్కవేసింది. వాళ్ళ గర్జనలు ఆమె దగ్గర నిరర్ధకం అయ్యాయి. అప్పుడా రాక్షసాంగనలకు ఏం చెయ్యాలో తోచలేదు. రావణా

సురుడి దగ్గరకి పోయినారు. సీతాదేవి నిశ్చయము చెప్పినారు. సీతాదేవిని వశపరచుకోవలెను అన్న ఆ రాక్షస స్త్రీల ఆశ నిరాశ అయిపోయింది. అంతట వాళ్ళు ఆ ప్రయత్నం మానుకున్నారు. ఆమె చుట్టూ చేరి నిద్రపోయినారు. ఆ రాక్షసాంగనలు అట్లా నిద్రపోయిన తరువాత ఆ మహాపతివ్రత సీతాదేవి పరమ దుఃఖంతో ఏడువసాగింది.

అప్పుడా రాక్షస స్త్రీల మధ్య పడుకొనివున్న త్రిజట అనే రాక్షసాంగన నిద్రలేచి తక్కిన వాళ్ళందరినీ నిద్రలేపి, మీరు సీతాదేవిని చంపి తినవద్దు. నన్ను తినండి. మీరేమి చేసినా ఈమె మాత్రం నాశనం అయిపోదు. ఈమెను మీరు చంపినా చచ్చిపోదు. నాకు ఒళ్ళు గగుర్పొడిచే భయంకరమైన ఒక కల వచ్చింది. రాక్షసుల నాశాన్ని, ఈమె భర్త రాముడి జయాన్ని ఆ కల సూచించింది. మనలను రాముడు చంపివేయకుండా కాపాడే సామర్థ్యం ఈ సీతాదేవి ఒక్కత్తికే వుంది. కాబట్టి, మనం ఈ వైదేహిని ప్రార్థించవలెను. ఈమెను ప్రార్థించటం ఎంతో మంచిది. ఇంత దుఃఖములో వున్న ఈమెను గురించి నాకు ఆ కల వచ్చింది. కాబట్టి ఈమె సమస్త సుఖాలు అనుభవిస్తుంది. మనం ఎన్ని అపరాధాలు చేసినప్పటికీ నమస్కారం చేసి ప్రార్థించినట్లైతే సీతా దేవి ప్రసన్నురాలౌతుంది అంటూ చెప్పింది.

అప్పుడు సీతాదేవి ఆ మాటలు విని తన భర్త జయిస్తాడని విని సంతోషపడి, రాక్షసాంగనలను చూచి సిగ్గుపడుతూ, ఓ రాక్షసాంగనలారా! ఈ త్రిజట చెప్పింది నిజమయ్యేటట్లైతే, మిమ్ములను నేను తప్పకుండా కాపాడుతాను అన్నది. నేను

సీతాదేవి దుర్దశను చూచి దుఃఖాక్రాంతుడ నయినాను. నా మనసు మహావ్యథ పడిపోయింది. నేను ఆమెతో మాట్లాడే ఉపాయం ఆలోచించసాగినాను. నాకు ఒక ఉపాయం తోచింది. అంతట ఇక్ష్వాకు వంశాన్ని వర్ణించడం మొదలుపెట్టాను. నేను చెప్పిన దంతా విన్నది. కన్నీళ్ళు కారుస్తూ ఆమె నన్ను చూచి, “ఓ వానర పుంగవా! నీవెవరవు? ఎందుకు ఇక్కడకు వచ్చావు? సముద్రాన్ని ఎట్లా దాటినావు? ఆ రామప్రభువుకు, నీకు స్నేహం ఎట్లా అయిందో చెప్పు” అన్నది.

నేను ఓ దేవీ! రామప్రభువుకు సుగ్రీవునితో స్నేహమైంది. అతడు వానరరాజు, భయంకర పరాక్రమవంతుడు, మహాబల వంతుడు. నేను ఆ సుగ్రీవుని భృత్యుణ్ణి. నా పేరు హనుమంతుడు. ఎటువంటి కష్ట కార్యాన్నైనా ఇట్టే చేసే రామప్రభువు నన్ను నీకోసం ఇక్కడికి పంపించినాడు. ఓ యశస్వినీ! ఆ పురుషోత్తముడు, ఆ ధీమంతుడు, దశరథ మహారాజు పుత్రుడు ఈ ముద్దు టుంగరాన్ని గుర్తుగా నీకు ఇవ్వవలసిందిగా నాకు ఇచ్చాడు అని చెప్పి ఉంగరాన్ని ఆమెకిచ్చి, దేవీ! నీవు నన్ను ఆజ్ఞాపించు. నన్నేమి చేయమంటే, అది చేస్తాను. నిన్ను రామలక్ష్మణుల దగ్గరకు తీసుకొని పొమ్మన్నట్లైతే తీసుకొనిపోతాను అని నేను చెప్పినాను.

ఆ జనకనందిని సీతాదేవి ఆలోచించి, రామప్రభువే రావణుని సంహారం చేసి నన్ను తీసుకొని పోవలెనని చెప్పింది. అంతట నేను ఆ పూజ్యురాలికి నమస్కారం చేసి, రామప్రభువు సంతోషించేందుకు ఏదైనా ఒక గురుతు ఇమ్మని ఆమెను ప్రార్థించినాను. అప్పుడామె రత్నాలు పొదిగిన చూడామణిని ఇచ్చి,

హనుమంతుడా! దీనిని తీసుకో. ఈ చూడామణిని చూచి ఆ రామప్రభువు నిన్ను మెచ్చుకుంటాడు అని చెప్పింది. ఆమె అప్పుడు మరొక వృత్తాంతాన్ని కూడా గుర్తుగా చెప్పింది. నేను అంతట తిరిగి రావలె ననుకున్నాను. ఆమెకు ప్రదక్షిణ నమస్కారాలు చేశాను. ఆమె ఆలోచిస్తూ నన్ను చూచి, ఓ హనుమంతుడా! నా కష్టాలన్నీ ఆ రామప్రభువుకు చెప్పవలెను. నా వృత్తాంతం వినగానే ఆ రామలక్ష్మణు లిద్దరూ సుగ్రీవునితో కూడా వెంటనే ఇక్కడికి వచ్చే ఏర్పాటు నీవు చేయవలెను. అట్లా జరగకపోతే నేను రామప్రభువుకు కనబడతానో, కనబడనో చెప్పలేను. నేను ఇక జీవించి వుండేది రెండు మాసాలే. ఆ తరువాత నేను నాథుడు లేనిదానివలె చచ్చిపోతాను. ఈ సంగతంతా ఆయనతో చెప్పు అని నాతో చెప్పింది.

ఇట్లా జాలివేసేటట్లు ఆమె చెప్పిన మాటలు నేను విన్నాను. నాకు పట్టరాని కోపం వచ్చింది. ఆలోచించాను. ఆపైన చేయ వలసిన పనిని నిశ్చయించినాను. అంతట నా దేహాన్ని పర్వత మంత ఎత్తున పెంచాను. రావణాసురునికి కోపం తెప్పించి, వాడితో యుద్ధము చేయవలెనని అనుకున్నాను. అప్పుడా అశోక వనాన్నంతా నాశనం చేసివేసినాను. నేను ఆ వనాన్ని విరిచేస్తూ వుంటే, ఆ మహాధ్వనికి అప్పుడక్కడ బెదిరిపోయి పరుగులెత్తుతున్న మృగపక్షి సమూహాల భయంకర ధ్వనులకు అక్కడున్న వికృతాననలు రాక్షసాంగనలు నిద్రలేచినారు. అట్లా విరిగిపోయిన అశోకవనాన్ని, పర్వతాకారంలో వున్న నన్ను చూచి, వాళ్ళందరూ వెంటనే రావణాసురుని దగ్గరకు పరుగెత్తుకొనిపోయి, జరిగిన

దంతా చెప్పినారు. అప్పుడు రావణాసురుడు నామీదకు కింకరులనే రాక్షసులను పంపించినాడు. ఒక ఇనుపగుదియతో నేను వాళ్ళందరినీ చంపివేశాను. అప్పుడు నాకొక బుద్ధి పుట్టింది. అక్కడున్న చైత్యప్రాసాదం మీదికి ఎగిరినాను. లంకాపట్టణ మంతటికీ అలంకారంగా వున్న ఆ చైత్యప్రాసాదాన్ని ధ్వంసం చేసివేసినాను. అక్కడున్న ఒక స్తంభాన్ని ఊడబెరికి దానితో నూరుగురు రాక్షసులను చంపాను.

అప్పుడు రావణాసురుడు ప్రహస్తుడి పుత్రుడు జంబుమాలిని నామీదకు పంపినాడు. వాడు భయంకరాకారులైన రాక్షసులను వెంటబెట్టుకొని నామీదకు వచ్చాడు. వాడు ఆ జంబుమాలి మహా బలవంతుడు, రణకోవిదుడు. నేను వాడిని, వాడి వెంటవచ్చిన రాక్షసులందరినీ పరమ భయంకరమైన ఇనుపగుదియతో కొట్టి చంపివేసినాను. ఆ జంబుమాలిని చంపివేయటం విని రావణా సురుడు నామీదికి మంత్రిపుత్రులను పంపించినాడు. వాళ్ళు మహా బలవంతులు. పదాతి సైన్యాలతో వచ్చి నామీద పడ్డారు. నేను ఆ మంత్రి పుత్రులను, తక్కిన వాళ్ళను ఇనుప గుదియలతోనే యమసదనానికి పంపించి వేశాను. అంతట రావణాసురుడు తన సేనానాయకులను నామీదకు పంపించినాడు. నేను వాళ్ళను కూడా నాశనం చేసివేశాను. అప్పుడు రావణుడు తన కొడుకు అక్షకుమారుని, గొప్ప రాక్షస సైన్యంతో నామీదకు పంపించినాడు. ఆ అక్షకుమారుడు మండోదరి పుత్రుడు. అయితే రణపండితుడు. తటాలున ఆకాశానికి ఎగిరి, నన్ను కొట్టబోయినాడు. నేను వాడి రెండు పాదాలు పట్టుకొని గిరగిరా త్రిప్పి, నేలమీదకు విసిరి

వేసినాను. వాడు చేతులు, కాళ్ళు విరిగి చచ్చిపోయాడు. అక్ష కుమారుడు చచ్చిపోయాడని తెలియగానే రావణాసురుడికి చెడ్డ కోపం వచ్చింది. మహాబలవంతుడు, యుద్ధోన్మత్తుడు అయిన ఇంద్రజిత్తు అనే తన కుమారుని నామీదికి పంపించాడు. నేను ఆ ఇంద్రజిత్తుతో వచ్చిన సైన్యాన్నంతా సంహారము చేసివేసినాను. అప్పుడు నేనెంతో సంతోషపడ్డాను. ఆ ఇంద్రజిత్తు తన సైన్య మంతా నాశనమైపోవడం చూచి, నేను అజేయుడ నని తెలుసుకొని అమితవేగంతో నామీద బ్రహ్మాస్త్రం వేసి, నన్ను బంధించినాడు. అప్పుడు రాక్షసు లందరూ వచ్చి నన్ను పగ్గాలతో కట్టివేసినారు. రావణాసురుడి దగ్గరకు నన్ను తీసుకొని పోయారు. ఆ దురాత్ముడు నన్ను చూచి, నీవు లంకకు ఎందుకు వచ్చినావు? రాక్షసులందరినీ ఎందుకు చంపినావు? అని అడిగినాడు. సీతాదేవికోసం నేనట్లా చేశానని వాడితో చెప్పాను.

"ఓ రాక్షసరాజా! నేను సీతాదేవిని చూడవలెననుకొని ఈ లంకాపట్టణము వచ్చాను. నేను వాయుదేవుని కుమారుడిని. నా పేరు హనుమంతుడు. నేను సుగ్రీవుడి అమాత్యుడను. రామ దూతను. రామసందేశం తెలియచెప్పటానికి నేనిక్కడికి దూతగా వచ్చినాను. మహా తేజోవంతుడు సుగ్రీవుడు నీ క్షేమం విచారించ మన్నాడు. ధర్మార్థ కామ సహితమైన హితవాక్యము నీతో చెప్ప మన్నాడు. ఋష్యమూక పర్వతం మీద వుండగా, నాకు రణ విశారదుడు రామునికీ స్నేహమైంది. అతడు తన భార్యను రాక్షసు డొకడు అపహరించినాడని, వాడిని సంహారము చేసి తన భార్యను తెచ్చుకోవడానికి సమస్త విధాలా సహాయం చేయవలసిందని నన్ను

కోరినాడు. నేను ఆ రామునితో నాకు, వాలికి వున్న విరోధము చెప్పాను. వాలిని చంపుతానని రాముడు ప్రతిజ్ఞ చేసినాడు. అగ్నిసాక్షిగా ఆ మహాప్రభువు రాముడు నాతో స్నేహం చేశాడు. అంతట అతడు వాలిని ఒక్క బాణంతో సంహారం చేసి, నాకు వానరరాజ్యం ఇప్పించినాడు. అందువలన నేను అవశ్యము రాముడికి సహాయం చేయడం కోసం ధర్మాన్ని అనుసరించి ఈ హనుమంతుని నీ దగ్గరికి దూతగా పంపించినాను. నీవు వెంటనే సీతాదేవిని రాముడికి ఇచ్చివేయవలసింది. అట్లా నీవు చేయకపోతే వానర వీరులందరూ నీ పట్టణాన్ని ముట్టడించి నీ సైన్యాన్ని నాశనం చేసి నిన్ను చంపివేస్తారు. ఇదివరకు వానరులు, దేవతలకు సహాయం చేసి యుద్ధంలో జయము సంపాదించి పెట్టినారు. వానర వీరుల ప్రభావము తెలియని వాడెవడూ లేడు. నీకూ వానరుల గురించి తెలుసును. ఈ విషయం నీతో చెప్పమని ఈ విధంగా వానరరాజు సుగ్రీవుడు నన్నిక్కడికి పంపించాడని నేను చెప్పినాను.

రావణాసురుడు కృద్ధుడైపోయాడు. కన్నులు జ్యోతులై పోయాయి. ఆ రుద్రకర్ముడు నన్ను దహించివేసేలా చూస్తూ, నా ప్రభావము తెలియక నన్ను చంపివేయవలసిందని ఆజ్ఞాపించి నాడు. అప్పుడు అతని తమ్ముడు విభీషణుడనే వాడు నన్ను చంపకూడదని చెప్పినాడు. ఆ విభీషణుడు మహా బుద్ధిమంతుడు. దూతను ఎంతమాత్రమూ చంపకూడదు. వదలి పెట్టవలసిందని, దూతను చంపివేయడం రాజధర్మానికి విరుద్ధమని, అట్లా చెయ్యకూడదని చెప్పినాడు. అంతేకాదు హితము చెప్పిన దూత, తన

ప్రభువు చెప్పిన మాటలనే చెబుతాడు. ఓ అన్నా! నీవు అతుల పరాక్రమవంతుడవు. దూత ఎటువంటి అపరాధము చేసినప్పటికీ చంపకూడదు అని శాస్త్రాలు చెబుతున్నవి. నీవు వీడిని చంపవద్దు. వికృత రూపుని చేసి పంపించి వేయవచ్చును అని చెప్పినాడు.

ఇట్లా విభీషణుడు చెప్పిన మాటలు విని రావణాసురుడు, నా తోకకు నిప్పు ముట్టించి కాల్చివేయవలసిందని ఆజ్ఞాపించి నాడు. అంతట రాక్షసులు జనపనార వస్త్రాలు, చిరిగిపోయిన గుడ్డపీలికలు నా తోకకు చుట్టి నూనెతో తడిపినారు. నన్ను పగ్గాలతో కట్టివేసి కట్టెలతో కొడుతూ, పిడికిళ్ళతో పొడుస్తూ నా తోకకు నిప్పు ముట్టించినారు. అంతట నన్ను ఆ రాక్షస శూరులు లంకాపట్టణ ద్వారము దగ్గరకు తీసుకొనిపోతూ రాజవీధిలో అందరికీ నా గురించి తెలిసేటట్లు చాటించినారు. నాకు అప్పుడు కోపం వచ్చింది. నా మహదాకారాన్ని కుంచించాను. కట్టివేసిన తాళ్ళన్నీ కుప్పకూలినాయి. మళ్ళీ పర్వతాకారం ధరించాను. ఆ పట్టణ ద్వారానికి అమర్చిన ఇనుప గుదియలను ఊడబీకి రాక్షసు లందరినీ చంపివేశాను. అమిత వేగంతో ఆ పట్టణ ద్వారం మీదకు ఎగిరాను. ప్రళయ కాలాగ్ని హోత్రము ప్రజలను దహించివేసేట్లుగా నేను నిర్భయంగా లంకాపట్టణ బహిర్ద్వారాలకు, కోట బురుజులకు, వివిధ గృహాలకు మండుతున్న నా తోకతో నిప్పంటించాను. లంకా పట్టణమంతా తగులబడిపోయింది. నేనప్పుడు సీతాదేవి కూడా దగ్ధమై పోయిందేమోనని దిగులుపడ్డాను. రామకార్యమంతా వ్యర్థమై పోయిందేమోనని భయపడ్డాను. అయితే ఆకాశంలో తిరుగుతున్న చారణులు 'సీతాదేవి తగులబడిపోలేదు. ఆశ్చర్యం'

అని చెప్పుకుంటున్న మంగళకరమైన మాటలు విన్నాను. సీతాదేవి చెక్కుచెదరకుండా వుందని విని సంతోషపడ్డాను. తోక మండుతూ వున్నప్పటికీ ఆ మంటలు నన్ను ఏ మాత్రమూ దహించలేదు. అప్పుడు నాకు అనేక శుభనిమిత్తాలు తోచినవి. నేనంతట మళ్ళీ సీతాదేవి దగ్గరకు పోయి ఆమెను మళ్ళీ చూశాను. ఆమె అనుజ్ఞ తీసుకొని అక్కడి నుంచి అరిష్ట పర్వతం మీదికి వచ్చాను. సముద్రం దాటి మిమ్ములను చూస్తున్నాను. ఆ రామప్రభువు ప్రభావం వల్లను, మీ అందరి అనుగ్రహం వల్లను మన ఏలిక సుగ్రీవుడు పంపించిన పని చేయగలిగాను. ఇక ఇప్పుడు ఏమి చేయవలసిందీ మీరు ఆలోచించవలెను" అని హనుమంతుడు చెప్పినాడు.

ఆ మారుతాత్మజుడు హనుమంతుడు మళ్ళీ ఇలా చెప్పటం మొదలు పెట్టినాడు. "సీతాదేవి మహా పతివ్రత. రాముడి ప్రయత్నము, సుగ్రీవుని తహతహ సఫలమవుతాయి. ఆమె మీద ఎంతో భక్తితో వున్నాను. రావణాసురుడు తపోబల సంపన్నుడు. వాడు ఆ తపో బలంతో సమస్త లోకాలను దహించి వేయగలడు. ఆ తపో బలంతోనే సీతాదేవిని తాకినప్పటికీ వాడు నాశనం అయిపోలేదు. ఇంతవరకు జరిగినదంతా చెప్పాను.

ఓ వానరులారా! జాంబవంతుడు, మీరు ఒప్పుకునే టట్లయితే, మనం లంకాపట్టణానికి పోయి ఆ వైదేహిని తీసుకొని రామలక్ష్మణుల దగ్గరకు పోదాం. అట్లా చేస్తేనే బాగుంటుందని నాకు తోస్తూవుంది. నేనొక్కడినే ఆ లంకాపట్టణంలో గల రాక్షసు లందరినీ, మహా బలవంతుడైన రావణుని ఇట్టే చంపివేయగలను. ఇక పరాక్రమవంతులు, బుద్ధిమంతులు, బలవంతులు, శాస్త్ర

విదులు, శూరులు అయిన మీరందరూ నావెంట వచ్చేటట్లేయితే వేరే చెప్పవలసిన పనేలేదు. నేనొక్కడినే ఆ రావణాసురుని సైన్యాలను, వాడి అనుచరులను, వాడి కొడుకులను, వాడిని యుద్ధంలో సంహారము చేస్తాను. ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్ని కానీ, ఐంద్రాస్త్రాన్ని గానీ, వాయువ్యాస్త్రాన్ని గానీ, వారుణాస్త్రాన్ని గానీ ప్రయోగించినప్పటికీ వాటినన్నిటినీ కొట్టివేసి, నేను రాక్షసు లందరినీ నాశనం చేయగలను. మీరు అనుజ్ఞ ఇచ్చినట్లయితే ఆ ఇంద్రజిత్తును నేనే జయిస్తాను. ఎడతెగకుండా నేను కురిపించే రాళ్ళవానకు అమృతపానం చేసిన దేవతలైనా ప్రాణం వదల వలసిందే.

ఇక రాక్షసుల గురించి చెప్పవలసిన పనేలేదు. ఒకవేళ సముద్రము చెలియలి కట్టను దాటితే దాటవచ్చును. మంథర పర్వతము చలిస్తే చలించవచ్చును. కానీ జాంబవంతుని ఏ శత్రు సైన్యాలూ ఏ మాత్రమూ కదిలించలేవు. రాక్షస సైన్యాలన్నిటినీ అంగదుడొక్కడే సంహారము చేయగలడు. అతడంతటి పరాక్రమ వంతుడు. మహా బలవంతులైన పవన వీరుల ఊరువుల వేగానికి మంథర పర్వతమైనా పగిలిపోక తప్పదు. ఇక్కడివారు రాక్షసులను ముక్కలు ముక్కలు చేయగలరు. అది నేను చెప్పవలెనా? దేవతలలో గానీ, అసురులలో గానీ, గంధర్వులలో గానీ, ఉరగులలో గానీ, పతగులలో గానీ మైంద ద్వివిదులతో పోరాడ గలవాడు ఒక్కడు కూడా లేడు. వారు అశ్వినీ దేవతల పుత్రులు. మహాభాగులు. రణరంగములో వారితో పోరాడగలిగిన వారి నెవరినీ నేనింతవరకూ చూడలేదు.

మైంద ద్వివిదులు ఇద్దరూ బ్రహ్మదేవుడి వరము వల్ల పరమ దర్పముతో పోరాడగలరు. వారిద్దరూ అమృతపానం చేసినవారు. పూర్వం బ్రహ్మదేవుడు మైంద ద్వివిదులను గౌరవించటానికోసం వీళ్ళెవరి చేతుల్లోనూ చావకుండా వరం ఇచ్చినాడు. ఆ వర ప్రభావం నుంచి ఆ మైంద ద్వివిదులు పరాక్రమించి, దేవతలను చీల్చి చెండాడి అమృతపానం చేశారు. అందువల్ల ఈ మైంద ద్వివిదు లిద్దరూ కుపితులైతే లంకాపట్టణమంతా గుఱ్ఱాలతోను, ఏనుగులతోను, రథాలతోను నాశనం చేసివేస్తారు. నేనే లంకా పట్టణమంతా దగ్ధం చేసి, రాజవీధులలో నా పేరు చాటించు కున్నాను. అధిక బలవంతుడైన, మహా బలవంతుడైన లక్ష్మణుడు, రాముడు కాపాడిన వానరరాజు సుగ్రీవుడు రాక్షసులను జయిస్తారని, నేను ఆ రామప్రభువు దాసుడనని, వాయుపుత్రుడనని హను మంతుడు ప్రకటించుకున్నాడు.

ఓ వానరులారా! ఆ మహా పతివ్రత దురాత్ముడైన రావణా సురుడి అశోకవనంలో శింశుపావృక్షము క్రింద కాలం గడుపు తున్నది. ఆమెను రాక్షసస్త్రీలు కావలి కాస్తున్నారు. ఆమె దుఃఖంతో బాధపడుతూ మేఘాలు కమ్ముకున్న చంద్రరేఖ మాదిరిగా కళా కాంతులు లేకుండా వుంది. బలగర్వితుడైన రావణాసురుని ఆమె మనసులోనైనా లెక్కచెయ్యలేదు. నిరంతరం రాముని ధ్యానిస్తూనే వుంది. ఆమెను తలచుకుంటే నాకు జాలివేస్తుంది. ఆ సుశ్రోణిని, ఆ మహాపతివ్రతను రావణాసురుడు ఇట్లా ఎంత నిర్బంధించి నప్పటికీ, నహుషుడు ఎంత నిర్బంధించినప్పటికీ అనన్య చిత్తంతో ఆ పురుందరుని ధ్యానించిన శచీదేవివలె, ఆ వైదేహి సర్వాత్మనా

రాముడినే ధ్యానిస్తూ వున్నది. ఆనాడు ఏ చీర కట్టుకున్నదో, ఆ చీరతోనే నేటికినీ వుంది. దుమ్ము కొట్టుకొని, మనోవ్యథతో దీనురాలై భర్త కొరకు ఎదురుచూస్తూ వుంది.

రావణాసురుడు అంతటి మహాపరాధం చేసినప్పటికీ సీతా దేవి తన పాతివ్రత్య ప్రభావంతో వాడిని నాశనము చేయలేదు. ఆమెను నిర్బంధించడం వలన, ఆ రావణాసురుడి తపోబలం అంతా నశించిపోయింది. ఆమె పాతివ్రత్య మహిమ ఆ రావణాసురుని నాశనం చేయడానికి ఎవరికైనా ఉపయోగిస్తుంది. రాముడు వచ్చి రావణాసురుని చంపడం నిమిత్తమాత్రం. ఆ సీతాదేవి సహజంగా సన్నటిది. రామవియోగంలో మరింత కృశించి సన్నబడిపోయింది. పాడ్యమినాడు చదివినవాడి చదువువలె ఆమె సన్నగిల్లిపోయింది. ఆ మహాభాగ ఇప్పుడు శోకపరాయణగా వుంది. ఇక ఇప్పుడు మనం ఏ ప్రతీకారం చేయవలెనో నిశ్చయించవలసింది” అని హనుమంతుడు చెప్పాడు.

హనుమంతుడు చెప్పినదంతా విని అంగదుడు “ఓ వానరు లారా! మనము సీతాదేవిని చూచి ఆమెను తీసుకొని పోకుండా రామప్రభువు దగ్గరకు పోవటం అయుక్తమైన పని. మీరందరూ పరమ పరాక్రమవంతులని ప్రసిద్ధి కెక్కినారు. మేము సీతాదేవిని చూచినాము కానీ, ఆమెను తీసుకొనిరాలేదు అని చెప్పటము కూడా అయుక్తంగానే కనబడుతున్నది. ఓ వానరోత్తములారా! ముల్లోకములలోని దేవతలలో కానీ, దైత్యులలో కానీ ఎగిరి పోవడంలో మనతో సరిసమానులెవరూ లేరు. అంతేకాదు మనతో సరిసమానమైన పరాక్రమం గలవారెవరూ లేరు. రాక్షస వీరు

లందరినీ హనుమంతుడే హతమార్చినాడు. ఇక మనం ఇక్కడ చేయవలసిందేమీ లేదు. కాబట్టి మనమందరమూ లంకాపట్టణం పోయి సీతాదేవిని తీసుకొని, రామప్రభువు సన్నిధికి పోదాం" అన్నాడు.

ఇట్లా అంగదుడు చెప్పిన మాటలు జాంబవంతుడు విన్నాడు. అంగదుడి ఉత్సాహానికి సంతోషించాడు. అయితే అతడు కార్యాకార్య విచక్షణాజ్ఞానము కలవాడు. అంతట అర్థవంతంగా "ఓ యువరాజా! నీవు చెప్పింది బాగానే వుంది. కానీ రామప్రభువు కార్యసిద్ధికి ఎట్లా ఆజ్ఞాపించినాడో అట్లా మనం చేయవలెను కానీ మనం మన చిత్తం చేయకూడదు" అని చెప్పినాడు.

జాంబవంతుడు చెప్పిన మాటలను అంగదుడు, హను మంతుడు మొదలగు వారందరూ శిరసావహించారు. అంతట ఆ వానర వీరు లందరూ మహేంద్ర పర్వతము నుంచి హనుమంతుడి వెంట బయలుదేరినారు. వారు మంథర పర్వతాల వలెను, మదపుటేనుగుల వలెను వున్నారు. అందరూ మహాకాయులు, బలవంతులు. ఆకాశాన్ని ఆచ్ఛాదించి ఆ ధైర్యవంతుని, ఆ మహా బలవంతుని, ఆ వేగవంతుని సమస్త భూతకోటి పూజించే ఆ వాయుపుత్రుని, హనుమంతుని తదేకంగా చూస్తూ తమ చూపులతో దూసుకు పోతున్నట్లు ముందుకు సాగిపోయినారు. వాళ్ళందరూ రామకార్యము సాధించి, పరమ యశస్సు సంపాదించుకోవలెనని అనుకున్నారు. తాము వచ్చిన పని నేరవేరినందువల్ల ఆయా దిక్కులలో వెదకబోయిన తక్కిన వానర వీరులకన్నా తామే అధికులమని సంతోషపడ్డారు. అందరూ యుద్ధ కాంక్షులైనారు.

సుగ్రీవుడికి చేసిన ఉపకారానికి, రాముడికి ప్రత్యుపకారం చేయ నిశ్చయించుకున్నారు. సీతాదేవిని చూసిన సంతోషవార్త చెప్పటానికి వారందరూ అభిముఖులైనారు.

అట్లా వానరులందరూ ఆకాశంలో ఎగిరిపోతూ దేవేంద్రుడి నందనోద్యానము వలె భూమిమీద నానావిధ వృక్షాలతోను, లతలతోను వున్న వనాన్ని చూసినారు. అది సుగ్రీవుడి మధువనం. ప్రాణికోటిలో ఎవ్వరూ దానివంక తేరిపార చూడటానికైనా అలవి కాకుండా, సర్వభూత మనోహరమైన ఆ మధువనాన్ని సుగ్రీవుడి మేనమామ దధిముఖుడనే మహా పరాక్రమవంతుడు కాపాడు తున్నాడు. మధువనాన్ని చూడగానే ఆ వానరులందరికీ ఆ వనములో మధువు తాగవలెననే బుద్ధి పుట్టింది. అందుకు అనుమతించవలసినదిగా అంగదుని యాచించారు. అంగదుడు, జాంబవంతుడు మొదలగు వృద్ధులతో చెప్పి ఒప్పించి వానరు లందరూ ఆ మధువు త్రాగడానికి అనుమతించినాడు.

(మైనాక పర్వతం మనలోని ఒక ప్రజ్ఞ. సురసాదేవి మనలోని భౌతిక శరీరానికి వుండే తత్త్వము. అందులో ప్రవేశించటానికి ప్రాణప్రవృత్తులు ఐదుతలల పాముగా వుంటాయి. ఈ ఐదుతలల పాములోకి జీవుడు ప్రవేశిస్తాడు. జీవుడు మానవ శరీరంలోకి ప్రవేశించాలంటే, స్పందనాత్మక చైతన్యమైన తత్త్వము పంచ ప్రాణములుగా ప్రవర్తిస్తుంది. అందులోకి జీవుడు ప్రవేశిస్తాడు. హింసిక అన్నది మణిపూరకం నుండి స్వాధిష్ఠానం వరకు మన యొక్క నీడలో మనం జీవిస్తాం. అంటే మనం ఆత్మస్వరూపుల

మన్నమాట మరచి దేహసంబంధమైన స్థితిగతులలో ఇరుక్కొని ఈ దేహానికి గల పేరు, కులమతాలు, స్థితిగతులు మనమని, దానితో సంబంధమున్న వారు మనవారని, లేనివారు మనవారు కారని ప్రతిబింబాత్మక జీవితంలో ప్రవేశిస్తాం. మన నీడ దేహాత్మకు సంబంధించిన నిర్వచనం. ఈ నీడ నుండి మళ్ళీ మనం నిజ స్థితిలో మనలను మనమే ఉద్ధరించుకోవాలి. 'ఉద్ధరేత్ ఆత్మనాత్మనం' అన్నారు కదా! హనుమంతుడు నీడకు దొరికేవాడు కాడు. మానవ స్వభావంలో నీడచేత దక్షిణధృవం వైపుకు లాగుబడుతున్నట్లైతే, యోగి అయినవాడు దానిని సంహరిస్తాడు. అంటే తాను నీడలో కాక తానుగా జీవిస్తాడు. దీనిని గురించే మాస్టర్ ఇ.కె. గారు 'నీ భూతం' అన్నారు. "Liberate yourself from the phantum of yourself" అన్నారు. మనలను రకరకాల సమస్యలు పీడిస్తున్నప్పుడు దైవమనే వెలుగుతో మనం ముడిపడి ఉండం. లంకిణి సంహారం అంటే మూలాధార ఛేదనం. బ్రహ్మగ్రంథిని ఛేదించడమే. జీవాత్మ తత్త్వం పరమాత్మను చేరడానికి మూలాధారానికి, స్వాధిష్ఠానానికి మధ్యగల ముడి విడిపడాలి. అదే మృత్యుంజయ మంత్రం. అలా జరిగినప్పుడు మళ్ళీ అమృతత్త్వ స్థితి వస్తుంది. సద్గురువు జీవాత్మ దేహంలోకి ప్రవేశించాడు. జీవాత్మను ప్రేరేపించాడు. మళ్ళీ తిరిగి వచ్చాడు. మహేంద్ర పర్వతం నుండి బయలుదేరిన హను మంతుడు మళ్ళీ అక్కడికే చేరాడు.)

# 12

వానరులు తేనె త్రాగడము మొదలుపెట్టారు. అప్పుడు హనుమంతుడు ఓ వానర వీరులారా! మీరు భయపడవద్దు. తేనె త్రాగండి. మిమ్ములను తేనె త్రాగనీయకుండా మీ మీదకు వచ్చే వారిని నేను అడ్డగిస్తాను అన్నాడు. ఆ మాటలు అంగదుడు విని ప్రసన్న హృదయంతో వానరులు తేనె త్రాగవలసిందే. హను మంతుడు పని సాధించుకొని వచ్చాడు. అతడెప్పుడు అకార్యము చేయమన్నా చేయవలసిందే. నేను అవశ్యము అంగీకరిస్తున్నాను. మరిప్పుడు హనుమంతుడు చేయమన్నది మంచిపనే అన్నాడు.

అంగదుడి నోటినుంచి ఈ మాట వచ్చీరావటంతోనే వానరు లందరూ పరమ సంతోషంతో భలే భలే అని ఎగిరి గంతులు వేసినారు. అంగదుని మెచ్చుకున్నారు. మహావృక్షాలను ముంచివేసే నదీప్రవాహం వలె వానరులందరూ ఆ మధువనం మీద పడ్డారు. అక్కడున్న కావలివాళ్ళను త్రోసివేసినారు. హనుమంతుడు సీతా దేవిని చూచి మాట్లాడి వచ్చాడనే సంతోషంతో, అంగదుడు మధువును త్రాగడానికి అనుమతించాడనే సంతోషంతోను ఆ మధువనంలోని తేనెనంతా త్రాగడం మొదలుపెట్టినారు. అడ్డగించిన కావలివాళ్ళను కొట్టి కట్టివేసినారు. తేనెతుట్టెలను రెండుచేతులా

పట్టుకొని ఒక్కొక్కరు ద్రోణము ద్రోణము (కుండెడు కుండెడు) తేనె త్రాగినారు. తాగినంత తాగి మిగతా తేనెను నేలపాలు చేసినారు.

కొందరు తేనె త్రాగిన తరువాత ఆ తేనెతుట్టెలను అవతల పారవేసినారు. కొందరు ఆ తేనెతుట్టెలను ఒకరిమీద ఒకరు వేసి కొట్టుకున్నారు. తేనె త్రాగి మత్తెక్కిన కొందరు చెట్టుకొమ్మను పట్టుకొని కూర్చున్నారు. మరికొందరు చెట్ల ఆకులు పరచుకొని పడుకున్నారు. కొందరు సంతోషాతిశయముతో ఒకరినొకరు తోస్తూ పిచ్చెత్తిన వారివలె ప్రవర్తించినారు. కొందరు తప్పటడుగులు వేస్తూ మత్తెక్కినారు. కొందరు సింహనాదాలు చేశారు. కొందరు పక్షుల కూతలు పెట్టారు. ఆ మత్తులో కొందరు నేలమీద పడి నిద్ర పోయినారు. అప్పుడు కొందరు చేయరాని పనులు చేస్తే, మరి కొందరు తాము చేసి అలాంటి పనిని వివరించారు. కొందరు కావలివాళ్ళను కొట్టి నానాబాధలు పెట్టారు. ఆ బాధలు పడలేక కొందరు కావలివాళ్ళు పరుగెత్తి పోయినారు. కొందరు కావలి వాళ్ళకు ఆ వానరులు తమ అపాన ద్వారాలను చూపించి అవమానించడమే కాక వాళ్ళను మోకాళ్ళమీద దేకించినారు. ఆ కావలివాళ్ళు పరమదుఃఖంతో దధిముఖుడి దగ్గరికిపోయి హను మంతుడు వరం ఇచ్చినందువల్ల వారు మధువనంలో చొరబడి, నానా దుష్ట చేష్టలు చేసి తమను అవమానించడం విన్నవించారు. దధిముఖుడు మంచిమాటలతో కావలివాళ్ళను ఓదార్చినాడు. మధువనాన్ని అట్లా పాడుచేసినందుకు కృద్ధుడై పోయి, మీరు నావెంట రండి. మనమందరమూ పోదాము. మదమెక్కి మధువు

తాగిన ఆ వానర వీరులందరినీ మనం మన బలంతో వెళ్ళ గొడదాము అని దధిముఖుడు అన్నాడు.

తమ ఏలిక అభిప్రాయాన్ని మనసులో వుంచుకొని వేప, తాటి, ఇంకా ఇతర చెట్లను, పర్వతాలను పెళ్ళగించి ఆయుధాలుగా పట్టుకొని, ఆ కావలివాళ్ళు మధువనంలో అంగదాదులున్న చోటికి పరుగెత్తి పోయినారు. వారి మధ్యనున్న దధిముఖుడు కూడా ఒక వృక్షాన్ని ఇట్టే పెళ్ళగించి, చేతిలో పట్టుకొని, ఆ కపికుంజరులను ఎదరించబోయినారు. మదమెక్కి చెట్లమీదను, నేలమీదను పడి వున్న ఆ వానరవీరులను ఎదుర్కొన్నారు. ఆ వనపాలకుల మధ్య చెట్టు చేతిలో పట్టుకొని వస్తున్న దధిముఖుని అప్పుడు అంగదుడు చూచాడు. ఎదురుగుండా పోయి దధిముఖుని కొట్టాడు. మదాంధు లైనందువల్ల ఆ కొట్టింది తన తాతనే నన్న జ్ఞానము అంగదునికి లేకపోయింది. అంతటితో పోనివ్వకుండా ఆ దధిముఖుని నేలమీద వేసి కుమ్మినాడు. దధిముఖుడి బాహువులు, భుజాలు, ఊరువులు గాయాలయ్యాయి. నెత్తుటితో తడిసి మూర్ఛపోయినాడు. వెంటనే తెప్పరిల్లినాడు.

అప్పుడా కపికుంజరుడు దధిముఖుడు ఒక దండము తీసుకొని తేనె త్రాగి మత్తెక్కి ఒళ్ళు తెలియకుండా వున్న వానర వీరులను తరుముతూ, ఎట్లాగో వారిని తప్పించుకొని బయట పడ్డాడు. వెంట వున్న కావలివాళ్ళను చూచి, ఈ అంగదాదులను ఇక్కడే పడివుండనిద్దాము. మన ఏలిక అయిన సుగ్రీవుని దగ్గరకు పోదాం. అతడిప్పుడు రాముడితో వున్నాడు. తప్పంతా అంగదుడిదే

అని ఆయనకు తెలియచెప్పుదాం. ఆయనకే కోపం వచ్చి వీరందరినీ శిక్షిస్తాడు. ఇది పితృపితామహమైన మధువనం. ఇంతవరకు దేవతలకు కూడా చొరనలవి కాకుండా వున్నది.

ఈ మధువనమంటే మన రాజు సుగ్రీవునికి ఎంతో ఇష్టము. ఇట్లా మందలుబ్ధులైన ఈ వానరులందరినీ ఆ సుగ్రీవుడే దండిస్తాడు. వీళ్ళు రాజాజ్ఞను తిరస్కరించారు. దుర్మార్గులు. వీళ్ళను చంపివేస్తే మన కోపం పోతుంది అని చెప్పి దధిముఖుడు భృత్యులతో కూడా ఆకాశాని కెగిరినాడు. సుగ్రీవుడున్న చోటికి ఒక నిమిషంలో పోయినాడు. అక్కడ రామలక్ష్మణులను, సుగ్రీవుడిని చూచిన దధిముఖుడు ఆకాశం నుండి మిట్టపల్లాలు లేని సమతల భూమికి దిగినాడు. మహా పరాక్రమవంతుడు దధిముఖుడు తన భృత్యులందరినీ వెంటబెట్టుకొని దీనవదనంతో చేతులు జోడించి సుగ్రీవుడి పాదాలకు నమస్కారం చేసినాడు.

(ఇది వానరుల కుండేటటువంటి సహజమైన చపలచిత్తం. ఇంతకుముందు కిష్కింధకాండలో సీతాన్వేషణకు బయలు దేరినప్పుడు కూడా ఒక బిలంలో చొరబడి, లోపల వున్న సమస్త మైనటువంటివి ఆకలి చేత, ఆగలేక తినడము, త్రాగడం చేస్తూ వుంటే అక్కడ 'స్వయంప్రభ' అనే దివ్యశక్తితో ఘర్షణ పడతారు. అప్పుడు హనుమంతుడు ఆమెను ప్రార్థించి, తాము ఏ పనిమీద బయలుదేరారో తెలిపి, ఆ వానరులు ఆ విధముగా ఆకలి వుండడం చేత అలా ప్రవర్తించారని తెలిపి, అందరినీ తీసుకొని బయటకు వస్తాడు. మళ్ళీ ఇప్పుడు కూడా తిండి కనబడితే ఆగలేరు అనేటటువంటిది వానరబుద్ధి. అంటే అంతకుముందే

తిన్నా, ఇంకో రుచికరమైన పదార్థం కనబడితే మళ్ళీ తింటారు. అందుకని సమయం, సందర్భం లేకుండా, ఒక వినయం విధేయత లేకుండా ఎక్కడపడితే అక్కడ, ఏది పడితే అది తినడం ఒక విధమైన దేహసంస్కారము. కోతులలో ఆకలి వేయడం ఉత్సాహము వచ్చినపుడూ కన్పిస్తోంది. నిరుత్సాహ పడినపుడూ కనిపిస్తోంది. ఇది వానర స్వభావంగా వున్నది. దైవాంశ సంభూతులు ఎన్నో మహత్కార్యములు చేయగలరు. శరీర పరిస్థితిని బట్టి కొన్ని కార్యాలు ఆ విధంగా చేస్తారు.)

సుగ్రీవుడు తనకట్లా సాష్టాంగ నమస్కారం చేసిన మేన మామను, మహా పరాక్రమవంతుడు దధిముఖుని చూచి భయపడి, ‘ఓ వీరుడా! లే లే! నా పాదాలు పట్టుకున్నావేమిటి? నీకు అభయ మిస్తున్నాను. ఏమిటో చెప్పు’ అని లేవదీసినాడు. సుగ్రీవుడు అలా అభయ మిచ్చినందుకు ఆ మహాప్రాజ్ఞుడు దధిముఖుడు ఓ రాజా! నీ తండ్రి ఋక్షరజుడి కాలంలోగానీ, నీ అన్న వాలి కాలంలోగానీ, నీవు గద్దె ఎక్కిన తరువాత ఇంతవరకు కానీ మధువనము ఎవరికైనా చొరనలవి కాకుండా వుంది. అటువంటి నీ మధు వనములోకి అంగదాది వానరవీరులు నిర్భయంగా వచ్చినారు. కావలి వాళ్ళందరినీ బెదిరించి, పట్టుకొని కొట్టినారు. యధేష్టంగా మధుపానం చేసినారు. వారిలో కొంతమంది త్రాగినంత త్రాగి, మిగతాది నేలమీద పారబోసినారు. ఈ కావలివాళ్ళు అడ్డగిస్తే, వాళ్ళు కనుబొమలు ఎగురవేసినారు. బెదిరించినారు. వాళ్ళకు కోపం వచ్చి, కన్నులెఱ్ఱజేసి, ఆ కావలివాళ్ళను కొట్టి తరిమి వేసినారు. కొందరిని చేతులమీద, కొందరిని మోకాళ్ళ మీద

కొట్టినారు. కొందరిని లేవనెత్తి తలక్రిందులు చేసి, వాళ్ళ వాళ్ళ పశ్చిమ ద్వారాలు చూసేట్లు చేసినారు. ఓ సుగ్రీవుడా! నీవిక్కడ ప్రభువై యుండగా అంగదాది వీరులు వనపాలకులను అట్లా కొట్టినారు. యధేష్టంగా మధుపానం చేసి, పళ్ళన్నిటినీ తినివేసి నారు. మధువనాన్నంతా నాశనము చేసివేసినారని చెప్పినాడు.

సుగ్రీవుడితో దధిముఖుడు అంతా విన్నవించుకోవటం చూస్తూ వున్న మహాప్రాజ్ఞుడు, పరవీరహంత అయిన లక్ష్మణుడు, ఓ సుగ్రీవుడా! మధువన పాలకుడైన ఈ దధిముఖుడు ఎందుకిట్లా వచ్చినాడు? ఎందుకింత దుఃఖ పడుతున్నాడు? నీతో ఏమి చెప్పుచున్నాడు? అని అడిగినాడు. ఆ వాక్యవిశారదుడు సుగ్రీవుడు, లక్ష్మణుడితో ఓ పూజ్యుడా! సీతాదేవిని దక్షిణదిక్కున వెదకబోయిన అంగదాది వానరవీరులు వచ్చి, మధువనంలో ప్రవేశించి మధువు నంతా త్రాగివేసినారు. వాళ్ళు ఆ అంగదాది వీరులు వచ్చీ రావటంతోనే మధువనాన్ని ఆక్రమించారని, దొరికిన తేనెనంతా త్రాగి, పళ్ళను తిని, చెట్లను విరిచివేసి, మధువనాన్ని ధ్వంసం చేశారట. అంగదాది మహావీరులు కృతకృత్యులై వుంటారు. అట్లా కాకపోతే వాళ్ళంతటి సాహసము చేసి వుండరు. వాళ్ళు కార్యం సాధించుకొని వచ్చి వుంటారు. సందేహం లేదు. హనుమంతుడు సీతాదేవిని చూచివుంటాడు. అతడంతటి సమర్థుడు. కార్యసాధనా సామర్థ్యము, బుద్ధిబలము, ఉత్సాహము, పరాక్రమము, విద్య అనే ఐదు కూడా హనుమంతునిలో నెలకొనివున్నవి. అంతేకాదు ఏ పని ఎట్లా చేయవలసిందో చెప్పటానికి జాంబవంతుని మించినవాడు మరొకడు ఈ జగత్తులో లేడు. అంగదుడు అమిత పరాక్రమ

వంతుడు. వారిద్దరి తోడ్పాటుతో హనుమంతుడు ఏ పనైనా సాధించగలడు.

అంగదాది వానరవీరులు సంతోషాతిశయంతో మధువనం లోకి పోయి మధుపానం చేసి వుంటారు. మత్తెక్కి ఒళ్ళు తెలియక మధువనాన్ని పాడుచేసి వుంటారు. అందువల్లనే వనపాలకులు నివారించబోతే వాళ్ళందరూ ఏకమై కొట్టి వుంటారు. ఈ దధిముఖుడు మహా పరాక్రమశాలి అని ప్రసిద్ధి కెక్కినాడు. ఎంతో మధురముగా మాట్లాడతాడు. ఇతనిని కూడా వారు లక్ష్యం చేయలేదు. అందువల్ల ఆ వానర వీరులందరూ చేసింది చెప్ప టానికి ఈయన ఇక్కడికి వచ్చినాడు. ఓ మహాబాహూ! సీతాదేవి వారికి కనబడి వుంటుంది. లేకున్నట్లయితే వారలా చెయ్యరు. అంత నిర్భయంగా వారు మధువనములోకి పోయి యధేష్ఠముగా తేనె త్రాగరు. ఆ మధువనాన్ని బ్రహ్మదేవుడు మా పూర్వీకులకు వరంగా ఇచ్చినాడు. ఆ వనంలోకి పోయిన వానర వీరులందరూ బుద్ధిమంతులు, పరాక్రమవంతులు అని ప్రసిద్ధి కెక్కినారు. వారు సీతాదేవిని చూడకున్నట్లయితే ఆ వనంలోకి పోనే పోరు. దాన్ని పాడుచేసి వుండరు అని చెప్పాడు.

శ్రవణ మనోహరమైన ఆ మాటలు విని, రామలక్ష్మణులు సంతోషపడ్డారు. అప్పుడు సుగ్రీవుడు దధిముఖుని చూచి, ఓ దధిముఖుడా! ఆ వానరవీరులు కృతకృత్యులై వుంటారు. అందువల్ల వాళ్ళు మధువనంలో ప్రవేశించి మధువు త్రాగినారు. అందుకు నాకు సంతోషంగా వున్నది. వాళ్ళ చేష్టలను నేను క్షమించవలెను. హనుమంతుడు మొదలగు వానరవీరులు సింహాలవంటి దర్పము

కలవారు. బలము కలవారు. సీతాదేవిని చూచి వారు కృతార్థులై వుంటారు. రామలక్ష్మణులు, నేను వారిని వెంటనే చూడవలెను. నీవు వెంటనే పోయి వారిని పంపించు అని చెప్పినాడు. సంతోషంతో సుగ్రీవుని కన్నులు వికసించినవి. దేహం పులకెత్తినది. రామలక్ష్మణులను చూచాడు. సంతోషంతో తన దేహము పులకించి నందువల్ల కార్యసిద్ధి హస్తగతమైంది అనుకున్నాడు. సంతోష పడ్డాడు సుగ్రీవుడు.

సుగ్రీవుడు చెప్పింది విన్న దధిముఖుడు సంతుష్టుడైనాడు. అప్పుడా మహా బలవంతులు రామలక్ష్మణులకు, సుగ్రీవునికి నమస్కారం చేసి తన వెంట వచ్చిన శూరులతో ఆకాశాని కెగిరి నాడు. ఎంత త్వరగా వచ్చినాడో, అంత త్వరగా ఆకాశమార్గాన పోయి మధువనంలో దిగినాడు. అప్పుడు వానర వీరులందరూ మత్తు వదలిపోయి తేనె మూత్రాన్ని విసర్జించడం చూశారు. వారి దగ్గరకి పోయి చేతులు జోడించి, అంగదునితో సంతోషంగా! ఓ యువరాజా! కావలివాళ్ళు మిమ్మలను అడ్డగించినారనే కోపం వద్దు. అజ్ఞానం వల్ల కోపం వచ్చి, వారట్లా చేశారు. ఓ బలవంతుడా! నీవు యువరాజువని, ఈ మధువనానికి నీవే ప్రభువని తెలియక వారు అపరాధం చేశారు. నీవు క్షమించవలెను. ఓ పుణ్యాత్ముడా! నేను పోయి నీ పినతండ్రి సుగ్రీవుడితో నీవు వానరవీరులతో ఇక్కడికి వచ్చావని, ఆ వానర వీరులందరూ ఈ మధువనాన్ని ధ్వంసం చేశారని చెప్పాను. ఆయనకు కోపం రాలేదు. సంతోషపడ్డాడు. మిమ్ముల నందరినీ త్వరలోనే తన దగ్గరకు పంపించవలసిందని సుగ్రీవుడు చెప్పాడని విన్నవించుకున్నాడు.

ఇట్లా మధురంగా దధిముఖుడు చెప్పింది విని అంగదుడు వానర వీరులందరినీ చూచి, ‘ఓ పరంతపులారా! మన వృత్తాంతము రాముడికి తెలిసింది. మనం పోయిన పని సాధించుకొని వచ్చి నాము కనుక ఇక ఇక్కడ వుండటం మంచిది కాదు. మీరందరూ యధేష్టముగా మధుపానం చేశారు. మీ అలసట పోగొట్టుకున్నారు. ఇకను ఇక్కడ మనం చేయవలసిందేమీ లేదు. మనమందరం ఇక సుగ్రీవుడి దగ్గరకు పోవలెను. ఓ వీరులారా! మీరందరూ చెప్పినట్లు చేస్తాను. నేను స్వతంత్రుడిని కాను. నేను యువరాజును. అయినప్పటికీ స్వామికార్యం సాధించుకొని వచ్చిన హనుమంతుని, మిమ్ములను ఎదురించి నా ఇష్టము వచ్చినట్లు ఆజ్ఞాపించడం అయుక్తము” అని చెప్పినాడు.

అంగదుడు అంత వినయంతో చెప్పినందుకు వానర వీరు లందరూ సంతోషపడ్డారు. అప్పుడు హనుమంతుడు అంగదుని చూచి “ఓ అంగదా! నీవు మా యువరాజువు. నిజముగా మా రాజువు. కాబట్టే ఇంత చక్కగా చెప్పగలిగావు. మరొకడయ్యే ట్లయితే, ఐశ్వర్యబలముచే మమ్ములను ఆజ్ఞాపించి వుండేవాడు. నీవు చెప్పినట్లుగా చెప్పడం నీకే తగినది. అటువంటి అణకువ మరొకడికి వుండదు. ఈ వినయము భవిష్యత్తులో నీకు శుభాన్ని స్తుంది.”

(మనం అధికారంలో వున్నా, మనకన్నా పెద్దవాళ్ళు మన చుట్టూ వుంటే, వాళ్ళను మన్నించి వాళ్ళు చెప్పినట్లు చెయ్యట మన్నది చిన్నవాళ్ళకు ముఖ్యమైన కర్తవ్యం.)

హనుమంతుడు ఇట్లా చెప్పి చెప్పడంతో మంచిది, బయలు దేరుదాం అని అంగదుడన్నాడు. అంతట ఆ మహా బలవంతు లందరూ ఆకాశాని కెగిరినారు. అప్పుడా వానరులందరూ యంత్రాలతో ఎగురగొట్టిన పర్వతాలవలె ఆకాశమార్గాన కనిపించి నారు. వారందరూ గాలికి అమితవేగంతో పరుగెత్తే మేఘాలవలె ఆకాశంలో వెళ్తూ మహానాదం చేశారు. అంగదాదులు అక్కడికి చేరక పూర్వం దుఃఖంతో బాధపడుతున్న ఆ కమలలోచనుని రాముని చూచి సుగ్రీవుడు, "ప్రభూ! ఊరడిల్లు. నీకు శుభ మవుతుంది. వానరవీరులు సీతాదేవిని చూచివుంటారు. సందేహం లేదు. సీతాదేవిని చూచి వుండకపోయినట్లైతే, నేను పెట్టిన గడువుకాలం అయిపోయిన తరువాత కూడా వారెంత మాత్రమూ తిరిగివచ్చేవారు కాదు. యువరాజైన అంగదుడు ఎగిరిపోయే వారిలో శ్రేష్ఠుడు. వాడు ఈ కార్యము సాధించక పోయినట్లైతే, నా దగ్గరికి ఎంత మాత్రమూ తిరిగిరాడు. ఒకవేళ స్వామికార్యము సాధించకుండానే తిరిగివస్తూ, వానరులందరూ మధువనాన్ని పాడుచెయ్యడానికి పూనుకుంటే అంగదుడు కలవర పడిపోయి వుండేవాడు. అప్పుడేమి చేసి వుండేవాడో? మా తండ్రి తాతల నుంచి ఎంతో జాగ్రత్తగా ఆ మధువనాన్ని కాపాడుతున్న సంగతి అంగదుడికి తెలుసు. సంతోషంతో లేకపోయినట్లైతే మధువనాన్ని ఏ మాత్రమూ పాడుచెయ్యనిచ్చే వాడు కాడు.

ఓ ప్రభూ! ఊరడిల్లు. నీవు సుప్రతుడవు. కౌసల్యాదేవి కడుపున చల్లగా పుట్టినావు. సీతాదేవిని హనుమంతుడే చూచి వుంటాడు. అంతటి మహాకార్యము అతడివల్ల తప్ప మరొకడివల్ల

కాదు. ఇటువంటి పనులు చెయ్యడానికి హనుమంతుడొక్కడే సమర్థుడు. సూర్యునిలో తేజస్సువలె కార్యసిద్ధి, బుద్ధి ప్రయత్నము, పరాక్రమము హనుమంతునిలో సుస్థిరంగా వున్నాయి. జాంబవంతుడు మంత్రిగాను, అంగదుడు సేనానాయకుడు గాను, హనుమంతుడు కార్యనిర్వాహకుడు గాను పనిచేసేట్లయితే ఎటువంటి దుర్ఘట కార్యమైనా అయితీరుతుంది. మరియొక విధముగా ఎన్నటికీ కాదు. ప్రభూ! నీవు ఈ విషయాన్ని గురించి చింతించ వద్దు" అన్నాడు.

ఇట్లా సుగ్రీవుడు రామునితో చెపుతూ వుండగా వానర వీరులు ప్రశ్రవణ పర్వత సమీపానికి వచ్చారు. హనుమంతుని సాహస కృత్యానికి ఆ వానర వీరులందరూ గర్వాతిశయంతోను తమకు కార్యసిద్ధి అయిందని తెలియచేయడానికి గంభీరంగా గర్జనలు చేశారు. ఆ వానరవీరుల సింహనాదాలు సుగ్రీవుడు విన్నాడు. ఆ కపిసత్తముడు సంతోషంతో ఉప్పొంగిపోయి, తోకను పొడుగుచేశాడు. అప్పుడు అంగదుడు, హనుమంతుడు వానర వీరులందరినీ వెంటబెట్టుకొని రామదర్శనం చేయడానికి వచ్చారు. ఆ మహాబాహువు హనుమంతుడు రాముడికి శిరసా నమస్కారం చేసి, "ప్రభూ! సీతాదేవి పాతివ్రత్య నియమంతో తేజరిల్లుతూ వుంది" అని చెప్పాడు.

(హనుమంతుడు ఒక్క వాక్యంలో ఎంతో అర్థాన్ని ఇమిడ్చి చెప్పాడు. మన వేదాలు, ఉపనిషత్తులు అట్లా చెప్పాయి. భాష్యం వ్రాస్తే వేలకొద్దీ పేజీలు రాయవచ్చు. ఒక వాక్యంలో సమస్తాన్నీ

చెప్పగలిగిన వాళ్ళు ప్రజ్ఞావంతులు. చిన్న మేధస్సు గలవాళ్ళు ఎంతో విపులంగా చెప్తారు.)

ఆ మాటలకు లక్ష్మణుడు, సుగ్రీవుడు సంతోషంతో ఉప్పొంగి పోయారు. ఆ హనుమంతుని మెచ్చుకుంటూ చూశారు. అప్పుడా పరవీరహంత రాముడు అత్యంత సంతోషంతోను, ఎంతో గౌరవం తోను హనుమంతుని చూశాడు. 'సీతాదేవి క్షేమంగా వుంది' అని వినగానే రాముడు వానరవీరులను చూచి "ఓ వానరవీరులారా! సీతాదేవి ఎక్కడ వుంది? నన్ను గురించి ఏమనుకుంటూ వుంది? నాకు వివరంగా చెప్పండి" అని అడిగాడు.

సీతాదేవి వృత్తాంతమంతా తెలుసుకొని వచ్చిన హనుమంతుని వివరాలన్నీ చెప్పమని వానరులు ప్రోత్సహించారు. అప్పుడా వాక్సిద్ధుడు, మారుతాత్మజుడు సీతాదేవి వుంటున్న దక్షిణదిక్కుకు తిరిగి, ఆమెకు నమస్కారం చేసి, "ప్రభూ! నేను నూరు యోజనాల సముద్రం దాటి సీతాదేవిని వెదకుతూ పోయినాను. ఆ సముద్రం దక్షిణ తీరానికి దక్షిణంగా ఆ దురాత్ముడు రావణాసురుడు నివసిస్తున్న లంకాపట్టణం వున్నది. అక్కడ రావణాసురుని స్వాధీనంలో వున్న మహాపతివ్రతను, ఆ పరమ సౌందర్యవతిని సీతాదేవిని నేను చూచాను. ఆమె మనసు నీ మీద పెట్టుకొని బ్రతికి వున్నది. అక్కడ అశోకవనమనే ప్రమదావనంలో వుంది. వికారాకారలైన రాక్షసులు ఆమె చుట్టూ కాపలా కాస్తున్నారు. వాళ్ళు మాటి మాటికీ ఆమెను బెదిరిస్తున్నారు. ఎంత మాత్రమూ దుఃఖ మనుభవించకూడని ఆ పతివ్రత అట్లా దుఃఖమనుభవిస్తూ వుంది. రాక్షసాంగనలు ఆమెను కదలనీయ

కుండా కావలి కాస్తున్నారు. ఆమె తలవెంట్రుకలన్నీ ఒకే జడకట్టుకొని పోయినాయి. నిరంతరం ఆమె నిన్ను ధ్యానం చేస్తూ వున్నది. కటిక నేలమీద పడుకుంటూ వున్నది. దేహం వివర్ణమై పోయింది. హేమంతకాలం లోని తామరకొలను మాదిరిగా ఆమె కనిపించింది. ఆమె తన మనస్సును ఈషణ్మాత్రమూ ఆ రావణాసురుని మీదకు పోనీయకుండా నీ మీదనే నిలిపి వుంచింది. అందువల్ల ఇప్పుడామె చచ్చిపోవడానికి నిశ్చయించు కుంది. ఎట్లాగో ఎంతో కష్టపడి పోయి వెదకి, ఆమెను నేను చూశాను. నేను ఇక్ష్వాకు వంశీయులను గురించి కీర్తించడం మొదలుపెట్టినాను. అప్పుడామె నన్ను నమ్మింది. నేనంతట ఆమెతో మాట్లాడినాను. ఇక్కడి సమస్త సంగతులు నేనామెకు చెప్పాను. ప్రభూ! నీవు సుగ్రీవుడితో స్నేహం చేయడం విని సంతోషపడ్డది. ఆమె పాతివ్రత్యాన్ని గురించి, ఆమెకు నీ మీద వున్న భక్తిని గురించి నేను ఎంతని చెప్పేది? ఎంత చెప్పినా తనివి తీరదు.

ఓ పురుషోత్తమా! నీ మీద భక్తితో మహోగ్రంగా తపస్సు చేస్తూ వున్న ఆ మహాభాగను, ఆ జనక నందినిని సీతాదేవిని నేను చూశాను. ఓ రామప్రభూ! నీవు మహా ప్రాజ్ఞుడవు. చిత్రకూట పర్వతము మీద మీరుంటున్నప్పుడు జరిగిన కాకి వృత్తాంతమంతా చెప్పింది. అంతట ఆమె నన్ను చూచి, ఓ వాయుపుత్రుడా! నీవు ఆ నరశార్దూలమునకు ఇక్కడ చూచినదంతా చూచినట్లు సుగ్రీవుడి సమక్షంలో రామప్రభువుకు విన్నవించు. నేను ఇంతవరకూ అతి జాగ్రత్తగా దాచివుంచిన నా చూడామణిని నీకు ఇస్తున్నాను. దానిని నా ప్రభువుకు సమర్పించు. హనుమంతుడా! ఒకనాడు నా నుదట

తిలకము చెరిగిపోయింది. అప్పుడు నా ప్రభువు మణిశిలను బొట్టుగా చేసి, నా చెక్కిలి మీద బొట్టుగా నవ్వులాటకు పెట్టినాడు. నీవు అది జ్ఞాపకం తెచ్చుకోమని చెప్పు. కాంతివంతమైన ఈ చూడామణిని నేను ఈ దుఃఖములో దాచుకుంటూ, ఆయనను చూస్తూ వున్నట్లు భావిస్తూ సంతోషిస్తున్నాను. అటువంటి ఈ చూడామణిని ఆయనకోసం పంపించినానని చెప్పు. నేనిక ఒక మాసమే జీవించివుంటాను. ఈ మాసము దాటిన తరువాత ఈ రాక్షసుల ఆధీనంలో నేను జీవించనని చెప్పు అని చెప్పింది.

ఓ ప్రభూ! ఆమె ధర్మము తప్పలేదు. దేహమంతా కృశించి పోయింది. అట్లా రావణాసురుని చెరలో వున్న ఆమె లేడివలె ఉత్ఫుల్ల నేత్రాలతో చూచింది. ప్రభూ! మీతో చెప్పమన్నదంతా చెప్పాను. ఇకనెట్లాగైనా మనం సముద్రం దాటిపోయే సాధన మేమిటో నీవు ఆలోచించవలెను" అన్నాడు. ఈ మాటలకు రామలక్ష్మణు లిద్దరూ కొంచెం ఊరడిల్లినారని హనుమంతుడు తెలుసుకున్నాడు. సీతాదేవి ఇచ్చిన చూడామణిని రాముడి కిచ్చినాడు. హనుమంతుడు చెప్పినదంతా రాముడు, లక్ష్మణుడితో కూడా విన్నాడు. అతడిచ్చిన చూడామణిని తన హృదయానికి హత్తుకున్నాడు. ఏడ్చినాడు. ఆ చూడామణిని చూడగానే ఆయనకు పట్టరాని దుఃఖం వచ్చింది. ఆపుకోలేకపోయాడు. ఎట్లాగో ఆపుకొని కన్నీళ్ళతో సుగ్రీవునితో, దూడమీద వాత్సల్యంతో ఆవు పాలు చేపుతుంది. అదే విధంగా ఈ చూడామణిని చూస్తూ వుంటే, నా హృదయం ద్రవిస్తోంది. మణిమయమైన ఈ చూడామణిని మా మామగారు జనకమహారాజు సీతాదేవికి ఇచ్చినారు. దీనిని ఆమె

తన వివాహ సమయంలో తలలో పెట్టుకున్నది. ఓ సుగ్రీవుడా! జనక మహారాజు ఒకప్పుడు యజ్ఞము చేశాడు. అందుకు సంతుష్టుడై దేవేంద్రుడు ఈ చూడామణిని ఆయనకు బహుమానంగా ఇచ్చాడు. దీని మణులన్నీ సముద్ర గర్భంలో ఉద్భవించినవే. దీనిని గొప్ప వారందరూ మెచ్చుకున్నారు.

ఓ సుగ్రీవుడా! ఈ చూడామణిని చూస్తూ వుంటే, మా మామగారు జనకమహారాజును, మా తండ్రి దశరథ మహారాజును దర్శనము చేస్తున్నట్లుగా వుంది. ఈ చూడామణి నా ప్రియురాలి శిరస్సు మీద ఎప్పుడూ శోభిస్తూ వుండేది. ఇప్పుడు దీనిని చూస్తూ వుంటే, నా సీతను చూస్తున్నట్లుగా వుంది. ఓ హనుమంతుడా! దాహము వేసినవాడికి పదే పదే జలమిచ్చి దాహము తీర్చేటట్లు, ఆ వైదేహి ఇంకా ఏమేమి చెప్పిందో మళ్ళీ చెప్పు. లక్ష్మణుడా! సీతా దేవిని వదలిపెట్టి వచ్చిన ఈ చూడామణిని, అందులో జలోద్భవమైన మణులతో వున్న ఈ చూడామణిని చూస్తూ వుంటే నాకు దుఃఖము వస్తున్నదేమిటి?

తమ్ముడా! వైదేహి ఒక్క మాసం జీవించి ఉండగలిగేట్లైతే బహుకాలము జీవిస్తుంది. నేను ఇకను ఆ హసితేక్షణ లేకుండా ఒక్క క్షణమైనా జీవించి ఉండలేను. ఆ నా ప్రియురాలు ఎక్కడ వుందో అక్కడికి నీవు నన్ను తీసుకొని పో. ఇప్పుడామె వృత్తాంతము మనకు తెలిసింది. ఇక ఒక క్షణమైనా నేను ఉండలేను. ఆ సుశ్రోణి, ఆ పరమ భీరువు నా భార్య సీతాదేవి ఎప్పుడూ భయపెట్టే ఘోర రాక్షసుల మధ్య ఎట్లా ఉండగలుగుతోంది? శరత్కాల పూర్ణచంద్రుని మేఘాలు ఆవరించినట్లు ఆమెచుట్టూ రాక్షసులు

మూగితే ఆమె ముఖము కళాకాంతులు మాసిపోయి వుంటుంది. ఇది నిశ్చయం.

ఓ హనుమంతుడా! సీత ఏమి చెప్పింది? ఆమె చెప్పింది చెప్పినట్లుగా నాకు చెప్పు. మందిస్తేనే రోగి బ్రతుకుతాడు. నా సీత చెప్పినదంతా నీవు చెబితేనే నేను బ్రతుకుతాను. ఓ హనుమంతుడా! ఆ మనోహరాంగి నా భామిని మనోహరంగా నాతో మాట్లాడుతూ వుండేది. నన్నెడబాసిన ఆ సుశ్రోణి ఏమి చెప్పిందో నాకిప్పుడు చెప్పు అన్నాడు.

(సాధనా పరంగా వివరంగా ఇలా వుంటుంది. సద్గురువు దైవానికి జీవుని గురించి వివరిస్తే, దైవం తహతహ లాడుతున్నాడు. జీవుడు కూడా దైవం కోసం తహతహలాడుతూ దేహం వదల డానికి సిద్ధంగా వుంది. పరమాత్మ లక్ష్మణుడనే కాలాన్ని దారి చూపమని అడుగుతూ వుంది. దైవం కూడా కాలం కలిసివచ్చేదాక ఆగక తప్పదు.)

"ఓ రామప్రభూ! చిత్రకూట పర్వతం మీద జరిగిన వృత్తాంతం సీతాదేవి నాకిట్లా చెప్పింది. ఆమె చెప్పింది చెప్పినట్లుగా చెబుతున్నాను వినవలసింది. సీతాదేవితో కూడా నీవు నిద్రపోతూ వుండగా ముందుగా ఆమెకు మెలకువ వచ్చింది. అప్పుడు ఒక కాకివచ్చి ఆమె స్తనాంతరంలో గీరింది. అప్పుడు నీవు ఆమె తొడమీద తలపెట్టుకొని నిద్రపోతున్నావు. ఆ కాకి పదేపదే వచ్చి ఆమెను గీరడం మొదలుపెట్టింది. ఆ నెత్తురుకు తడిసి నీవు నిద్రలేచావు. సీతాదేవి స్తనాంతరముల నుండి రక్తము కారడం

నీవు చూసి, కృద్ధుడై పోయి తాచుపాము బుసలు కొట్టేలా నీవు నిట్టూర్పులు విడుస్తూ, ఓ భీరూ! నీ స్తనాల మధ్య గీరిన వాడెవడు? కోపంతో రేగిన ఐదుతలల పాముతో ఆటలాడదలచుకొన్న వాడెవడు? అని అడుగుతూ చరచరా నాలుగువైపులా చూచి, సీతాదేవికి ఎదురుగుండా నెత్తురు మరకలతో వున్న కాకిని నీవు చూశావు. ఆ కాకి దేవేంద్రుడి కొడుకు. పర్వత ప్రాంతాలలో వాయువేగంతో తిరుగుతూ వుండేవాడు. ఓ మహాబాహూ! నీవప్పుడు కోపంతో కన్నులెర్ర చేసినావు. నీకు క్రూరమైన ఆలోచన పోయింది. నీ దర్భాసనంలో నుంచి ఒక దర్భను తీసి, బ్రహ్మాస్త్ర మంత్రముతో అభిమంత్రించి వదలిపెట్టావు. అప్పుడు ఆ దర్భకర్ర ప్రళయ కాలాగ్నిహోత్రం వలె జ్వలిస్తూ ఆ కాకికి ఎదురుగుండా పోయింది. ఆ కాకిని వెంబడించింది. అంతట ఆ కాకి ముల్లోకాలు తిరిగింది. తండ్రియైన దేవేంద్రుడు ఆ కాకిని కాపాడలేక పోయాడు. దేవతలు, మహర్షులు కూడా ఆ కాకిని కాపాడలేక పోయారు. ఎక్కడికి పోయినా తనను కాపాడే వారెవరూ లేక ఆ కాకి చివరికి నీ దగ్గరకే చేరింది. నీవే శరణ్యుడవనుకుంది. తనను కాపాడమంటూ నిన్ను శరణువేడింది. చంపివేయవలసిన అపరాధం చేసింది. అయినప్పటికీ నీవు దానిని దయతో కాపాడి నావు. బ్రహ్మాస్త్రము వ్యర్థమై పోకూడదు కనుక నీవు ఆ కాకి కుడికంటిని కొట్టివేసి వదలిపెట్టావు. అప్పుడు ఆ కాకి నీకు, నీ తండ్రి దశరథ మహారాజుకు నమస్కారములు చెప్పి, దాని దారిన అది పోయింది.

ఓ హనుమంతుడా! రామప్రభువు అస్త్రవేత్తలతో శ్రేష్ఠుడు.

మహాబలవంతుడు, సత్యస్వభావుడు. ఎందుకు రాక్షసుల మీద తన అస్త్రములను రామప్రభువు ప్రయోగించలేదు? అని తనమీద ఏ మాత్రం ప్రేమవున్నా తీక్షణ బాణాలతో రావణాసురుని చంపివేసి వుండేవాడని, ఆయన రాకపోయినట్లైతే అన్నగారి అనుజ్ఞతో ఆ పరంతపుడు లక్ష్మణుడైనా వచ్చి తనను కాపాడి వుండేవాడని, ఆ పరంతపులిద్దరూ ఒకేచోట వుండి అట్లా ఎందుకు చేయలేదని అడుగుతూ, నేనేదో గొప్ప పాపం చేసివుంటాను. సందేహం లేదు అంటూ సీతాదేవి కన్నీళ్ళు కార్చింది.

నేను ఆ పూజ్యురాలితో ఓ దేవీ! నేను సత్యప్రమాణం చేసి చెబుతున్నాను. నీ దుఃఖంలో నుంచి ఆ రామప్రభువు ఏ పనీ చేయకుండా వున్నాడు. ఆయన దుఃఖపడుతూ వున్నందువల్ల లక్ష్మణుడు కూడా దుఃఖపడుతూ వున్నాడు. ఓ దేవీ! నేనెట్లాగో వచ్చి నిన్ను చూశాను. నీవు ఇక దుఃఖపడవద్దు. ఇది దుఃఖ పడవలసిన సమయం కాదు. త్వరలో నీ దుఃఖమంతా తీరి పోతుంది. పెద్దపులుల వంటి ఆ అన్నదమ్ము లిద్దరూ నిన్ను చూడ వలెనని తహతహ లాడుతున్నారు. ఇక్కడికి త్వరలోనే వస్తారు. లంకాపట్టణాన్ని భస్మం చేసివేస్తారు. ఓ దేవీ! రామప్రభువు రావణాసురుని సబాంధవంగా సంహారం చేసి వేస్తాడు. నిన్ను తన పట్టణానికి తీసుకొనిపోతాడు. ఓ పూజ్యురాలా! రామప్రభువు బాగా ఎరిగివుండి, ఆయన చూచి సంతోషించేదేదైనా నాకు నీవు గుర్తుగా ఇవ్వవలెను అని నేనడిగితే అన్ని దిక్కులా చూస్తూ, తన చీరకొంగు నుంచి విప్పి ఈ చూడామణిని నాకు ఇచ్చింది. ఓ ప్రభూ! నేను ఈ చూడామణిని తీసుకొని ఆ పూజ్యురాలికి

సాష్టాంగ నమస్కారం చేశాను. అప్పుడే ప్రయాణమైనాను. ఆ వరవర్ణిని సీతాదేవి నన్ను చూచి కన్నీళ్లు కారుస్తూ, దీనురాలై మాటలు తడబడుతూ, ఎగిరిపోయేటప్పుడు నేనేమైపోతానో అని భయపడుతూ, ఓ హనుమంతుడా! సింహాల వంటి రామలక్ష్మణులకు, సుగ్రీవునికి, ఆయన మంత్రులకు అందరికీ నా యోగక్షేమం చెప్పు. నన్ను ఈ దుఃఖ సముద్రంలో నుంచి ఆ రామప్రభువు కడతేర్చునట్లు నీవే చేయవలెను. ఓ హనుమంతుడా! నీవు రామప్రభువు దగ్గరకు పోగానే నా ఈ ఘోర దుఃఖాన్ని గురించి, ఈ రాక్షసులు నన్ను బెదిరించటాన్ని గురించి చెప్పవలసింది" అని చెప్పింది.

ఓ ప్రభూ! నీవు రాజులలో రాజసింహము వంటివాడవు. ఆ పూజ్యురాలు సీతాదేవి చెప్పినదంతా చెప్పాను. ఓ నరశార్దూలమా! నీకు నామీద వున్న వాత్సల్యాన్ని, ఆప్తతత్వాన్ని సీతాదేవి గమనించింది. ప్రయాణమై పోవడానికి నా వేగిరపాటు చూచింది. ఆమె మళ్ళీ నాతో ఓ హనుమంతుడా! రామప్రభువు యుద్ధంలో రావణాసురుని హతమార్చి నన్ను తీసుకుపోయేటట్లు చేయవలెను. ఎన్ని విధాలుగా చెప్పవలెనో అన్ని విధాలుగా చెప్పు. ఓ అరిందమా! ఇక్కడెక్కడైనా రహస్య ప్రదేశములో నీకిష్టమైతే ఈ రోజు వుండి అలసట తీర్చుకొని రేపు ప్రయాణమై పో. నీవు ఇక్కడ ఒక రోజు ఉండేటట్లయితే, నేను కొంతసేపైనా దిగులుపడటం తగ్గుతుంది. మళ్ళీ నీవు వచ్చేవరకూ నేను ప్రాణంతో వుంటానో, వుండనో సందేహమే అని తెలిపింది. రామప్రభువును ఎడబాసినందువల్ల నేను దుఃఖభాగినిని అయినాను. నాకు దుస్థితి పట్టింది.

ఇట్లా దుఃఖపడుతున్న నేను నీవు కనబడకుండా పోయిన తరువాత మరింత దుఃఖపడుతూ వుంటాను.

ఓ వీరుడా! నీకు సాయం వచ్చిన వానరుల గురించి, ఎలుగుబంట్ల గురించి పెద్దసందేహం నన్ను బాధపెడుతూ వుంది. ఈ మహోదధిని ఎవరూ దాటిరాలేరు. వాళ్ళందరూ ఇక్కడికెట్లా వస్తారు? ఆ రాజపుత్రులు రామలక్ష్మణులు ఈ మహాసముద్రాన్ని ఎట్లా దాటివస్తారు. సమస్త ప్రాణికోటిలోను నీకు, నీ తండ్రి వాయుదేవుడికి, గరుత్మంతుడికి మీ ముగ్గురికే ఈ సముద్రాన్ని లంఘించే శక్తి  వున్నది. ఓ హనుమంతుడా! నీవు కార్యవిదులలో శ్రేష్ఠుడవు. అందరినీ ఈ సముద్రం దాటించి తీసుకొని రావటానికి ఏమి ఉపాయం వుందో చెప్పు. ఓ హనుమంతుడా! నీవు పరవీరహంతవు. ఈ లంకాపట్టణంలో గల రాక్షసుల నందరినీ సంహారం చేసే సామర్థ్యం నీకొక్కడికే వుంది. నీవు అట్లా చేసేట్లయితే, నీకు యశస్సు వస్తుంది. రావణాసురుడు, వాడి సమస్త సైన్యాలను సంహారం చేసి, రామప్రభువు నన్ను తన పట్టణానికి తీసుకొని పోయినట్లయితే, ఆయనకే కాకుండా నాకు కూడా యశస్కరంగా వుంటుంది. ఆ పరమ పరాక్రమవంతుడి మీద భయముతోనే రావణాసురుడు దండకారణ్యములో కపటోపాయంతో నన్ను అపహరించుకొని వచ్చాడు.

కాబట్టి, రామప్రభువు రాకుండా నన్ను రామప్రభువు దగ్గరకు తీసుకొనిపోవటం తగినపని కాదు. ఆ శత్రు సంహారకుడు రామప్రభువు  లంకాపట్టణాన్ని తమ సైన్యాలతో నింపివేసి నన్ను తీసుకొనిపోవడం ఆయన పరాక్రమానికి తగినట్లుగా వుంటుంది.

అందువల్ల ఆ మహా పరాక్రమవంతుడు, ఆ ఆహవశూరుడు ఆయనకు అనురూపమైన పరాక్రమంతో వచ్చి, నన్ను తీసుకొని పోయేటట్లు నీవు చేయవలెను అంటూ సీతాదేవి అర్థవంతంగాను, యుక్తియుక్తము గాను, వినయాన్వితము గాను చెప్పిన మాటలకు నేను ఓ దేవీ! వానరసేనలకు, భల్లూకసేనలకు ప్రభువైన సుగ్రీవుడు ఆకాశగమనంలో శ్రేష్ఠుడు. సత్వసంపన్నుడు. అతడు ఈ కార్యము సాధించడానికి కృతనిశ్చయుడిగా వున్నాడు. పరాక్రమవంతులు, అమిత శక్తిసంపన్నులు, మహా బలవంతులు అయిన వానర భల్లూకాది వీరు లనేకమంది ఆ సుగ్రీవుడి చెప్పుచేతలలో వున్నారు. వాళ్ళందరికీ మనోవేగంతో పోయే శక్తి వుంది. వాళ్ళందరూ ఆకాశమార్గాన కానీ, పాతాళమార్గాన కానీ, జ్యోతిర్మార్గాన కానీ ఏ అంతరాయమూ లేకుండా పోగలరు. ఎటువంటి దుర్ఘట కార్యాలనైనా ఏ మాత్రమైనా ఆయాసం లేకుండా చేయగలరు.

ఆ మహాబాహువులు, ఆ బలదర్పితులు వానరవీరులు అనేక పర్యాయములు ఆకాశమార్గాన పోయి ఈ భూమినంతా తిరిగి చూశారు. ఆ సుగ్రీవుడి దగ్గరున్న వానరులలో కొందరు నాతో సరిసమానులు. కొందరు నాకన్నా అధికులు, నాకన్నా బలవంతులు, అయినా వారిని గురించి నేను చెప్పవలసిన పనేలేదు. ఎక్కడికైనా పంపించవలసి వచ్చినప్పుడు ఎక్కువైన వారిని పంపించరు. సామాన్యులనే పంపిస్తూ వుంటారు. ఓ దేవీ! పరితాప పడటం ఇక చాలు. దుఃఖము వదలిపెట్టు. వానర వీరులందరూ ఒక్క గంతువేసి ఇక్కడికి వచ్చిపడతారు. ఓ

మహాభాగా! నేను ఆ నృసింహులను నా వీపుమీద ఎక్కించుకొని నీ దగ్గరికి తీసుకొనివస్తాను. సూర్యచంద్రుల వంటి ఆ కాంతిమంతులను నీవు చూస్తావు. సింహము వంటి ఆ శత్రు సంహారకుడు రాముడు ధనుర్ధారుడై, తమ్ముడు లక్ష్మణుడితో కూడా లంకాపట్టణ ద్వారం దగ్గరకు రావటం నీవు చూస్తావు. వారి వెంట వానర భల్లూక వీరులు వస్తారు. వాళ్ళు గోళ్ళతోను, కోరలతోను పోరాడే సింహ శార్దూలాల వంటి పరాక్రమవంతులు. మత్త మాతంగాల వంటి మహాబలవంతులు. వారినందరినీ నీవు త్వరలోనే చూస్తావు. ఈ లంకాపట్టణంలో మలయ పర్వత సానువులలో వానర భల్లూక వీరులు సింహనాదాలు చేయడం నీవు త్వరలోనే వింటావు.

"ఓ దేవీ! వనవాస గడువు కాలము అయిపోయి, ఆ అరిందముడు రామప్రభువు నిన్ను తీసుకొని అయోధ్యా పట్టణానికి పోయి, రాజ్యాభిషేకము చేసుకోవడం కూడా త్వరలోనే జరుగుతుంది" అని చెప్పానన్నాడు.

*స్వస్తి!*

*శ్రీమద్రామాయణమందలి 'సుందరకాండ' సమాప్తము.*

## ధనిష్ఠ ప్రచురణలు - మాస్టర్ పార్వతీకుమార్‌గారి రచనలు






























## శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు-1

రచన : **మాస్టర్ పార్వతీకుమార్**

**వాల్మీకి రామాయణమందలి బాలకాండ,**
**అయోధ్యకాండల యందలి ఘట్టములను**
**88 శీర్షికలుగ సులభమైన శైలిలో**
**ఈ గ్రంథమందు వివరింపబడినవి.**

వెల : రూ॥ 100-00

---

## శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు-2

రచన : **మాస్టర్ పార్వతీకుమార్**

**వాల్మీకి రామాయణమందలి అరణ్యకాండ,**
**కిష్కింధకాండలలో గల సున్నితమగు**
**ధర్మములను 98 శీర్షికలుగ సులభమైన శైలిలో**
**ఈ గ్రంథమందు వివరింపబడినవి.**

వెల : రూ॥ 100-00




ప్రతులకు :

ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్,
విశాఖపట్నం - 530 002 ఫోన్ : 0891-2701531
www.dhanishta.org info@dhanishta.org



రామాయణమందు సాధకులకు అత్యుత్తమమైన అనుగ్రహమును అందించేటటువంటిది సుందరకాండ. ప్రతి వారు తప్పక అవగాహన చేసుకొని, గురుతత్త్వాన్ని పరిపూర్ణంగా ఆశ్రయించి తద్వారా దైవమును చేరే సమస్తమైన ఉపాయములు సుందర కాండలో చెప్పబడి ఉన్నాయి. జీవాత్మ వేల లక్షల జన్మలు ఎత్తిన వెనుక, తను చేసే తిరుగు ప్రయాణంలో దైవాన్ని చేరవలసిన ఉపాయములన్నీ సుందరకాండలో ఇమిడి వున్నాయి. ఒక జీవుని జీవితంలోకి ఒక సద్గురువు ప్రవేశించడం అనే ఘట్టంకన్నా అత్యుత్తమమైన ఘట్టం వేరే ఏదీ లేదు కాబట్టి అది 'సుందర కాండము'. జీవునికి జీవనము సుందరమైనది కావాలంటే సద్గురువు ఆశ్రయం లభించాలి. సద్గురువు నందు దైవమును దర్శించాలి. సద్గురువును అవగాహన చేసుకొని, అతను తెలిపిన మార్గంలో నడిచి వెళ్ళాలి. సద్గురువు ఒక తపన చెందుచున్న జీవుణ్ణి ఏ విధంగా స్పృశిస్తాడు అనేది ఈ కాండములో చెప్పబడినది.

ISBN 978-81-957285-3-4

ధనిష్ఠ